
భద్రాచలం
మన్నెం కతలు

Bhadrachalam
**Mannem Kathalu**

**VIDYASAGAR**

**First Printing** : January, 1993
**Third Printing** : March, 2006

**Cover Art** : Lakshman Ale

**Cover Design** : Manjari

**DTP** : Ratna

**Printers** : Orion Printers Pvt. Ltd.
Lakadi-Ka-Pool, Hyderabad

**Price** : Rs.86.00
US$

**Published by** : Priyadarsini Prachuranalu
Plot No.8, Road No.13, Banjarahills
Hyderabad. Ph : 040 - 5568 8677

భద్రాచలం

# మన్నెం కతలు

విద్యాసాగర్

ప్రియదర్శిని ప్రచురణలు
హైదరాబాద్

# సాహితీ ప్రియులకు...

**సా**హితీ సుమం లో ఓ రేకై ఒదిగి పోయి, సాదా సీదా భాషలో కూడా ఇమిడిపోతూ, ప్రతి ఒక్కరికీ ఏదో ఒక వ్యాక్యం లోనో, భావన లోనో తమకు తామే తారసపడుతూ...సరికొత్తగా పరిచయం చేసుకుంటూ... వారి వారి జీవన ప్రయాణాలకు ప్రతిబింబమై....

చివరికి–

సాగరంలో కలిసిపోయే సెలయేటి ప్రవాహంలా...

అనగనగాతో బయలుదేరి... కాశీమజిలీలు సాగిస్తూ... కంచికి చేర్చే 'కథ'– కలకాలం ప్రియం.

నాటి నుండి నేటికీ కాల్పనిక సాహిత్యమూ, అనుభూతి వాద సాహిత్యమూ వాటి వాటి స్థానాలకై ఒకదానితో మరొకటి పోటీ పడటమే కాకుండా ఆయా కోవకు చెందిన రచయితలుగా రచయితకు గుర్తింపును తెచ్చిపెట్టాయి కూడా. కానీ ఇందులో శ్రీ విద్యాసాగర్‌గారు వాస్తవ సంఘటనలు మిగిల్చిన అనుభవాలకు అక్షరరూపం దిద్ది కదా సాహిత్వంలో అనుభవ వాదాన్ని తనదైన పంథాలో సృష్టించారనడానికి పుస్తక సాక్ష్యం కథలు కాని కతలైన– ఈ 'భద్రాచలం మన్నెం కథలు'.

తన అనుభవాల్లోని చేదునీ, అచేతనత్వాన్ని, అశక్తతని నిష్కర్షగా... నిజాయితీగా అక్షరాల్లోకి అనువదించి కతలుగా మనకు అందించిన వైనంతోపాటు... అక్కడి గిరిజన బతుకుల్ని, బతుకుల్లోని వ్యథల్ని ప్రకృతి అందాల పరిచయంతోరంగరించి... కతలుగా జీవ పోయడం వీరి శైలికి సదృశ్యం.

మన్నెం అందాలతో..ప్రకృతి పారవశ్యంలో పడి పరవశిద్దాం– అని మనం అనుకునే లోపే...

పాచిబండ మీద మోపిన పాదంలా... అక్కడి అమాయక జీవుల వ్యథలు, గాథలు...

చెమ్మగిల్లిన కంటి మసక చూపులో సరిపోల్చుకోలేని ఆకృతులై ఉలిక్కి పడేలా చేసి, వాస్తవంలోకి తెచ్చి వదలి పెడ్తాయి...

అందుకే మీరూ... ఓసారి మన్నెంలోకి అడుగిడి చూడండి... కాదన గలరేమో...?!

కా.. దన – లేని

మీ కోసం...

కుదించుకు పోయిన వ్యవస్థ – వాస్తవాల వెక్కిరింత నుండి కుదుపులకు లోనై, పరిధి విస్తృతమై నిరంతరం మానవీయ కోణంలో సంస్కరణల బాటగా సాగాలనే రచయిత ఆకాంక్షనీ, ప్రయత్నాన్నీ...

స... గర్వంగా...

మీ

**వత్సల**

# మూడో ప్రచురణతో...

భద్రాచలం మన్యం కతలు రాసి 15 ఏళ్లు దాటింది. గిరిజన ప్రాంతాలుగా పిలవబడే ఆదివాసీ ప్రాంతాల్లో యీ పదిహేనేళ్లలో మార్పులొచ్చాయా అంటే రాలేదనే చెప్పాలి. అదే సమస్యలు, అవే అరకొర పరిష్కారాలు. డబ్బు ఖర్చవుతున్నది. అధికారులు పని చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో గిరిజన సంక్షేమం ఉంటూనే ఉన్నది. కానీ అది ఆది వాసీల ప్రాంతంలో ఆదివాసులతో సంబంధంలేని ప్రగతిగానే ఉంటున్నది. దీనికి ప్రత్యేకించి ఎవర్నీ ఏమీ అనడానికి వీలుపడకపోవడమే మన ఆచరణా విధానంలోని గమ్మత్తు.

వానాకాలమొస్తే ఇప్పటికీ ఆదివాసీ ప్రాంతాల పరిస్థితి దయనీయమే! మిగిలిన రోజుల్లో చేరుకోవడానికి తగిన రోడ్డు సౌకర్యంగానీ, మంచి నీళ్లుగానీ లేని గ్రామాలెన్నెన్నో!! భూమి సమస్యెటూ ఉండనే ఉంది. దీనికి తోడు యిప్పుడు ఆదివాసి ప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులు ఎవరైనా కొనుక్కోవచ్చు. కొనుక్కొనే వాళ్లూ, అమ్మేవాళ్లు సమాన స్థాయిలో లేరనే విషయం మనకు గుర్తుండడం లేదు. అప్పుడేం జరుగుతుందో ఊహించడం పెద్ద కష్టంకాదు.

పై సమస్యలన్నింటి కారణంగా ఆదీవాసీప్రాంతాలు సంక్షోభంలో ఉన్నాయి. ఆ సంక్షోభం నుంచి వాళ్లను బైట పడేసేందుకు ఇటు పోలీసులు, అటు మావోయిస్టులు. ఇద్దరికీ ఆదివాసీల సంక్షేమమే ధ్యేయం. అయినా అటు విశాఖ మన్యం నుంచి యిటు నల్లమల ప్రాంతం దాకా ఆదివాసీలు అడివిలోకి వెళ్లడం ప్రాణాంతకమౌతున్నది.

ఆదివాసీల పరిస్థితుల్లోని విచిత్రం, వైరుధ్యం ఏమిటంటే అన్ని సంపదల మధ్యే ఉంటూ వాటినిస్వేచ్ఛగా, హుందాగా వాడుకోలేని దుస్థితి. అంతకుముందు ప్రాణం నిలుపుకునేందుకు జీవనాధారం సమస్య. యిప్పుడు ప్రాణం నిలుపుకోవడమే సమస్య. ఇలా సమస్యనుంచి సమస్యకు జీవితంగా వాళ్లు బతుకుతున్నారు. దీనికి తోడు సంక్షేమ విభాగాలూ లాభనష్టాలు బేరీజు వేసుకుంటూ పని చేయవలసి రావడం గత పదిహేనేళ్లలో వచ్చిన ఒక పెద్ద కుదుపు. బహుశా యిదే కొనమెరుపు. కొసమెరుపా లేదా కొండెక్కే దీపమా?

అయితే యిది ఆదివాసీలకే పరిమితమా అంటే కాదనే చెప్పాలి. పేదలందరి పరిస్థితి అదే. వాళ్లు అడివిలో ఉన్నా, ఊళ్లో ఉన్నా దళిత వాడలో ఉన్నా మురికివాడలో

ఉన్నా వాళ్ల ఉనికికే విలువ లేదు గాబట్టి వాళ్ల పనికీ విలువలేదు. కానీ దాదాపు అన్ని విభాగాల్లోనూ ఖాళీలుండడం సర్వసాధారణం. ఈ పరిస్థితి మారాలంటే అధికారులూ, స్వచ్ఛంద సంస్థలూ యింకా బలంగా, నిరంతరాయంగా పని చేయవలసిన అవసరం ఉంది.

ఇవి కథలు కావు గనక యిప్పటికీ పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు గనక వీటిని చదివిన అధికారులు (చదివితే) స్వచ్ఛంద సంస్థలూ, యువతరం మన సాటి మనుషులైన ఈ ఆదివాసీల జీవన స్థితిగతులను మెరుగు పర్చేందుకు తమ వంతు కృషి చేస్తారనే నమ్మకంతో...

**విద్యాసాగర్**



# పరిచయం

అడవంటే కొందరికి అడ్డదిడ్డంగా పెరిగే చెట్లు జ్ఞాపకానికి వస్తాయి. కొందరికి క్రూర జంతువులు స్ఫురణకు వస్తాయి. అడవిని కొందరు లాభదృష్టితో చూస్తారు, మరి కొందరు సౌందర్య దృష్టితో చూస్తారు, ఇంకా కొందరు వినోద దృష్టితో చూస్తారు. కాని లక్షలాది మంది గిరిజనులకు అది ఆశ్రయం. నాగరికులకు సొంత ఊరూ, సొంత ఇల్లూ ఎలాగో గిరిజనులకు అడవి అలాగ. అంతకంటె ఎక్కువే కూడా. అడవి గిరిజనుడికి మాతృదేవత. “అడవితల్లి” అంటాడతడు.

ఇరవయ్యో శతాబ్దం చివరి దశకంలో నాగరిక ప్రపంచం అనుభవిస్తున్న సౌకర్యాలలో గిరిజనులకు సహస్రాంశమైనా దక్కడం లేదు. ఆధునిక సమాజం సాధించిన అభివృద్ధిలో గిరజనుడి వాటా అల్పాతిఅల్పం. గిరిజనాభ్యుదయం కోసం ప్రభుత్వాలు పథకాల మీద పథకాలు వేస్తున్నది నిజమే. కోట్లకు కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. అదీ వాస్తవమే. అయినప్పటికీ గిరిజన పల్లెలు నాటికీ నేటికీ మారలేదు. పౌష్టికాహారం, వైద్య వసతి, టీవీ, రేడియో లాంటి ఘనమైన విషయాల మాట అటుంచి కనీసం బస్సు సౌకర్యానికి సైతం నోచుకోని గ్రామాలు కొల్లలు. రాత్రివేళ దీపం వెలగని కుటీరాలు కోకొల్లలు. గిరిజనేతరులతో సమానస్థాయిని వారెలాగూ పొందలేరు. అది వారికి తెలుసు. కనీసం అంతరాలు కాస్తంత తగ్గాలని గిరిజనుడు అనుకోవడం అత్యాస కాదు మరి.

పథకాలు ఎన్ని ఉన్నా, నిధులకు ఏమంత కొరత లేకున్నా ఆశించినంత అభివృద్ధి ఎందుకు జరగడం లేదన్నది తరచు వినవచ్చే ప్రశ్న. సమాధానాలు బృహత్ నివేదికలుగా ప్రభుత్వ భాండాగారాలలో పడి ఉంటాయి. ఎందువల్లనంటే అది అంతే. గిరిజనులు ఆకలితో అలమటించడం లేదంటే, వారిలో కొందరికైనా అక్షరజ్ఞానం కలుగుతున్నదంటే అందుకు ప్రభుత్వ యంత్రాంగాంలో సాటి మానవుల పట్ల తమ ధర్మాన్ని నిర్వర్తించాలని ఆరాటపడేవారు కొందరైనా ఉండడం కారణం. అదిలాబాద్ జిల్లాకు అధికారిగా పంపిస్తే అదొక మహాశిక్ష అనుకొనేవారు ఉన్నట్టే, అడవులకు పంపించినా ఆనందంగా పనిచేసేవారు కొద్ది మందైనా ఉన్నారు. బంగళాలూ, మందీ మార్బలాల ఆకర్షణలను అవతల పెట్టి, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాల అధికారిగా నియమిస్తే తృప్తిగా వెళ్లి, రాత్రనక, పగలనక, ఎండనక, వననక ఎంత దూరమైనా కాలిబాటను తిరిగి, శ్రమించి అమాయక గరిజనుల ఆదరాభి

మానాలను అడగకుండానే పొందిన యువ ఐ.ఎ.ఏస్. అధికారులలో ఒకరు శ్రీ విధ్యాసాగర్. పాలవంచ ఐ.టి.డి.ఎ. (సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ) అధికారిగా కొద్దికాలం పాటు తన విధి బాధ్యతలను నిర్వర్తించానని మాత్రమే అంటారాయన. కాని, అక్కడి గిరిజనులు అంతకంటె ఎక్కువ అనుకొన్నారు. సానుభూతి కలిగి, సాయం చేసే అధికారులలో సాక్షాత్తు దేవుణ్ణి చూస్తారు గిరిజనులు. శ్రీ విద్యాసాగర్ పట్ల వారికి కలిగిన కృతజ్ఞతా భావం భాషకు అందేది కాదు.

పాలవంచ గిరిజనుల ఆచార వ్యవహారాలను, నమ్మకాలను, కష్ట సుఖాలను, మంచితనాన్ని, అమాయకత్వాన్ని, అవసరాలను శ్రీ విద్యాసాగర్ అధ్యయనం చేశారు, అర్థం చేసుకొన్నారు. కర్తవ్య నిర్వహణలో తనకు కలిగిన అనుభవాలలో కొన్నిటిని రసవద్ఘట్టాలుగా ఆయన అక్షరబద్ధం చేశారు. వాటిని ఒక వ్యాసవరంపరగా "ఆంధ్రప్రభ"లో ప్రచురించే అవకాశం నాకు కలిగింది. నా మట్టుకు నాకు చాలా సంతృప్తిని, సంతోషాన్ని కలిగించిన వ్యాసాలివి. మనుషులుగా పుట్టి మనుషులుగా పెరుగుతూ మనుషులుగా మనందరి మధ్యగాక, వనమృగాల మధ్య నాగరికతకు అందనంత దూరంలో బ్రతుకుతున్న మనుషుల కోసం ఏ అధికారైనా ఆరాటపడి, ఎంతో కొంత కృషిచేయగిగాడని తెలిస్తే అదొక విలక్షణమైన ఆనందానుభూతి.

నాగరిక ప్రాంతాల నుంచి వెళ్లే ఎవరినైనా గిరిజనులు తొలుత అనుమానంగా చూస్తారు. అధికారులనైనా అంతే. రెండు మూడు సార్లు చూసిన తరువాత గిరిజనులలోని బెదురు చెదురుతుంది. భయం పోయిన తరువాత నమ్మకం మొలకెత్తుతుంది. అప్పుడు గిరిజనుడు నోరు మెదిపి మాట్లాడతాడు. మనసు విప్పి చెలిమి చేస్తాడు. తనవాడనుకొన్న తరువాత అతడు పరమ ఆత్మీయుడుగా మారతాడు. సొంత విషయాలు ఏకరువు పెడతాడు. అవతలి వాడి సొంత విషయాలు అడుగుతాడు. సుమారు నలభై సంవత్సరాల క్రిందట తమ ప్రాంతాలు చూసి వెళ్లినశ్రేయోభిలాషి ప్రొఫెసర్ హేమండార్ఫ్‌ను, ఆయన సతిని పాలవంచ గిరిజనులు ఇప్పటికి మరవలేదు. స్థానిక అధికారులతో కలసి ఆయన ఇటీవల పాలవంచ సందర్శించినప్పుడు ఇప్పటికి కొన్ని సంవత్సరాల క్రితం దివంగతురాలైన ఆయన సతిని గురించి గిరిజనులు పదేపదే అడిగారట. నచ్చితే చుట్టరికాలు కలపడంలో గిరిజనుడికి గిరిజనుడే సాటి.

పాలపంచ గిరిజనులలో ఎక్కువమంది కోయాలూ, కొండరెడ్లూ. నాగరిక ప్రాంతాలకు దూరంగా ఉన్నా గిరిజనులు సౌందర్యోపాసకులు. అందులో నాగరికులకు ఎంతమాత్రం తీసిపోరు. "కోయగూడేల్లో కొంతమంది కోయల లోగిళ్లు చూస్తే అందమంటే కోయలకుండే భావమేమిటో తెలుస్తుంద"ని రాశారు శ్రీ విద్యాసాగర్ ఒక వ్యాసంలో. "ఇంటి ముందు పూలచెట్లూ, ఇంటిలోపల రెండు అరలు; వెదురు తడికెల మీద చక్కటి రంగుల దృశ్యాలు, ఇంటిబైట చక్కగా ఆలికి, ఏదో ముగ్గులు వేసి, వెదురు గోడలపై ఏవో బొమ్మలు వేసి, బొమ్మరిల్లులా ఉండే" కోయల నివాసాలను మనోజ్ఞంగా చిత్రించారు రచయిత. కొన్ని గిరిజన పల్లెల పేర్లు మోటుగా అనిపించవచ్చునేమో గాని కొన్ని పేర్లు మాత్రం చాలా అందంగా, విన సొంపుగా ఉంటాయి. అలాంటి ఒక అందమైన పేరు "వెన్నెల బయలు". రచయిత అన్నట్టు "ఎంత చక్కనిపేరు!" గిరిజనుల భాష సైతం అంతే! సొంపైన కొండరెడ్ల చక్కని తెలుగు, కోయల రేలపాటా ఇందుకు నిదర్శనాలంటారు రచయిత.

సుతిమెత్తని మాటలతో గట్టిగా మందలించగల నేర్పు గిరిజనులకు ఉంది. తిరుగులేని వాదనా పటిమ ఉంది. కొందరు గిరిజనుల మాటలు గమనిస్తే బుద్ధి కుశలతకు విద్య అంత ముఖ్యం కాదేమో అనిపిస్తుంది. మాటకారితనంలో గిరిజన మహిళలు మగవాళ్లకు తీసిపోరు. నాలుగాకులు ఎక్కువే "చదివార"ని కూడా చెప్పవచ్చు. మేకల్ని మేపుకోనిస్తే అడవులు తరిగిపోతాయనే వాదాన్ని ఒక గిరిజన మహిళ ఎలా చీల్చి చెండాడిందో గమనించండి.

"పారెస్టు సార్లొచ్చింతరువాత బుట్టినయా మేకలు? తాతల ముత్తాతల నాట్నుంచి మేకల్లేవు? అయి అడివిలో మేస్తలేవు? యిప్పుడు పారెస్టు సార్లు మేకలు మేస్తే అడివి దరుగుతదంటే శాపలు దాగి సెరువెండినదన్నట్టున్నది నాయన!".

గిరిజనులు ఆత్మీయతకు ఇచ్చిన విలువలను అంతస్తుకు ఇవ్వరు.తమలో ఒకరుగా దగ్గరైన చిన్న ఉద్యోగిని సైతం నెత్తిన పెట్టుకొంటారు. అంత కంటె ఎంత పెద్ద అధికారి సమక్షంలోనైనా సరే తమ నచ్చుబాటును దాచకుండా బయటకు చెపుతారు. సాయం చేద్దామని వచ్చిన ఉన్నతాధికారి ఎదటనే తమకు తెలిసిన చిన్న ఉద్యోగి పట్ల అభిమానాన్ని వ్యక్తం చేసిన సంఘటనను "వాడు రెడ్డి వచ్చానాడా?" అనే వ్యాసంలో ఉదహరించారు రచయిత.

గిరిజనుల అవసరాలేవిటో, వాటిని తీర్చడానికి ప్రభుత్వం రూపొందించిన పథకాలు ఎందుకు సక్రమంగా అమలు కావడం లేదో శ్రీ విద్యసాగర్ వ్యాసాలు తెలియజేస్తాయి. గిరిజన సంక్షేమ వ్యవహారాలు చూస్తున్న ఒక ఉన్నతస్థాయి అధికారిని గురించి రాస్తూ "భూమీ, నీరూ, మొక్కలూ – ఈ వరుసలో గిరిజనాభివృద్ధి జరిగితే బాగుంటుందని ఆయన విశ్వాసం.... అదే నేనూ నమ్ముతాను" అని సమస్య స్వరూపాన్ని మూడే మాటల్లో తేల్చారు రచయిత. గిరిజనులకు భూమిని పంచడంలో, సాగునీటి వసతి కల్పించడంలో మొక్కలు పెంచుకోనివ్వడంలో ప్రతిబంధకాలు లేకపోతే గిరిజన సమస్యే లేదు. దాని అనుబంధ

సమస్యలు అంతకంటే లేవు. క్రింది స్థాయిలో పనిచేయని ఉద్యోగుల చేత పని చేయించడం, నమ్మకం ఉంచి, నీతిమంతుడైన ఉద్యోగిని గిరిజనాభ్యుదయానికి ఉపయోగించుకోవడం అందరికీ చేతనైనది కాదు. చేతనైతే గిరిజన ప్రాంతాలు ఎప్పుడో మెరుగుపడి ఉండేవి. రోడ్డు వసతి కూడా లేని పల్లెలకు నడిచివెళ్లే ఓపికా, సరైనా తిండి అమరకపోయినప్పటికి దొరికనదేదో తిని సర్దుకుపోయే మనస్తత్వమూ ఉంటే గిరిజనాభ్యుధయానికి పనిచేసే ఉగ్యోగి కొంతలో కొంతైనా విజయం సాధించగలుగుతారు. అధికారులకు గిరిజన పెద్దలు చేసే మర్యాదలను వివరిస్తూ "చింతగండి పెద్ద యింట్లో కోడికూర మాత్రమే" చేసిన ఉదంతాన్ని ఉదహరించి "ప్రభుత్వాధికారులు అంతకు తక్కువైతే తినరని వారి నమ్మకమేమో!" అని దెప్పి పొడిచారు రచయిత.

క్రిందిస్థాయి ఉద్యోగులు పనిచేయకపోతే పై అధికారుల వద్దకు పోయి అడిగి పనిచేయించుకోవడం గొప్ప నేర్పు. గిరిజనులలో అక్కడొకరు, ఇక్కడొకరు ఆ విద్యను నేర్చుకొన్నారు. అలా వెంటబడి పనిచేయించుకొనే ఒకగిరిజనుడి కథ ఈ గ్రంథంలో ఉంది పై అధికారి దగ్గరకు ఎందుకు పోవాలో అతడి మాటల్లో వినండి. "పెద్దొర జూసిండంటె కొందోళ్లు యింటరు గద. నా పైసలు నాకిస్తరు గద గదీ యిషయం!" గిరిజన ప్రాంతాలలో దీర్ఘకాలం పనిచేయవలసివచ్చే ఉద్యోగులు ఏదో ఒక సాకు చెప్పి స్వస్థలాలకు తరచు వెడుతుంటారు. ఎందుకని అడిగితే పండగనో, పబ్బమనో గిరిజనులకు జవాబు చెపుతుంటారు. "ఇన్ని పండగలుంటాయా సార్లకు" అని గిరిజనుల ఆశ్చర్యం.

గిరిజన ప్రాంతాలలో ఉధృతమవుతున్న మరొక సమస్య నిరుద్యోగం. అంతో ఇంతో చరువుకొన్ని తరువాత గిరిజనుడు ఉద్యోగం ఆశిస్తున్నాడు. అతడి ఆశ ఫలించనప్పుడు "అతివాదం" వైపు అకర్షితుడవుతున్నాడు. గూడేలకు గూడేలు మారిపోవడానికి సైతం ఇలాంటి పరిణామాలే కారణం. "బీదరికంలో మగ్గే ఆ గూడేలు నిరాశలో మునిగిపోవలసిందేనా? ఇటువంటి వాతావరణంలో (గిరిజన యువకుడు) అతివాదం వైపు ఆకర్షితుడవడంలో ఆశ్చర్యం ఏముంది? ఉద్యోగాలు వచ్చినా, ఆర్థిక పరిస్థితి మెరుగుపడినా వాళ్లు అతివాదం వైపు మొగ్గు చూపించితే అది వేరే విషయం" అని ఆవేదన వ్యక్తపరిచారు రచయిత. ఏకోపాధ్యాయ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యావంతులైన గిరిజనులను నియమిస్తే పరిమితంగానైనా సమస్యను పరిష్కారం చేయవచ్చు. అలా కొన్నిచోట్ల చేశారు. అది మంచి ప్రాచుర్యం పొందింది. అనేక కారణాల వల్ల అడవి వదలడానికి ఇష్టపడని గిరిజన యువకులకు ఉపాధ్యాయ వృత్తి సచ్చుతుంది. "బి.ఎ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై కూడా ఒక యువకుడు ఎన్నిసార్లు ఈ ఏకోపాధ్యాయ పాఠశాలల గురించి నన్నడిగి ఉంటాడో చెప్పలేను"



అని ఒక వ్యాసంలో రాశారు రచయిత. "ఎవరైనా సొంతంగా, కొత్తగా ఏదైనా చేయదల్చుకొంటే మన వ్యవస్థను కాపాడాలనుకొనే ఉద్యోగులూ, అధికారులూ ఏవో కొన్ని అవాంతరాలు కల్పిస్తూనే ఉంటారు. అవరోధాలు దాటి ముందుకెళ్లగలిగేవారు చాలా తక్కువమంది. అందుకే చాలామంది నిరుద్యోగులు ప్రభుత్వోదో&యగాలు వచ్చేదాకా నిరుద్యోగులుగా ఉండటానికే యిష్టపడతారు" అని రచయిత విశ్లేషణ.

జిల్లా అధికార యంత్రాంగం సాహసించి ఏవైనా నిర్ణయాలు తీసుకొంటే అవి అమలు జరుగుతాయన్న హామీ లేదు. రెండు వందల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఏర్పాటు చేద్దామనుకొని, తరువాత తప్పనిసరై విరమించుకొన్న ఒక సంఘటన విషయంలో అనుభవం పండిన ఒక ఉన్నతాధికారి జౌత్సాహికుడైన తనతోటి అధికారికి విజ్ఞతాపూర్వకంగా చేసిన హితబోధ చూడండి "మనం ఖచ్చితంగా నెరవేర్చగలమని తెలీవి వాటిని మనపైన వేసుకోవడం మంచిది కాదు. ఏకోపాధ్యాయ ఉద్యోగాలు వస్తాయనే నమ్ముదాం. కాని అవి వచ్చిన రోజున ఉద్యోగాలిద్దాం, పాఠశాలలు తెరుద్దాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి వర్తమానం లేకుండా మనమే తొందరపడ్డం మంచిది కాదు. మీ ఉద్దేశం మంచిదే కాని అర్థాంతరంగా పాఠశాలలు మూసివేయవలివస్తే గిరిజన యువకులకు మన మీద నమ్మకం ఉంటుందా? వాళ్ల కుటుంబాలు ఏమవుతాయి?"

ప్రాంభించిన పథకాలు అనుకోకుండా ఆగిపోతే, చేద్దామనుకొన్న మంచిపని చేయలేకపోతే కలిగే మానసిక వ్యధను రచయిత పఠితల గుండెకు గుచ్చుకొనేలా వర్ణించారు. "ఇంతవరకు జీవితంలో నాకు గుర్తుండి రెండే రెండుసార్లు చాలా తీవ్రమైన వేదనను అనుభవించాను. మొదటిది పూర్తిగా వ్యక్తి గతమైనది. రెండోది ఉద్యోగానికి సంబంధించినది అయినా దాదాపు వ్యక్తిగతమైనంతగా మనసును కలచి వేసింది. అది జీడిగుప్పలో కొండరెడ్ల కోసం ఓ ఏడాది కిందట స్థాపించిన 'స్పెషల్ సెల్' మూసిచేయాలనీ, అదే రకంగా కూనవరం దగ్గర పైడిగూడెలలో తయారవుతున్న కొండరెడ్ల శిక్షణా కేంద్రం నిర్మాణాన్ని ఆపివేయవలసిందనీ అందిన ఆదేశం...... కళ్లముందే కన్నబిడ్డలు ప్రమాదానికి గురైనప్పుడు కలిగే వేదనలాంటిది అనుభవించాన్నేను." వేదనను ఇంతకంటె స్పష్టంగా చెప్పడం ఎవరికీ సాధ్యపడదేమో.

గిరిజనులను గురించి ప్రభుత్వంలోని పెద్దలతో సహా నాగరిక ప్రపంచంలోని చాలా మందికి చాలా అపోహాలు ఉన్నాయి. గిరిజనులు అన్యాయంగా అడవులను నరికి ధ్వంసం చేస్తున్నారన్నది అలాంటి అపోహలలో ఒకటి. ''పోడు'' వల్ల వనసంపద తరుగుతున్నదని ఒక ఆరోషణ. కాని, కాగితం మిల్లుల కోసం, నాగరికుల గృహనిర్మాణానికి

కలప కోసం నరుకుతున్న అడవుల విస్తీర్ణంతో పోలిస్తే నిజానికి "పోడు" వల్ల పాడవుతున్న అడవి చాలా తక్కువ. "పోడు" వల్ల నరికిన అడవి ప్రాంతంలో తిరిగి అడవి పెరగడానికి కూడా గిరిజనులు దోహదం చేస్తారని చాలామంది గుర్తించరు. క్రూరమృగాల నుంచి కాపాడుకోనడానికో, చలికాచుకోడానికో, భూసారాన్ని పెంచడానికో గిరిజనునలు చెట్లను తగులబెట్టే మాట కూడా నిజం. ఐతే, సర్వసాధారాణంగా ఎండిన చెట్లనే కాలుస్తారు గిరిజనులు. అడవితల్లిని కాపాడుకోవాలనే ఆందోళన నాగరికులకంటే గిరిజనులకే ఎక్కువ ఉండడం సహజం. గిరిజనేతరులు భారీయెత్తున అడవులను ధ్వంసం చుస్తున్నారని గిరిజనులు పడే ఆవేదన మన దృష్టికి రాదు. "మా మాటయినేవాడెవుడు" అని నిర్లిప్తంగా ఊరుకోవడం తప్పించి గిరిజనులు చేయగలిగింది లేదు. తమ మట్టుకు తాము "కూసున్న కొమ్మను కొట్టుకుండేవాళ్లం గాము" అని తమ నిజాయితీని, చిత్తశుద్ధినీ మనకు విశదపరచాలని వారు చేసే ప్రయత్నం విఫలమవుతూనే ఉంటుంది. ఎందుకంటే వారిది మౌనవేదన.

గిరిజనుల నమ్మకాలు వేరు, వారి ఆచార వ్యవహారాలు వేరు. వారి నమ్మకాలను మన నమ్మకాలతో, వారి ఆచారాలను మన ఆచారాలతో పోల్చడం సరికాదు. ఇద్దరు భార్యలు ఉండటం తప్పు కాదు సరికదా అవసరమని నమ్ముతారు కొండరెడ్లు. "ఊరు బయలు ఎల్లినప్పుడు వెంట ఉండే దానికొకరు, ఇల్లు జూసే దానికొకరు, ఇద్దరుండాల" అని కొండరెడ్ల సమర్ధన. నాగరికులలోనూ ఇది సమంజసంగా ఉందనుకొనే వారు కొందరైనా ఉంటారు. కాని అలా బయటికి చెప్పరు. "ఒక జాతి నమ్మకాలు, ఆచారాలు తప్పు ఒప్పు అని చెప్పడానికి మనమెవరం?" అని ప్రశ్నించారాయన 'ఇద్దరుండాల సారూ" అనే వ్యాసంలో అలాగని తాను బహు భార్యాత్వాన్ని ఎంతమాత్రం సమర్ధించడం లేదనీ స్పష్టంచేశారు.

బంగళాలు కట్టేదాకా ఆఫీసులు పెట్టకపోవడం తప్పంటూ ఒక గిరిజనుడు చెట్టుకిందనే ఆఫీసు పెట్టమంటాడు. "ఇప్పుడిక్కడ చెట్టు కింద కూర్చుని ఇన్ని మాటలు మాట్లాడుకోలే! మనం పనిచేసుకోవడానికి బంగళానే కావాలా? చెట్టుకిందనే ఆఫీసు పెడితే సరిపోతది" అని అతడి వాదన. కాదనడం కష్టమే మరి.

ఏర్చికూర్చిన పదాలతో, సుదీర్ఘ సమాసాలు వేసి రూపొందించే వ్యాక్యాలు వ్యక్తం చేయలేని భావాలను తేలికమాటలతో గుండెకు తగిలేలా వ్యక్తం చేయడం గిరిజనుల మధ్య కూర్చుని వారి ముచ్చట్లు వింటుంటే కనిపిస్తుంది. కొండరెడ్ల వృత్తులలో ఒకటి బుట్టలల్లడం. కొండరెడ్లు కొండలమీదనే ఉంటారు. అక్కడే దొరికే వెదుళ్ల సరికి బుట్టలు అల్లుతారు. ఫారెస్టు డిపార్టుమెంటు వారు, కొండరెడ్లను కిందికొచ్చి డిపోలనుంచి వెదుళ్లు తీసుకోమని పురుమాయించడం కాస్తంత ఇబ్బందికరమైన పరిస్థితిని కల్పించింది. కొండమీది నుంచి



తెచ్చిన వెదుళ్లను మళ్లీ డిపో నుంచి కొండమీదికి మోసుకొనిపోవడం ఎందుకో వారికి బోధపడలేదు. అదొక అర్థం లేని పని అని వారికి అనిపించింది. ఒక గిరిజన యువతి ఈ అధికారిని అడిగింది "కొండకు కట్టెలు మొయ్యమంటరా సారూ" అని. అందులోని వెటకారం అధికారికి అర్ధం కాక తప్పదు. కొద్ది మాటలచేత ఆ యువతి ఎంత అర్థాన్ని, ఎంత వెటకారాన్ని మోయించింది! ఆఫీసుల చుట్టూ తిరగలేకనే, అధికారులతో వేగలేకనే "కొండరెడ్లు ఉన్న స్థితిలోనే ఉండటానికి ఇష్టపడతారు" అంటారు రచయిత.

శ్రీ విద్యాసాగర్‌కు సౌందర్యదృష్టి ఉంది. చూసిన అందాన్ని అందమైన మాటల్లో చెప్పగల ప్రతిభ ఉంది. రచయిత హృదయం నుంచి కవితాత్మకంగా పొంగివచ్చిన చక్కని వ్యాక్యాలు ఈ గ్రంథంలో ఎన్నో ఉన్నాయి. "వాస చిత్తడికి అప్పటికప్పుడే పుట్టుకొచ్చి వెన్నుదీసిన రెల్లు పూలూ, అడవి పూలపొదలూ అల్లుకొన్ని బండ్లబాట"గా అడవి మధ్య బాటను అభివర్ణించారు. వర్షం కురిసిన తరువాత బాట ఆయనకు బురద అనిపించలేదు. "వళ్లంతా తడిసి ఆరిన కాలిదారులు" అంటారు. "కసకసమని సందడి చేసే కొండజొన్న చేలు" లాంటి సహజ వర్ణనలు సంకలనంలోని ప్రతి వ్యాసాన్ని రసభరితం చేశాయి.

గిరిజ ప్రాంతాలలోని స్థితిగతులను తెలుసుకొనడానికి పాలకులు కమిటీలు వేసి కాలాన్ని, ధనాన్ని వృథా చేయవలసిన అవసరం లేదు. అనుభవం నుంచి పుట్టుకొచ్చిన ఇలాంటి వ్యాసాలను అధ్యయనం చేస్తే తెలియవలసిన సంగతులన్నీ ఎవరికైనా తెలుస్తాయి.

అడవితల్లి అనుగు బిడ్డలైన గిరిజనుల పట్ల శ్రీ విద్యాసాగర్‌కు కలిగిన ప్రేమాభిమానాలకూ వాత్సల్యానికీ ఈ వ్యాస సంకలనం అక్షరాకృతి.

**-పొత్తూరి వెంకటేశ్వరరావు**

# నా... మాట

నేను ఈ పని చేసేందుకు నాకున్న అర్హతలేంటో నాకు తెలీదు. అయితే కాస్త లోతుగా ఆలోచిస్తే కొన్ని కారణాల వల్ల నేను ఈ పని చేయడం పూర్తిగా అసమంజసం కాదేమోననిపిస్తుంది. మొదటిది ఈ రచయిత నా చిరకాలమిత్రుడు కావడం; రెండవది నేను 1978- 79లో కొన్ని నెలల పాటు శబరి, గోదారి సంగమం దాటింతర్వాతున్న వరరామచంద్రపురంలోని నాగార్జున గ్రామీణ బ్యాంకులో ఫీల్డాఫీసరుగా పన్జేయడం; మూడవది ఖమ్మం జిల్లాలో కలెక్టర్‌గా పనిచేయడం. నాక్కూడా గిరిజన ప్రాంతాల్లో కాస్త అనుభవం ఉండడం. సరే, ఈ గొడవంతా ఎందుగ్గానీ, అసలు విషయాని కొద్దాం.

అసలు విషయమేటంటే మనిషిలోస్వార్ధం లేనపుడు అతను (అంటే ఆమె కూడా) మాట్లాడే ప్రతి పదానికి ఎంతో బలముంటుంది. ప్రతి పనిలోనూ సిన్సియారిటీ కనబడుతుంది. మీరు ఈవిషయాన్ని “భద్రాచలం–మన్నెం కతలు” చదవడం మొదలుపెట్టిన మొదటి వాక్యం నుండి చివరి వాక్యం వరకు గ్రహిస్తారు, అనుభవిస్తారు.

మనవాడి రచనల్లోని గొప్ప విశేషమేంటంటే ఎంతో గొప్ప విషయాన్ని నువ్వు నేను మాట్లాడుకొన్నట్లు చెప్పేయడం. అలా పాఠకుడ్ని తనతో తీసుకెళ్ళిపోతాడు. ఇదంతా పెద్దపెద్ద పద్యాలు, గేయాల ద్వారా కాదు. తను మాట్లాడుకుంటూ పోతుంటే మనమంతా వినవల్సిందే. అది తన మాటలకున్న శక్తి. మీరు దీన్ని చదవడం మొదలుపెడితే నాతో ఒప్పుకుంటారని నేను చెప్పనవసరం లేదు.

నేను గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నప్పట్నుంచి నాకర్ధం కాని విషయమొకటుంది. అదేంటంటే ‘విశ్వాసాని’కి ‘హేతువు’కూ ఎందుకు పొంతనలేదని. కాని “ఇద్దరుండాల సారూ!” చదివింతర్వాత అసలు వాటి మధ్య లింకు ఎక్కడుందో తెలిసింది. ఆ లింకు ఎక్కడుందంటే మేధస్సు మనస్సు మధ్య. అయితే ఈ చిక్కును మనవాడు ఎంత సులభంగా విప్పాడో గమనించండి. “మనిషిని మనిషి వంచించనంత వరకూ ఏ ఆచారం నమ్మినా తప్పుకాదేమో? ఒకజాతి నమ్మకాలు, ఆచారాలు ఈప్పు,ఒప్పు అని చెప్పడానికి మనమెవరం? నిజాలను ఇప్పుకోవడానికి మనకెంత సంకోచం?” మన మౌలిక విలువలనే ప్రశ్నిస్తాలేడీ పెద్దమనిషి?

గిరిజన జీవనవిధానం, వారి ఆర్ధిక వ్యవస్థ, ప్రభుత్వ అటవీ విధానం, అధికారుల అవగాహన, పేపర్‌మిల్స్ యొక్క “స్వలాభాపేక్ష” ఎలా వుంటాయో అన్న విషయాల్ని “కొండకు

కట్టెలు మొయ్యమంటారా సారూ?...లో కళ్ళకు కట్టినట్లు చెప్పాడు. వివిధ వర్గాల వారి ప్రయోజనాలకున్న ఘర్షణలిలా వుంటాయనే విషయం చదువుతున్నపుడు మళ్ళీ గుర్తొస్తుంది. ఒకరిది బతుకు తెరువుకై పోరాటం, మరొకరిది ధనార్జనకై ఆరాటం.

"చెట్టుకింద ఆఫీసు"లో గిరిజనులూ, అందులో ఖమ్మంజిల్లా కొండరెడ్లెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తాడు. కొండరెడ్లకు ప్రత్యేక శ్రద్ధాశక్తులతో పని చేసిన ప్రసాదరెడ్డిని గూర్చి "వాడురె వచ్చినాడా?" లోను, ఈ ప్రాజెక్టు స్థాపనలో పూర్తిసహాయ సహకారాలందించిన జిల్లా కలెక్టర్ శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావుగార్ని గూర్చి "ఆ తొమ్మిది నెలలు" లోను ఎంతో చక్కగా వివరించాడు. (బిడ్డకు జన్మనిచ్చే తల్లి నవమాసాలు మోసి, కనిపెంచినట్లుగనే మన సాగరుడు ఆ తొమ్మిది నెలలు కొండరెడ్ల అభివృద్ధి కొరకు ప్రత్యేక ప్రాజెక్టును సాధించి అన్ని కొండరెడ్ల గ్రామాల మధ్యఉండే కొండరెడ్డి గ్రామమైన జీడిగుప్పలో స్థాపించాడు.

ప్రశ్నల శర్మగారు'లో అడవికి అర్థం చెప్పి అందులో నివసించే వారి హక్కుల గూర్చి చెప్పాడు. వారి బాగోగులు కోసం చేయవలసిన పనులు పద్ధతి ప్రకారం చేపట్టాడు. కాని అవి పూర్తయ్యే వరకు అదే స్థానంలో వుండిపని చేయగలిగినవాడు ధన్యుడు. కాని మనవాడు అంత అదృష్టవంతుడు కాదు. "కానీ యింతలోనే నాకు పాలవంచ నుండి బదిలీ అయిపోయింది. " అన్న వాక్యం చదువుతుంటే పాఠకుడికే గుండె గతుక్కుమంటే ఇక గిరిజనుడి ఆవేదన, ఆక్రోశం వేరే చెప్పాలా?

నర్మదా ప్రాజెక్టు, సర్దార్ సరోవర్ ప్రాజెక్టులవల్ల నిరాశ్రయులు అవుతున్న గిరిజనుల కోసం మేధాపాట్కర్, బాబాఆమ్టేలు పోరాడుతున్నారు. కాని చింత మల్లమ్మగోడు ఎవరు వినిపించుకున్నారు. "భూమి కోసం" చదవండి మీకే తెలుస్తుంది. భూమికోసం, భుక్తికోసం మల్లమ్మలాగా ఎంతమంది తంటాలు పడుతున్నారో ఏమో? భూమికి, భుక్తికి మధ్య శ్రమశక్తి అనేది ముఖ్యమైన లింకు. ఆ వయసులో కూడా ఆమెలాంటి అభాగ్యులు ఎందరో అంత కష్టపడుతుండ బట్టే మనం ఇలా వుండగల్గుతున్నాం.

"కోయకన్నె" చదువుతుంటే నాకు శ్రీశ్రీగారి 'జగన్నాథ రథ చక్రాలు' గుర్తుకొచ్చాయి. ఈ అత్యాచారాలకు అంతమెప్పుడో?

గ్రామీణ ప్రాంతాల్లో వున్న 'పవర్ ఈక్వేషన్' ను ఎంతో చక్కగా, కళ్ళకు కట్టినట్లు వాస్తవాల్ని "బతకనిస్తరా సారూ"లో చూపించాడు. అయితే వినేవాడుంటే అడిగేవాడికి లోకువని సిరమప్ప విషయంలో మనం అనుకోకూడదు. సిరిమప్పకు వేరేమార్గం లేదు. ఉన్నదారి ఒక్కటే. అది ఐ.టి.డి.ఎ.కు పోతుంది. అక్కడ పి.వో. గారుంటారు. మరి సిరిమప్ప బాధ ఎవరు తీర్చాలి? పి.వో. గారే.



కొండకోనల్లో వుండే గిరిజనులు అడవిలో వుంటారు. అడవిలో వన్య ప్రాణులూ వుంటాయి. కాబట్టి వాళ్లు కొన్నిసార్లు జంతుబారి నుండి తప్పించుకోలేరు. కొన్నిసార్లు పులులకు బలయితే మరికొన్ని సార్లు ఎలుగుబంట్లు దెబ్బతీస్తాయి. గాయపరుస్తాయ్. ఆ సంఘటన విషాద భరితమైంది. "నా మొకం మల్లొచ్చింది సారూ" చదువుతుంటే నాకళ్ళమ్మట నీళ్ళు తిరిగినయ్. వాళ్ళు ఆసుపత్రి నుండి మధ్యలోనే తిరిగొచ్చేస్తే మనవాడెంతో బాధపడ్డాడు. కాని వాళ్ళు మాత్రం ఏం చేయగలరు? "షారూ, మొకమొస్తదోరాదో గానీ, దేశంగాని దేశంల నేనెందుకు జావాల. నేనీడెందు కుంట. నన్నూరికి దీసుకపోండ్రి అని ముసిలాయనొకటే వొర్లబట్టె. పట్నంల దవాకాన్ల బెడ్డులేదని కింద బండబెట్టిరి. పొద్దునొక డాకటేరు జూసిపోతే మళ్లీ జూసిటోడు లేకపాయె. ఏదన్న గావాలంటె నేనుబోతే ముసిలోడి దగ్గర మనిసి లేకపాయె. సస్తె సచ్చినం. ఉన్నూర్ల జస్త. నన్ను దీసకపొండ్రి అంటె దిక్కుదోసక మళ్లీ దెచ్చినం యీడికె. మీరిచ్చిన పైసలు ఆడికయి పోయినయి." ఈ పరిస్థితులే మనసెదురైతే మనం కూడా మధ్యలోనే వచ్చేసేవాళ్లం ఆసుపత్రి నుంచి.

గోదారిక్కోపమొస్తే భద్రాచలంలోని ఊర్లమీద తన రౌద్రాన్నెలా చూపిస్తుందో మనవాడు 'రోడ్డమీద లాంచీ"లో చూపిస్తాడు. "ఎంత చేరువో అది అంత దూరమే"చాలా ఆసక్తికరంగా వుంది. "ప్రొఫెసర్ హేమండార్ఫ్" మీద చాలా విషయాలు మనకందించాడు. ఆంధ్రలోని ఆదివాసులకు ముఖ్యంగా ఆదిలాబాద్ వాళ్లకి ప్రొఫెసర్ హేమండార్ఫ్ అంటే ఇంచుమించు 'పెర్సాపేన్" (ఆరాధ్యదైవం)తో సమానమే మరి.

ఏవిషయానైనా సరే ఎంతో ఈజ్ తో డీల్ చేయగల సమర్థుడు మనవాడు.

మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు "ఏ కవి కైనా సరే" (మన రచయిత కూడా కవే. అయితే పద్యాలు వ్రాసే వాళ్ళు కవులు, గద్యాలు్రాసే వాళ్లు రచయితలను కోవడం మనం మానసిక అడ్డుగోడలు కట్టుకోవడమే. ఏదైనా ఉపయోగపడే భావం చెప్పే ప్రతి ఒక్కడూ, నా దృష్టిలో కవే) "అతని చుట్టూ ఒక సమాజం ఆసమాజానికొక పరిణామం వుంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్య స్థానం విర్ణీత మవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయితే ఈ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు." మన్నెం కతలు చదివింతర్వాత నా యింప్రెషన్ ఏంటంటే శ్రీశ్రీ చెప్పిన ఆగమనాన్ని మన వాడు మరింత వేగవంతం చేయగలడు. చేస్తాడు, చేస్తున్నాడు.మీరంతా చదివి మీ యింప్రెషన్స్‌ని మీరే ఏర్పరుచుకోవాలని కోరుతూ మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ఇక చదవండి ఈ మన్నెం కతల్ని.

**-పి. సుబ్రమణ్యం**

# అడుగు..
## విడం...డిలా..


| | | |
|---|---|---|
| 1. | ఇటూ... కిన్నెరసాని | పుట |
| | అటూ... కిన్నెరసాని | 01 |
| 2. | రోడ్డుమీద లాంచీ ! | |
| | ఆకాశవాణి నందిగాము !! | 08 |
| 3. | మనలోమాట | 17 |
| 4. | చెట్టుకింద ఆఫీసు | 25 |
| 5. | "వాడు రెడ్డి వచ్చినాడా ?" | 34 |
| 6. | "కొండకు కట్టెలు మొయ్యమంటరా... సారూ?" | 40 |
| 7. | "ఇద్దరుండాల సారూ !" | 46 |
| 8. | ప్రొఫెసర్ హేమండార్ఫ్ | 55 |
| 9. | భూమి కోసం | 65 |
| 10. | "శాపలు దాగితే సెరువెండుద్దా సారూ ?" | 72 |
| 11. | ఆ... తొమ్మిది నెలలు | 78 |
| 12. | కోయకన్నె | 86 |
| 13. | "కూసున్న కొమ్మ కొట్టుకుంటమా సారూ ?" | 95 |
| 14. | చీకటి మండలం | 103 |
| 15. | ప్రశ్నల శర్మగారు | 111 |
| 16. | "బతకనిస్తరా... సారూ ?" | 118 |
| 17. | "నా మొకం మల్లొచ్చింది సారూ !" | 124 |
| 18. | కొండెక్కి దిగిన కొండరెడ్ల సెంటరు | 129 |
| 19. | ఇవి కూడా జరిగుంటే... | 136 |
| 20. | ఓసారి తిరిగి చూస్తే | 143 |
| 21. | ఈ పుస్తకమెలా వచ్చిందంటే | 146 |
| | (తొలి ప్రచురణతో - రచయిత) | |
| 22. | గిరిజన సీమలు | 154 |

# ఇటూ... కిన్నెరసాని
# అటూ... కిన్నెరసాని

"**పీ.**వో.[1] గారూ, వో పీ.వో గారూ, అమ్మ ఆఫీసు కెళుతున్నది. నిన్ను లెమ్మంటుంది." అంటూ మూడున్నర సంవత్సరాల మా పాప నీహారిక లేపడంతో లేచాను. ఆఫీసుకు వెళ్లే వేళ దాకా పడుకున్నానా? అని ఆశ్చర్యపోయాను. యింతలో మా శ్రీమతి వచ్చి "నిద్రయిపోయిందా లేక యింకా కలలు కనడం మిగిలిపోయిందా" అనడంతో సిగ్గేసింది నాకు. ఉదయాన్నే యింటి చుట్టూ ఉండే గిరిజనుల కోసం ఆరు గంటలకే లేవడం అలవాటయిన నేను ఈ రోజు యిప్పటి దాకా ఎలా పడుకున్నావా అనుకుంటూనే, 'టైమెంతైందని' అడిగాను.

"తొందర పడాల్సినంత కాలేదు. అయినా నువ్విప్పు2డు పాలవంచలో లేవు. మీరిపుడు పీవోగారు కాదు పీవో గారూ" అంటూ నవ్వింది.

"సరే, యీ రోజు నీహాకు స్కూల్లేదు. నాకాఫీసుంది[2]. యీ రోజు నుంచీ, నీ ఉద్యోగం వేరే; యిప్పుడే వస్తానని చెప్పి ఆఫీసుకెళ్లి, ఆఫీసు నుంచి చెప్పకుండా క్యాంపెళ్లి, రాత్రి పది గంటలకు వచ్చే రోజులు యింక నుంచి బంద్. ఈ రోజు నుంచి, నీహాను చూసుకోవాలి; ఆనంద్‌ని ఆడించాలి. నీహాను స్కూల్లో వదలాలి; ఇంటికి తీసుకురావాలి..."

"యింకా..."

"యింకా మధ్యాహ్నం నేనొచ్చేటప్పటికి నా కోసం ఎదురు చూడాలి"

"యింకా..."

"యిప్పటికే టైమైంది. అవన్నీ మధ్యాహ్నం వచ్చింతరువాత చెప్తాను. నీ కోసం నేను రోజుల తరబడి ఎదురు చూశానుగా! యిప్పుడు నీ వంతు". అంటూ వెళ్ళిపోయింది మా శ్రీమతి.

లేచి స్నానం చేసి తయారయ్యేటప్పటికి పదకొండున్నర అయింది. పేపర్లు ముందేసుకొని కూచుని, యింత తీరిగ్గా పేపర్లు చదివి ఎన్ని రోజులైంది? ఈ రోజు షేరు మార్కెట్ వివరాలు కూడా చదవొచ్చు అనుకున్నాను. నీహమ్మ ప్రశ్నలకు సమాధానాలు

చెబుతూ అప్పుడప్పుడూ ఆమెపై విసుక్కుంటూ, తమ ఏడ్వబోయేంతలో, "నీహమ్మా, నీ నీ హ్యాపీ బర్త్‌డే క్యాసెట్ చూస్తావా" అంటూండగా, మా శ్రీమతి గారొచ్చేశారు. "కొట్టుకుంటూ, తిట్టుకుంటూ గౌతమెక్కే[3] వాళ్లమూ, నీ దగ్గరొచ్చే వాళ్లము. యిప్పుడదంతా కుదరదు పీవోగారూ! నీహమ్మను ఒక్కమాటంటే ఊరుకునేది లేదు. ఆమె ఏడిస్తే కథలు చెప్పి నిదరబుచ్చాల్సిన పని కూడా యికనుంచి నీదే. మధ్యాహ్నం ఓ మీటింగుంది. భోంచేసి వెంటనే వెళ్ళాలి మళ్లీ సాయంత్రం తీరిగ్గా మాట్లాడుకుందాం" అంటూ భోజనానికి కూర్చుంది.

భోజనాలైపోయి, మా శ్రీమతి తిరిగి ఆఫీసుకెళ్లాక నీహమ్మను నిద్రబుచ్చడం నావంతయింది.

**"పప్పా, వోకథ చెప్పవా?"**

కథలు వినదమే కానీ, చెప్పడం మర్చిపోయి చాలా రోజులయిందే, ఏం చేయాలబ్బా? అనుకుంటూండగా ఓ ఆలోచన వచ్చింది. మన అనుభవాలనే కథలుగా చెప్పొచ్చుగా నీహమ్మకు. నాతోబాటు నీహమ్మ అడవుల్లో అప్పుడప్పుడూ తిరిగినా, అప్పుడామెకేం అర్థం అయి వుంటుంది. యిప్పుడవే చెప్తే తనకూ గుర్తొస్తుందనే ఆలోచనతో మొదలు పెట్టాను. మూడున్నర సంవత్సరాల పాప కివన్నీ అర్థమయ్యేనా? అయినా ఆలోచనలు ఆగవు కదా. ఆమె విన్నంత వరకూ విని నిద్రపోతే మిగిలినవన్నీ నా ఆలోచనలూ, జ్ఞాపకాలు. ఈ ఆలోచనలూ జ్ఞాపకాలూ నీహమ్మకు కథల రూపంలో చెప్పినవి కావు. కానీ నీహమ్మకు చెప్పాలనుకోవడమే వీటికి అంకురార్పణం.

ఇక చూడండి.

**ఎంత చేరువో అది అంత దూరమే!**

1988 జులై 14కి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చినా నల్గొండ కలెక్టరు శ్రీ దయాచారిగారు నన్నంత తొందరగా రిలీవ్ చెయ్యలేదు. చెయ్యనని చెప్పేశారు. నేను నల్గొండ జిల్లాలోనే కనీసం ఇంకో సంవత్సరం అయినా ఉండాలని వారి కోరిక. అయితే ఆయనకి నచ్చచెప్పి రావడానికి కొంత సమయం పట్టింది. అంచేత పాలవంచ వెళ్లి జాయిన్ కావడానికి రెండు వారాలు ఆలస్యం అయింది. ఈ లోపు వర్షాలు బాగా వస్తున్నాయి.

ఆ వర్షాకాలంలో జులై 26న మధ్యాహ్నం వేళకు పాలవంచ చేరుకుని మిత్రుడు నాగిరెడ్డి దగ్గర ఛార్జి తీసుకుని అరపూట కూడా కాలేదు. 'గోదావరి పెరుగుతోంది, పెరుగుతోంది' అంటూ వార్తలు రావడం మొదలయ్యాయి. గోదావరి పెరగడం



మొదలయిందంటే ఖమ్మం జిల్లాలో మిగిలిన పనులన్నీ బంద్. వర్షాకాలం మొదలయిందంటే గ్రామాల్లోకి వెళ్లడం చాలా కష్టం. కాబట్టి యిప్పటి మొట్టమొదటి కర్తవ్యం ఆఫీసు పని కాదు. ఏవో కొన్ని బట్టలు సర్దుకొని గోదావరి వెంట పరిగెత్తడమే.

1986 గోదావరి వరదల్లో డ్రైవింగ్‌లో అనుభవజ్ఞుడైన డ్రైవరు వీరాస్వామీ, వరద సహాయక చర్యల్లో విశేష సేవ చేసిన అధికారి మా అడ్మినిస్ట్రేటివ్ అధికారి సత్యనారాయణగారు బైల్దేరాం. పీవో గారి వెంటే గదా క్యాంపు క్లర్కు అంటూ హనుమంతరావు మమ్మల్ని అనుసరించాడు.

మా వాహనం మారుతి జిప్సీ. వీరాస్వామి కథ మొదలు పెట్టాడంటే దానికి అంతం వండదు. ఒక దానివెంట ఒకటి అలా చెప్పేసుకుంటూ వెళ్తూ ఉండడం అతని ప్రత్యేకత. ఎంత ఆసక్తికరంగా ఉన్నా, పని దృష్ట్యా యిప్పటికింక చాల్లే అని మధ్యలో ఆపమని చెప్పగలగడం నా ప్రత్యేకత.

బయల్దేరబోతుండగా...

జూయింట్ కలెక్టరు శ్యాంబాబు కూడా భద్రాచలం వెళ్లడానికి పాలవంచ వస్తున్నాడనీ; కలెక్టరు శ్రీ కృష్ణారావు గారు కూడా అదే ప్రయత్నంలోనే ఉన్నారనీ, కానీ పరిస్థితి అనుకూలించడం లేదనే సమాచారం అందింది. సాధ్యమైనంత తొందరగా భద్రాచలం చేరుకుందామనే తొందరలో ఉండగా, పాలవంచ మండలాధ్యక్షులు శ్రీ కిషన్ వచ్చారు, "సార్, కిన్నెరసాని పెరుగుతోంది. నాగారాం మునిగిపోతుందని అందరూ భయపడుతున్నారు. కిన్నెరసాని డ్యాం యింజనీర్లు నీళ్లు పూర్తిగా వదిలారంటున్నారు. మీరొకసారి రావాలంటూ". నాగారం చూసుకుంటూ భద్రాచలం వెళ్దామని బైల్దేరాం శ్రీ కిషన్‌తో సహా.

నాగారం చేరుకునే లోపుల కిన్నెరసాని నీళ్ళు బ్రిడ్జికివతల ఫర్లాంగు దూరం రావడంతో కిన్నెరసాని బ్రిడ్జి అటు ప్రక్కకి వెళ్లిపోయినట్లు భ్రాంతి కలిగింది. నాగారం చేరుకోగానే, మాయిల్లు చూడండంటే మా యిల్లు చూడండంటూ గ్రామస్తులు చుట్టు ముట్టారు. ఎటూ చూడాలనే వచ్చాను గనుక యిళ్లల్లోకి వెళ్ళాను. పరిస్థితి అంత ప్రమాదకరంగా లేదు. కానీ ఆ సమయంలో ఆ మాట అనడం ధర్మం కాదు, ఆందోళనలో ఉన్న వాళ్లకు కొంచెం ధైర్యం చెప్పడమే అప్పటికి చేయవలసింది.

యిళ్లన్నీ తిరిగి మళ్లీ రోడ్డు మీదకి వచ్చేటప్పటికి సత్యనారాయణ గారు, "సార్ యింతవరకూ ఎవ్వరూ భద్రాచలం వెళ్లలేదు. సబ్‌– కలెక్టరు భట్టాచర్యగారు ఒక్కరే

భద్రాచలంలో ఉన్నారు. కాబట్టి యిప్పటికైనా మన భద్రాచలం బైల్దేరాలి. కానీ కిన్నెరసాని దాటనీయదు. వేరే మార్గం చుట్టూ తిరగైనా మనం పోతే మంచిది; లేకుంటే అది కూడా కష్టమౌతుంది" అని అన్నారు.

అప్పుడనుకున్నాం పాలవంచకు తిరిగి వెళ్లి ఆశ్వారావు పేట ద్వారా భద్రాచలం చేరదామని. దూరం 180 కి.మీ. వెంటనే బైల్దేరితే మూడు గంటల్లో చేరిపోవచ్చు. అదే ఆశ, ఆతృతతో బైల్దేరాం.

ఆనందాపురం గ్రామం దాటగానే పాములేరు వచ్చింది. నిండుగా పారుతున్న పాములేరు చూడగానే వీరాస్వామి కథ మొదలు పెట్టాడు.

1986లో బిస్వాల్ గారు పి.వో.గా ఉన్నప్పుడు గోదావరి వరదల్లో వేలేరుపాడు ప్రాంతంలో జీపులో వెళ్తుండగా, ఆకస్మాత్తుగా జీపు టైరు బురదలో యిరుక్కొని తిరగడం మొదలైందంట. పై నుంచి వర్షం; యిరుక్కుంది వాగులో. ఏం చేయలో తోచక అర్ధరాత్రి దాకా అక్కడే గడిచిపోతే ప్రక్క గ్రామం నుంచి ఓ ట్రాక్టరు వచ్చి లాగిందట. బైట పడింతరువాత కూడా దారి తప్పి పాలవంచ చేరేటప్పటికి తెల్లవారి పోయిందట.

ఇలా అనుభవాలు గుర్తు చేసుకుంటూ మేమో అరడజను వాగులు దాటాం. ఓ చోట కల్వర్టు దిగి ప్రక్కగా వెళ్లవలసి వచ్చింది. అక్కడ నాకు సందేహమొచ్చింది. మా జీపు కూడా వాగులో యిరుక్కుపోదు కదా అని. సరే ఎలాగైతేనేం వాగు దాటాం. వీరాస్వామికి ప్రతివాగుతో ఓ సంబంధం, అనుబంధం ఉంది. తన అనుభవాలతో మేము రెండు గంటలు గడిపి, యింకో గంటలో భద్రాచలం చేరిపోతామనే సంతోషంలో ఉండగా ఎదురుగా ఓ బ్రిడ్జి కనిపించింది. ఆ తరువాత అవతలి వైపు ఓ ఫర్లాంగు దూరాన రోడ్డు కనిపించింది. అంటే బ్రిడ్జి నుంచి ఓ ఫర్లాంగు దూరం రోడ్డు నీళ్లలో మునిపోయిందన్నమాట.

వీరాస్వామి మాట్లాడ్డం ఆపేశాడు. అయ్యా, యిది జిప్సీ, నీళ్ళు తగిలితే ఆగిపోతుంది. మరి ఏం చేయ్యాలంటూనే" జీవు ఆపేశాడు. వర్షం వస్తోంది. వాగు పెరిగే అవకాశం చాలా ఉంది. అయితే, యింకో అరగంటలో భద్రాచలం చేరిపోవాలనే ఆశ ఓ పక్క బలంగా వుంది. వాగు లోతు ఎంత వుంటుందో సరిగ్గా ఎవరికీ తెలియదు. దూరంగా నీళ్లలో మునిగిన తాటిచెట్ల తలలు చూస్తే చూచాయిగా ఒక అవగాహన వచ్చింది. కానీ రోడ్డు ఏవైవుందో తెలియదు. సరే యింత దూరం వచ్చాక యిక్కడ ఆగడమెందుకని అనుకుంటూ, సత్యనారాయణ గారివైపు చూశాను, హనుమంతరావునూ అడిగాను వెళదామా అని. తనూ సరేనన్నాడు.



జీవు వెనక మిగిలిపోయింది. జీవు ఈ పక్కకు చేరే అవకాశం లేదు. ఓ వేళ నీళ్లు తగ్గితే రూపు జీవు ఈ వైపుకు వచ్చేటట్టు. లేకపోతే వీరాస్వామి తిరిగి పాలవంచ వెళ్లి మా విషయం అక్కడ చెప్పాలనే ఉద్దేశ్యంతో వీరాస్వామిని జిప్సీలో వదిలి ముగ్గురం బైల్దేరాం.

అడుగు తీసి అడుగు వేసుకుంటూ నటుస్తున్నాం, ఎందుకంటే మేం నడుస్తున్నది వాగులో, ఎక్కడ లో తుందో తెలియదు. రోడ్డు ఏ ప్రక్కగా వెళుతుందో తెలియదు. కాళ్లతో రోడ్డును తడుముకుంటూ, ఒక్కోసారి పొరబాటున రోడ్డు దిగి గుంటలో పడిపోయి, మెడలోతు నీళ్లలో నడుస్తూ తాటిచెట్ల దగ్గరి కొచ్చేసరికి కొంచెం సందేహమొచ్చింది. వాటిపై భాగం మాత్రమే కన్పిస్తోంది. అంటే ఎంత లోతుందో ఏమో! అయితే చెట్టు ఆకారాన్ని బట్టి దాని వయస్సూ, పొడుగూ చెప్పొచ్చు. "సత్యనారాయణ గారూ, బాగా లోతుంటుందేమో యిక్కడ" అన్నాన్నేను.

"చెప్పలేం సార్, కానీ యీ చెట్లు కొంచెం లేతగా ఉన్నాయి. అంటే పెద్ద పొడుగుండకపోవచ్చు" అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

"రోడ్డు ప్రక్కన ఉండే చెట్లు కాబట్టి, కొంచెం లోతులో అవి ఉండొచ్చు సార్. రోడ్డు కొంచెం పైకే ఉంటుంది కాబట్టి, మనం నేరుగా రోడ్డు చూసుకుంటూ వెళితే వెళ్లిపోవచ్చు సార్" అన్నారు హనుమంతరావు కూడా. దూరాన వీరాస్వామి జిప్సీఅగుపిస్తోంది. "వెనక్కి వెళ్లిపోదామా? సార్" అన్నాడు హనుమంతరావు. "యింత దూరం వచ్చి యిప్పుడు వెనక్కి వెళ్లడం ఏమిటి? ముందుకే వెళదాం" అన్నాను. చివరికి ఎలాగైతేనేం వాగు దాటేశాం. ఎంత రిలీఫ్ పొందామో చెప్పలేం!

భద్రాచలం చేరడానికి ఉన్న ఒక్క యిబ్బందీ గడిచిపోయిందనీ, తరువాత రాబోయే గ్రామం కనీసం 5 కి.మీ.లు ఉంటుందని సత్యనారాయణగారన్నారు. మళ్లీ బైల్దేరాం కాలినడకన. జల్లులొస్తున్నాయి, చెప్పులు జీపులో ఉండిపోయాయి. పోనీ కథలు చెప్పుకుంటూ నడిస్తే అలసట తెలియకుండా ఉంటుందనుకుంటే కథలు చెప్పే వీరాస్వామీ జీపులో ఉండిపోయాడు. ఆ ప్రాంతానికి నేను పూర్తిగా కొత్త కాబట్టి అప్పుడప్పుడు నేనడిగే ప్రశ్నలకు సత్యనారాయణ గారు, హనుమంతరావు సమాధానం చెబుతూ మసక చీకటి పడేటప్పటికి ఉప్పేరు చేరుకున్నాం. ఉప్పేరు నుంచి చూస్తే భూర్గంపాడు, భద్రాచలం కన్పిస్తాయి.

ఉత్సాహం ఎక్కువైంది. ఆతృత ఎక్కువగా ఉంది. కాలినడక మళ్లీ మొదలుపేట్టాం. ఉప్పేరు దాటి కిన్నెరసాని మీది బ్రిడ్జి దగ్గర కొచ్చి యింకొంచెం దూరం నడిచాం. రోడ్డు మునిగిపోయింది. చుట్టూ సముద్రంలా ఉంది. అక్కడ్నుంచి భూర్గంపాడు కేవలం ఓ

కిలోమీటరే. ఆ కిలోమీటరు దూరమూ నీళ్లే. కిన్నెరసానీ, గోదవరీ కలిసిపోయాయి.

నీళ్లు! నీళ్లు!! ఎటు చూసినా నీళ్లే!!! కిలోమీటరు దూరం మునిగిన రోడ్డు మీద మేం వెళ్ళగలిగే అవకాశం ఏమాత్రం లేదని తెలుస్తున్నా, ముందుకు పోవాలనే ఆతృత తగ్గడం లేదు. నిముష నిముషానికి నీళ్లమట్టం ఎక్కువౌతూనే వుంది.

ఇంతలో బాగాచీకటి పడింది. వర్షం కురుస్తూనే ఉంది. గోదావరీ, కిన్నెరసానీ ఆజేయంగా కన్పిస్తున్నాయి. తిరిగి ఉప్పేరు వెళ్లడమే మార్గం. మళ్లీ యింకో కిలోమీటరు వెనక్కి నడవాల్సిందే.

మొదటి రోజే అయినా, ఈ గ్రామాలన్నీ నావే అనే ధీమా. గ్రామం చేరితే రాత్రి ఎలానో గడచిపోతుందనుకుంటూ నడుస్తుండగా, శ్రీధరవేలేరు గ్రామ సర్పంచి ఎదురొచ్చారు. ఆయనతో సత్యనారాయణగారు మా ప్రయాణ వివరాలు చెప్పారు. ఆయన నొచ్చుకొని,“యీ పరిస్థితోల్లో వెళ్లవలసిన అవసరం ఏముంది సార్. మేమంతా లేమా? మీరీ రాత్రికి యిక్కడ వుండండి. రూపు పడవలో భూర్గంపాడు వెళ్లవచ్చు” అన్నారు యింతలో అతనికి ఐ.టి.డి.ఎ.[4] కొన్ని కాంట్రాక్టులు యిచ్చినట్టు తెలిసింది. అంచేత రాత్రికి యిక్కడ ఎలా ఉండడమా అనే ఆందోళన ఓ పక్క! కానీ యీ రాత్రికి మరెక్కడికీ వెళ్లలేకపోవడం మరొకపక్క! ఆలోచించి యిక్కడ భోంచేయకపోతే సరిపోతుందనే మధ్య మార్గం ఎంచుకున్నాను.

యింతలో సర్పంచి గారి చిన్నపాప నీళ్లు తీసుకొనివచ్చింది ‘భోజనానికి రండి’ అంటూ. మళ్లీ మీమాంస. ఓ చిన్నపాప భోజనానికి పిలుస్తుంటే కాదనడం బాగుండదేమో! కాని ఓ కాంట్రాక్టరు యింటిలో ఎలా భోంచేయడం అనే ఆందోళన. “మీ కోసం ప్రత్యేకంగా మేము చేయలేదు సార్” అంది పాప ముద్దుగా. యిక లాభం లేదు. చిన్నపాప అమాయకత్వం గెలిచింది. ఆ రాత్రి గడిచింది.

ఇప్పుడు మేమిద్దరం అధికారీ, కాంట్రాక్టర్లం కాము. ఇద్దరు మనుషులం మాత్రమే. ఒకరినొకరు అర్థం చేసుకొనే పరిస్థితిలో ఉన్నవాళ్ళం. తెల్లవారిన తరువాత, పడవలో భూర్గంపాడు, జీపులో భద్రాచలం చేరామననుకోండి.

మామూలుగా అరగంట పట్టే ప్రయాణం 18 గంటలు పట్టింది. 28 కి.మీ.ల దూరం 180 కి.మీ అయింది. ఈ లోపు గూడ్సు రైలును మణుగూరు దాకా పొడిగించుకొని కలెక్టరు గారు భద్రాచలం చేరుకున్నారు. వారికన్నా ముందే చేరాలనుకున్న మేం ఆలస్యంగా చేరాం. “మీరేమయ్యారో తెలియడం లేదని పాలవంచ నుండి ఫోనొచ్చిందని” సబ్ కలెక్టరు



భట్టాచార్య చెప్పడంతో వీరాస్వామి ఏమయ్యాడా అని ఆందోళన కలిగింది. కాని వీరాస్వామి జీవుకు ఎటువంటి మార్గంలోనైనా వెళ్లడం చేతొచ్చు. కాకుంటే ఎవరికైనా మా బాధలు కథలుగా చెబుతూ ఆగిపోయాడేమో!

❖ ❖ ❖

1. పీ.వో. : ప్రాజెక్టు ఆఫీసరు లేదా ప్రాజెక్టు అధికారి. ఐటిడీఏ (సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ)లో ప్రధాన కార్యనిర్వహణాధికారి. గిరిజనులందరికీ బాగాపరిచయమైన అధికారి.
2. ఆమె ఆఫీసు : అంటే మా శ్రీమతి రత్నప్రభ ఆఫీసు. 1981 బ్యాచ్ అయ్యేయస్ అధికారిణి. కర్నాటక రాష్ట్రంలో పని చేస్తున్నది. నేను పాలవంచలో పని చేస్తున్న రోజుల్లో ఆమె హైదరాబాద్‌లో ఫిలిం సెన్సార్ బోర్డు అధికారిణిగా ఉండేది.
3. గౌతమి : సికింద్రాబాద్ నుంచి కాకినాడ వెళ్లే రైలు. ఈ రైల్లో ఓ పెట్టె కొత్తగూడెం వెళ్తుంది. ప్రతి శని, ఆదివారాలు పిల్లలతో సహా మా శ్రీమతి ఈ రైల్లో కొత్తగూడెం వచ్చేది.
4. ఐటీడీఏ : ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లేదా తెలుగులో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ. మన దేశంలోగిరి జన జనాభా అధికంగా ఉన్న జిల్లాలో యిటువంటి సంస్థలను 1975 నుంచి ఏర్పాటు చేయడం జరిగింది. ఇటువంటివి ప్రస్తుతం మన దేశంలో 193 ఉన్నాయి.

# రోడ్డు మీద లాంచీ !
# ఆకాశవాణి నందిగామ !!

నందిగామ ఎక్కడిదైనా అక్కడ రేడియో స్టేషన్ లేదే అని సందేహపడ్తున్నారా? అసలు విషయమంతా అందులోనే ఉంది.

అలాగే రోడ్డు మీద లాంచీ అంటే మీరు యింకా అయోమయంలో పడొచ్చు.

లేనట్టుగా ఉండి ఒకటీ,

అసంగతంగా ఉండి ఇంకొకటీ

ఈ రెండు పేర్లూ మిమ్మల్ని ఇబ్బందిలో పడేస్తాయి.

చాలాసార్లు జీవితంలో మనకు ఎదురుపడే సంఘటనలకూ, మనం చేయాలనుకొనే పనులకూ, మనం చేస్తున్న పనులకూ, మన ఆలోచనలకూ, పొంతన లేకపోవడం నేనొక్కడ్నే కాదు, మీరందరూ చూసి అనుభవించే ఉంటారని నా నమ్మకం.

అలాగే రోడ్డు మీదికి లాంచీ వచ్చింది.

నందిగామకు రేడియో స్టేషనూ వచ్చింది.

కాకుంటే అవి రెండూ అక్కడ ఉంది కొద్దిసేపే.

ఆ కొద్దిసేపట్లోనే ఏవేవో సంఘటనలు... కొన్ని సందర్భాలూ.... కొన్ని అసందర్భాలూ...

ముందు చెప్పినట్లుగా పాలవంచ నుండి 28 కి.మీ. దూరంలో ఉన్న భద్రాచలం చేరుకోవడానికి 180 కి.మీ. దూరం 18 గంటలపాటు ప్రయాణం చేసి భద్రాచలం చేరుకోవడంతో మా పని అయిపోలేదు.

వాస్తవానికి భద్రాచలం దగ్గర గోదావరి వరదల ప్రభావం దాని తీరు తెన్నులు తెలుస్తాయి కాబట్టి అక్కడనుంచే వరద సహాయ కార్యక్రమాలు మొదలౌతాయి. అక్కడే కార్యక్రమాలను ఆలోచించుకొని, ప్రణాళిక రూపొందించుకొని సంబంధిత అధికారులకు తగు సూచన యివ్వడం జరుగుతుంది. అందుచేత అధికారులందరూ భద్రాచలంలో సబ్ కలెక్టరు కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు చేరుకుంటారు. అలాగే మేమూ, అంటే మా ఎ.వో. సత్యనారాయణా, సీ.సీ హనుమంతరావూ భద్రాచలం సబ్ కలెక్టరు కార్యాలయం చేరాం.

కృష్ణారావు గారు 1986 గోదావరి వరదల వెంటనే ఖమ్మం కలెక్టరుగా వచ్చారు. ఆ వరదల తీవ్రత, ఆ సమయంలో వచ్చిన అనుభవాలను, సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఓ మంచి “మార్గదర్శిని” లాంటి పుస్తకం తయారు చేశారు. దాని ఆధారంగా అధికారులతో చర్చలు జరిపి, ఎవరెవరు ఎక్కడెక్కడికి వెళ్లాలో కలెక్టరు గారు నిర్ణయించారు.

కృష్ణారావుగార్ని కలవగానే వారిలా అన్నారు.

“నేను భద్రాచలం వస్తూ పోతూ వుంటాను. జాయింట్ కలెక్టరు శ్యాంబాబు భద్రాచలంలో ఉంటారు. సబ్ కలెక్టరు భట్టాచార్య వెంకటాపురం ప్రాంతం చూస్తారు. ప్రాజెక్టు అధికారి సాగర్ కూనవరం ప్రాంతంలో ఉంటారు” అని అధికారులకు విధులు అప్పజెప్పారు.

ఈ రకంగా చెయ్యడంలో ఉన్నతాధికారులు అందుబాటులో ఉంటే ఎక్కడికక్కడ నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందనేది ఆయన ఉద్దేశం. “ముఖ్యంగా కూనవరంలో ఉండే అధికారులు అప్రమత్తంగా ఉండాలి. భద్రాచలానికి పై ప్రాంతాల్లో, అంటే వెంకటాపురం ప్రాంతంలో వరద తీవ్రత ఉన్నా, ప్రజలకు సహాయ కార్యాక్రమాలు అందించడం కొంతవరకు సులభం. వెంకటాపురం చేరడానికి తాలిపేరు దాటడమొక్కటే యిబ్బంది. వరద తీవ్రత ఎక్కువయ్యే కొద్దీ భద్రాచలంలోనూ పస్థితి ఆందోళనకరంగా ఉంటుంది. మూడొంతుల భద్రాచలం పట్టణం మునగుతుంది. అయితే కూనవరం ప్రాంతం ఓలోతైన పళ్లెం లాగా ఉండి, అడవీ కొండలూ చాలా దూరంగ ఉండడంతో గోదావరి విస్తరించడానికి ఏ అడ్డూ ఆపూ ఉండవు. అంచేత గోదావరి కూనవరం దగ్గర నదిలాగా కాదు, సముద్రం లాగా అన్పిస్తుంది. శబరి గోదావరిలో కలిస్తే గోదావరి విస్తరణ పెరుగుతుంది. గోదావరి శబరిని వెనక్కి నెడితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది” అంటూ మాకు జాగ్రత్త చెప్పారు.

“శబరి ఓ పెద్ద కాలువలా వుంటుంది. దాని గట్లు చాలా ఎత్తుగా ఉండి, చాలా వేగంగా ప్రవహిస్తుంది. ఈ వేగంతో వచ్చే శబరిని గోదావరి వెనక్కి నెడితే అది కూనవరం,

వరరామచంద్రపురం, చింతూరు మండంలాల్లోని గ్రామాల్లోకి వెళ్లి గ్రామాలనుదీవుల్లాగా తయారుచేస్తుంది. యిటువంటి పరిస్థితి వారం రోజులకు పైబడి ఉండే అవకాశం ఉంది. ఈ స్థితిలో తాగేనీళ్లు, ఆహారం సరఫరా చేస్తూ ఈ వారం రోజులా గడపడం మినహా వేరే మార్గం లేందటూ" మేము కనీసం వారం రోజులు కూనవరంలో చిక్కుకుపోక తప్పదని చెప్పకనే చెప్పేశారు.

ఇలా శబరీ, గోదావరి కలిసే కూనవరం ప్రాంతంలో వరద నీళ్లు ఒకటి, రెండు అంతస్తులుండే భవంతులను ముంచేస్తే, 1986లో లాంచీలు భవనాల మీదుగా వెళ్లాయి. కాబట్టి ప్రాజెక్టు అధికారిగారు భద్రాచలంపై పూర్తిగా ఆధారపడకుండా సహాయ కార్యక్రమాలు చూసుకోవాలి. అవసరమైనవన్నీ ముందే కూనవరంలో సిద్ధంగా ఉంచడం జరిగిందనుకోండి. ఇంతవరకూ 1986 లాంటి పరిస్థితి రాలేదు. కానీ రాదనీ చెప్పలేము".

"మేము పేరూరు దగ్గరా, దుమ్ముగూడెం దగ్గరా కేంద్ర వాటర్ కమీషన్ వారి ద్వారా నీటిమట్టం ఎలా ఉందనేది గమనిస్తూనే ఉంటాం. దుమ్ముగూడెం, భద్రాచలం దగ్గర వరద తీసిన ఇంకో రెండు మూడు రోజుల వరకూ కూనవరం దగ్గర వరద తీవ్రత ఉంటుంది.

కూనవరం దగ్గర వరద ఎక్కువ కావడానికి యింకో కారణం కూడా ఉంది. కొల్లూరు దగ్గరి పాపికొండల నడుమ గోదావరి వైశాల్యం చాలా తక్కువ. ఎందుకంటే ఆ కొండలు చాలా యిరుకైనవి. దీంతో గోదావరి నీరు వెనక్కి తగ్గి గ్రామాల వైపు మళ్లుతుంది. ఇందంతా చూసి గాభరా పడకండి. పరిస్థితి ఎలా వుంటుందని చూచాయగా చెప్పాను. అన్ని ప్రాంతాల్లో "హ్యామ్ సెట్స్"[6] ఉన్నాయి కాబట్టి ఎప్పటికప్పుడు సమాచారం పంపిస్తూ ఉండండి. ప్రజలను ఆందోళన పడకుండా చూసుకుంటే మన పని మూడొంతులు సఫలమయినట్లే" అంటూ ధైర్యం చెప్పారు.

ఏ.ఓ. సత్యనారాయణగారిని వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట పంపించి నేనూ, సి.సి. హనుమంతరావూ, అటెంటడరు భూషయ్యా కూనవరం బయల్దేరాం.

డ్రైవరు జగదీష్. జీవు మహీంద్ర అండ్ మహీంద్ర. ఇది పూర్తిగా మూసి ఉండే జీపు. జగదీష్ డి.ఆర్.డి.ఎ.[7] డ్రైవరు.

మా రెండో రోజు ప్రయాణంలో దారి సరిగ్గా ఉందా లేదా అని చెప్పగలిగే వారు లేరు. సబ్ కలెక్టరు భట్టాచార్య టూకీగా చెప్పాడు గానీ దాన్ని నిర్ధారించలేక పోయాడు.



వదర తీవ్రత ఎవరో చెప్పితే తెలుసుకోగలిగే అవకాశం లేదు. కలెక్టరు గారు ఓ అవగాహన యిచ్చారు. మనంతట మనం తెలుసుకోవడమే మంచిదని బయల్దేరాం. జగదీష్ కొంచెం సందేహంగా ఉన్నాడు. సాయంత్రానికి తిరిగి భద్రాచలం రాగలనా లేదా అని అతని సందేహం. భద్రాచలం నుంచి కూనవరం 60 కి.మీ.లు ఎక్కువంటే 1.30 గంటల ప్రయాణం. అంతా బాగుంటే తను సాయంత్రం 8 గంటలకు తిరిగిరావచ్చు. ఆ మాట చెప్పి అతన్ని ఉత్సాహపరిచాం.

సమయం సాయంత్రం నాలుగ్గంటలు. ఆకాశం మేఘావృతంగా వుంది. కొంచెం కొంచెం జల్లులు పడుతాన్నాయి. కంట్రోలు రూం జీపుల రొదలోనే కలెక్టరు గారికి చెప్పి బయట్దేరబోతూ,

ఈసారి మేమొక్కడున్నామో తెలియని పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో "ఓ 'హ్యామ్ సెట్' ఉంటే బాగుంటుంది సార్" అన్నాను కలెక్టరు గారితొ. "ఇంకా రాలేదు వీళ్లు. కొంచెం సేపట్లో "హ్యామ్ సెట్" పంపిస్తా" మంటూ ఉండగా "నా పేరు శ్రీనివాసండీ,[8] హైదరాబాదు నుంచి వచ్చా" నంటూ సన్నగా, పొడుగ్గా ఉత్సాహంగా ఉన్న చామనచాయ రంగు యువకుడొచ్చాడు. "సాగర్, శ్రీనివాస్‌ను కూడా మీతో తీసుకువెళ్లండి. ఇతిన్న వరరామచంద్రన పురం పంపించండి ఎలాగైనా ఈ రాత్రికే. తొందరగా బయల్దేరండి" అని మరోసారి గుర్తు చేసారు.

భద్రాచలానికి 15 కి.మీ దూరంలో నెల్లిపాక ఉంది. ఇక్కడ నుంచి కూనవరం 45 కి.మీ.లు నెల్లిపాక దగ్గర చింతూరు మీదగా రాజమండ్రి వెళ్లే రోడ్డు వేరౌతుంది. నెల్లిపాక చేరేటప్పటికి బాగా వెలుతురుంది. అయితే నెల్లిపాక చేరడానికి ముందే ఓ చిన్న నీళ్లగుంటలో కొంచెం ఇబ్బందులు పడి వచ్చాం గనుక చీకటి పడకముందే కూనవరం చేరతూమా అనే సందేహం పెరుగుతోంది. ఇంకా మూడొంతుల ప్రయాణం ఉంది.

నెల్లిపాక దాటి. మహా అయితే యింకో గంటలో కూనవరం చేరతామను కుంటూండగా రోడ్డు మలుపులో వేగంగా ప్రవహిస్తున్న నీళ్లు అగుపించాయి. అక్కడో వాగుందేమో అనే సందేహం కలిగి, "అక్కడో వాగుందా" అని అడిగాను. "గోదావరి నీళ్ళు వాగుల్లోకి వచ్చి, వాగుల నీళ్లు పొలాలగుండా చిన్నకాలవల్లోకి రావడంతో రోడ్డు మీద పారే నీళ్ళు కూడా వాగుల్లాగా తయారౌతాయి. అలాంటిదే యిది. మనం సందేహ పడాల్సిసందేంలేదన్నాడు" భూషయ్య.

పై నుంచి జల్లులు పడుతున్నాయి. చూస్తుండగానే నీళ్లమట్టం పెరుగుతోంది. “అయినా, యిది డీజిల్ జీపు కాబట్టి నీళ్లలో తడిసినా ఏం కాదంటూ” నీళ్లలో దించడానికి సిద్ధమయ్యాడు జగదీష్ రోడ్డు మలుపులో నీళ్ళు కనీసమంటే అర ఫర్లాంగు ఉన్నాయి. కంగారులో జీపు రోడ్డు దిగింది. ఆ నీళ్ల మధ్యలో అగిపోయింది. మేము పూర్తిగా తడిసిపోయాము. మేము ఎలాగైనా రక్షించుకొందామనుకున్న “హ్యామ్ సెట్” కూడా తడిసిపోయింది. అది పనిచేయకపోతే మళ్లీ మేం ఎక్కడున్నామో తెలియని పరిస్థితి వస్తే... వరద సహాయ కార్యక్రమాలు మేం చేయడం పోయి మాకే సహాయం అందించవలసి వస్తుంది!

నాతో ఉన్న మిగిలిన అందరి ఆందోళన వేరు. అదేమంటే యిటు వంటి పరిస్థితిలో నేనున్నానే అని. నన్ను చూడాలంటే మొహమాట పడుతున్నారు. మన కింద పనిచేసే ఉద్యోగుల గౌరవాభిమానాలకు హద్దులు చూడడం ఇటువంటి సందర్భాల్లో అసలు సాధ్యం కాదు. అందరమూ కలిసే ఉన్నామని నేననుకుంటూ ఉంటే, నేనా పరిస్థితిలో ఉన్నందుకువాళ్ల బాధ చూసి చలించిపోయాను. “మనందరం కలిసి యిక్కడనుంచి బయటపడే మార్గం ఆలోచించాలి. జీపు నెడదాం పట్టండి” అని అన్నాను. “లేదు సార్. ముందు మీరు వెళ్లండి. ఎదురుగా కన్పించేదే నందిగామ. భూషయ్యా, మీరూ అక్కడికి వెళ్లండి, మేము జీపు నెట్టుకొని వస్తా” మంటూ అందరూ ఒకేసారి చెప్పారు. నేను జీపు నెట్టడం మొదలు పెట్టడంతో వాళ్లూ ఆ ప్రయత్నంలో పడిపోయారు. నీళ్లు దాటింతరువాత ఓ కిలోమీటరుంది ఊరు. ఈ కిలోమీటరూ జీపును నెట్టాం.

సమయం రాత్రి 7 గంటలు. చీకటి. అప్పుడప్పుడూ మెరుపుల వెలుగు. మందకొడిగా వెలుగుతున్న కరెంటు దీపాల వెలుగు. నిర్మానుష్యమైన రోడ్డు. సన్నని ధారగా కురిసే వర్షం. కోస్తా జిల్లాల్లోని గ్రామాల పేర్లు వెంకటాపురం నుంచి కూనవరం దాకా ఉండే రోడ్డుపై చాలా తటస్థిస్తాయి. అటువంటి వాటిలో నందిగామ ఒకటి.

గిరిజన సంక్షేమం నా ప్రధాన లక్ష్యం కాబట్టి,“ఈ గ్రామం గిరిజన గ్రామమా” అని అడిగాను. “కాదయ్యా, అన్నాడు” భూషయ్య. అరే! గిరజనేతర గ్రామంలో ఆగిపోయామా? ఇంతకు ముందాగిన ఉప్పేరు కూడా గిరిజనేతర గ్రామమే. అయినా ఆపదలో గిరిజన, గిరజనేతర భేదమేమిటి? గిరిజనేతరులకు వరద రాదా ఏమిటి అనే ఆలోచనల్లో నేనుండగా, “హ్యామ్ సెట్” పనిచేస్తుందో లేదా అనే ఆందోళనలో ఉన్నట్టున్నాడు శ్రీనివాస్.



“ నిండా మునిగాక చలేముంది శ్రీనివాస్ గారు! చుట్టుప్రక్కలా నీళ్లు. పైన వర్షం. జీపు బంద్; మన ప్రయాణం బంద్. చేయగలిగిందేమన్నా ఉంటే తెల్లవారింతరువాత చూసుకోవలసిందే” అన్నాడు హనుమంతరావు.

రోడ్డు మీద ఎవరూ లేరు. ఆగిపోయిన జీపు. జీపు చుట్టూ మేం. శ్రీనివాస్‌కి ఉత్సాహం తగ్గడం లేదు. బహుశా మొదటిసారి సెట్ స్వంతంగా ఉపయోగించే అవకాశం లేదోనని ఏదో రకంగా ఇప్పుడే ఏదో ఒకటి చేయాలనే ఆదుర్దాతో గుంజల కోసం చుట్టూ చూడడం మొదలు పెట్టాడు. “ ఎదురుగా ఉండే ఇంటి గుంజ ఎక్కి అక్కడ ఏరియల్ బిగిస్తే వాళ్ళేమి అనరా”? అని  అడిగాడు.

“సరే, వాళ్లేమయినా అంటే మాత్రం మనం చేయగలిగేదేముంది? వాళ్లు తిట్టినా మనకు వేరే గత్యంతరం లేదు కదా. బిగిద్దాం కానీండి” అన్నాడు హనుమంతరావు. ఆగిన జీపూ, సాగుతున్న ఏరియల్ తీగలూ, జీపు చుట్టూ నిలబడిన మేమూ, సర్కస్ కంపెనీ వాళ్లలాగా అనిపించామేమో యిద్దరు పిల్లలు మెల్లగా బయటికి వచ్చారు. నాకైతే చిన్నప్పుడు చూసిన దొమ్మరాట గుర్తొచ్చింది. వాళ్ళు గ్రామంలోకి రాగానే రెండు  గుంజలు పాలి తాడు కడ్తారు. ఆ తాటిపై ఓ యువతి నడుస్తుంది. ఎక్కడ జారిపడుతుందోననే ఉత్కంఠ. కాకుంటే మమ్మల్ని చూస్తే గమనించగల్గే తేడా ఒక్కటే. అది జీపు. మమ్మల్ని వింతగానూ, సందేహంగానూ చూస్తున్నారు. అయినా వర్షాకాలంలో సర్కస్ వాళ్లెందుకొస్తారు? వచ్చిన ప్రతివాడూ పక్కవాడితో గుసగుసలు మొదలు పెట్టాడు. మేమెవరమో చెప్పేపని భూషయ్య తీసుకున్నాడు. ఇంతలో నందిగామ గ్రామ సర్పంచ్ వచ్చారు. అతనికీ కొంత ఆశ్చర్యంగానే ఉంది. మా వివరాలు తెలుసుకున్న వెంటనే ఏరియల్ తీగలు బిగించే ప్రయత్నాలు చేశారాయన. “మీరు కూనవరం ఈ జీపులో పోగలిగేది ఒట్టిమాట” అన్నారు.

“అయినా జీపు చెడిపోయింది కదా” అన్నాను నేను.

“ జీపు బాగున్నా, ముందు మురుమూరు దగ్గర వాగు మిమ్మల్నిదాటనివ్వదు కదా” అన్నారాయన.

ఈ రోజు కూడా మళ్లీ యింకో మజిలీ అన్నమాట. అయినా మేము యీ గిరిజనేతర గ్రామంలో నిలబడిపోయామేమిటా అనుకున్నాను. నాకలా అన్పించడంలో కొంత అర్థం లేకపోలేదు. గిరిజనేతర గ్రామాలు సాధారణంగా రోడ్డు మీద ఉండి కొంత పెద్దవిగా ఉంటాయి. అక్కడి ప్రజలకు సాయమందించడం అంత కష్టం కాదు. కానీ పూర్తిగా గిరిజన

గ్రామాలు, అంటే కోయగూడేలు రోడ్డుకు దూరంగా పల్లంలో ఉండి, చేరుకోవడానికి వీలుపడకుండా నీళ్ల మధ్య దీవుల్లాగా తయారౌతాయని చూచాయగా విన్నాన్నేను. అందుకే మనమేదైనా సాయం చేయవలసింది నిస్సహాయంగా ఉన్న గిరిజనులకు కదా. ఇలా గిరిజన సంకేమం కోసం పని చేయవలసిన నేను కూడా గిరిజనేతర గ్రామంలో ...... అనే ఆలొచనల్లో ఉండగా....

"మీరు రండి సార్. బట్టలు మార్చుకొని వద్దురు గానీ, తప్ప తడిసిపోయారు. మీరు ఆరోగ్యంగా ఉంటేకదా సార్, మాకు సాయం చేయగలిగేది. పనులన్నీ వీళ్లు చూసుకుంటారు మీరు రండిసార్" అన్నారు సర్పంచి గారు. గిరిజన గ్రామమైనా, గిరిజనేతర గ్రామమైనా గ్రామస్తుల్లో ప్రభుత్వ అధికారుల పట్ల, అతిధుల పట్ల ఉండే ఆ గౌరవం నన్ను కదలించి వేసింది.

తలో పనీ చేస్తుండగా, గ్రామం మొత్తం సందడిగా తయారయింది. సెట్ తయారైంది. చుట్టూ ఉన్న గ్రామస్తుల్లో ఉత్సుకత మొదలయింది, ఈ తీగలు కట్టి వీళ్లేం చేస్తారో చూద్దామని.

శ్రీనివాస్ మాట్లాడ్డం మొదలెట్టాడు. " వియు 2, జెయు9 ఎస్ కాలింగ్ ఫ్రమ్ నందిగామ" మేమెక్కడున్నామో భద్రాచలం కంట్రోలు రూంకు చెప్పేశాం. భద్రాచలంతో సంబంధాలు మొదలయ్యాయి. గ్రామస్తుల సందేహం, ఉత్సుకత, ఇప్పుడు భక్తి, గౌరవాల్లోకి మారిపోయాయి.

యిప్పుడు గుసగుసలు పెద్దవాళ్లలో మొదలయ్యాయి. గుసగుసల సారాంశమేమిటంటే తప్పిపోయిన నాగయ్య గురించి సెట్‌లో మేము భద్రాచలం చెప్తామా లేదా అని భూషయ్య సందేహ నివృత్తి చేశాడు. వాళ్లప్పటికి పూర్తిగా నమ్మారు, మేం వరద సహాయ కార్యక్రమాల కోసం వచ్చామని చొరవ తీసుకుని సర్పంచి గారు ముందుకు వచ్చి"సార్, నాగయ్య అనే అతను ఊరవతల వాగు దాటి వెళ్లాడు. ఇంకా తిరిగి రాలేదు. యిప్పుడేమో చీకటి పడిపోయింది. వెతికి వెతికి తిరిగి వచ్చారు. ఈ వార్త భద్రాచలం పంపండి. అతని భార్యా, ముసలి తల్లిదండ్రులూ దిక్కుతోచకుండా ఉన్నారు" అని అన్నారు. " అలాగే ప్రెసిడెంటు గారూ, ఈ రాత్రికి అతను తప్పిపోయాడని వార్త పంపిద్దాం. మన అదృష్టం కొద్దీ అతను ఉదయం తిరిగొస్తే మంచిది లేకుంటే చేయవలసింది చూద్దాం" అన్నాను.



ఆకాశవాణి నందిగామ స్టేషన్నుంచి మేం పంపిన మొదటిది విషాద వార్త "నాగయ్య తప్పిపోయాడని"

ఆ వర్షంలో, చీకట్లో, చిత్తడిలో వేళకాని వేళ అరడజను మందికి భోజనం తయారు చేయించి వడ్డించారు. ప్రెసిడెంటు గారి కుటుంబ సభ్యులు. "నెయ్యి కూడా ఉంది సార్" అన్నారు ప్రెసిడెంటు గారు. నాకు నవ్వొచ్చింది. ఈ వేళలో, ఇటువంటి పరిస్థితుల్లో కూడా నెయ్యి లేకుండా భోజనమెలా చేస్తారింత పెద్ద అధికారి అని ఆయన ఉద్దేశమేమో! లేక అధికారులు అటువంటి అభిప్రాయం కలిగించారా? అనుకుంటూ

"వద్దండీ" అని వారించాను.

నాకు రాత్రంతా నాగయ్యను గురించిన ఆలోచన ఎక్కువైంది. ఒక వేళ నాగయ్యకేమయినా అయితే....కీడు శంకించకూడదు. కానీ, యీ పరిస్థితుల్లో ఆలోచన అసమంజసం కాదేమో! చాలా ఆలస్యంగా నిద్రపట్టింది.

తెల్లవారగానే నాగయ్య చనిపోయాడని తెలిసింది. ఆ యింటికి వెళ్లాలంటేనే భయమేసింది. ఆ ముసలి తల్లిదండ్రులకేమని చెప్పాలి. మీకున్న ఒక్క కొడుక్కీ మేం పరిహారమిస్తామని చెప్పాలా? ఆ యిల్లాలికేం చప్పాలి? ఆందోళనగానే ఆ యింటికి వెళ్లాను. రోదిస్తున్న ఆ ముసలి తండ్రిని చూస్తే అక్కడ ఎక్కువ సేపు వుండడం నా వల్ల కాలేదు. శవ సంస్కారానిక్కావలసిన ఏర్పాట్లు చేయమని చెప్పి, ఏవో కొన్ని వాగ్దానాలు ప్రభుత్వం తరపున చేశాను కానీ మనసంతా వెలితిగా వుంది. గ్రామ సేవకులూ, నాతో ఉన్న సిబ్బందీ, సర్పంచు గారూ శవ సంస్కార ప్రయత్నాలు చేశారు.

భారంగా తిరిగి వచ్చి సెట్‌లో నాగయ్య చనిపోయాడునే వార్త భద్రాచలం పంపించాం. మా ఆకాశవాణి కార్యక్రమం విషాదంతో మొదలయింది. గిరిజన సంక్షేమాధికారి మొదటి సహాయ కార్యక్రమం గిరజనేతర గ్రామంలో మొదలయింది. ఇదేనేమో జీవితంలోని చిత్రం. అయినా ఆపదలో ఉన్నవాళ్లు ఎవరైతేనేం? ఏ గ్రామమైతేనేం? మనుషులంతా ఒక్కటే.... వాళ్ళ బాధలన్నీ ఒక్కటే..... ఆ బాధలను అనుభవించే దీనులంతా ఒక్కటే.

జీపు స్టార్టయింది. కానీ ముందు మురుమూరు దగ్గర గోదావరి వెళ్లనీయదు కదా! ఇంతలో లాంచీ భద్రాచలం నుండి వచ్చిందనే వార్త వచ్చింది. జీపులో వెనక్కి తిరిగి వెళ్ళి రోడ్డు మీదకి వచ్చి నిల్చిన లాంచీలో బాధగా అడుగు పెట్టాం.

"వియు 2 –జెయుఎస్– కాలింగ్ ఫ్రమ్ నందిగామ.... లీవింగ్ ఫర్ కూనవరం."

❖ ❖ ❖

5. నందిగామ : ఈ గ్రామం భద్రాచలం – కూనవరం రోడ్డు మీద ఉంది.

6. హ్యామ్‌సెట్ : ఇది పూర్తిగా రేడియో లాంటి సాధనం. అయితే దీన్ని వాడడానికి ప్రభుత్వానుమతి కావాలి. తర్ఫీదు పొందిన ఏ వ్యక్తైనా దీన్ని ఉపయోగించి ప్రపంచంలో ఎవరితోనైనా మాట్లాడవచ్చు. ప్రకృతి వైపరీత్యాల్లో చిక్కుకున్న వారికి సాయం అందించడంలో హ్యామ్‌సెట్‌లు/హ్యామ్‌లు చేసే సేవ అద్వితీయం. వీటిని ఉపయోగించే వ్యక్తిని హ్యామ్ అంటారు. ఈ సెట్‌ల గురించి యింకా ఎక్కువ వివరాలు తెలుసుకోదలిస్తే హైదరాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆమెచ్యూర్ రేడియో' రాజ్‌భవన్ రోడ్ వారిని సంప్రదించవచ్చు.

7. డిఆర్‌డిఎ : డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లేదా తెలుగులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ. పట్టణ ప్రాంతాల్లో తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉంటుంది ఈ సంస్థ.

8. శ్రీనివాస్ : ఈయనో హ్యామ్. ప్రస్తుతం వోల్టాస్ కంపెనీలో యింజినీరుగా ఉన్నారు. హైదరాబాద్‌లోనివాసం.

9. వియుజెయస్ : ఇది శ్రీనివాస్ గారి సంకేతం. ప్రతి హ్యామ్‌కి ఒక సంకేతం ఉంటుంది.



# మనలో మాట

పాలవంచలో ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారిగా ఛార్జి తీసుకొని రెండు నెలలు కూడా కాలేదు. అంతా కొత్త కొత్తగానే ఉంది. ఒక్క పక్క పచ్చగా వాన జల్లులతో పులకరిస్తూ ఉండే చెట్లూ, దూరంగా నీలిరంగులో అందాలు చిమ్ముతూ ఆకాశంతో మాట్లాడుతున్నట్టున్న కొండలు ఎటుచూసినా నీళ్ళు ఒళ్లంతా తడిసి ఆరుతున్న దారులు గలగలపారే వాగులూ, వంకలు, గ్రామాల్లో ఏపుగా మొగ్గ తొడుగుతున్న మామిడీ, జీడిమామిడి చెట్లు యివి మాత్రమే పరిచయమైనట్లుగా అనిపిస్తున్నాయి.

మరోపక్క ఆఫీసు వాతావరణం అంతా కొత్తగానే ఉంది. ఎన్నో విభాగాలూ, ఏవేవో ప్రణాళికలు! రోజూ ఏవేవో కావాలని వచ్చిపోయే గిరిజనులూ, రకరకాల పద్దుల కింద నిల్వ ఉన్న డబ్బులూ, ఆ డబ్బులు ఎలా ఖర్చు చేయాలో చెప్పే ఉత్తర్వుల కోసం ప్రతిసారీ హైదరాబాదు రాస్తామనే సిబ్బందీ, ఏది తెలుసుకుందామన్నా చేద్దామన్నా వెంటనే సాధ్యం కావడం లేదు. ఇదేనేమో ప్రభుత్వ ఉద్యోగమంటే అనిపించింది. నాకన్నా ముందు ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన మిత్రుడు అజయ్‌కల్లం రాసిచ్చిన భవిష్యత్తు కార్యాక్రమాల చిత్తు ప్రతి మాత్రమే కాసింత ధైర్యాన్నిచ్చింది. ఎంతో కొంత చెయ్యడానికి ఆధారముందనిపించింది.

గిరిజన ప్రాంతాల్లో, ఐటిడిఎలు ఉద్యానవనాలకూ, సేద్యపునీటికి అధిక ప్రాధాన్యతనిచ్చాయనే చెప్పొచ్చు. బీదరికాన్ని పారదోలడానికి ప్రభుత్వం అమలుచేసే పథకాల్లో భూమి, సేద్యపునీరు, భూమికి సంబంధించిన కార్యక్రమాలు తీసుకోవడం ఓ సిద్ధాంతం లాంటిది. దాన్ని బలంగా నమ్మేవాళ్లు కొంతమంది. నమ్మకపోతే బాగుండదనే వాళ్లు కొంతమంది. నమ్మినట్టు యింకొంతమంది. నా వరకు నాకు అలాంటి నమ్మకం చాలా బలంగానే ఉంది.

భూమీ, నీరూ, మొక్కలూ యీ వరసలో గిరిజనాభివృద్ధి జరిగితే బాగుంటుందని బలంగా నమ్మేవారిలో శాస్త్రిగారు ఒకరిని కొంచెం ఎక్కువగానే విన్నాను. శాస్త్రిగారు గిరిజన సంక్షేమ శాఖకు సంచాలకులుగా ఉండేవారు. ఆయన పూర్తి పేరు ఎమ్.వి పూర్ణచంద్రశేఖర

శాస్త్రి. ఆయనో పద్ధతి ప్రకారం పనిచేస్తారనీ, అలుపూ సొలుపూ ఎరక్కుండా అలా పనిచేసుకుంటూ వెళతారనీ విన్నాను. ( మరి పక్కవాళ్ల సంగతేవిటీ?) అటువంటి శాస్త్రిగారు పాలవంచ వొస్తున్నారని వినగానే కొంత గాభరా పడిన మాట వాస్తవం.

అయితే భూమీ, నీరూ, మొక్కలూ యిదే వరసలో అభివృద్ధి జరిగితే బాగుంటుందని నేనూ నమ్ముతాను గాబట్టి వారితో భావసారూప్యమేదో కుదురుతుంది గాబట్టి ఫరవాలేదనుకున్నాను. ఎంతైనా బాస్ కదా! భయం తప్పలేదు. కానీ ఓ చిన్న తిరకాసొచ్చింది. పాలవంచ వచ్చి మేం చేస్తున్న దేదో చూస్తే ఆ తరువాత.... అప్పటికే వేలాది ఎకరాల్లో జీడి, మామిడి మొక్కలు నాటించేశాం. అవి పచ్చ పచ్చగా కళకళ్లాడుతూ వచ్చిపోయే వాళ్లను నవ్వుతూ పలకరించడం మొదలు పెట్టేశాయి. వాటిని చూసిన తరువాత బాస్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం కొంచెం సులభంగా ఉంటుందనుకున్నాను. అలా కాకుండా ముందు ఏటూరు నాగారంలో మీటింగు, తరవాత పాలవంచ వస్తామన్నారు. పాలవంచ నుంచి ఏటూరు నాగారం రోడ్డు చూసిన నాకు శాస్త్రిగారు ఆ దారిన వస్తే ఖచ్చితంగా మూడ్ పాడయి నన్ను ఏదో ఒకదానికి చీవాట్లు పెడతారనుకున్నాను.

ఏటూరునాగారంలో అక్కడి ప్రాజెక్టు అధికారి గోపాల్ గారూ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి సుబ్రహ్మణ్యం గారూ ఉన్నారు. వాళ్లిద్దరూ అప్పటికే ( ఓ సంవత్సరం) ఐ.టి.డి.ఎ.లో ఎంతో అనుభవం సంపాదించేశారు. వాళ్లిద్దరూ మిత్రులే అయినా, వాళ్ల ముందు ఐ.టి.డి.ఎ. మీటింగులో పాల్గొనడమంటే కొంచెం బెరుగ్గా అనిపించింది. అలాంటి వాతావరణంలో శ్రాస్త్రీగార్ని కలుసుకోవడమంటే భయం కలగక యింకెలా ఉంటుంది మరి?

సరే ఏటూరునాగారం బైలుదేరాను. ఆ దారి చూడవలసిందే! ఖమ్మం సరిహద్దు జానంపేట దాకా తారు రోడ్డు. అక్కడ్నుంచి మట్టి రోడ్డు. ఒక్కోగుంత జీపు దిగిపోవడానికి సరిపోయినంత ఉంది. ఆ గతుకుల్లో పడిలేస్తే ఒళ్లు పచ్చడయిపోయింది. అయినా ఎంతో కొంత శరీరం, కాస్తంత మెదడూ ప్రాణంతో సహా ఏటూరి నాగారం చేరింది. శాస్త్రి గార్ని చూడడం కోసమేమో!

శాస్త్రిగారి మీటింగులు కాస్త తీరిగ్గానే ఉంటాయని ముందే చెప్పాను. మీటింగును మధ్యాహ్నం భోజనం కోసం వాయిదా వేసినప్పుడు చాలా ఆప్యాయంగా

– " ఏం సాగర్ ఎలా వుంది మీ ఐటిడిఏ" అంటూ పలకరించారు.

మీటింగులో చర్చించే ఐటిడిఏకూ, మీటింగు బైట మాట్లాడుకునే ఐటిడిఏకు



ఎంతో కొంత తేడా వుంటుందేమో అన్పించింది నాకు.

– "బాగుంది సార్" అన్నాను.

–"ముందు ముందు యింకా బాగుంటుంది" అన్నారు.

– " రేపు మీరొస్తున్నారు గదా సార్. చూసి మీరే చెప్పండి మా ఐటిడిఏ ఎలా వుందో" అన్నాను మాటకలుపుతూ.

"అప్పుడే మా ఐటిడిఏ అంటున్నారు గదా. అందుకునే ముందు ముందు యింకా బాగుంటుందనేది" అన్నారు నవ్వుతూ.

వాతావరణం యింటా, బైటా అంతా ప్రశాంతంగా, తేలిగ్గా, ఆహ్లాదకరంగా అన్పించింది. కొన్ని గంటల కిందటి వరకూ నాలో ఉన్న ఆ బెరుకూ, సంకోచం, సందేహం, కొత్తదనం యిప్పుడేమయ్యాయి? యీ కాస్తలోనే ఎంతో పరిచయమున్నట్టుగా మన సమస్యలన్నీ ఈయనతో చెప్పొచ్చుననిపించే ఈ ధైర్యం ఎలా వచ్చింది? దాన్ని చనువు అనలేను. మరేమనాలో?

అదేనేమో పక్కవాడి చేత మనస్ఫూర్తిగా పనిచేయించగలిగే నేర్పంటే. చనువివ్వకుండానే సంకోచాలూ, సందేహాలు వదిలిపోయేలా చేయగలగాలి పక్కవాళ్లలో!

"రాత్రి ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి గోపాల్ గారి బంగళాలోనే బస. చాలా చక్కగా ఉంది బంగళా."

దేనికదే చెప్పుకోవాలి. ఇంత కలుపుగోలుతనమూ, అప్యాయతా అన్నిసార్లూ ఉంటాయనుకోవడం అవివేకమని మరుసటి రోజే తెలిసింది నాకు. ప్రభుత్వోద్యోగమంటే ఒకే తీరున పోగలిగేది గాదనీ, మనుషులందరూ సమానమనే విశ్వజనీనతా సిద్ధాంతాలకు సందర్భానుసారంగా భాష్యం చెప్పుకోవాలనీ తెలిసింది.

ఏటూరునాగరంలో మీటింగైపోయి మరుసటి రోజు మధ్యాహ్నం పాలవంచకు బయల్దేరాం నేనూ శాస్త్రిగారు. ఖమ్మం ఐ.టి.డి.ఎ చూడాలనే దానికన్నా, ఖమ్మం ఐ.టి.డి.ఎ.ను కొత్తగా వచ్చిన ప్రాజెక్టు అధికారికి చూపించడం శాస్త్రిగారి ఉద్దేశం కావచ్చు.

మొన్న నేను వచ్చిన అదే గతుకుల రోడ్డు మీదే ప్రయాణం. కాకుంటే తన కార్లో కూచుందామన్నారు శాస్త్రిగారు. జీపైనా, కారైనా కొంచెం అటు యిటుగా మళ్లీ వొళ్లు

పచ్చదవటం తప్పదనుకున్న నాకు శాస్త్రిగారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో రోడ్డు గతుకులు గుర్తురాలేదు. ఎటొచ్చీ కారు కొంచెం మెత్తగానే వెళుతుందనడం కన్నాడ్రైవరు జాగ్రత్తగా తీసుకు వెళుతున్నా దనడం సమంజసమేమో!

ఖమ్మం ఐటిడిఎను గురించి నాకు అర్థమైనంత వరకూ, నాకు పరిచయమైనంత వరకూ చెప్పుకుంటూ వెళ్లాను. సాధక బాధకాలూ, అక్కడి సమస్యలూ, యింకా చెయ్యవలసిన పనులూ, ఉద్యోగుల సమస్యలూ యిత్యాదులు చెప్పాను.

"సార్, ఖమ్మం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలు లేని గ్రామాలు చాలా ఉన్నాయని" పనిలో పనిగా కొంచెం సందేహిస్తూనే నా మనసులో మొదటినుంచీ ఉన్న ఓ ఆలోచన చెప్పాను.

" నిజమే సాగర్, మిగిలిన జిల్లాలతో పోల్చితే ఖమ్మం జిల్లాకు కేవలం యాభై పాఠశాలలు మాత్రమే వచ్చాయన్నారు"

"తొందరలో పాఠశాలలు వచ్చేలా ప్రయత్నం చేస్తే బాగుంటుంది సార్". అన్నాను.

"ప్రయత్నం చేద్దాం" అన్నారు శాస్త్రి గారు

"అవి రావడానికి కనీసం ఒకటి రెండేళ్లు పడుతుందేమో సార్. అందుకని మా కలెక్టరు గారూ నేనూ ఒకటి ఆలోచించాం" అన్నాను.

"ఏమిటది?" అన్నారు.

"గిరిజన ప్రాంతల్లో పూర్తిగా మారుమూల ప్రాంతంగా ఉన్న 200 గ్రామాలను ఎంపిక చేశాం. ఆగ్రామాలన్నీ 'పోడు నివారణ'[10] కాంపాక్ట్ ఏరియా పథకాల' కింద వచ్చేవే. ఈ రెండు పథకాల క్రింద విద్యాభివృద్ధి కోసం కొంత మొత్తం కేటాయించారు. కాని పెద్దగా ఖర్చు కాలేదు. దాన్ని ఖర్చు పెట్టి ఈ రెండొందల గ్రామాల్లో నెలకు 500 రూపాయల చొప్పున యిచ్చి గిరిజన యువకులనే ఉపాధ్యాయులుగా నియమించి, ప్రభుత్వం నుంచి పాఠశాలలు వచ్చినపుడు ఈ యువకులను పర్మినెంటు చేస్తే సరిపోతుంది" అన్నాను.

"వద్దండీ" అని ఖచ్చితంగా చెప్పేశారు శాస్త్రి గారు.

అవాక్కయిపోయాను. ఏమి మాట్లాడాలో తోచలేదు. గిరిజన ప్రాంతంలో నిరక్షరాస్యత, గిరిజన యువకుల్లో నిరుద్యోగ సమస్య చూసినప్పుడు సమస్య ఎంతో కొంత



పరిష్కారమవుతుం దనుకున్న నాకు శాస్త్రి గారి ధోరణి అర్థం కాలేదు. మౌనంగా ఉండిపోయాను.

"యూ కాంట్ ఛూజ్ యువర్ బాస్" అన్నారు సౌమ్యంగా, నవ్వుతూ.

మౌనంగా ఉండిపోయాన్నేను. భాదపడుతున్నానని గమనించిన శాస్త్రిగారు వివరించడం మొదలు పెట్టేరు.

"తానొకటి తలిస్తే బాసొకటి తలుస్తాడనేది వాస్తవమైనా భరించక తప్పదు. మీరొక రకంగా ఆలోచించారు. కానీ నేను నా అనుభవంతో యింకో రకంగా ఆలోచించాను. కాబట్టి మీరన్నది నేనొప్పుకోలేకపోయాను. మీలాగే ఆలోచించే బాస్ దొరకరు. అయినా ఉద్యోగం చేయాలి. అందుకే చెప్పాను."

యిక ఆ సంభాషణ పొడిగించడం యిష్టం లేకపోయింది. నా ఆలోచన మీద నాకు నమ్మకం ఉన్నా యిక ఎక్కువ మాట్లాడాలనిపించలేదు. కానీ శాస్త్రిగారు నేనన్నదానికి ఒప్పుకోలేదనే బాధ లోపల ఎక్కడో ఉన్నా శాస్త్రిగారి మాటల తీరు చూస్తే ఆ బాధ ఎక్కువగా అన్పించలేదు.

నా ఆలోచనా, ఏదో చేయాలనే తపనా చూచాయగా శాస్త్రిగారి మనసు కొచ్చాయేయో! కొంచెం సేపటి తర్వాత తనే కాస్త చనువుగా "గిరిజన ప్రాంతంలో ఉద్యోగంలో బాగా రాణించాలంటే కొన్ని చిట్కాలు చెప్పేదా" అన్నారు.

నాకు నవ్వాలనిపించింది. కానీ నవ్వలేకపోయాను. యింతకు ముందే నేను కాస్త పెద్ద సమస్యనుకుంటున్న దాన్ని ఒక్క మాటతో కొట్టిపారేసిన శాస్త్రిగారు యిప్పుడు చాలా మామూలుగా స్నేహపూర్వకంగా సోదరవాత్సల్యంతో చిట్కాలు చెప్తానంటున్నా రేమిటనిపించింది. సరే, బాస్ చెప్తానంటూంటే వద్దనడమెందుకని 'చెప్పండి సార్' అన్నాను.

- మా సంభాషణ యిలా సాగింది "గిరిజనులకు జీవనాధరమేమిటి?"
- "భూమే కదా సార్."
- "మరి దానికి నీళ్లు లేకపోతే ఎలా?"
- "మోటారు పంపుసెట్లు యిస్తున్నాం గదా సార్"
- "ఎంతమందికి యిస్తున్నారు?"

– "తమ వంతు డబ్బు కట్టగలిగిన వాళ్లందరికీ యిస్తున్నాం గందడీ!"

– "ఎంతమంది కట్టగలుగుతున్నారు"

– "చాలామంది కట్టలేకపోతున్నారు."

– మరి వాళ్ల సంగతేమిటీ?

– "మరి...?" ఏం చెప్పాలో తోచక మౌనంగా వుండిపోయాను

– "అక్కడే ఉంది చిట్కా వాళ్లు డబ్బు కట్టలేదని వాళ్ళకు పంపుసెట్లు యివ్వడం లేదు. అటువంటి వాళ్లే ఎక్కువ మంది ఉంటారు. యింత మంది జీవనాధారానికి అవసరమైన భూమికి నీళ్లివ్వలేకపోతే మనం చేయగలిగిన అభివృద్ధి ఏమిటి?"

– "మరి డబ్బు కట్టకపోతే" అంటూ ఆగిపోయాను.

– "అదే కదా చెబ్తున్నాను. అవసరమైతే పూర్తిగా ఉచితంగా యివ్వాలి. అప్పుడే వాళ్ల అవసరం మనం గుర్తించినట్లుగా గిరిజనులు మనలను నమ్ముతారు. మన దగ్గరకొస్తారు. వాళ్ల సమస్యలేమిటో మనసు విప్పి మాట్లాడతారు. ఇది మనలో మాట. ఎవరికీ చెప్పకండేం!"

– "మరి అందరూ ఉచితంగా యివ్వమంటే

– "కొంచెం చిక్కు సమస్యే. కానీ..." అంటూ వదిలేశారు శాస్త్రిగారు.

నాకర్థమయ్యింది తన ఉద్దేశమేమిటో. గిరిజనులందరికీ ప్రతిదీ ఉచితంగా యిచ్చేసి వాళ్లను పరాన్నజీవులుగా చేయమని చెప్తున్నాడేమోననిపిస్తుంది వినేవాళ్లకు. కానీ గిరిజనుల నిజాయితీ, గిరిజనుడి మనసెరిగిన వారికెవరికైనా తెలుస్తుంది. శాస్త్రిగారన్న మాటల్లోని అంతర్యమేమిటో అవసరమైతే మొత్తం ఉచితంగా యివ్వాలి గిరిజనుడికి. అంటే అవసరముందా లేదా అని సరిగ్గా తేల్చుకోవడం మన బాధ్యత అన్నారు (నవ్వుతూనే), ఎంత చక్కటి సూక్ష్మ చెప్పారీయన అన్పించింది.

ప్రతిదీ, ప్రతి ఒక్కరికీ ఉచితంగా యిస్తే గిరిజనుల అమాయకత్వం వల్లనో, గిరిజనేతరుల అమాయకత్వం వల్లనో ప్రభుత్వం చేసినసాయానికి ఫలితం లేకుండా పోయిన సందర్భాలూ ఉండవచ్చు. కానీ అలా జరక్కుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం సమంజసం కానీ,చేతులు మారుతాయేమోనని చేతులు కట్టుకు కూర్చోవడం అర్థరహితం. "టీచరు పోస్టులను మీరెందుకు భర్తీ చేయకూడదని చెప్పానో తెలుసా?" అని అడిగారు శాస్త్రిగారు అనునయంగా.



నేను మౌనంగా ఉండిపోయాను.

"మనం ఖచ్చితంగా నెరవేర్చగలమని తెలియని వాటిని మనపైన వేసుకోవడం మంచిది కాదు. ఉపాధ్యాయ ఉద్యోగాలు వస్తాయనే నమ్ముదాం... కానీ అవి వచ్చిన రోజున ఉద్యోగాలిద్దాం. పాఠశాలలు తెరుద్దాం. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా మనమే తొందరపడ్డం మంచిది కాదు. మీ ఉద్దేశం మంచిదే. కానీ అర్థాంతరంగా పాఠశాలలు మూయవలసి వస్తే, గిరిజన యువకులకు మనమీద నమ్మకముంటుందా? వాళ్లు కుటుంబాలేమవుతాయి?"

తన అభిప్రాయం నాకు పూర్తిగా సమర్థనీయంగా అనిపించలేదు. కానీ ప్రభుత్వపుపనితీరు చూసి చెప్తున్న తాను యింత వివరంగా చెబుతుంటే వొత్తిడి చేయడం మంచిది కాదేమోననిపించింది. కానీ అసంతృప్తి మిగిలిపోయింది. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులుగా శాస్త్రిగారే కాని చెబితే నిరాశగాక యింకేమిటి?

కాస్త ఆలస్యంగా గతుకుల రోడ్డంతా దాటి ఖమ్మం గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టిన వెంటనే ఐటిడిఎలు చేపట్టిన పండ్ల మొక్కల పెంపకాన్ని గురించి చెప్పాను.

"భూమిచ్చి, దానికి నీళ్లిచ్చి, అందులో శాశ్వతంగా ఉండే మొక్కలు నాటి గిరిజనుడికిచ్చినట్లయితే అది తరగని ఆస్తి. గిరిజనుడి నుంచి దానినెవరూ తీసుకోలేరు. అందుకే భూమికి సంబంధించి ఏ పథకం తీసుకున్నా భవిష్యత్తులో గిరిజనుడికి మేలే జరుగుతుంది" అంటూ తన అభిప్రాయాన్ని చెప్పారు.

మరుసటి రోజు గరిమెళ్లపాడు ఫారమ్ వెళదామన్నాను. దాన్ని ఆయన చాలా వివరంగానూ, అప్యాయంగానూ చూసి ఓ "సిల్వర్ ఓక్" మొక్క నాటారు. అది ఎంత ఏపుగా పెరిగిందో చూస్తే శాస్త్రిగారి మనస్సును ఆ మొక్క తెలుసుకుందేమో అన్పిస్తుంది. నేనూ ఐటిడిఎ వదిలే నాటికి చాలా ఎత్తు ఎదిగిందా మొక్క అది చూసినప్పుడల్లా గిరిజనుడి మనసులో నమ్మకం కలిగించగలిగామంటే ఏ గడువు పెడితే ఆ గడువునాటికి తన బాధ్యత తీర్చుకోవడానికే ప్రయత్నిస్తాడు. లేదా తన అశక్తతను తెలుపుకోవడానికి మైళ్లకు మైళ్లు నడిచి వచ్చిన గిరిజనులను తరువాత రోజుల్లో చూశాను.

ఒక్కసారి పాలవంచ వచ్చి ఎన్ని విషయాలు చెప్పారీయన? ప్రభుత్వంలో ఉద్యోగమంటే ఏమిటో చెప్పారు. యిష్టం లేకపోయినా పై అధికారులతో సర్దుకుపోక తప్పదనే చేదు వాస్తవాన్ని చెప్పారు. గిరిజనుల మనసెరిగి మసలు కోవడమెలానో చెప్పారు. గిరిజనుల

భవిష్యత్తేమిటో చెప్పారు. గిరిజనాభివృద్ధికి తన సిద్ధాంతమేమిటో చెప్పకనే చెప్పేశారు. ఇవన్నీ మనలో మాటగానే చెప్పేశారే!

❖ ❖ ❖

10. పోడు : ఇదొక పురాతన వ్యవసాయ పద్ధతి. లాభదాయకమైంది కాదు. నష్టాలే ఎక్కువ. అడవిని నరికి మొద్దులను కాల్చి నేల సాపు చేసి దున్నిగానీ, దున్నకుండా గానీ విత్తనాలు చల్లుతారు. వర్షాధారంతో పంట పండుతుంది. మూడు, నాలుగేళ్ళలో యిలా సాగు చేసిన భూమి సారం కోల్పోతుంది. అప్పుడు గిరిజనులు దాన్ని వదిలేసి కొత్త చోట పోడు కొడతారు. తిరిగి అది దట్టమై అడవిగా పెరిగే వరకూ దాని జోలికి వెళ్లరు. ఈ రకంగా గిరిజనులు భూమి, అడవి, ప్రకృతిలో సమతౌల్యతను కాపాడేవారు. కానీ రానురానూ గిరిజన ప్రాంతంలోని సేద్యపు భూమి మీద వొత్తిడి పెరుగుతూండడంతో గిరిజనులు అడవి దట్టంగా పెరగకుముందే తిరిగి పోడుగొట్టుక తప్పడం లేదు. మెరక ప్రాంతంలోని గిరజనుల భూమి తాము తీసుకోలేని గిరిజనులు యింకాస్త లోపలికి అడవిలో వెళ్తున్నారు. పోడు గొడ్తున్నారు. పోడు వల్ల చాలా నష్టాలున్నాయి గాబట్టి భారత ప్రభుత్వం 'పోడు నివారణ' పథకం చేపట్టంది.



# చెట్టు కింద ఆఫీసు

గిరిజన ప్రాంతాల్లో కొండలకూ గుబురు చెట్లకూ, అడవులకూ, కొండల్లోంచి పారే సెలయేళ్లకూ కొదవ ఉండదు. దట్టమైన అడవిలో చెట్ల కిరకిరలూ, పక్షుల కలకలారావాలు వింటుంటే అదో వింత అనుభవం. దట్టమైన అడవుల్లో నడిచేటప్పుడు నిర్జీవమైన భవంతులమయమైన నగరాల్లో, జనారణ్యాల్లో మనమెంత సంకుచితంగా బతుకుతున్నామా అనిపిస్తుంది.

కొండల మధ్య గోదావరి వొడ్డున ఆరుబయట చెట్ల నీడన ఆఫీసు పని చేసుకోగలిగితే ఎంత బాగుణ్ణు! కానీ యిలాంటికలలు కోరుకోవాల్సిందే కానీ తీరవేమోనని అనుకూంటూ ఉండేవాణ్ణి. అనుకోకుండా వో రోజు మోహన్రావు[11] గారు ఆదిమ జాతుల కోసం ప్రత్యేకించి అమలు చేయవలసిన ప్రణాళికల గురించి తయారు చేసిన రిపోర్టు' నా కంటబడింది.

ఆ రిపోర్టులో కొండరెడ్లు కాస్త గణనీయంగా ఉన్న తూర్పుగోదావరి, ఖమ్మం జిల్లాల్లో ఓ ప్రత్యేకమైన విభాగమే ఏర్పాటు చేయడం మంచిదనే సిఫార్సు వుంది. తళుక్కున ఓ తలపు మెరిసింది.

అలాంటి కొత్త కార్యాలయం కొండల మధ్యన, కొండ రెడ్ల గ్రామాల మధ్యన ఏర్పాటు చేయొచ్చు కదా అని. అయితే ఎక్కడ? ఎలా? గిరిజనాభివృద్ధి సంస్థ పాలవంచ గురించీ, ఖమ్మం గిరిజన ప్రాంతంలో సూచనప్రాయంగా ప్రతి విషయాన్ని గురించి ఎంతోకొంత తెలిసిన వాడు మా క్యాంపు క్లర్కు హనుమంతరావు. వెంటనే హనుమంతరావును పిలిచి అడిగాను "కొండరెడ్ల గ్రామాలకు అందుబాటులో అనుకూలంగా ఉండే గ్రామం ఏదని. "జీడిగుప్పంటూ" తడుముకోకుండా జవాబిచ్చాడు హనుమంతరావు. జీడిగుప్పకు అలాంటి ప్రత్యేకత ఉందన్న విషయం యింకా చాలా మందికి తెలిసే వుండవచ్చు. కానీ, ఆ విషయం నిస్సందేహంగా చెప్పగలగడం హనుమంతరావు ప్రత్యేకత. దాంతో ఇంకాస్త అదనపు సమాచారం కూడా అందించాడు. "జీడిగుప్ప కేవలం రెండు మండలాలకు మాత్రమే దూరంగా ఉంటుంది. అయితే ఆ రెండు మండలాల్లో ఉన్న కొండరెడ్డి గ్రామాలు కేవలం రెండే. అవి దమ్మపేట, అశ్వరావు పేట మండలాల్లో ఉన్నాయి.

ఎక్కువ కొండరెడ్డి గ్రామాలున్న వరరామచంద్రపురం మండలంలో జీడిగుప్ప ఉంది వరరామచంద్రపురం నుంచి 25 కి.మీ. వరకూ రహదార్లు భవనాల శాఖ వారి రోడ్డు ఉంది. గోదావరి ఒడ్డున రోడ్డున్న చివరి గ్రామం పోచవరం. వేలేరుపాడు మండలంలో కొండరెడ్డి గ్రామాలు ఆరు దాకా వున్నాయి. అవన్నీ జీడిగుప్పకు అటువైపు ఉన్నాయి. బహుశా ఈ రెండు కారణాలు జీడిగుప్పకు కొంచెం ప్రతికూలంగా అన్పిస్తాయి.

కానీ కూనవరం, వరరామచంద్రపురం, వేలేరుపాడు మండలాల్లో మూడొంతుల కొండరెడ్ల గ్రామాలున్నాయి. కాబట్టి జీడిగుప్ప అన్ని మండలాలకూ అందుబాటులో ఉండే గ్రామం, చాలా వెనకబడి ఉన్న కొండరెడ్డి గ్రామాలు కూనవరంలో, వరరామచంద్రపురంలో ఉన్నాయి. అదిగాక జీడిగుప్పలో 150 ఎకరాల భూమి సమస్య ఉంది. దాన్ని పరిష్కరించుకుంటూ, అక్కడో ఆఫీసు నడిపిస్తే కొండరెడ్ల మధ్యనే ఉన్నట్లుంటుంది. కోయిదా,కటుకూరు పెద్దవే గాని వాటిని చేరుకోవడానికి కొంచెం కష్టపడాలి" అంటూ ముగించాడు.

మర్నాటి ఉదయం జీడిగుప్పకు ప్రయాణం చేద్దామనుకున్నా. తెల్లవారితే రెండో శనివారం, శెలవు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు వారానికి రెండ్రోజులు శలవులు గాబట్టి ప్రతి శనివారం ఉదయానికల్లా మా శ్రీమతి వస్తుంది. అయితే రాత్రంతా ప్రయాణం చేసి వస్తుంది కాబట్టి ఆమెనురమ్మని పిలవడం భావ్యం కాదు.

శనివారం ఉదయం 7 గంటలకు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాన్నేను. అయితే 6.45కి గౌతమికి మా శ్రీమతి వస్తుంది గాబట్టి ఆమె వచ్చింతరువాత ఆమెకు చెప్పి బయల్దేర్దామనుకుంటుండగా మా శ్రీమతి రానే వచ్చేసింది. ఎటూ తప్పదు గాబట్టి మెల్లగా చెప్పేశాను. "ఓ అరగంట ఆలస్యంగా వెళ్లగలవా?" అంది. బహుశా అరగంట తరువాత వెళ్లమంటుందేమో అనుకున్నాను. స్నానాదికాలు ముగిస్తుంటే, నాతో కలిసి టిఫిన్ చేసి తమ నిద్రపోతుందేమో అనుకున్నాను. అయితే సరిగ్గా ఏడున్నర గంటలకి యింక బయల్దేరుదామా అంది. "నేను ప్రతి శనివారం పాలవంచ వచ్చేది నిన్ను చూడ్డానికే కాదు. గిరిజనసీమలోని పల్లెలు, గోదావరి ఒడ్డూ, అడవులూ, కొండలూ చూద్దామని కూడా. ఎప్పట్నుంచో నువ్వు చెబుతున్న వరరామచంద్రపుర ప్రాంతం ఈ రోజు చూడొచ్చు కదా? వెళదామా" అంది. నా ఆశ్చర్యానికి, ఆనందానికి అంతు లేదు. యిప్పుడు తొందర చేయడం ఆమె వంతైంది. తొమ్మిదిన్నరకు కూనవరం చేరాం. ఫారెస్టు బంగళాకు వెళ్లే దారిలో దారి మళ్లించాడు నాగేశ్వరరావు. గెస్ట్‌హౌస్‌లో కూనవరం మండలం రెవెన్యూ అధికారి బాబు,



మండల అభివృద్ధి అధికారి సుబ్బారావు ఉన్నారు. "ఏమిటి సంగతులు" అని అడిగాను. యమ్.ఆర్.ఓ. బాబును. "ఏం లేదు సార్ శబరి ఒడ్డున జీపు తయారుగా ఉంచమని వరరామచంద్రపురం వాళ్లకు చెప్పాము. శబరి దాటడానికి పడవ కూడా సిద్ధంగా ఉంది. కాని వరరామచంద్రాపురం నుంచి జీడిగుప్ప వెళ్లేదారి అంత బాగుండదు."

మంచి అడవిలో బావి మలుపు దగ్గర యిద్దరు హత్య చేయబడ్డారు. అదంతా మంచి దట్టమైన అడవి ప్రాంతము. ఒంటరిగా వెళ్లడానికి అందరూ భయపడుతూ ఉంటారు.

వాస్తవానికి మేమా ప్రాంతం చేరుకున్నప్పుడు ఆ వాతావరణం చూసి నాకు అస్సాంలోని దట్టమైన అడవి ప్రాంతాలు గుర్తొచ్చాయి. ఆ ప్రాంతమంతా పెద్ద పెద్ద చెట్లతో, వెదురు పొదలతో కిరకిర శతాబ్దలతో నిండి ఉంది. అక్కడోటీ, అక్కడోటీ చిన్న సన్నవి కాలిదారులు ఆ అడవిలో అదృశ్యమైపోతున్నాయి. బావి మలుపు దగ్గర వాగుంది. వాగు గలగలలు చెట్లకిరకిరలూ అదో వింత అనుభూతిని కలిగించాయి. యిలాంటి ప్రాంతంలోనూ సాటి మానవులు శాశ్వతంగా నివాసముంటూ వుంటే మనం ఆ ప్రాంతానికి వెళ్లడానికే సందేహించడమా?

ఫిబ్రవరి నెలకే గోదావరిలో పెద్దగా నీళ్లుండవు. అయితే వో దారి వెంట వెళితే లాంచీలో జీడిగుప్ప దాకా వెళ్లొచ్చు.

శబరిలో ఎప్పుడూ నీళ్లుంటాయి. అదో పెద్ద కాలువలాగా అన్పిస్తుంది.

సీలేరు నుంచి అదనంగా వదిలే నీళ్లు శబరిలోకి వస్తాయి. అందుకని శబరి 365 రోజులూ బాగా పారుతూ ఉంటుంది.

వరరామచంద్రపురం చేరాలంటే శబరి దాటాలి. కూనవరం దగ్గర శబరీ, గోదావరి కలుస్తాయి. శబరికి ఇటు వైపు కూనవరం, అటు వైపు వరరామచంద్రపురం గ్రామాలుంటాయి.

పడవలో నుంచి చుట్టుప్రక్కల చూస్తే అలా ప్రయాణం చేస్తూ అక్కడే ఉండిపోవాలనిపిస్తుంది. చుట్టూనీలిరంగు కొండలూ, ప్రక్కన పరవళ్ల తొక్కే శబరి, కొంచెం దూరంగా చిక్కిపోయిన నడుముతో గోదారి, శబరి ఒడ్డున పచ్చపచ్చగా ఉండేపంటలు.

శబరి ఒడ్డు చాలా సారవంతమైంది. ఏడాది పొడవునా నీళ్లుంటాయి. కాబట్టి ఏడాదిపొడవున ఏదో పంటలు వేస్తుంటారు. కోస్తా జిల్లాల నుంచి వచ్చిన గిరిజనేతరులు ఆ భూములకు వాళ్లకు పట్టాలున్నాయి.

చట్టప్రకారం గిరిజన ప్రాంతంలో భూమంతా గిరిజనులదే. గిరిజనేతరుడికి భూమి ఉంటే ఆ భూమి తనకెలా వచ్చిందో నిరూపించుకోవలసిన బాధ్యత గిరిజనేతరుడిదే. నిరూపణలకు అసాధ్యాలు కానీ, అడ్డంకులు కాని ఏమున్నట్లు లేదు. ఇదలా సాగుతూనే ఉంటుందేమో!

కూనవరం నుంచి పోచవరం రోడ్డు మొత్తం 25 కి.మీ.లు అయితే వరరామచంద్ర పురం నుండి బహుశా ఓ 5 కి.మీ.ల వరకే తారు రోడ్డుంది. ఆ తరువాత మట్టి రోడ్డు. మంచి అడవి మధ్యలో ఈ రోడ్డు వెళుతుంది. అయితే ఆ అడవి అంత ప్రమాదకరం కాదని నా ఉద్దేశం.

వరరామచంద్రపురం నుంచి ఓ 10 కి.మీ.లు వెళ్లాక కుందులూరు, చింతూరు వెళ్లే రోడ్డు వస్తుంది. ఆ రోడ్డు నుంచి యింకొంచెం ముందుకు వెళ్లగానే అందరూ భయం భయంగా చెప్పుకునే బావి మలుపు వస్తుంది. ఆ మలుపు దగ్గర్నుంచి కుడిచేతి వైపు రోడ్డు జీడిగుప్ప వెళుతుంది.

బావి మలుపు రాగానే వ్యవసాయాధికారి నాగేశ్వరరావు కథ మొదలుపెట్టాడు.

“ఇక్కడే సార్, ఓ పార్టీ కార్యకర్తలను నక్సలైట్లుహత్య చేసింది. సరిగ్గా ఈ చెట్టుకిందేసార్ అంటూండగా జీపు వేగం తగ్గింది. ఆ ప్రాంతం కొంచెం నిర్మానుష్యంగా ఉంది. చుట్టూ అడవి ఉంది. ప్రక్కనే ఓ వాగు పారుతుంది.

ఇటువంటి ప్రదేశంలో హత్యలాంటిది నిరాఘాటంగా జరపడానికి అవకాశం ఎక్కువే. యిక్కడ్నుంచే 5 కి.మీ.లు వెళితే జీడిగుప్ప గ్రామం.

జీడిగుప్ప ఊరిపొలిమేరలోనే మా ఆశ్రమ పాఠశాల వుంది. కొత్త భవనం నిర్మాణంలో ఉంది. పాఠశాల కనిపించిందంటే బడి పిల్లలతో మాట్లాడ్డం నాకు అలవాటు. అయితే నాతో బాటు మా శ్రీమతీ, నీహమ్మా, అధికారులూ చాలా మంది ఉన్నారు కాబట్టి స్కూల్లో ఆగే ఆలోచన మానుకున్నాను. స్కూలు దాటగానే విశాలమైన పచ్చిక మైదానం లాంటిది కన్పిస్తుంది. ఆ పచ్చిక మైదానానికి ఓ పక్క పెద్ద అడవితో నిండిన కొండలు. ఓ పక్క ఓ చిన్న తిప్ప లాంటి దాని మీద గుబురు చింతల మధ్య అటవీశాఖ వారి విశ్రాంతి భవనం అగుపిస్తుంది. ఆ గ్రామానికి అంచున లోతులో గోదారి.

గోదారికి అటు పక్క కటుకూరు. ఆ వూరికి ముందు గోదారి యిసుకలో ఆరబోసిన



ఎర్రని ఎండుమిరప రాసులు. కటుకూరు కూడా గుబురు చింతల నీడన సేద తీర్చుకుంటున్నట్టుగా అగుపిస్తుంది.

గోదావరి ఖమ్మం జిల్లాలో ప్రవహించినంత దూరం యింకే జిల్లాలోనూ ప్రవహించదేమో! ఖమ్మం జిల్లాలో దాదాపు 200 కి.మీ. పారే గోదావరికి అటూ యిటూ ఎన్నెన్ని గ్రామాలో!

వాజేడునాగారం, పేరూరు నుంచి కొల్లూరు దాకా ఎన్నెన్ని గూడేలో!

అటువంటి అందమైన గ్రామాల్లో జీడిగుప్ప ఒకటి.

జీపు ఎక్కడ ఆపాలి అనేది ఒక సమస్య అయింది నాగేశ్వర్రావుకు, ఎందుకంటే విశ్రాంతి భవనం కొండపైన ఉంది.

– “అదో ఆ చింత చెట్టుకింద” అంటూ వచ్చాడు ఆయన.

చింత చెట్టుకు ఒకేకొమ్మ ఉంది. అయినా దాని కింద చాలినంత నీడ వుంది. చెట్టు మొదట్లోనే కూచోవడానికి చాలినంత చోటు వుంది.

– “మీ పేరేమిటి?” అని అడిగాను పెద్దాయన్ని.

– “ముర్ల రాజిరెడ్డి” అన్నాడు పెద్దాయన.

– “తొందరగా మంచం తేరా రామిరెడ్డి” అంటూ ఓ కుర్రాణ్ణి పంపాడు రాజిరెడ్డి.

– “రాజిరెడ్డి జీడిగుప్పకు సర్పంచి” అని నాగేశ్వరరావు పరిచయం చేసాడు.

తన సొంత తమ్ముడు ఎర్రయ్యరెడ్డి గతంలో భద్రాచలం ఎం.ఎల్.ఏ.గా ఎన్నికైనాడు అనే అదనపు సమాచారం కూడా అందించాడు నాగేశ్వరరావు.

రాజిరెడ్డి, యర్రయ్యరెడ్డి ఇద్దరూ ఒడ్డూ పొడుగూ మంచి ఛాయ ఉండి రూపం ఉన్న వారు చక్కటి తెలుగు మాట్లాడగలిగినవారు.

రాజిరెడ్డి గారికో సందేహమొచ్చినట్టుంది.

ఇంత మంది ఈ రోజు జీడిగుప్ప ఎందుకొచ్చారో అని ఒక వేళ 1986 వరదలప్పుడు యిచ్చిన ఇండ్ల కాలనీ యింకా పూర్తి చేయలేదెందుకని దండించడానికొచ్చారేమోనని అనుమానం. అయితే తన సందేహాలను వ్యక్తం చేయలేదు.

గ్రామాల్లోని పెద్దలు, గ్రామస్తులు సాధారణంగా వాళ్లంత వాళ్లు బైటపడరు. మొదట వాళ్లు మాట్లాడరు. మనం మాట్లాడిన చాలా సేపటి వరకూ మౌనంగా ఉంటారు. మనం అడిగినా సమాధానం చెప్పకపోవడం చాలా సాధారణంగా గమనించవచ్చు.

ఆ మౌనం వెనక చరిత్ర వుంది. ఆ మౌనం వెనక సందేహం ఉంది. అపనమ్మకముంది. ఆ మౌనం వెనక యింతకు ముందు వచ్చిన వాళ్లలాగే వీళ్లు కూడా ఏదో చూసిపోవడానికి వచ్చి వుంటారన్న ఉదాసీనతా ఉంది.

వాళ్లతో మాట్లాడ్డం మన బాధ్యత. వాళ్ల భాషలో మాట్లాడ్డం మనకే మంచిది. మనం వాళ్ల కోసమే వచ్చామని నమ్మకం కలిగించడానికి చాలా సమయమే పడుతుంది.

చెప్పదలుచుకున్నది కొంచెం గట్టిగా చెప్పడం కొండరెడ్లకు అలవాటు. దాచి పెట్టడం వాళ్లెరుగరు.

ఈ కొండల మధ్యన ఎక్కడో, నాగరికులమని చెప్పుకునే మనకు దూరంగా ఉన్న వీళ్లు ఎంత స్వచ్ఛమైన తెలుగు మాట్లాడతారో! ఎంత ధైర్యంగా మాట్లాడతారో గమనిస్తే వారి మౌనం అర్థవంతమైనదనిపిస్తుంది. మేమెందుకు వచ్చామని చెప్పడం నా వంతైంది.

రాజరెడ్డి గారూ, మేము యిక్కడకెందుకొచ్చామో తెలుసా? అంటూ మొదలెట్టాను.

– "మీరు చెప్తే కదా తెలిసేది. ఇంతమంది వచ్చినారంటే ఏదో పెద్ద పనే ఉంటు"దన్నాడు.

– "మీ ఆలోచన సరిగ్గానే ఉంది.కాని ఈ నాగేశ్వర్రావనే ఆయన్ను ఎప్పుడైనా చూశారా?"

– "ఎందుకు చూళ్లేదు? అయితే ఆయన పేరు తెలీదు."

– ఆయన పేరు అడగలేదా?

– "పేరుతో ఏం పని? పని చేసేటోళ్లకు పేర్లతో ఏమిటవసరం?"

– "బాగా చెప్పా"రన్నారు.

"అయితే మేమీ రోజు గ్రామంలో మీ అందరితో మాట్లాడాలనీ, మీ అందరి ఉద్దేశాలు తెలుసుకొందామని వచ్చాము" అన్నాను.



నాగేశ్వర్రావు తన సొంత శైలిలో కాస్త వివరణాత్మకంగా చెప్పడం మొదలుపెట్టాడు.

– "రాజిరెడ్డిగారూ, కొండరెడ్డి ఊళ్లన్నిటికి సెంటర్లో ఉండే ఊరేది? అనడిగాడు." ఈ ఊరేనన్నారు.

– "కొండరెడ్లందరూ మండలానికి పోతే తొందరగా పనులు అవుతున్నాయా?" అనడిగాను.

– "ఆ"…..

– "సొంత ఊరని చెప్తున్నారేమో కదా! మరి గోదావరికి ఆ ప్రక్క ఉండే వాళ్లెలా వస్తారిక్కడికి?"

– "కొండల్లో పుట్టి పెరిగిన మాకు నీళ్లడ్డమా? గోదారి దాటొస్తరు. పడవలున్నాయి గదా" అన్నారు రాజిరెడ్డి.

– "దమ్మపేట, అశ్వరావుపేటలో కూడా కొండరెడ్లు ఉన్నారట కదా మరి వాళ్లకు చాలా దూరం కాదా?" అన్నాను.

– "అందరికి ఎట్ల అమరుతాది? ఆ రెండింటికే దూరం. మిగిలిన వాటికి సెంటరే కదా" అన్నాడు.

– "ఎదురుగా ఉండే కటుకూరయితే అటు ఉండే వాళ్లకు అనుకూలమా?" అనడిగాను.

– "అటువుండేవాళ్లకి అనుకూలమే. మూడొంతుల మందిమి యిక్కడే ఉన్నాము కదా" అన్నాడు.

– "కొయిదాలో?"

– "కొయిదా కూడా అంతే. అయినా కోయిదాలో కొండరెడ్లు తక్కువైనరు కదా."

– "కోయిదాలో సదస్సు పెట్టినప్పుడు మీరంతా వచ్చినారుగదా!"

– "మీరక్కడ పెడితే రాక ఏం జేస్తము? నడుచుకుంట ఎక్కడెక్కడ్నుంచో వచ్చినరు. కొంత మంది అంతకు ముందు రోజు బయలెల్లినారు గదా."

– "ఈ ఊర్లో ఏం జేస్తే మంచిది? అనడిగాన్నేను.

– "ఇంతమంది మీరొచ్చి ఏం జేస్తే మంచిదని నన్నడిగితే నేనేం జెప్తా?"

– "కొండరెడ్ల కోసం ఈ ఊళ్లోనే ఒక ఆఫీసు పెడితే బాగుంటుందా?"

– "ఎందుకు బాగుండదు? నడక దప్పుతది. ఎక్కడెక్కడ్నో మండలాల చుట్టు తిప్పుడు దప్పుతది".

– "మరి ఆఫీసు పెట్టుకోవటానికి యిక్కడేం లేదు కదా" అన్నాను.

– "యిప్పటికిప్పుడు బంగళా ఎట్టొస్తది? అయినా ఆ ఎదురుగా ఉండేవి చూడొచ్చుగా" అన్నారు కొండ మీది ఫారెస్టు బంగ్లా చూపిస్తూ.

– "బాగున్నాయా?"

– "పాడుబడినాయి, వాటిని వాడేటోళ్లు లేరు".

– "బాగు చేస్తే?"

– "ఫారెస్టోళ్లు యిస్తే గదా. అయినా బాగా పాతవయి"

– "మరి ఎక్కడ పెట్టాలె ఆఫీసు?"

– "ఇప్పుడిక్కడ కూచొని యిన్ని మాటలు మాట్లాడుకొలే మనం. పని చేసుకోవడానికి బంగళానే కావాలెనా? చెట్టుకిందనే ఆఫీసు పెడితే సరిపోతది" అన్నారు. రాజిరెడ్డిగారు.

– "ఈ చెట్టు కిందనే?"

– "చక్కగ ఈ నీడన ఓ ఇల్లు కడ్తము. దాన్లో ఆఫీసు బెట్టండి. నిదానంగా బంగ్లా గట్టండి. లేకుంటే ఆ బంగ్లా బాగు చేయించండి. తొందరగా పని జెయ్యడం మంచిది గద. బంగ్లా కోసం పని ఆపడమెందుకు?" అన్నారు.

– "మరి చెట్టుకింద యిల్లెవరు కడ్తారు?"

– "వీళ్లంతా ఏం జేస్తారు కట్టమంటె కడ్తారు గదా" అని ఉత్సాహంగా చూస్తున్న యువకుల్ని చూపించాడు.

– "ఎప్పటికి కట్టిస్తారు."

– "మీరెప్పటికంటే అప్పుడే,అయితే కొంచెం డబ్బు కావాలె."



"ఎందుకు?"

"పని మొదలయ్యేటప్పుడు అందరము పండగ చేసుకోవాలె" అన్నారు రాజిరెడ్డిగారు.

– – –

పాలవంచకు తిరిగి వచ్చి వివరంగా రిపోర్టు రాసి కలెక్టరు కృష్ణారావుగారితో మాట్లాడాను.

వారు బంగ్లాలోనే ఆఫీసు పెట్టే ప్రయత్నం చేస్తే మంచిదనే సలహా యిచ్చారు. రెండు నెలల తరువాత 1989 ఉగాది పర్వదినాన యావత్తు కొండరెడ్ల సమక్షంలో రాజిరెడ్డి గారి  ఆశీస్సులతో కొండరెడ్ల ప్రత్యేక విభాగం కొండపైన బంగళాలో వెలిసింది.

కృష్ణారావుగారు కొబ్బరికాయ కొట్టి ప్రసాదరెడ్డిని కొండరెడ్ల ప్రత్యేకాధికారిగా పరిచయం చేస్తే ముర్ల ఎర్రయరెడ్డిగారు ఏకంగా భద్రాచలం రాజధానిగా ఓ రాజ్యమే కావాలన్నారు కలెక్టరు తలుచుకుంటే ఏదైనా సాధ్యమేమోననుకొని.

ఇదంతా వింటున్న రాజిరెడ్డిగారు నలభై ఏండ్ల తరువాత మళ్లీ ఈ ఊరికి కళొచ్చినట్లుంది గదా అని నవ్వీ నవ్వనట్లున్నారు.

❖ ❖ ❖

11. మోహనరావు : వీరు గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థ (ట్రైబల్ కల్చరల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాదు) కి సంచాలకులు, ఈ సంస్థ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దీనికి ప్రాంతీయ కార్యాలయాలు రెండన్నాయి. ఒకటి భద్రాచలంలో, రెండోది పాడేరులో ఉంది. మోహనరావు గారు 'కోలాము' లనే గిరిజన తెగ మీద విశేషంగా పరిశోధన చేశారు.

# "వాడు రెడ్డి వచ్చినాడా?"

**"కొం**డరెడ్లు అంటే కొండల మీదనే ఉండాలి అప్పుడే వాడు నిజమైన కొండరెడ్డి" అని నమ్మే కొండరెడ్లు చాలా మంది ఉన్నారు ఖమ్మం జిల్లాలోని గిరిజన ప్రాంతంలో.

"అడవి తల్లీ, కొండలూ మాకు అండ, అక్కడ నుంచి దిగి వచ్చిన రోజున మా జాతి లేదు, మాకు బతుకు లేదు" అని బలంగా నమ్ముతారు కొండరెడ్లు.

ఖమ్మం జిల్లాలో కొండరెడ్లను మూడు రకాలుగా విభజించుకోవచ్చు.

నిజంగా కొండలపైనే ఉండేవాళ్లు; పూర్తిగా అడవి మధ్యలో ఉండేవాళ్లు;

గోదావరి ఒడ్డునే ఉండేవాళ్లు. అందరూ కొండరెడ్లే అయినా ఒక్కొక్కరి జీవన విధానం చుట్టూ ప్రక్కల వాతావరణం మీద ఆధారపడి ఒక్కోరకంగా ఉంటుంది.

నాగరికతకు చాలా దూరంగా ఉన్నా, ఒక్క ఎకరా భూమి కూడా సేద్యానికి లేకపోయినా, గోదారి ఒడ్డున వుండే కొండరెడ్లతో పోలిస్తే మిగిలిన ప్రాంతాల్లోని కొండరెడ్లు చాలా అమాయకులు, యింకా అనాగరిక జీవనం గడుపుతున్నారని చెప్పాలి.

కూనవరం వెళ్లడం సులభం. కానీ కూనవరం మండలంలోని కొండరెడ్డి గ్రామాలు చేరుకోవడం ఎంత కష్టమో అనుభవిస్తే తెలుస్తుంది.

ఇక్కడ వీళ్లో కథ చెప్తారు.

"గతంలో రెడ్డి రాజుల కాలంలో యుద్ధాలు జరిగినప్పుడు ఓడిపోయిన కొంత మంది రెడ్లు కొండల్లోకి పారిపోయి అప్పటి నుంచి వారక్కడ్నే ఉండిపోయినారట". శత్రువెప్పుడు వస్తాడోనని అనుమానంగా చూస్తుంటారు. బయట నుంచి వెళ్లే ఏ కొత్త వ్యక్తినైనా కాస్త సందేహంగా చూస్తారు వాళ్లు. మనమెవరి గూఢచారులమైనా కావొచ్చని.

వీరి చక్కటి భాష చూస్తే పైన చెప్పిన కథ నిజమేమోనన్పిస్తుంది.

కొండరెడ్డి గ్రామాలు కొన్ని తిరిగి కొండరెడ్ల కోసం ప్రత్యేకించి ఓ కార్యాలయం ఏర్పాటు చేయడం, ప్రసాదరెడ్డి ప్రత్యేకాధికారిగా రావడం జరిగింది.

ప్రసాదరెడ్డి వచ్చినప్పట్నుంచీ, "సార్ మీరు ఆ ఊరు చూడాలి, ఈ ఊరు చూడాలి అని అనడం, నన్ను ఆశపెట్టడం, ఒక్కోసారి, ఫలానా గ్రామంలో మీరొస్తున్నారని" చెప్పేశాను అని బెదిరించడం లాంటివి కూడా జరుగుతూ ఉండేవి.

ఐతే మైదాన ప్రాంతంలో ఉన్న గ్రామాలకు అంటే అడవి మధ్యలో ఉన్నా సరే వెళ్లడమైతే కాస్త తొందరగా వీలయ్యేది కానీ, నిజంగా కొండల మీద ఉన్న గ్రామాలకు వెళ్లడమంటే అంత తొందరగా వీలుకాలేదు.

ముందే చెప్పినట్లుగా కొండరెడ్డి గ్రామాలు కొన్ని కొండ శిఖరాల పైనే ఉన్నాయి. అలాంటి వాటిల్లో చింతగండి ఒకటి. చింతగండిని కొండరెడ్డి జీవనానికి ప్రతీకగా ఓ నమూనా గ్రామంగా చెబ్తుంటాడు ప్రసాదరెడ్డి. వాస్తవానికి గిరిజన తెగల జీవన విధానంపై ఐటిడిఏ కార్యక్రమాలపై ఓ డాక్యుమెంటరీ తీస్తే దాని కోసం వీడియో టీమ్‌ను ఓ రోజంతా కష్టపెట్టి చింతగండి తీసుకెళ్లి ఫిల్మ్ తీయించాడు ప్రసాదరెడ్డి. ఇటువంటి చింతగండికి నేను వెళ్లకపోవడమనేది ప్రసాదరెడ్డికి చాలా వెలితి కలిగించే విషయమట. అందుకనే ఎప్పట్నుంచో మీరు చింతగండి రావాలి, చింతగండి రావాలి అని అంటూ ఉండేవాడు.

అందునా, చింతగండి వెళితే చింతగండి ఒక్కటే గాదు దాన్ని బేస్ కాంప్ చేసుకొని యింకో డజను గ్రామాలకు వెళ్లవచ్చు.

ఓ డజను గ్రామాల కొండరెడ్లకు చింతగండి కేంద్ర స్థానం లాంటిది. ఏదైనా విషయం ఈ గ్రామాలన్నింటికీ చేరాలంటే చింతగండి దాకా చేరవేయగలిగితే చాలు.

ఆ రోజు మంగళవారం. వారంలో అది నా మొదటి క్యాంపు రోజు.

సోమవారం విజ్ఞప్తుల దినం పూర్తి కాగానే మళ్లీ యింకేం వచ్చి పడుతుందోనని అతి ముఖ్యమైన ప్రయాణాలు మంగళవారం పెట్టుకొనేవాడిని.

అలాగే చింతగండి ప్రయాణం పెట్టుకున్నాను.

వాహనం మారుతి జీపు. డ్రైవరు వీరాస్వామి. వెంట వుండేది అటెండరు భూషయ్య.

పాలవంచ నుంచి కూనవరం వెళితే కూనవరంలో సెక్టోరల్ అధికారి నాగేశ్వరరావూ[18], కొండరెడ్ల విభాగం ప్రత్యేకాధికారి ప్రసాదరెడ్డి వుంటారు.

కానీ ప్రసాదరెడ్డి మాత్రమే నన్ను కూనవరం నుంచి చింతగండి తీసుకువెళ్లే ఏర్పాటు చేసుకున్నాం.

సంచులు భుజానేసుకొని కొండ ఎక్కడం మొదలుపెట్టాం. చింతగండి కొంచెం

సులభంగానే ఎక్కగలమని నా నమ్మకం.

ఎందుకంటే హిమాలయాల్లో ట్రెక్కింగ్[12], రాక్ క్లైంబింగ్[13] చేశాం గనుక, యీ కొండలు ఎక్కడం అంత పెద్ద కష్టం కాకపోవచ్చు అనే ఉద్దేశంతో.

కొండదారి కేవలం రాళ్లమయం కాకుండా చాలా రమణీయంగా ఉంది. దారి ప్రక్కన వెదురుపొదలు, కొంచెం దూరంగా పెద్ద మద్ది చెట్లు కొంచెం దూరం దారి సాగగానే కాస్త చదునైన ప్రదేశం. అక్కడ ఉసిరి చెట్ల కింద విస్తారంగా రాలిన ఉసిరిపళ్లు.

వాటిని ఏరుకుంటూ మళ్లీ కొంత దూరం నడిస్తే యింకాస్త పల్లపు ప్రాంతం.

కొంచెం విశ్రాంతి తీసుకోమని ప్రసాదరెడ్డి సలహా. మాతోబాటు వస్తున్న అడివిరెడ్డి చెంగు చెంగున కొండరాళ్లపైకి దూకుతూ ముందుకు పోతున్నాడు. విశ్రాంతి తీసుకుందామని ఆగాము. భూషయ్య నీళ్లిచ్చాడు. నీళ్లు తాగితే తీయగా ఉంది. కొండ ఉసిరి కాయలు తిని నీళ్లు తాగితే తీయగా ఉంటుంది.

అలా నీళ్లు తాగుతూ ఉండగా ఎవరో పాటలు పాడుతున్న శబ్దం వచ్చింది.

ఇక్కడెవరు పాటలు పాడుతున్నారా అని సందేహం వచ్చి భూషయ్యను అడిగాను. భూషయ్య అడివిరెడ్డిని అడిగాడు. వెనకెవరొస్తున్నారో తెలీదన్నాడు అడివిరెడ్డి. కొంచెంసేపటికి మా గిరిజన సంక్షేమ కార్యకర్తలు యిద్దరు పాటలు పాడుతూ రావడం గమనించాం. వీళ్లు ఎందుకు వస్తున్నారని అనుకుంటూండగా, చొక్కా తీసి భుజం మీద వేసుకొని ఆయాసపడుతూ నడుస్తున్న నాగేశ్వర్రావు అగుపించారు. అప్పుడనిపించింది నాగేశ్వరరావుని సెక్టోరల్ అధికారిగానూ, తరువాత పైడి గూడెం ఫారం పూర్తి ఇన్‌ఛార్జిగానూ చెయ్యడంలో నేనేం పొరబాటు చెయ్యలేదని.

సరే అందరమూ కలిసే నడుద్దామని చెప్పి మేము కూర్చుండి పోయాము.

ఈ లోపు మాతో ఉన్న నాగేశ్వర్రావనే కోయ అబ్బాయి కింద నుంచి ఆయాసంతో నడుచుకుంటూ వస్తున్న నాగేశ్వర్రావును ఫొటో తీశాడు.

తాను ఐటిడిఎ వారు ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీలో శిక్షణ పొందాడు. మేము చింతగండి వెళుతున్నామని చెప్పగా తానూ మా వెంట వచ్చాడు.

మళ్లీ బయలు దేర్దామనుకుంటుండగానే అడివిరెడ్డి చాలా ముందుకు వెళ్లిపోయాడు. ఉసిరి పళ్లు తప్ప యింకే పళ్లూ ఉండే రోజులు కావని.



యిలా నడుచుకుంటూ, పళ్లేరుకుంటూ సాగుతుండగా ఏవో పూలగుత్తులతో ఎదురొచ్చాడు అడివిరెడ్డి.

ఆ పూలేవో తెల్లగా, చిన్న చిన్న పూలతో గుత్తులుగా ఉన్నాయి. వాసన గుభాళిస్తుంది. పూల పేరు చెప్పమంటే చెప్పలేకపోయాడు అడివిరెడ్డి. యిలాంటి పూలగుత్తులు దారి పొడవునా ఎన్నో వున్నాయి. ఇంకా తెస్తానంటూ చెంగున పరిగెత్తిపోయాడు.

అడివిరెడ్డికి యీ కొండలెక్కడం చాలా మామూలు విషయం. ఆరు కి.మీ.ల దూరం ఉండే ఆ దారిన రోజుకి రెండుసార్లు కొండ ఎక్కి దిగుతాడు అడివిరెడ్డి. సంతకు రావాలంటే కూనవరం రావాలి. అంటే పన్నెండు కిలోమీటర్లు.

వెదుర్లు కొట్టి బుట్టలు అల్లి వాటిని అమ్మాలంటే కూటూరులో ఐటిడిఎ గోదాముకు రావాలి. అవి తీసుకొనే చంద్రమ్మ లేకపోతే బుట్టలు వదిలేసి, డబ్బులు తీసుకోవడానికి మళ్లీ కొండదిగి రావాలి.ఎవరైనా అధికారులు వచ్చినప్పుడు వాళ్లను కలవడానికి కొండ దిగాలి. యిలా కొండ దిగడం చాలా మామూలు విషయం, రోజూ చేసే పని. అంచేత అడివిరెడ్డి మాకో హీరో ఐపోయాడు.

ఎంత రాక్ క్లైంబింగ్ చేసినా, ఎప్పుడో ట్రెక్కింగ్ చేసినా యిప్పుడు కొండలెక్కడం కష్టమైన పని అనేది అనుభవంలోకి వచ్చింది.

చివరి మజిలీ అయిపోయి యింకో కిలోమీటరు దూరంలో చింతగండి ఉందనుకు నేప్పట్నుంచి కొండరెడ్లు ఒక్కొక్కరే మాకు దార్లో ఎదురు అవుతూ వచ్చారు. వాళ్లంతా చింతగండికే వెళ్తున్నారు. కాబట్టి వాళ్లనే దారి అడుగుతూ ముందుకు సాగుతున్నాము.నాకు, వాళ్లకూ తమ తమ గమ్యస్థానాలు చేరాలనే ఆతృతే ఎక్కువగా ఉంది. ఆ సమయంలో ఎవరికీ ఎదుటి వారి వివరాలు కనుక్కొనే ఓపిక ఉన్నట్టు లేదు.

చింతగండి ఊరు దగ్గరకు వచ్చిందనగా నాగేశ్వరరావు నా దగ్గరికొచ్చి, "మనమొస్తున్నామని ప్రసాదరెడ్డి టేకులొద్దికి కబురు పంపిస్తే మంచిదేమో" అని అన్నాడు.

అలాగేనని ప్రసాదరెడ్డి వెనక ఉండిపోతే, నేనూ నాగేశ్వరరావు కలిసి నడవడం మొదలుపెట్టాము.

ఊరికి మొదట్లోనే ఓ చిన్న సెలయేరు ఉంది. దాన్ని దాటగానే గుబురు చెట్లు, గుబురు చెట్లకు ఎడమవైపు చిన్నబోదు. దాని మీద ఏపుగా పెరిగిన టేకు చెట్లు. చెట్ల మధ్య అక్కడక్కడా పోడుకొట్టిన కొండ అంచులూ, దూరంగా అక్కడక్కడా జీలుగు చెట్లు. ఓ బోటి

కింద లోయ. చుట్టూ పచ్చని చెట్లు. అరిచే పిట్టలూ, చల్లటిగాలి.

మధ్యాహ్నం రెండున్నరయ్యేటప్పటికి నేనూ నాగేశ్వరరావు చింతగండి చేరుకొని ఊరి మొదట్లోనే ఉండే వెలగచెట్టు కిందికి చేరాము. అప్పటికి అక్కడ ఓ నలుగురు కొండరెడ్లు ఉన్నారు. బయట నుంచి మేమొచ్చామని తెలిసినా, ఈ రోజు పీ.వో. వస్తాడట అని తెలిసినా, వచ్చిన వాళ్లెవరో తమంతట తాము చెప్పే దాకా వాళ్లు మాట్లాడదలుచుకున్నట్లు లేదు.

ఇళ్లు ఇక్కడోటి, అక్కడోటి ఉన్నాయి. ఇంటింటికీ ఓ పళ్లమొక్క ఉంది. ఇంటి ముందు పరిసరాలు శుభ్రంగా ఉన్నాయి. ప్రతి యింటి ముందూ ఒక్కరో యిద్దరో ఉన్నారు. అయినా ముసలీవాళ్లూ, చిన్న పిల్లలూ తప్పించి పెద్దగా మనుషులు కన్పించడం లేదు.

ఇక వీళ్లందర్నీ మనం కూడదీయాలి అనుకొని ఓ రాయి చూసుకొని కూర్చున్నాన్నేను అక్కడ ఉన్న నలుగురు కొండరెడ్లకు దగ్గరగా.

నాగేశ్వరరావు ఆ నలుగురికీ నన్ను చూపించి "ఎవరొచ్చారో గుర్తు పట్టారా?" అని అడిగాడు.

'తెలీదు ఈ రోజు పీ.వో. వస్తాడన్నారు. కానీ వాడు రెడ్డి వస్తున్నడా లేదా?" అని అడిగాడు.

"వచ్చిన వారు పీ.వో.గారు" అని చెప్పి, రెడ్డి కన్నా పీవో ఎంత పెద్ద ఆఫీసరో వివరించబోయాడు నాగేశ్వరరావు. వారించాను నేను. రెడ్డి వస్తున్నాడా? అని మళ్లీ ప్రశ్న. కొంచెం సేపట్లో వస్తాడన్నాను. వాళ్ల ముఖంలో ధైర్యం ఆనందం స్పష్టంగా కన్పించింది. అంటే ఎవరొస్తే మాకెందుకు? మా రెడ్డి వచ్చినాడా? లేదా అనేది వాళ్ల ఉద్దేశం కావచ్చు.

వాడు అనేది మనం సాధారణంగా గౌరవార్థం ఉపయోగించం. బాగా పరిచమున్న వాళ్లకు బాగా చనువున్న వాళ్లకే మనం వాడు అనే మాట ఉపయోగిస్తాం.

అయితే కొండరెడ్లు 'వాడు' అనేది సాధారణంగా ఉపయోగిస్తారు. కాని అధికారులతో చాలా వినయంగా మెలుగుతారు. రెడ్డి ఒక అధికారి అని వాళ్లకు తెలుసు. కానీ వాడు అని తమలో ఒకడిగా రెడ్డిని చూసుకునే స్థితిలో వాళ్లున్నారంటే ప్రసాదరెడ్డి వాళ్లలో ఎంతగా కలిసిపోయాడా అని చలించిపోయాన్నేను.

ఇంతలో ప్రసాదరెడ్డి వచ్చాడు. ఎక్కడెక్కడో ఉన్నకొండరెడ్లు బిలబిలమంటూ చుట్టూ మూగారు. కొంత మంది చాపలు తీసుకొని రావడం మొదలుపెట్టారు. కూర్చోవడానికి,



ప్రసాదరెడ్డి రెండిళ్లలోకి వెళ్లగానే స్త్రీలూ రావడం మొదలుపెట్టారు. వీరికి ప్రసాదరెడ్డి అంటే ఎంత అప్యాయత అన్పించింది.

మారెడ్డి అని కులాభిమానమా? మా కోసం వచ్చిన అధికారి అని గౌరవమా? అలా అయితే నేనూ నాగేశ్వరరావు కూడా వాళ్లకోసమే వచ్చాం కదా? కానీ మొదటిసారి వచ్చాం మేమిద్దరమూ! కులాభిమానమనేది గిరిజనులకింకా ఒంటబట్టలేదని నా నమ్మకం.

"టేకులొద్ది పెద్ద కూడా యిక్కడికి వచ్చాడు సార్" అంటూ ప్రసాదరెడ్డి మా దగ్గరికొచ్చాడు. అతను రాగానే బంధువును చూసినంత సంబరంగా బాయిబొక్క పెద్ద లేచి ప్రసాదరెడ్డి దగ్గరకొచ్చి ఏదో గుసగుసలాడాడు.

"ఉండండి. మనందరం భోజనం చేసిన తరువాత మిగిలిన సంగతులన్నీ మాట్లాడుకుందాం. అప్పుడు అన్ని సంగతులూ పీ.వో. గారికి చెప్పవచ్చు" అన్నాడు.

చింతగండి పెద్ద యింట్లో కోడికూర మాత్రమే చేశారట. నాగేశ్వరరావు, ప్రసాదరెడ్డి తమతో కొన్ని పూరీలు, కాస్త అన్నం తెచ్చారు. చింతగండి గ్రామస్తులూ పక్కన పది గ్రామాల పెద్దలూ,పిన్నలూ కూచొని భోం చేశాం.

భోజనం అయ్యాక మళ్లీ ప్రసాదరెడ్డితో గుసగుసలు మొదలయ్యాయి. "బుట్టలకు ధర పెంచమనీ, బుట్టలక్కావలసిన వెదురు వాళ్ల గ్రామానికి దగ్గర్లోనే నరుక్కుంటామనీ, దానికి అనుమతి కావాలని" వాళ్ల గుసగుసల సారాంశం. ప్రసాదరెడ్డితో వాళ్లకున్న చనువుకీ, అతనంటే వాళ్లకున్న నమ్మకాన్నీ చూసి కొండరెడ్ల గ్రామాలన్నీ నేను చూడకపోయినా యిబ్బంది లేదు, మా ప్రసాదరెడ్డి ఉన్నాడు కదా అనుకొన్నాను.

12. ట్రెక్కింగ్ : ఒక్క మాటలో చెప్పాలంటే అంత సరిగ్గా దారిలేని ప్రాంతానికి కాలి నడకతో వెళ్లడాన్ని ట్రెక్కింగ్ అనొచ్చు. సరిగ్గా దారి లేదు గాబట్టి దారంతా ఎగుడు దిగుడుగా ఉండొచ్చు. కొండ ప్రాంతముండొచ్చు, చాలా నిటారుగా ఉండే ప్రాంతం కావచ్చు. ట్రెక్కింగ్ చేస్తే అరణ్య ప్రాంతంలో పని చేయడం కొంత సులభం.
13. రాక్ క్లైంబింగ్ : తెలుగులో కొండలెక్కడం. ఇది పోలీసు అధికారుల ట్రైనింగులో, మిలటరీ ట్రైనింగులో ఓ భాగం. పెద్ద పెద్ద కొండలు, పెద్ద పెద్ద బండలు, కొండ శిఖరాలు ఎక్కడానికి శిక్షణ, మెళుకువ చాలా అవసరము. రాక్ క్లైంబింగ్ చేస్తే శరీరం కూడా గట్టిపడుతుంది.

❖ ❖ ❖

# "కొండకు కట్టెలు మొయ్యమంటరా... సారూ?"

ఆ రోజు 1990 సం॥ నవంబరు నెల శనివారం.

గల్ఫ్ సంక్షోభం పుణ్యమాని శని, ఆదివారాలు శలవు మాకు. అందుకనే వారాంతంలో మా శ్రీమతి కలెక్టరుగా పని చేసే రాయచూరు జిల్లా (కర్నాటక) వెళుతూ ఉండేవాణ్ణి. అలాంటి ఓ వారాంతంలో రాయచూరు జిల్లాలోని తుంగభద్రా డామ్ ఉండే మునీరాబాద్ వెళ్లడం తటస్థించింది.

మధ్యాహ్నం మూడు గంటలు అయింది. మా శ్రీమతి ఏదో మీటింగ్ కోసం వెళ్లింది. మునీరాబాద్‌లోని ఇంద్రభవన్ అనే విశ్రాంతి భవనం. బాల్కనీలో కూర్చొని తుంగభద్ర జలాశయం వైపు దృష్టి సారించాను.

లేత ఎండ. ఆ లేత ఎండ జలాశయం నీళ్ల మీద పడి కిలోమీటర్ల తరబడి వెండి కాంతులు విరజిమ్ముతోంది. తుంగభద్ర జలాశయం అజేయంగా అన్పిస్తోంది. చుట్టుపక్కల చెట్టూ చేమలు కన్పించడం లేదు. సుదూరంగా ఆవలి ఒడ్డున కొండలు అగుపిస్తున్నాయి మసక మసకగా.

ఇంత జలరాశికి చుట్టుపక్కల యింత బోసిగానా? ఇటువంటి ప్రదేశంలో ఇంత జలరాశి ఉండడమా?

ఇలాగే నాగార్జునసాగర్ రిజర్వాయరు దగ్గర చూస్తే కూడా బండరాళ్లూ, సర్కారు తుమ్మ చెట్లతో నిండిన కృష్ణానది గట్టు అతి పేవలంగా ఉండి యింత జలరాశి పక్క ఎడారి లాంటి యీ వాతావరణమా అనిపిస్తుంది!

ఇలా తుంగభద్ర జలాశయం గురించి ఆలోచిస్తున్న నాకు ఎందుకుండగూడదూ? కూనవరం దగ్గర ఫారం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు అడవిలో ఫారమా అన్న వాళ్లు లేరా? కానీ యిప్పుడో! ఇటువంటి ఫారం యీ అడవిలోనా అనుకునే వాళ్ళు ఎంత మందో!

అదేనేమో వైరుధ్యాల్లోని అందమంటే!

అయితే ఈ ఫారానికి అంకురార్పణ చాలా కాకతాళీయంగా జరిగింది.

ఆ రోజుల జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయాను.

– – –

– "సారూ! కొండకు కట్టెలు మొయ్యమంటారా" అని నా సమాధానం కోసం ఎదురు చూస్తోంది సున్నం చంద్రమ్మ.

చంద్రమ్మ కూటూరు సర్పంచి కూతురు కూటూరులో గిరిజనాభివృద్ధి సంస్థ వారు ప్రోత్సహిస్తున్న వెదురు బుట్టల తయారీ కార్యక్రమాన్ని కోయలు, కొండరెడ్ల తరపున నిర్వహిస్తోందామె. ఆమె అన్నది నాకు వెంటనే అర్థం కాలేదు. అందుకే...

– "అది కాదమ్మా, నాకు కాస్త వివరంగా చెప్పు. కొండకు కట్టెలు మొయ్యడమేమిటి? అర్థం లేని పని కదా! ఎవరన్నారు అలా చెయ్యమని" అని కాస్త ఆశ్చర్యంగా అడిగాన్నేను.

– "అట్లనే ఉన్నట్టుంది సారూ, ఫారెస్టు సార్లు జెప్పే మాట, కొండ కింద డిపోల కొచ్చి ఎదురు బొంగులు తీసుకోవాలంట. లేకుంటే బుట్టలల్లొద్దంట"......

యిప్పటికి నాకర్థమయింది సమస్యేమిటి అనేది.

ఒకే ప్రశ్నకు ఉండే రెండు జవాబుల్లో ఎంత తేడా?

ఇక్కడే గిరిజనులకూ, చట్టాన్నీ, నిబంధనలనూ సమయోచితంగా అర్థం చేసుకోలేని ప్రభుత్వాధికారులకూ పేచీ వచ్చేది.

నాలుగు వందల కుటుంబాలకు జీవనోపాధినిచ్చే పనిని ఆపేయడమంటే మాటలా?

గిరిజనులు ఎవరి గూడేనికి దగ్గరుండే అడవిలో వాళ్లు వెదురు నరికి బుట్టలల్లి వాటిని సంతలో అమ్మి ఆ డబ్బుల్తో సంతలోనే తమక్కావలసిన వస్తువులు కొనుక్కోవడం అనాదిగా గిరిజనుల దగ్గరకొని అంతకు ఐదు రెట్లు ధరకు అమ్ముకోవడం గమనించిన గిరిజనాభివృద్ధి సంస్థ పాలవంచ వారు వెదురుబుట్టలను తామే కొంటే గిరిజనులకు గిట్టుబాటు ధర యివ్వొచ్చు కదా అనే ఆలోచనతో సంతల్లో బుట్టలు కొనడం ప్రారంభించారు. అలా కొన్న వాటిని సింగరేణి కాలరీస్‌కి సరఫరా చేస్తారు.

యిక్కడ్నుంచే మొదలయింది చిక్కంతా. గిరిజనులకు ఎక్కువ ధర వస్తుంది. కాబట్టి, లాభదాయకమైన వృత్తి కింద ఈ బుట్టల వ్యాపారాన్ని జమకట్టి వెదురుకు రాయల్టీ కట్టమనడం మొదలుపెట్టారు అటవీశాఖ వారు.

కానీ వెదురు కొట్టుకోవడం, బుట్టలు అల్లుకోవడం, వాటిని అమ్ముకోవడం మాకు

వ్యాపారం కాదు, అది మా జీవనం, దానికి మేము డబ్బులు కట్టేదేమిటి అంటారు గిరిజనులు.

పర్యవసానంగా అటవీశాఖలోని కిందిస్థాయి ఉద్యోగులు గిరిజనులు చేసే బుట్టలు ఖమ్మం జిల్లా దాటి బయటికి పోకుండా ఆంక్షలు పెట్టడం మొదలుపెట్టారు. ఈ ఆంక్షల్లో భాగంగానే గిరిజనులకు వాళ్లు అడవిలో వెదురు నరకొద్దన్నారు. వెదురు కావాలంటే ఫారెస్టు డిపోల నుంచి తీసుకోండి అని కూడా సలహా యిచ్చారు. ఇది గిరిజనులకు సమంజసంగా అన్పించలేదు.

ఎందుకంటే, ముఖ్యంగా కొండరెడ్ల గ్రామాలు దాదాపు మంచి అడవి మధ్యలో కొండల మీద ఉండి వెదురుపొదలకు అందుబాటులో ఉంటాయి. డిపోలు కొండ కింద కొండరెడ్ల గ్రామాలకు చాలా దూరంగా ఉంటాయి. అందుకనే డిపోల నుంచి వెదురు బొంగులు మొయ్యడమంటే కొండకు కట్టెలు మొయ్యడమేనని గిరిజనుల వాదన. ఈ వాదనకు సమాధానం చెప్పడం కష్టం. అయినా ప్రభుత్వాధికారులుగా మౌనంగా ఉండలేని అటవీశాఖ అధికారులు ప్రతివాదన మొదలుపెట్టేరు. అది యిలా ఉంటుంది.

"గిరిజనుల అడ్డదిడ్డంగా వెదురు నరుకుతారు. దాంతో కొన్నాళ్లకు వెదుళ్లు చిగురేయడం ఆగిపోయి అంతరించి పోతాయి. గిరిజనులు తమంతట తాము వెదురు నరకకూడదు. కొన్నాళ్లకు వారికి జీవనోపాధి లేకుండా పోతుంది. అందుకనే గిరిజనులు ఫారెస్టు డిపోల నుంచే వెదురు తీసుకోవాలి. లేకుంటే అడవిని కాపాడ్డం అసాధ్యం" అన్న ఈ వాదన కూడా సమంజసంగానే ఉంది.

కానీ గిరిజనుల వాదన వినండి.

"పేపరు బోర్డోళ్లు[14] నరికిన ఎదురు తోపులు జూడండి సారు. అక్కడ మళ్లీ ఎదురు మొలుస్తదా? మేము మా తాతల తండ్రునాట్నుంచి ఎదురు కొడ్తున్నమా లేదా? మేము ఎదురుగొట్టిన దగ్గర ఆడివెండిందా? రోజుకు లారీలకు లారీలు పేపరు బోర్డోళ్లు కొట్టుకుంటే ఎండని అడివి మేము పొట్టకూటికి రోజుకు పది బొంగులు గొడితే ఎండుద్దా? తరుగుద్దా?"

ఈ రెండు వాదనలూ విన్న గిరిజనాభివృద్ధి సంస్థ వారికి తోచిన పరిష్కారాలు రెండు.

ఒకటి : కొండరెడ్లు మాత్రం వెదురు బొంగులు వాళ్ల గ్రామాలకు చుట్టుపక్కలే కొట్టుకునేలా అటవీశాఖ వారిని ఒప్పించడం. (ఎందుకంటే కొండకు కట్టెలు మొయ్యడం అర్థరహితమని ఎవరైనా ఒప్పుకుంటారు గాబట్టి)



రెండు : కోయలు ఫారెస్టు డిపోల్లోనే వెదురు తీసుకోవడం (భవిష్యత్తులో ప్రభుత్వ భూముల్లో వెదురు నాటి పెంచడం) కోయ గ్రామాలు కొండకింద మైదాన ప్రాంతంలో ఉంటాయి గాబట్టి.

ఈ ఆలోచనతోనే సామాజిక అడవుల కార్యక్రమం కింద వెదురెందుకు పెంచకూడదని పించింది నాకు. వెంటనే కూనవరం ప్రాంతంలో వ్యవసాయాధికారిగా ఉన్న నాగేశ్వరరావును పిలిపించాను. వెదురుతో బుట్టలల్లే గిరిజన కుటుంబాలు కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లోనే ఎక్కువ ఉన్నాయి.

– కూనవరం దగ్గర ఓ రెండొందల ఎకరాల భూమి ఉందన్నారు కదా అందులో వెదురు పెంచితే ఎలా ఉంటుంది? అని అడిగాను.

– "బాగుంటుంది సార్. వాస్తవానికి వెదురు పెంచాలని గత సంవత్సరం అనుకోవడం జరిగింది. నలభై ఎకరాల్లో నాటాము కూడా" అన్నారు.

– ఎలా వుంది?

– మీరోసారి చూసి, ముందు మనమేం చేయాలనేది నిర్ణయించుకుంటే బాగుంటుంది.

– సంవత్సరం గడిచింది కదా ఎలా వుందని మరోసారడిగాను. నాగేశ్వరరావు కాస్త యిబ్బందిపడుతూ "మీరోసారి చూస్తే బాగుంటుంది సార్" అన్నాడు.

– సరే ఎల్లుండి వెళదాం" అన్నాను.

కూనవరం వెళ్లేముందు భద్రాచలం దగ్గర అటవీశాఖ వారి వెదురుతోపులు కన్పించాయి. అవి పెద్దగా బాగున్నట్టనిపించలేదు. వెంటనే అశ్వారావుపేట మండలంలో వినాయకపురం దగ్గర అటవీశాఖ వారి వెదురుతోపులు గుర్తొచ్చాయి. అవి కొంత వరకు ఫరవాలేదు కానీ అంత ఏపుగా పెరగడం లేదు. కూనవరం దగ్గర చూస్తే వెదురు మొక్కలు ఎర్రగానూ పీలగానూ కన్పించాయి. అవీ అక్కడొకటి, అక్కడొకటి కన్పిస్తున్నాయి. ఒక్కో దగ్గర గడ్డిపోచల్లాగా అన్పిస్తున్నాయి.

ఎదురు బొదుగూ లేని వెదుళ్లు చూసిన నాకు వెదురు కోసం అడవితల్లినే నమ్ముకోక తప్పదేమో అనిపించింది.

అంటే వెదురు పెంచితే పెరగదని కాదు గానీ, అంతగా లాభసాటి కాదేమోననే సందేహం నాకు కలిగింది. అయితే కళ్లెదురుగా కనబడుతున్న 200 ఎకరాల భూమిని

చూడగానే ఈ భూమితో యింకేవైనా గిరిజనులకు ప్రయోజనకరమైన పనులు చేయొచ్చు గదా అనిపించింది. వెంటనే బీడి శర్మ ('ప్రశ్నల శర్మ') గారి ఉత్తరమూ, రాష్ట్ర ప్రభుత్వం వారు ఖమ్మం జిల్లా ఐటిడిఎకు మంజూరు చేసిన రెండు ఫారాల ఉత్తర్వులూ గుర్తుకొచ్చాయి.

బీడి శర్మగారి ఉత్తరంలో సారాంశంమేమిటంటే –

"వయసులో ఉన్న గిరిజన దంపతులను గ్రామానికి ఇద్దరు ముగ్గుర్ని ఎంపిక చేసి ఓ 20 జంటల దాకా ఓ ట్రైనింగ్ సెంటర్లో సంవత్సరం రోజులు ఉంచి ఒక్కో జంటకూ రెండున్నర ఎకరాల భూమి యిచ్చి ఆధునిక వ్యవసాయంలో యితర రంగాల్లో, నాయకత్వ లక్షణాలు నేర్పిస్తే వారు తిరిగి వెళ్లి తమ గ్రామానికి నాయకత్వం వహించగలరు. ముందు ముందు సంవత్సరాల్లో వారి వారి గ్రామాల్లో ప్రభుత్వానికి వారే ప్రతినిధులుగా ఉంటారు. అందువల్ల సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియడానికి, అమలు జరపడానికి సులభంగా ఉంటుంది" అని.

ఈ ఆలోచనతో నాకో కొత్త ఉత్సాహమొచ్చింది. అదే మాట ఉద్యానవన శాఖాధికారి మురళీధర రావు గారితో మనం ట్రైనింగ్ ఫారం కూనవరం దగ్గర మొదలుపెడితే ఎలా ఉంటుంది అని. ఆయన వెంటనే "అడవిలో ఫారమా?" అనేశారు. ఒకప్పుడు గరిమెళ్లపాడులోని ఫారం కూడా అడవి మధ్యలోనే ఉండేదని మర్చిపోయి.

ఆయనకి వివరించడానికి కొంత సమయం పట్టింది. అయినా తన సందేహం వీడినట్టు లేదు. యూనిట్ ఆఫీసర్లందరితో ఓ సారి చర్చించితే బాగుంటుందేమో అన్నారు.

కానీ నాకెందుకో ఈ సందేహాలూ, చర్చలూ ముందే మొదలు పెట్టేకన్నా ఆ భూమి దగ్గరకే అందరూ వెళ్లి ఆలోచిస్తే మంచిది గదా అనిపించి కూనవరం బైలుదేరితే దారిలో డ్రైవరు వీరాస్వామి కూడా "అయ్యా, అడవిలో ఫారం బెడతరంట గదా. అడివిలో ఫారమంటే యిబ్బందయితదేమో!" అన్నాడు.

యిదో భేతాళకథ లాగా ఉందే అన్పించింది. ఒకరి సందేహం తీర్చి యింకొంచెం ముందుకు వెళ్లేలోపుల యింకొకరు మళ్లీ 'అడవిలో ఫారమా?' అంటే ఎంత మందికి సమాధానం చెప్పను?

– – –

ఎటొచ్చీ, భూమి మీదకు పోయి మిగతా అధికారులందరికీ భూమికి ఓ చివర ఎత్తుగా ఉన్న టేకుల బోరు, ఇంకో చివర ఉన్న పంట చెరువూ చూపించి వీటి రెండింటి



మధ్యలో ఉన్న భూమిలో ఫారం తయారు చేస్తే అందంగా ఉండదా? పదండి చూద్దాం అన్నాను. మొత్తం భూమి చూసి తిరిగి వచ్చేటప్పటికి ఎవరెవరు కార్యక్రమం ఏ ఏ ప్రాంతంలో చేస్తే బాగుంటుందనే ఆలోచనలో అందరూ మునిగిపోతే –

– 'ఈ ఫారానికి సెంటరెక్కడయితే బాగుంటుంది సార్" అని అడిగాడు నాగేశ్వరరావు.

– "ఏం సెంటరు చూసి కొడతావా అడివి?" అంటూ ఛలోక్తి విసిరారు మురళీధరరావుగారు.

కొంచెం దూరంగా కనిపిస్తున్న పోడు గొట్టిన కొండలు చూపిస్తూ.

– "పోడెందుకు కొట్టగూడదో ఈ ఫారంలో నేర్పించాలి మనం. ఆ కొండ కిందే సెంటరు" అన్నాన్నేను.

కొండకు కట్టెలు మోపించడమెందుకని వెదుళ్ల పెంపకం మొదలుపెడితే అది అడవిలో ఫారమై కూచుంది.

జగ్గారం, పైడిగూడెం, కొత్తూరు,పెదార్కూరు, ఏకవారి గూడెం గ్రామాల్లోని గిరిజనులకు ఫారంలో పని చేయడం గర్వంగానూ, హక్కుగానూ ఉంది.

ఆరు నెలలు తిరిగేసరికి పళ్లచెట్లూ, ఫారం సెంటర్లో పూలతోటలూ, ఓ చివర శిక్షణార్థులకు ఇండ్ల కాలనీ తయారయ్యే సరికి చింతూరు – కూనవరం రోడ్డుపై వెళ్లే వారికి అదో చూడదగ్గ ప్రదేశమైంది.

"మొత్తానికి అడివిలో ఫారం జేసింద్రు సారూ" అంటున్న చుట్టు ప్రక్కల ప్రజలకు–

"యిప్పుడు నాటిన చెట్లన్నీపెరిగి పూలమాల ఆకారంలో ఈ ఫారం కనబడితే, అప్పుడంటారేమో చెప్పండి అడవిలో ఫారమా?" అని అంటున్నాడు నాగేశ్వరరావు.

❖ ❖ ❖

14. పేపరు బోర్డోళ్లు : 'భద్రాచలం పేపర్ బోర్డ్స్' కంపెనీ. ఇది భద్రాచలం దగ్గర సారపాక గ్రామంలో ఉంది. వెదుళ్లతో కాగితం తయారు చేస్తారు యీ కంపెనీవారు. ఖమ్మం జిల్లాలోని అడవుల నుంచి పేపరు బోర్డు వారు లారీల కొద్దీ వెదురు సేకరిస్తుంటారు.

# "ఇద్దరుండాల సారూ"

"సార్, జూన్ యిరవయ్యో తారీఖు మంచిరోజట" అంటూ ఆగిపోయాడు నాగేశ్వరరావు.

– "దేనికి?" అన్నాన్నేను.

– "భూమి పంచడానికి సార్"

– ''అంటే, నేను పైడిగూడెం తప్పకుండా రావాలి అని పరోక్షంగా చెప్తున్నారన్నమాట" అన్నాన్నేను.

– "లేదు సార్, మొన్నటి మేనెల తుఫానుకి నేలంతా తడిసింది. వర్షాకాలం వచ్చేస్తోంది. ట్రైనింగ్ మొదలై అపుడే రెండు వారాలైపోయింది. భూమి పంపకాలు చేస్తే వానలు వచ్చే సమయానికి ఎవరి భూమి వాళ్లు బాగు చేసుకుంటారు."

– "పళ్ల తోటలన్నీ సిద్ధపోయాయి కదా? మల్బరీ తోట కూడా పెరిగింది. మరిక వాళ్లు బాగు చేసుకునేదేమిటి?"

– "వ్యవసాయ భూమి వాళ్లకప్పజెప్పేస్తే అది వాళ్లు బాగు చేసుకుంటారు. పండ్ల తోటలూ, పట్టు పెంపకం మనం దగ్గరుండి వాళ్లకు నేర్పించవలసిన కొత్త కార్యక్రమాలు కాబట్టి అవి పెరిగినా యిబ్బంది లేదు" అంచేత మీరు ఓ సారి పైడిగూడెం వస్తే మీ సమక్షంలో ఆ భూమి పంపకాలు చేస్తే బాగుంటుందని నా కోరిక" అన్నాడు.

– ఏవిటి నాగేశ్వరరావ్, ఆస్తుల పంపకం జేసే తండ్రిలా మాట్లాడుతున్నారే అన్నాన్నేను.

– "వాళ్లనంత దూరం తీసుకువచ్చిన తరువాత వాళ్లకు అన్ని మనమై చూసుకోకపోతే వాళ్లు విసిగిపోయి తిరిగి వెళిపోతారని భయంసార్. ఇలా వెళిపోతే ప్రభుత్వం పైనా, ప్రభుత్వాధికారుపైనా వాళ్లకు నమ్మకం పోతే మనం చేసిన ప్రయత్నం మన ప్రయాస అంతా వ్యర్థమే కదా సార్" అన్నారు.

– "అంటే పూర్తిగా వాళ్ళ మనిషై పోయార్నమాట" అన్నాను.

– "ఏ రోజైతే నన్ను సెక్టోరల్ అధికారి బాధ్యతల నుండి తప్పించారో అప్పటి నుండి నా సమయం, ఆలోచనలు అంతా పైడిగూడెం ఫారం, కొండరెడ్లే సార్"

– "సరే రేపొస్తున్నాను. మీరు వెళ్లండి" అన్నాను. సంతృప్తిగా వెళ్లిపోయాడు నాగేశ్వరరావు(నాగేశ్వరరావు ఐటిడిఎలో పనిచేస్తున్న వ్యవసాయాధికారి)

– – –

భద్రాచలం డివిజన్‌లోని వరరామచంద్రపురం మండలానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న జీడిగుప్పలో 1989 మొదట్లో కొండరెడ్ల కోసం ప్రత్యేకించి ఓ కార్యాలయం ప్రారంభించడం ప్రసాదరెడ్డి ప్రత్యేకాధికారిగా రావడం జరిగింది.

తన కార్యాలయం స్థాపనకు ముందే మూడొంతుల గ్రామాలు తిరిగి, వారితో సంబంధాన్నీ అనుబంధాన్నీ ఏర్పరచుకొని కార్యాలయ ప్రారంభోత్సవానికల్లా కొండరెడ్లు ప్రసాదరెడ్డి కోసం ఎదరు చూస్తే స్థితికి తీసుకొచ్చాడు. యిలాంటి పరిచయం పెంచుకున్న ప్రసాదరెడ్డి కొన్ని ప్రతిపాదనలు చేశాడు.

ప్రతి గ్రామం నుంచీ కొందరు కొండరెడ్డి యువకులను మనం ప్రోత్సహించి వారి గ్రామాల అభివృద్ధిని వారికే అప్పచెప్పితే బాగుంటుందనేది మొదటిది.

ప్రతి గ్రామం నుంచి సాధ్యమైనంత వరకూ ఎక్కువ మంది పిల్లలను చింతూరులో ఉండే కొండరెడ్డి పాఠశాలకు పంపితే అన్ని కొండరెడ్డి గ్రామాల్లోని తల్లితండ్రులకు మా పిల్లలున్నారు గాబట్టి మేమక్కడికి వెళ్లాలి అనే కోరిక కలుగుతుందనేది రెండోది.

కొండరెడ్లకు ఒక ట్రైనింగ్ సెంటర్లాంటిది ఉంటే బాగుంటుందేమో ఆ రకంగా మనం కొండరెడ్లకు ముఖ్యమైన రెండు మూడు చోట్లను తయారు చేయొచ్చనేది మూడోది. దాంతో కొండరెడ్లు పదిమందితో కలవడం అలవాటు చేసుకుంటారు.

అప్పుడు నాకో ఆలోచన వచ్చింది.

అప్పటికే ఐటిడిఎ ద్వారా గిరిజనులందరికీ, మరీ ముఖ్యంగా భద్రాచలం ప్రాంతంలోని గిరిజనుల కోసం ఓ ట్రైనింగ్ సెంటరు లాంటిది ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచనతో పైడిగూడెంలో ఓ మన్యప్రాంత ప్రదర్శనా క్షేత్రం తయారు చేయడం మొదలుపెట్టాం గదా. దాన్నే ప్రస్తుతానికి కొండరెడ్ల శిక్షణా కేంద్రం ఎందుకు చేయకూడదు? అని.

యిక్కడ పైడిగూడెం ఫారం గురించి మీక్కొంచెం చెప్పాలి. ఎందుకంటే ఈ

ఫారమ్‌లోనే మన కథానాయకుడు గంగిరెడ్డి, నాయికలిద్దరూ ఉండేది.

పైడిగూడెం ఫారానికి ఆలోచనా బీజాలు పరోక్షంగా నాటిన వారు శ్రీ బీడి శర్మగారు. ఆయన భారత ప్రభుత్వంలో యస్.సి. అండ్ యస్.టి. కమిషన్‌కి కమీషనరుగా పని చేసి రిటైరైనారు. ఈ ఫారానికి ఓ రూపం యిచ్చిన వారు నాగేశ్వరరావు. ఈయన గురించి చూచాయగా వాడు రెడ్డి వచ్చినాడా?లో చెప్పాను. పైడిగూడెం ఫారానికి ఎంతో కొంత చరిత్ర ఎలా ఉందో, అలాగే కొంత ప్రత్యేకత కూడా ఉంది. ఆ ప్రత్యేకత ఆ ఫారానికుండే లక్ష్యాలవల్ల వచ్చింది.అది అన్ని ఫారాల్లాగే కొన్ని మొక్కలు పెంచడానికీ, కొన్ని మొక్కలు అంటుగట్టి అమ్మడానికి పుట్టిన ఫారం కాదు.

ఈ ఫారంలో కేవలం మొక్కల పెంపకమే కాకుండా, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులూ, పట్టుపరిశ్రమా, చిన్ని చిన్ని చేతివృత్తులు నేర్పుతూ, పొదుపు చెయ్యడమెలా, యింటిని తీర్చిదిద్దుకొవడమెలా లాంటి వాటిల్లో గిరిజన జంటలకు శిక్షణ యివ్వాలని నిర్ణయించబడింది.

'పోడు వ్యవసాయం' మానండి అని ఉదాహరణ పూర్వకంగా చెప్పడం.

'పొదుపు నేర్చుకోండి' 'నాయకత్వ లక్షణాలను పెంచుకోండి' అని చెప్పాలంటే అప్పుడప్పుడూ వచ్చిపోయే శిక్షణార్థులతో అది వీలవదు.

ఇవన్నీ నేర్పించదలుకున్న ఫారం కేవలం మొక్కల పెంపకంతో, అప్పుడుప్పుడూ వచ్చిపోయే ఐదూ, పదిమంది శిక్షణార్థులతో ఉంటే సరిపోదు.

అందుకే ఈ ఫారమ్‌లో కొంతకాలం పాటు ఉండే శిక్షణార్థులు కావాలి. కొండరెడ్లు అయినా, కోయలైనా యిల్లు వదలి, ఊరు వదిలి ఎంతో కాలం ఉండరు. అసలు కొండరెడ్లు కొండ దిగడానికే ఇష్టపడరు. మరి అటువంటప్పుడు వీరిని కొంతకాలం పాటు ఈ ఫారంలో ఉంచాలంటే ఒకే ఒక మార్గముంది. అయినా తమ కుటుంబాలతో సహా ఉండవచ్చు అని చెప్పినంతమాత్రాన కొండరెడ్లనూ, కోయలను ఒప్పించడం చాలా కష్టం. ఒప్పించి వాళ్లను ఫారానికి తీసుకురావడానికి చాలా ఓర్పు కావాలి.చాలా నేర్పు కావాలి. ఎన్నో ఆశలు కల్పించాలి. ఆ ఆశలు సక్రమమైనవి కావాలి. ఎన్నో ఆశయాలు నేర్పించాలి. వారిలో ఉన్న మంచి గుణాలను ప్రస్తుతించాలి. వారి నాయకత్వ లక్షణాలను గుర్తించి మెచ్చుకోవాలి. అందుకే ఈ పనులన్నీ చేయడానికి ఓపికొక్కటి చాలదు. కాస్త నేర్పు ఉన్నవాళ్లు కావాలి.

ఈ పని అరడజను మంది అధికారులకు అప్పజెప్పితే చివరకు ముగ్గురు అధికారులు మాత్రమే చేయగలిగారు. ఈ ముగ్గురు అధికారులు కలిసి ముప్ఫై మంది కొండరెడ్డి కోయ



దంపతులను ఒప్పించగలిగారు.

వచ్చిన మొదటి వారం వరకు కొండరెడ్డి కోయ దంపతుల ధ్యాస పైడిగూడెంలో లేదట. వారి మనుసు ఫారమ్‌లో లేదట. ఎటో చూస్తున్నట్టు ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉండే వాళ్ల చూపులు వాళ్ల వాళ్ల ఊరి దిశగా ఉన్నాయేమో నన్పించిందంట నాగేశ్వరరావుకు.

– " వీళ్లకు మనం ఫారంలో వ్యవసాయ భూమిని సమానంగా పంచి యిచ్చి యిది నీది, యిది నీది అని చూపిస్తే తప్ప వాళ్లలో ఆసక్తి కనిపించేట్లు లేదు సార్" అంటూ వచ్చాడు నాగేశ్వరరావు ఒకసారి.

"అసలు మన ప్రణాళికా, ఆలోచనా అదే కదా! ప్రతి జంటకూ ఓ రెండున్నర ఎకరం వచ్చేట్టుగా చూసి కొలిచి యిచ్చేస్తే యిది నా భూమి యిందులో నేను కష్టపడి పనిచేయాలని అనుకుంటారు" అన్నానేను.

– "కానీ వీళ్లకో అలవాటుంది సార్" అన్నాడు నాగేశ్వరరావు

– " ఏవిటదని ప్రశ్నించాను

– " ఏ చిన్న పనికైనా అందరూ కలిసే బయలుదేరుతారు. ఒక్క మామిడి చెట్టుకింద కలుపు తీయాలన్నా అందరూ బయలు దేరుతారు. ఒక గంట తొవ్వాలంటే యిద్దరు ఆ పని చేస్తూ ఉంటే మిగిలిన అందరూ అలా చూస్తూ ఉంటారు. కలిసి పని చేయాలనేది వాళ్ల అలవాటు. విడివిడిగా ఎవరికి వాళ్లు ఎవరి పనులు వాళ్లు చేసుకోలేకపోతున్నారు.

– "మరి అటువంటప్పుడు మనం భూమి పంచి యిస్తే ఏం లాభం"

– " ఎవరిది వారికి చూపిస్తే అందరూ కలిసి ఒక దగ్గర పనిచేయడం మానుకుంటారేమో"

– " మరి వెంటనే ఆ పని చెయ్యండి" అన్నాను నేను.

– – –

1990 జూన్ నెల 20వ తారీఖు.

పాలవంచ నుంచి ఉదయాన్నే బయలుదేరి పైడిగూడెం వెళదామని నిర్ణయించుకున్నాను కానీ వీలవలేదు. 1990 మే నెలలో ఖమ్మం జిల్లా గిరిజన ప్రాంతంలో రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. ఒకటి మే నెల ఒకటో తారీఖు నుంచి ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి గారు అమలు చేయాలని నిర్ణయించిన ఓ ప్రత్యేక కార్యక్రమం.

రాష్ట్రంలోని 7 గిరిజన జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అందులో ఖమ్మం ఒకటి. దానిపేరు 'ప్రత్యేక మారుమూల ప్రాంత అభివృద్ధి పథకము'.

ఈ కార్యక్రమం వల్ల అంతకుముందు ఉండే తోడు అదనపు భారం తోడయింది.

రెండోది మే నెల 8వ తారీఖున ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన పెనుతుఫాను. దీని తాకిడి ప్రభావంతో సహాయక కార్యక్రమాలు అత్యవసరం అయ్యాయి. ప్రత్యేక కార్యక్రమమైనా కొంత ఆలస్యం చేయొచ్చేమో గానీ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నప్పుడు తాత్సారం చేస్తే గిరిజన ప్రాంతంలో గానీ, ఆ మాటకొస్తే ఏ ప్రాంతంలోనైనా ప్రభుత్వం అస్తిత్వానికి విలువాలేదు, ఉనికీ లేదు.

ఈ రెండు ప్రధానమైన కారణాల వల్ల జూన్ నెలలో ప్రతిరోజూ ఊపిరి సలపనంత పనైపోయింది. ఇటువంటి పరిస్థితుల్లోనే జూన్ నెల ఒకటవ తారీఖున పైడిగూడెంలో కొండరెడ్ల, కోయ దంపతుల శిక్షణా శిబిరం మొదలైంది. దానికి వెళ్లలేకపోయాను. ఈ ఇరవై రోజులుగా పైడిగూడెం వెళ్లాలని గిరిజన దంపతులను పలకరించాలనీ అనుకుంటూనే ఉన్నాను. ఎనిమిది నెలలుగా కష్టపడ్డి ఓ శిక్షణా కేంద్రం తయారు చేసి తీరా శిక్షణ ప్రారంభమయ్యే నాటికి మనం వెళ్లలేకపోయామే అని బాధగా వుంది. అందుకే ఆ రోజు ఖచ్చితంగా వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

బయల్దేరేటప్పటికే మధ్యాహ్నం రెండున్నరయింది. తొలకరి వర్షాలు మొదలయ్యాయని దారిలో కొంతమంది కోయలు భూమి పండుగ[15] సంబరాలు మొదలు పెట్టినట్టుంది. అక్కడక్కడా వాళ్లు జీపును ఆ పేశారు. నేనెవరో వాళ్ళకు తెలుసు కానీ ఏ జీపు అయినా, ఏ వాహనం అయినా కొంత యినాం వాళ్లకు యివ్వందే వెళ్లడానికి లేదు. ఈ పండుగ సంబరాలు జరిగే రోజుల్లో నా జీపును అపకుండా చూడాలని భూషయ్య చాలా ప్రయత్నం చేసాడు.

–" జీపులో ఉన్నావారు పి.వో గారు వారి బండిని మీరాపడమేమిటి?

ఆయన మీ కోసమే కదా పనిచేస్తున్నారు. ఆయన దగ్గర మీరు డబ్బు తీసుకోవడమేమిటి" అనే ధోరణిలో మాట్లాడబోతాడు. అయినా వాళ్లు వినిపించుకోరు.

"మా కోసమే పనిచేస్తున్నరు గామట్టే దొర సంతోసం కొద్ది ఎంతో కొంత డబ్బు యివ్వాలే, మేం సంబరం చేసుకోవాలె" అంటారు వాళ్లు.

వాళ్ళకు డబ్బు య్యివడమనేది ఆ సమయంలో వారికి సంప్రదాయాన్ని, ఆచార వ్యవహారాలను గౌరవించినట్లుగా భావిస్తారు వాళ్లు. మిగిలిన వాహనాలు వెళ్లకుండా



కొయ్యదుంగలు రోడ్డుకు అడ్డంగా వేస్తారట. నాకా పనిచేయలేదు గాబట్టి నేనంటే ఎంతో కొంత గౌరవయుందనుకున్నాను. అదే మాట అన్నాను భూషయ్యతో.

– "వచ్చింది పీ.వో గారని తెలుసయ్యా. కాకుంటే మీ చేతిగుండా కూడా కొంత డబ్బు తీసుకోవాలని వాళ్ల కోరిక భూషయ్య.

రెండు చోట్ల కొంత డబ్బు వాళ్లకిచ్చి పైడిగూడెం చేరేటప్పటికి నాలుగున్నర గంటలైంది. అంటే ఓ అరగంట ఆలస్యమైంది.

ఫారంలో అడుగుపెట్టగానే నమస్కార బాణాలు మొదలయ్యాయి.

ఉద్యోగులవి కావు శిక్షణార్థులవి!

అరె ఎంత మార్పు వీరిలో! ఈ కొద్దికాలంలోనే!! అనుకున్నాన్నేను.

కొత్త వ్యక్తిని చూడగానే స్త్రీలు చాటుకు వెళ్లడం లేదు. కోయగూడెనికి వెళితే స్త్రీలు ముందుకు వచ్చి మాట్లాడ్డం చాలా అరుదు. కానీ, యిక్కడ యిప్పుడు అంత బెరుగ్గా ఉన్నట్లనిపించలేదు.

– నీ పేరేమిటయ్యా? అని ఒక వ్యక్తిని అడిగానున.

– అడివిరెడ్డి

– భార్యతో వచ్చినావా?

– ఆ.... అదో అక్కడ పనిచేసేది నా భార్య

– ఎన్ని రోజులైంది వచ్చి?

– ఇరవై రోజులయింది.

– మంచిగుందా యిక్కడ?

– ఆ.... మంచిగుంది కానీ ఒక్కబిడ్డనే తెచ్చుకోమంటున్నారు. మరి రెండో వాడెక్కడుండాల? ఇంట్లో ఒక్కడుండలేడు గద?

– నిజమే. ఈ విషయాలన్నీ యింకాసేపట్లో మనందరం కలిసి మాట్లాడుకుందాం. అందరు కలిసి ఆ పెంకుటిల్లుందే అందులోకి రావాలె అని చెప్పి ఫారం మొత్తం తిరిగి ఇండ్ల కాలనీ దగ్గరి కొచ్చేసరికి కొంతమంది పర్ణశాలకు బైలుదేరి వెళ్లారని తెలిసింది.

"కొత్తగా వచ్చినాయన ఏదో మాట్లాడుతాడట మనందరితో" అనుకుంటూ

యింకొంతమంది గుంపుగా కాలనీ నుంచి బయల్దేరడం చూశాన్నేను.

ఎన్నో గ్రామాల నుంచి వచ్చిన వీళ్ళు యిక్కడెంతగా కలిసిపోయారో గదా!

వాళ్ళ ఊరి నుంచి బయటకెళ్లి ఒక్కరోజైనా పక్క ఊళ్లో ఉండకుండా వెంటనే తిరిగి వెళ్లిపోవాలని రాత్రికి రాత్రే అడవిలో 10 కి.మీ. నడిచి వెళ్లడానికి సిద్ధమైన కొండరెడ్డిని చూశాన్నేను. మనిషి ప్రకృతిలో భాగమైపోతే భయాలూ బాధలూ లేవేమో! ఇరవై రోజులలో వీరి ధృక్పథంలో ఒక కొత్త మార్పు స్పష్టంగా కన్పిస్తోంది.

కొత్తలో సరదా అన్పించి యిలా ఉంటారేమో!

పర్ణశాలలో స్త్రీలంతా ఓవైపు, పురుషులంతా ఓవైపు కూర్చున్నారు.

ఈ ట్రైనింగు దంపతులకు యిచ్చేది కాబట్టి ఒక్కో జంటను విడివిడిగా చూడాలని, కాస్త బెరుగ్గా ఉండే స్త్రీలను కూడా వారి భర్తలతో సహా కూర్చోబెట్టి యిద్దరి అభిప్రాయాలు కనుక్కోవాలని నా ఉద్దేశం.

జంటలు జంటలుగా కూర్చోబెట్టడానికి నాగేశ్వరరావుకు కొంచెం సమయం పట్టింది. నాకు దగ్గర్లో కూచున్న జంటలో భర్తనడిగాను.

– మీపేరు?

–భూమిరెడ్డి

–ఊరు?

–బాయిబొక్క

యిలా అడుగుతూ ఉండగా మంచి వయస్సులో ఉన్న ఇద్దరు అమ్మాయిల ప్రక్కన కూర్చొన్న ఓ యువకుడి వంతు వచ్చింది. దంపతులు కూర్చోవడంలో బహుళా యింకొకరి భార్య యితని భార్య ప్రక్కన కూర్చోందేమో అనుకుని సరే తెలుసకుందామని అడిగాను.

– మీపేరు?

– సొందల గంగిరెడ్డి

– భార్య పేరు?

– పెద్ద దానిదా? చిన్నదానిదా?

– అంటే యిద్దరున్నారా?



–అవు సారూ!

–అంటే నీవు వాళ్లిద్దర్నీ పెళ్లి చేసుకున్నావా?

– అవును.

– ఇద్దర్ని చేసుకోకూడదని చట్టముంది. తెలుసా? అన్నాను కొంచెం తెచ్చిపెట్టుకున్న కోపంతో నిజానికి నాకు అతని అమాయకత్వానికీ, ధైర్యానికి ఆశ్చర్యం కలిగింది.

– "తెలవదు. అయినా యిద్దరుంటే తప్పా? ఇద్దరుండాల సారు. పతివాడికి యిద్దరుండాల. ఊరు బయలు ఎల్లినప్పుడు ఎంట ఉండే దానికొకరు. యిల్లు జూసుకొనేదానికొకరు"

– "మరి నువ్వు బైలు ఎల్లినవు కద. వెంట ఒకరే గద ఉండాల. ఇల్లు చూసుకోవడానికి ఒకరుండాలి గదా. యిద్దరూ యిక్కడికెందుకొచ్చినారు?

– "ఒక్కర్నే తేవాలని చెప్పలేదు గదా"

– " అంటే ప్రతి ఒక్కరికీ యిద్దరు భార్యలుంటరనుకొంటె గదా ఒక్కర్నే తీసుకురమ్మని చెప్పాలని తెలిసేది"

– " నేనట్లనుకోలె సారూ!

– "నువు అనుకోవు గంగిరెడ్డి. అందరికీ యిద్దరుంటారని మేమూ అనుకోలేదు" అన్నాడు నాగేశ్వరరావు నవ్వుతూ.

నాగరికులమని చెప్పుకునే మన పద్ధతులూ, కట్టుబాట్లూ, ఆచార వ్యవహారాలూ వాటిని సమర్థిస్తూ ఒక్కోసారి మన మనస్సుకు తప్పు చేస్తున్నామని తెలిసినా సంఘం కోసం, సంఘం మెప్పుకోసం తప్పులనే ఘనంగా సమర్థించుకొనే మనకూ, చేసే ప్రతి పనిలో ప్రయోజనమేంటో సహజంగా చూపించగలిగే అనాగరికులని చెప్పబడే ఈ సహజమైన మానవులకూ ఎన్ని తరాల తేడా యోచనల్లో? వ్యక్తీకరణల్లో? ఎంత మామూలుగా చెప్పడితను ఇద్దరుండాల సారూ అని.

అయినా కొండల వెంట తిరిగి, ఊరికి మూడుసార్లు వెళ్లినా సందేహంగా, నిర్వేదంగా చూసి ఒకసారి పైడిగూడెం రండి చూద్దురు గాని అంటే చూసి తిరిగివెళ్లిపోయి శిక్షణ ప్రారంభమయ్యే నాటికి రమ్మంటే రావడానికి అంతగా సుముఖత చూపించని ఈ అమాయక నం ఈ బెరుకు చూపుల జనంలో ఒకడైన గంగిరెడ్డి ఈ రోజు యింత స్వేచ్ఛగా, యింత స్వతంత్ర్యంగా మాట్లాడగలుగుతున్నాడంటే, తన భావాలను స్పష్టం

చేయగలుగుతున్నాడంటే ఈ మార్పు మా ట్రైనింగ్ ప్రభావమా?

ఎంతో కొంత చురుకుదనం ఉన్న వాళ్లూ ధైర్యం, నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని ఎంపిక చేయాలని చెప్పగానే, అలాగే ప్రయత్నిస్తామని చెప్పి అటువంటి వాళ్ళను ఎంపిక చేసిన అధికారుల ప్రయత్న ఫలితమా? అని ఆలోచిస్తూ–

"గంగిరెడ్డీ నువ్వన్నమాట నేను మా యింట్లో అంటే బయలు ఎల్లేటప్పుడు వెంట వచ్చేది లేదు సరిగదా నేను యింటో ఉండడానిక్కూడా ఒప్పుకోరయ్యా" అన్నాను జీపు ఎక్కుతూ నవ్వు నణిచిపెట్టుకుని.

అయినా యిందులో అంత చేయగూడని పనేమిటి? అనే ధోరణిలో...... ఈ సదువుకున్న వాళ్ల ఆలోచనలూ, పద్ధతులూ వేరే ...... వాటిని మనమెందుకు పట్టించుకోవడమనే ధోరణిలో.....

మనం చేసింది తప్పా? అయితే ఈ సారు యిది తప్పు అని ఖచ్చితంగా చెప్పలేదేం? దండించలేదేం? అనే ధోరణిలోనూ..... ఆలోచిస్తూ అలా నిలబడిపోయాడు గంగిరెడ్డి.

మనిషిని మనిషి వంచించనంతవరకూ, మనిషిని మనిషి హింసించనంత వరకూ ఏ ఆచారమూ, ఏ నమ్మికా తప్పు కాదేమో!

ఒక జాతి నమ్మకాలు, ఆచారాలు తప్పు, ఒప్పు అని చెప్పడానికి మనమెవరం? తప్పు కాదని తెలిసీ ఒక ఒప్పు చేయడానికి మనకెంత సంకోచం!

నిజాలను ఒప్పుకోడానికి మనకెంత భయం!!

కానీ ప్రతి మగవాడికీ ఇద్దరు భార్యలుండటం ఒప్పని నా ఉద్దేశం కాదనుకోండి

❖ ❖ ❖

15. భూమి పండుగ : కోయతెగకు ప్రధానమైన పండుగ. తొలకరి వానలు మొదలుకాగానే భూమిని పూజిస్తూ కోయలందరు సంబరం చేసుకుంటారు. వ్యవసాయం చేసే కాలం మొదలయిందనే దానికి సూచనగా ఈ పండగ చేస్తారు. ఈ రోజు పురుషులందరూ వేటకి వెళ్లి అడవి జంతువులను వేటాడి తెస్తారు. తెగ మొత్తం కలిసికట్టుగా భోజనం చేస్తారు.



# ప్రొఫెసర్ హేమండార్ఫ్

ఆ రోజు 1989 జనవరి పదో తేదీ అనుకుంటాను

మా కలెక్టరు కృష్ణారావు గారు ఫోన్ చేసి 'హేమండార్ఫ్ గారు పన్నెండో తారీఖు ఖమ్మం జిల్లా వస్తున్నారట. పదమూడో తారీఖున గిరిజన ప్రాంతాలు చూస్తారట. దాని కోసం ఏర్పాటు చేయండి. నేను కూడా వస్తాను" అని చెప్పారు.

ప్రొఫెసరు గారు వస్తున్నారనగానే చాలా సంతోషమూ, భయమూ కలిగాయి. వారు అదిలాబాద్ జిల్లా దాదాపు ప్రతి ఏడూ వెళతారు. ఖమ్మం జిల్లాకు రావడం బహుశా నలభై ఐదేండ్ల తరువాత యిదే మొదటిసారేమో!

ఈ మధ్యకాలంలో జరిగిందేవిటో చూసి ఆయన మెచ్చుకుంటారో, నొచ్చుకుంటారోనని సందేహం.

ఈ నలభై సంవత్సరాల్లో జరిగిందానికి ఏ ఒక్కరూ బాధ్యులు కాకపోయినా ఆ సమయంలో ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం నియమించబడిన అధికారిగా నాకు బెరుగ్గా ఉంది. ఐనా గిరిజన ప్రాంతాల అధ్యయనంలో తలపండిన ఆ మహనీయుడు ఖమ్మం జిల్లాకు వస్తున్నారంటే ఆ సమయంలో నేను కూడా ఉండగలిగినందుకు సంతోషంగా ఉంది. అందుకే మళ్లీ ఆయన మధ్యలో మనసు మార్చుకుంటారేమోననే భయంతో హైదరాబాదు వెళ్లైనా తీసుకురావడానికి సిద్ధమయ్యాన్నేను.

ప్రతి శీతాకాలం ప్రొఫెసరు గారు భారతదేశం వస్తారు. వారు గతంలో పనిచేసిన ప్రాంతాలైన ఆదిలాబాదు, ఈశాన్య భారతదేశం పర్యటించి వస్తూ వుంటారు.

ప్రొఫెసరు గారి పూర్తి పేరు క్రిష్టొఫ్‌వన్ ఫెరర్ హేమండార్ఫ్ ఆస్ట్రియా దేశంలో వియన్నా వంటి నగరంలో సంపన్న కుటుంబంలో పుట్టిన హేమండార్ఫ్ గారు భారతదేశంలోని అదిమ జాతుల మధ్య వారి జీవన విధానాన్ని చదవాలనుకోవడం చిత్రంగా జరిగింది.

"లా" లో పట్టా పుచ్చుకొని, నిక్షేపంగా బతుకుతెరువు సంపాదించుకోగల అవకాశం

ఉన్నా ఆంత్రోపాలజీ చదవాలనుకున్నారట హేమండార్ఫ్ గారు.

'థెరసియానం' చివరి సంవత్సరంలో 'మతం' ఓ విషయంగా చదువు తున్నపుడు తన గురువు ఐరోపా ఖండానికి చెందని మతాలు అధ్యయనం చెయ్యమని ప్రోత్సహించాడట.

అందుకే హేమండార్ఫ్ గారు తన సిద్ధాంత వ్యాసం కోసం "అదిమ జాతుల మతాలు" ఎంచుకున్నారట. యిందు కోసం పరిశోధన అవసరం అయింది.

అయితే 1930లోని యూరపులోని ఆర్థిక వ్యవస్థ ఆయనకా అవకాశాన్ని యివ్వలేకపోయింది. అయినా అమెరికా రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ వారి పుణ్యమా అని భారతదేశం రావడానికి వీలయింది. అప్పటికి వారి పరిచయం భారతదేశాన్ని పరిపాలిస్తున్న కొంతమంది ఆంగ్లేయులతోనే. అందుకే నాగాహిల్స్ కలెక్టరుగా ఉన్న జె.పి. మిల్స్ ఆయన్ని ఈశాన్య భారతదేశం రమ్మన్నారు. వైస్‌రాయ్‌గా ఉన్న లిన్‌లిత్‌గో సిమ్లాకు ఆహ్వానించారు.

1938లో బెట్టీతో పెళ్లయి కొన్నాళ్లు సరదాగా వియన్నాలో కాలం గడుపు దామనుకున్న హేమండార్ఫ్ దంపతులకు అప్పటి రాజకీయ పరిస్థితులు అనుకూలించలేదు. అప్పుడే హిట్లరు ఆస్ట్రియాను వశం చేసుకోవడం జరిగింది.

అల్లకల్లోలంగా ఉన్న పరిస్థితుల్లో వేరే చోటికి వెళితే మంచిదనుకునే సమయంలో భారతదేశానికే వెళ్లి ఆదివాసుల మధ్య పరిశోధనలు సాగిస్తే సరిపోతుంది కదా అనిపించిందట. వియన్నా నుంచి బయల్దేరి బొంబాయి చేరుకోగానే రెండో ప్రపంచ యుద్ధం రావడంతో అస్సాం వెళ్లి నాగా జాతుల మీద చేయవలసిన పరిశోధన కాస్తా కొన్నాళ్లు వెకబడిపోయి, నిజాం రాజ్యంలోని ఆదివాసి ప్రాంతాలు చూసి, పరిశోధించే అవకాశం లభించింది. నిజామ్‌కు ఆర్థిక, గృహ మంత్రిగా ఉన్న సర్ థియొడర్ టస్కర్‌తో పరిచయం యిందుకు ఎంతో ఉపకరించిందట.

యూరప్‌లో యుద్ధం జరుగుతున్నన్ని రోజులూ హేమండార్ఫ్ దంపతులు నిజాం రాజ్యంలోని ఆదిసువాల జీవన విధానాన్ని చదవడంలో గడిపారు, ఆ రోజుల్లోనే యిప్పటి కర్నాటక రాష్ట్రంలోని రాయచూరు దాకా టస్కర్ దంపతులతో హేమండార్ఫ్ దంపతులు వెళ్లడం జరిగింది.

ఇటువంటి పరిశోధన నల్లమల కొండల్లో ఉండే అతి పురాతనమైన జాతి చెంచులతో మొదలైంది. ఈ పరిశోధన సాగిన తొమ్మిది నెలల కాలంలో దుంపలు, కందమూలాలు



తినడానికి అలవాటు పడిన హేమండార్ఫ్ దంపతులకు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు టస్కర్[16] దంపతులు మంచి విందు యిస్తే దాన్ని అరిగించుకోవడానికి ఓ రెండు వారాలు పట్టిందట.

చెంచుల దేశంలో కొంత కాలం గడిపాక వారి గురించిన అనుభవాలను గ్రంథస్థం చేయాలనుకొని, సభ్య ప్రపంచానికి కొంచెం దూరంగా, అంతగా బాదర బందీ ఉండని చోటుకు వెళ్లాలనుకొంటే, టస్కర్ దంపతులు పాలవంచ ప్రాంతాన్ని సూచించారట. ఇలా జరిగింది. ప్రొఫెసర్‌గారు మొదట పాలవంచ, ఖమ్మం గిరిజన ప్రాంతం రావడం. 1940 సం॥ మొత్తం యిక్కడే గడిచిపోయింది. ఆ రోజుల నాటి అనుభవాలే "ది రెడ్డీస్ ఆఫ్ ది బైసన్ హిల్స్–ఎ స్టడీ ఇన్ ఎకల్చరేషన్" పేరుతో ప్రచురితమయ్యాయి.

ఈసారి అలవాటుగా వెళ్లే ఆదిలాబాద్, ఈశాన్య భారతదేశం కాకుండా ఖమ్మం జిల్లా పర్యటించాలనుకోవడానికి కారణం సరిగ్గా తెలీదు. బహుశా ఆదిలాబాద్ కలెక్టరుగా గిరిజనుల కోసం తన వంతు సేవ చేసిన సి.వి.యస్.కె. శర్మగారు అప్పుడు కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కార్యాలయంలో పని చేస్తున్నారు గాబట్టి వారిద్దరికున్న పరిచయంవల్ల ప్రొఫెసరుగారు ఖమ్మం జిల్లా రావాలని అనుకొని ఉండొచ్చు.

ఖమ్మం జిల్లాలో కూడా వారి జ్ఞాపకాలు చాలానే ఉన్నాయి. వాటిల్లో సుదిమళ్లలోని ట్రైనింగ్ స్కూలు ఒకటి. ఆ జ్ఞాపకాలను తిరగవేసుకోవడంలో ఏ కొంచెం సమయం కూడా వృథా చెయ్యదలచుకున్నట్టు లేదాయన. పాలవంచ చేరకుండానే దారిలో ఉన్న సుదిమళ్లలో ఆగుదామన్నారు. హైదరాబాద్ నుంచి ఏకబిగిన నాలుగ్గంటల ప్రయాణం ఆయన ఉత్సాహాన్ని ఏ మాత్రం తగ్గించలేదు.

ఇన్నేళ్ల తర్వాత కూడా సుదిమళ్ల అదే స్థితిలో ఉందన్నారాయన.

అప్పుడు వారు కొండపైన స్థాపించిన ట్రైనింగ్ స్కూలు యిప్పుడు లేదు. కొండ మీద బోసిగా ఉంది. గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ సుదిమళ్ల వీధుల్లో అలా నెమ్మదిగా తిరుగుతూ ఉండగా గ్రామస్తులు చిన్నా, పెద్దా, ఆడా, మగా బయటికొచ్చారు. వారిలో ఓ ముసలమ్మ ప్రొఫెసర్‌గార్ని పోల్చుకోవడానికి ప్రయత్నం చేస్తూ...

"నలభై, యాభై ఏండ్ల కిందట ఈయన లాగనే ఒక దొరొచ్చిండు. దొరసానమ్మ కూడా ఉండె. మరి యీ దొరపేరేంది? అంది.

అప్పుడొచ్చిన దొరే యీ దొర' అన్నారు పక్కనే ఉన్న సి.వి.యస్.కె. శర్మగారు.

"మరి దొరసానమ్మ ఏది? ఎప్పుడు యిద్దరు కలిసి తిరుగుతుండేవాళ్లుగదా"

మేమందరం మౌనంగా ఉండిపోయాం.

ప్రొఫెసరుగారికి ఆ విషయాన్ని పొడిగించటం బాధాకరంగా తోచినట్లుంది. సుడిమళ్ల బాగోగుల గురించి అడిగారు ఆ ముసలమ్మను.

"ఆ... అప్పుడేదో మీరు కొంచెం జేసింద్రు. యిప్పుడా బడి లేదు. యింకొక చిన్న పిల్లల బడి పెట్టింద్రు. మండలమై తరువాత యిక్కడున్న ఆఫీసు కూడా యిల్లంచుకుబోయె. సుదిమళ్ల బోసిబోయె..." అంది. అది విని బాధపడ్డారేమో వారు మౌనంగా వుండిపోయారు. సుదిమళ్ల గురించి మాట్లాడుకుంటూ పాలవంచ బైల్దేరాం.

అదే రోజు మధ్యాహ్నం భద్రాచలం ప్రాంతంలోని ఓ గ్రామం చూద్దామన్నారు. ఉన్న కాస్త సమయంలో వీలైనన్ని ఎక్కువ ప్రదేశాలు చూడాలని వారి కోరిక మేరకు భద్రాచలం దగ్గరే ఉండే చింతగుప్ప చూశాం.

పూర్తిగాకోయలుండే గ్రామమది. భద్రాచలానికి అంత దగ్గర్లో, యింకా పూర్తి కోయ గ్రామమున్నందుకు ఆశ్చర్యం వెల్లడించారాయన. పదమూడో తారీఖు గిరిజన గ్రామాలుచూడ్డానికి నేను కూడా వస్తానని శర్మగారు చెప్పారు. కానీ అనుకోకుండా కృష్ణారావుగారికి, శర్మగారికి యిద్దరికీ వీలవలేదు ప్రొఫెసరుగారి వెంట రావడానికి.

నాకెందుకో పరీక్షకు వెళ్ళినట్టు అనిపించింది. ఈ ప్రాంతాలు తిరిగి గిరిజనుల స్థితిగతులను అవుపోసన పట్టిన హేమండార్ఫ్ ఎటువంటి ప్రశ్నలు అడుగుతారో, నేనేం సమాధానం చెప్పగలుగుతానో అనే ఆలోచన కొంచెం ఆందోళన గలిగించింది.

చివరికి అనిపించిందేమిటంటే ఆయనతో నేనే ఎక్కువ మాట్లాడేనేమోనని!

చాలా చిన్న చిన్న ప్రశ్నలు అడిగారాయన. వాటికి సమాధానాలు చాలా పెద్దవిగా ఉంటాయి. కానీ సంతృప్తిని కలిగించకపోవచ్చు. ఎందుకంటే గిరిజన సమస్యలకు మనం సంతృప్తికరమైన సమాధానాలు యివ్వలేకపోతున్నాం. సంతృప్తికరమైన సమాధానాలు లేవని ఆయనకూ తెలుసు.

ఆయన ప్రశ్న దాదాపు స్వగతం లాంటివి. కాకుంటే ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతాలలో ఏమైనా కొంచెం మంచి మార్పుందేమో తెలుసుకుందామనే ఆశ కాబోలు; ఆ



స్వగతాలే కొంచెం పెద్దగా పక్కవారితో అంటారు. వాటిని ప్రశ్నలనుకొని మనం సమాధానం చెప్పబోతాం. ఆయన విని మౌనంగా ఉంటారు.

మరుసటి రోజు పాలవంచ నుంచి సరాసరి కోయిదా వెళ్లి, అక్కడి నుండి తిరిగివస్తూ దారిలో ఉండే గ్రామాలు చూస్తూ రావాలని వారి కోరిక. పాలవంచ నుంచి కోయిదా వెళ్లడమంటే అంత సులభమేమీ కాదు. పాలవంచ నుండి వేలేరుపాడు గ్రామం చేరడమే చాలా కష్టం. వేలేరుపాడు మండల కేంద్రమైనా వేలేరుపాడుకు సరైన రోడ్డు లేదు. కుకునూరు దాకా మంచి రోడ్డుంది. అక్కడ్నుంచి వేలేరుపాడుకు బండ్లబాట వెంట వాగులు దాటుకుంటూ అలా అలా అనిశ్చితంగా వెళ్లవలసిందే. మంచి వేసవిలో మాత్రం బస్సు వేలేరుపాడు దాకా వెళుతుంది. వేలేరుపాడు, కుకునూరు మధ్య పంచాయితీ రాజ్ శాఖవారు రోడ్డు వేస్తున్నారు కానీ వంతెనలు పూర్తి కాలేదు. వేలేరుపాడు, చిగురు మామిడి మధ్య ఐటిడిఎ వారప్పుడే మొదలుపెట్టిన రోడ్డు వాగులున్న చోట కొట్టుకుపోయింది.

ఖమ్మం జల్లా గిరిజన ప్రాంతంలో వర్షాకాలం ప్రభావం వేలేరుపాడు మండలంలో కనీసం జనవరి చివరిదాకా ఉంటుంది.

ఆ రకంగా అంటే దారులన్నీ అస్తవ్యస్తమయిపోయి ఏ గ్రామం చేరాలన్నా చాలా కష్టపడవలసి ఉంటుంది.

ఇటువంటి మార్గంలో కోయిదా దాకా వెళ్లడం అంటే ప్రయాణాన్ని కావాలని యిబ్బందులపాలు చేసుకోవడమే. కాని వారి కోరిక కాదనడానికి నాకు మనస్కరించలేదు.

దానికో రెండు కారణాలున్నాయి.

ఖమ్మం జిల్లాలో గతంలో వారు పని చేసిన ప్రాంతం వేలేరుపాడు మండలంలో ఉంది. అందునా అప్పుడు వారు మకాం చేసిన చోటు కోయిదా. అటువంటి కోయిదా చూస్తానని వారంటే వీలవదని చెప్పడమెలా? ఈ జీపులు, వాహనాలు లేని రోజుల్లో ఆదిలాబాద్ నుంచి పాలవంచ వరకు కాలినడకన నెలల తరబడి భార్యతో సహా ప్రయాణం చేసిన వారాయన.

యిక రెండో కారణం : గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల ప్రభావం ఎలా వుంటుందో చూడాలంటే వేలేరుపాడు మండలంలోని గ్రామాలు చూడాలి. ఎక్కువ భాగం కొండరెడ్డి గ్రామాలు వేలేరుపాడు మండలంలో ఉన్నాయి. ప్రొఫెసర్‌గారు "ది రెడ్డీస్ ఆఫ్ ది

బైసన్ హిల్స్" అనే పుస్తకం రాసింది ఈ ప్రాంతాల్లోని కొండరెడ్ల గురించీ, వారి గ్రామాల గురించీ.

ఈ ఏభై ఏండ్లలో వచ్చిన మార్పులేమిటో వారు కళ్లారా చూడాలనుకుంటూ ఉంటే కాదనడమెలా? అయితే వారి వయసు గుర్తుకు రావడంతో కొంచెం సందేహమొచ్చింది. అదే చూచాయిగా అన్నాను. కానీ ఆయన మనసు మార్చుకోలేదు.

గత అనుభవాల బంధమలాంటిది.

సంతోషకరమైన మార్పులు, చేర్పులూ తెలిసినా ఆయనకు అక్కడి వాళ్లనూ, పరిచయమైన చోటిని చూడాలని ఎంత తపన!

ఉదయం తొమ్మిదింటికి జీపులో బయల్దేరాం. దాని అసలు బాగా లేదు.

కుకునూరు నుంచి వేలేరుపాడు చేరేటప్పటికి ఒంటి గంట కావస్తోంది.

అంటే కేవలం 60 కి.మీ. ప్రయాణానికి మూడు గంటలపైన పట్టింది. ముందు ముందు ప్రయాణం యింకా దారుణంగా ఉంటుంది. పెద్ద పెద్ద వాగులు దాటవలసి వుంటుంది. ఎండ తీవ్రంగా ఉందారోజు. కెమెరాతో ప్రొఫెసర్‌గారు సిద్ధంగా ఉన్నారు. చిగురు మామిడి దాటినప్పటి నుంచి ఫొటోలు తీసుకోవాలనే ఉత్సాహం చూపించారు. దూరం నుంచే పోడుకొట్టిన కొండలు ఫొటో తీయాలని రెండు మూడుసార్లు జీపు ఆపి ఫొటోలు తీసుకొంటూ ప్రయాణం చేసి కటుకూరు చేరేటప్పటికి రెండు గంటలైంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. కటుకూరు వద్ద గుబురు చింతలు చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లైంది. "ఇక్కడ నుంచి యింకా ముందుకు వెళితే యిక ఆలస్యమౌతుందేమో కదా.

ఈ దారి చూస్తే చీకటి పడితే వెళ్లడం చాలా కష్టమనిపిస్తుంది. ఈ రోజు ప్రయాణం కటుకూరుతో ఆపేద్దామా?" అన్నారు ప్రొఫెసరుగారు.

అప్పటికింకా నేనుకోయిదా చూళ్లేదు గాబట్టి, ఎండ తీవ్రంగా ఉన్నా, కోయిదా దాకా వెళితే బాగుండుననిపించింది.

జీపులో కోయిదాలో వారి అనుభవాలను గురించీ, పేరంటపల్లి స్వామీజీ[17] గురించీ, కిసునూరు కొండరెడ్ల గురించి ఆయన చెప్పగా కోయిదా చూడాలనే కోరిక నాలో పెరిగిపోయింది. గోదావరి ఒడ్డున ఉన్న యీ గ్రామాలు చూస్తేగానీ వాటి ప్రత్యేకత అర్థం కాదు. కొల్లూరు దగ్గర పాపికొండల నడుమ గోదారి అందాలు చూడవలసిందే. నిజాం



పరిపాలనలో గిరిజన సంక్షేమం కోసం నియమింపబడిన హేమండార్ఫ్‌గారు కోయిదాలో మకాం పెట్టి, అక్కడో చౌకడిపో తెరిచి, తన కార్యస్థానంగా కొన్నాళ్లపాటు కోయిదానే చేసుకున్నారట.

ఆనాడు కూడా వెదురుకొట్టడమే ప్రధానమైన వృత్తిగా ఉండేదట కోయిదా చుట్టుపక్క కొండరెడ్లకు.

వెదురుకొట్టి సంపాదించుకున్న డబ్బులతో కోయిదాలోని చౌకడిపోలో కోయలు కొండరెడ్లు దిన వెచ్చాలు కొనేవారట.

ఇక్కడ ఆగిపోదాం అనగానే కాస్త ఆనాసక్తిగా తలూపాన్నేను.

"మీరు పని చేసిన రోజులనాటి మనుషులెవరయినా యీ ఊళ్లో ఉంటారేమో! వాళ్లను కలుసుకుంటే బాగుంటుంది కదా" అన్నాను. ఆయన ఆనందాన్ని వర్ణించడం కష్టం.

ఎదురుగా వస్తున్న యాట్లకన్నం రెడ్డిని పిలిచి వచ్చిందెవరో చెప్పాను. ఊళ్లోని పెద్దలకుకబురు పంపాడు కన్నంరెడ్డి.

మంచినీళ్లు తాగుతూ చింతచెట్ల కింద మంచం మీద కూర్చున్నాం.

హేమండార్ఫ్‌గారి కళ్లు తెలిసిన ప్రదేశంలో తెలిసిన వ్యక్తులకోసం వెదుకుతున్నాను.

కానీ యీ కుగ్రామంలో యిన్నేళ్ల తరువాత ఎవర్నైనా ఎలా గుర్తు పడతారీయన అని ఉత్కంఠతో చూస్తున్నామంతా. పిల్లల అరుపుల మధ్య యువజంటల హెచ్చరింపుల మధ్య ఊళ్లో కల్లా చాలా పెద్ద వాడని జుట్టూ, కొంచెం వంగిన నడుమూ, చేతి కర్రతో నల్లగా, సన్నగా ఉన్న ఒకాయనను తీసుకువచ్చారు.

కన్నంరెడ్డి లాంటియువకులకు తమ ఊళ్లో దొరలకాలం నాటి పెద్ద ఒకడున్నాడని గర్వంగా ఉంది. అయితే ఆ పెద్ద మనిషికి చూపు ఆనుతున్నట్టు లేదు. నిదానించి చూస్తూ మా దగ్గర కొచ్చాడు.(ఇంతమంది మనుషులూ, సందడీ చూసి తను గతంలకోకి వెళ్లినట్లున్నాడు.)

– మీ పేరేమిటి? అడిగాను నేను.

– 'లచ్చిరెడ్డి'

– ఇక్కడికి వచ్చిన ఆయన్ను ఎరుగుదువా?

– 'ఎవరాయన'?

హేమండార్ఫ్ దొరగారన్నాను

"యిప్పటి మాటా? మా చిన్నప్పటి సంగతి. దొరసానమ్మతో గలిసి యీ ఊళ్లన్నీ తిరిగినారుకదా. కోయిదాలో బడిపెట్టినారు. మరి ఒక్కడే వచ్చిండా యిప్పుడు? దొరసానమ్మ రాల?" అనడిగాడు లచ్చిరెడ్డి. ప్రొఫెసరు గారు మౌనంగా ఉండిపోయారు.

ఆ మౌనం లోతు మనకందనిది.

యింకొంచెం సేపట్లో ఓ ముసలమ్మ వచ్చింది. ఆమె ప్రొఫెసర్ గార్ని చూడలేదటగానీ, ఒకదొర దొరసానమ్మను వెంటబెట్టుకొని ఈ ఊర్లంబడి తిరుగేవాడని విన్నదట. వాల్లది యీ దేశం గాదనీ, చానా దూరమనీ, యిక్కడ కోయిలను కొండరెడ్లలను చూద్దామని వచ్చినారని విన్నదట. ఆమె అడిగిన ఒకే ప్రశ్న.

–"దొరసానమ్మ రాలేదా" అని

ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం మాకే కష్టంగా ఉంది. యిక ప్రొఫెసరు గారి నుంచి సమాధానం కోసం మేం ఎదురుచూడలేదు.

ప్రొఫెసర్‌గారి శ్రీమతి ఎలిజెబెత్, ప్రొఫెసరుగారి ప్రియమైన బెట్టీ ఆ మధ్యనే ఈ లోకం విడిచి వెళ్లిపోయింది.

1932లో లండన్లో ఓ పార్టీలో భారతదేశాన్ని గురించిన చర్చలో మహాత్మాగాంధీ మీద అంతగా సదభిప్రాయం లేని బెట్టీతో సుదీర్ఘమైన వాగ్వివాదంతో మొదలైన పరిచయం 1938లో పరిణయం దాకా వచ్చి 50 సంవత్సరాలు జీవిత భాగస్వామినిగా, సహధర్మచారిణీగా కొండలూ, గుట్టలు భర్తతో సాటిదే లోకంగా తిరిగి, భర్త ఆసక్తుల్లోనే తనూ ఆసక్తి పెంచుకొని వివాహ జీవితంలో సగభాగానికిపైగా భారతదేశంలోని ఆదివాస ప్రాంతాల్లో గడపడానికి మనసా వాచా, కర్మణా సుముఖత చూపించిన ఎలిజెబెతమ్మ 1987లో ప్రొఫెసరుగార్ని వదలివెళ్లిపోయింది.

ఇన్నేళ్ళ తరువాత తన రోజులనాటి వ్యక్తులను చూడగలిగినందుకు ఆయన కళ్లలో ఉబికిన ఆనంద భాష్పాలు, బెట్టీ జ్ఞాపకాలతో విషాదాశృవులుగా మారి అంతలోనే కళ్లలోనే



యింకిపోయాయేమో! ఎక్కడికి వెళ్ళినా దొరసానమ్మను గురించి అడగని గిరిజనులు లేరు. చనిపోయేనాటి సాయంత్రం దాకా హైదరాబాదులో "గిరిజనుల సమస్యల" మీద సెమినారులో పాల్గొందంటే గిరిజనుల మీద ఆమెక్కు అభిమానమెంతటితో తెలుస్తుంది. అందుకే ఏభై ఏండ్ల తరవాత కూడా గిరిజనులు ఆమెను గురించి అడిగేది. ఆమె చనిపోవడానికి ముందే రంపచోడవరం దారిన పేరంటపల్లి దాకా వచ్చి వెళ్ళారు హేమండార్ఫ్ దంపతులు. అప్పుడు కోయిదా, కటుకూరు రాలేకపోయారట.

లచ్చిరెడ్డితో మాట్లాడ్డం మొదలు పెట్టారాయన.

యీ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లు తిరిగినా ఈ ప్రాంతపు భాష అయిన తెలుగు కానీ, కోయ భాషగానీ అంతగా పరిచయం ఉన్నట్టు లేదు ప్రొఫెసరుగారికి. ఆ వచ్చీరాని భాషలో మాట్లాడ్డానికి ప్రయత్నం చెయ్యలేదాయన. నేనే దుబాసీగా పనిచేశాను.

ప్రొఫెసరుగారు, లచ్చిరెడ్డి, ముసటమ్మగారి గతానుభవాలతో ఓ గంట గడిచిపోయింది. గ్రామం మొత్తం చింతల కింద చేరింది. ఏదో తన్మయత్వం!

వెంటనే మళ్లీ నాలుగు గంటల ప్రయాణం గుర్తొచ్చి తప్పని సరై గుర్తుచేశాను. సమయం మూడు కావస్తున్నదని అయిష్టంగానే లేచారాయన. తిరిగి పాలవంచ చేరేటప్పటకి సాయంత్రం ఆరున్నరైయింది.

ఇంటికి తీసుకెళ్లి కాస్త కాఫీ యిద్దామని యింటిదాకా తీసుకువెళ్లాను.

కానీ ఆయన కారు దిగలేదు. బాగా అలిసి పోయినట్టున్నారు. యిక లాభం లేదని యింట్లోకి వెళ్లి మా శ్రీమతిని. పిలిచి ప్రొఫెసరు గారిని పరిచయం చేద్దామనుకున్నాను. ఇంట్లో అడుగు పెట్టగానే ఏదో వంటకపు సువాసన గుభాలిస్తుంటే వెంటనే భయమేసింది. ఈ రోజు ఏదైనా ప్రత్యేకమైన రోజు కాదు గదా. అయితే తిట్లు తప్పవు శ్రీమతి నుంచి అనుకుంటూ మెల్లగా మా నీహమ్మ నడిగాను "ఏంటమ్మా విశేషమని".

– ఈరోజు అమ్మ హేపీ బర్త్‌డే కదా' అంది నీహమ్మ.

ప్రొఫెసర్‌గారితో మా శ్రీమతి ఓ ఫోటో తీసుకోవాలనుకుంది. ప్రొఫెసర్‌గారు కారు దిగలేదు గాబట్టి అదీ వీలవలేదు.

ఒక పక్క రోజంతా ఆమెను పట్టించుకోకుండా తిరిగాననీ, రెండోది ఫోటో తీసుకోలేకపోయాననే కోపం నుంచి ఈ రోజు నేను తప్పించుకోవడం కల్ల అని అటూ

యిటూ తచ్చాడుతుండగా మా శ్రీమతి అంది.

"నా పుట్టిన రోజు గుర్తుపెట్టుకోకపోయినా ప్రొఫెసరుగారితో పరిచయం నా పుట్టినరోజుకు నువ్వు యిచ్చిన అమూల్యమైన కానుక" బతికిపోయాన్రా బాబూ, ఊరకరారు మహానుభావులు అని అన్న పెద్దమనిషెవరో గానీ సరిగ్గానే చెప్పాడను కున్నాను . మా శ్రీమతితో సహా ప్రొఫెసరు గారికి వీడ్కోలు చెప్పాను.

❖ ❖ ❖

16. టస్కర్ దంపతులు : 1939 ప్రాంతంలో హైదరాబాదు నిజాము ప్రభుత్వంలో రెవెన్యూ, గృహ మంత్రిగా ఉండేవారు. హేమండార్ఫ్ దంపతులనే హైదరాబాదు సంస్థానంలోని అదిమ జాతుల గురించి పరిశోధించమని ప్రోత్సహించేవారు. అందువల్లనే హేమండార్ఫ్ గారికి ప్రస్తుత తెలంగాణా ప్రాంతంలోని ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన తెగల జీవన విధానాన్ని పరిశీలించడం వీలయింది. ఈ సందర్భంలోనే పాలవంచ సంస్థానం కూడా సందర్శించి కొండరెడ్ల మధ్య పని చేయడం జరిగింది.

17. పేరంటపల్లి స్వామిజీ : భద్రాచలం నుంచి రాజమండ్రికి లాంచీలో వెళ్లేటప్పుడు కూనవరం ఆటింతరవాత గోదావరి ఒడ్డున ఉన్న కొండరెడ్డి గ్రామమిది. ఈ గ్రామంలో ఓ ఆశ్రమం ఉంది. ఈ ఆశ్రమం చక్కటి రెండు సెలయేళ్ల మధ్య ఉన్న చదునైన వనవాటికలో ఉంది. అక్కడే ఓ హిందూ స్వామిజీ ఉన్నాడు. ఆయన్నే పేరంటపల్లి స్వామిజీ అంటారు. ఈ ప్రాంతమంతా కొండరెడ్డి ప్రాంతము.



# భూమి కోసం

**19**85లో కొత్తగూడెం దగ్గర గరిమెళ్లపాడులో గిరిజనులకు ఉద్యానవనాలు, పట్టుపరిశ్రమల్లో శిక్షణ కోసం ఓ ఫారం పెట్టడం జరిగింది. దాన్ని హె.చ్.ఎన్.టి.సి.[18] అని అధికార్లు పిలుస్తున్నా మామూలు ప్రజలు ఫారమనే అంటారు.

ఆ ఫారానికి కనీసం పదిహేన్ను రోజులకోసారైనా వెళుతూ ఉండేవాణ్ణి.

మొక్కలూ, పిల్లలూ పెరగడాన్ని గమనించడంలో ఉండే ఆనందం మీకందరికీ అనుభవమే!

అలా ఫారానికి వెళ్లిన ఓసారి సామాజిక వనాల నర్సరీలు పెంచేందుకు చేస్తున్న ఏర్పాటు చూద్దామని అటువైపుగా వెళుతుండగా నడుం వంగినా కాస్త చురుగ్గానే నడుస్తున్న ఓ ముసలమ్మ ఎదురొచ్చింది.

– ఏం పేరమ్మా? అని అడిగాను.

– చింత మల్లమ్మ, అంది ముసలమ్మ.

– మరి బాగా వయసుపైన బడ్డట్లుంది గదా! పని జెయ్యగలుగుతున్నావా? అని అడిగాన్నేను.

– "కన్నపేగూ, బూవి తల్లీ వొదిలిపెట్టవయ్యా, అందుకే యిక్కడున్న. కొడుకున్నడు. మొగుడు కాలం జేసిండు. కొడుకు కలేరి[19] లో బొగ్గు బాయల[20] పన్జేస్తడు. దున్నెటోడు లేడు గాని యింటి పేరూ, కాస్త బూవీ నిలబడాలని ఎప్పుడనిపిస్తది. అందుకే యి బాదంతా" అంది దాదాపు అరవై ఏళ్లు పై బడిన మల్లమ్మ.

– మరి దున్నెటోడు లేక, కొడుకు బొగ్గు బాయల పనిజేస్తుంటె భూమి గురించి నీకెందుకింత ఆశ? అన్నాను నేను ఆమె ఏమంటుందో చూద్దామని.

–"ఎప్పుడో ఒకప్పుడు నా కొడుక్కనిపిచ్చదా, బూవి జెయ్యాలని. ఇప్పుడంటే వయసుల ఉన్నడుగాబట్టి బొగ్గు బాయిల దిగి పన్జేస్తుండు. ఏండ్లు మీదికొచ్చినంక బాయిల దిగుడు కష్టమైతది. అప్పుడు బూవే తోడు. ఎంతో కొంత పంటేసుకుంటడు".

– "మరి నీ భూమి ఎక్కడుంది? ఎంతుంది?"

–" సగం ఫారంలో, సగం పారెస్టులో" అంది మల్లమ్మ నిరామయంగా.

– అంటే ఈ ఫారంలో నీ భూమి కలిసిపోయింది?

– "ఆవు. రెండకరాల దాక ఫారంలో గలిసింది. యింగ రెండుకరాలు పిచ్చితుప్పలు మొలిసి అడివిలో గలిసిపోయింది. "ఈ ఫారంలో నన్నా కాస్తె నీళ్ల దగిలి సెట్టూ, సేమా, గడ్డి గాదం బెరిగి కంటికి పచ్చంగ అన్పిస్తంది. ఇండ్ల పంజేస్తే జీవనం జరుగుతుంది. ఆ అడవిలో రెండెకరాలు.....వాళ్లేంజెయ్యరు; నన్ను సెయ్యిబెట్టనియ్యరు. అండ్ల పిచ్చి తంగెళ్లు మొల్సినయి"

– అవునమ్మా, మరి నీ భూమి ఫారంలో కలిసిపోయిందంటున్నావు. చెట్టూ చేమలు పెరిగి మొత్తం ఫారంలో ఆ రెండెకరాలు కూడా భాగమై పోయింది కదా. మరి ఆ భూమి నీదని యింకా ఆశ వుంది?

–" అందుకే జెప్పిన గద. కన్నపేగూ, బూవి తల్లీ వదిలిపెట్టయ్యా" అని.

మల్లమ్మకు అరవై ఏళ్లు పై బడ్డా ముసలితనం పైకొచ్చినా, పూర్తిగా డీలాపడిపోయినట్లుగా అన్పిపంచదు. మరీ అంత పొట్టిగాదు (కానీ పొట్టిగా ఉంటుందనే చెప్పాలి.) చామనచాయలో కొంచెం సన్నగా, కాయకష్టం వల్ల గట్టిపడినా, వయసు మీద పడడం వల్ల సడలిన ఒళ్లూ, పట్టుదలా, ఆశక్తతా రెండు కలగలిసినట్టుంటుంది. వెం(ట్రుకలు పూర్తిగా నెరిసినా తలనిండా జుట్టుంది. అటూ యిటూ నడవగలిగే శక్తి ఉంది. ఫారంలో ఉన్న ఎక్కువ మంది పనివాళ్లలాగా గబగబా పనిచేయలేకపోవచ్చు కానీ ఎంతో కొంత పనిచెయ్యాలనే పట్టుదలతోనే ఆమె నడుస్తుంది.

ఇంతలో గరిమెళ్లపాడు ఫారం అధికారి శ్రీ నరసింహదాస్ వచ్చాడు.

"ఆమె రోజూ ఫారంలో పనిజెయ్యదు సార్. ఎందుకంటే ఈ వయసులో ఈ ఫారంలో ఆమె చెయ్యగలిగే పనులు చాలా తక్కువ. డైబ్బై రెండెకరాల ఫరాంలో అటూ యిటూ తిరగడమే కష్టం. యింక మొక్కలకు నీళ్లు పోయడం, మొక్కలు ఒకచోట నుండి మరో చోటుకు మార్చడం లాంటివి వయసులో ఉన్నవాళ్లు మాత్రమే చేయగలిగిన పనులు. అయితే ఈమె పట్టుదల చూసి మొన్న మంజూరు అయిన గేదెల్లో ఒకదాన్ని యీమెకివ్వడం జరిగింది. ఫారంలో గడ్డి కోసుకుంటుంది. కోడలు పనిచేస్తున్నది ఫారంలో. ఆ రకంగా ఆమె కలుపు తీసినట్టు అవుతుంది. తన గేదెకు గడ్డి దొరికినట్టవుతుంది కదా సార్. యిప్పుడామెకు ఎలాగు భూమి యివ్వగలిగే స్థితిలో మనం లేం కదా సార్. అందుకని...." అంటూ ఆగిపోయాడు దాస్.



"అసలు ఈమె భూమి ఫారంలో కలవడానికి కారణం ఏమిటి? అడివిలో కూడా కొంత కలిసిపోయిందంటున్నది కదా? దాన్ని మనం తిరిగి యివ్వలేమా?" అని అడిగాన్నేను.

"తన భూమి ఫారంలో కలిసిందని నాకూ కూడా చెప్పింది కానీ, యిప్పుడు చెయ్యగలిగేదేముందని నేను పెద్దగా పట్టించుకోలేదు. ఆమెకో గేదె నిచ్చాం కాబట్టి మనం చెయ్యగలిగేదింకేం లేదని వివరాలు కనుక్కోలేదు సార్" తాను పూర్తి వివరాలు తెలుసుకోలేక పోయినందుకు కొంచెం నొచ్చుకున్నాడు దాస్.

"సరే పర్వాలేదు. ఇప్పుడైనా మనం వివరాలు తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఏదైనా పరిష్కార మార్గముందేమో చూద్దాం. తన భూమెక్కడుండేది? అడిగాన్నేను.

"ఇప్పుడా భూమిలోనే సార్ ఆమె గడ్డికోసుకునేది" అంటూ బైల్దేరాడు దాస్.

"కనీసం అంతవరకైనా తన భూమితో సంబంధం పెట్టుకోనిచ్చారన్నమాట" అన్నాన్నేను దాస్‌ని మెచ్చుకుంటూ.

"ఇదేసార్ ఆమె భూమి" అంటూ కూరగాయలతోటతో మొదలుపెట్టి వెదురు పొదలతో నిండినకంచె దాకా ఓ రెండెకరాలు చూపించాడు. పూర్తిగా బాగు చేసి, చదును చేసి నీళ్లు కట్టడంవల్ల భూమి బాగా సారవంతంగా తయారైంది. పచ్చికా, పచ్చని చెట్లతో భూమి అంతా కళకళలాడుతోంది.

"ఈ భూమిని యిప్పుడు తిరిగి ఆమెకివ్వడం ఎంత వరకు వీలవుతుంది?" మళ్లీ అడిగాన్నేను ఆమెకు న్యాయం చేయాలనే కోరికతో.

"అలా అయితే ఈ 'డెబ్బై రెండెకరాల్లో సగం భూమి యివ్వవలసి వస్తుంది సార్" అన్నాడు దాస్ కొంచెం సందేహంగా.

"అంటే యిప్పుడు భూమిపోయిన వాళ్లందరూ యీ వూళ్లోనే ఉన్నారా?

"అందరూ లేరు ముగ్గురే ఉన్నారు. మిగిలిన వాళ్లంతా ఎక్కడెక్కడికో వెళ్లిపోయారట. కొంత మంది కొత్తగూడెం పోయినారు. నేనొచ్చేటప్పటికే వాళ్లెవరూ లేరు. వెళ్లిపోయి కూడా ఆరేడేళ్లు అయిందట."

భూమి విషయంలో ఆరేడేళ్లు పెద్దకాలమా? అరవై డెబ్బై ఏళ్లు భూమి కోసం పోరాడిన వాళ్లున్నారు. కాకుంటే కోయలు మనకు జడిసిభూమి వదులుకొని పోవడానికి సిద్ధమవుతారు. అసలిదంతా ఎలా జరిగిందో తెలుసుకోవాలనే కోరికతో, పూర్తి వివరాలు

వాళ్ల ద్వారానే తెలుసుకుంటే పరిష్కారం చూడగలమేమోనే ఆశతో చింత మల్లమ్మతో మాట్లాడ్డానికి ఫారంలో మేము సమావేశ మందిరంగా ఉపయోగించే పర్ణశాలకొచ్చి కుచున్నాం.

– "మరి మల్లమ్మా, యిప్పుడు చెప్పు. ఎట్ల జరిగిందిదంతా" అని అడిగితే – గుమ్మడి అచ్చయ్య కొడుకు గుమ్మడి మల్లయ్య మొదలుపెట్టి చెప్పిన కతః

"గప్పుడు యిక్కడంత కాలిగున్నదని, బొగ్గు బాయిల నీల్లొస్తయని మంచిగుంటదని లలితమ్మ పట్వారమ్మ తలొక రెండెకరాలు గొట్టుకోమనె. యమ్మార్వో వాసవిరెడ్డి యీడ ఊరుగట్టాలె అని చెప్పి మొదల నీళ్లబాయి దొవ్విచ్చిండు. ఎయ్యి రూపాయల యిండ్ల పథకం కింద యిండ్లు గట్టించబట్టిరి. అప్పుడు ఆ సారు, ఏం పేరూ, అర్టికల్చరు సారు ప్రభాకర్రెడ్డి సారొచ్చి మీ భూములన్ని పడా వున్నాయి గద మరి వాటిని బాగు జేస్తే మంచిది గదా అన్నడు".

"ఆ.... అంత మాములుగయిందా? అట్టగాదు" అంటూ మొదలు పెట్టింది మల్లమ్మ".

"మా తమ్ముడు సందు నా సందు నాలుగెకరాలుండె."

– "అందులో ఏమి వేసేవాళ్లు?"

– "అండ్ల మొదిట్లో నల్లసామలు, తరవాత పచ్చజొన్నేసినం..... కోసినం..... తిన్నం...."

– "మళ్లేమయింది?"

– "గవర్మెంటు సార్లొచ్చిండ్రు."

– "వచ్చి ఏమన్నారు?"

– "యామన్నరంటె..... మాకేవెరిక..... మసుకూరోల్లని దోలిచ్చినరు ..... పట్టా చేతికియ్యమన్నరు. ఏం ..... యింత కాడికొస్తదనుకున్నమా ..... పట్టదీసుకొని ..... అంగూటం జెయ్యి అంగూటం జెయ్యి అన్నరు"

– "మరి ఎందుకు తీసుకొంటున్నారో మీకు చెప్పలేదా?"

– ''మాకు జెప్పలే..... అంగూటం జెయ్యమన్నరు. బావులు వొయినయ్యన్నరు......."

– "భూమి జూపిస్తమన్నరా?"



– "బావియ్యలే, డబ్బియ్యలే....."

– "భూమిస్తామనలేదా?"

– "అన్నరు. సూపియ్యలే"

– "మరి నువు ప్రయత్నం జేసినావా?"

– "ఏం జేస్తవు?"

– "మరి తరువాత ఏం జేసినారు?"

– "ఏం జేసినం..... కొన్నాళ్లు గుట్టకు బోవడం, కట్టెలు దేవడం, ఆ బస్తిలో ..... కలేరిలో అమ్ముకోవడం యిట్ట....."

– తరువాత?

"గవర్మెంటోళ్లు బావి తీసుకొన్నంక చింతలకట్టకు పోడుగొట్టినం ..... అంత కాల్సినం..... దున్నేసమయానికి బందింపు జేసింద్రు"

– ఎవరమ్మా?

– ఎవురంటే, పారెస్టోల్లు

– తరువాత .....

– "యింక..... మళ్లీ నీళ్లు గట్టలె..... సెయ్యలే..... అయ్యట్టనే పెద్దకంపయినయి"

– మరి మళ్లీ దాని కోసం ప్రయత్నం జెయ్యలేదా?

– "ఎందుకు జెయ్యలే అంటూ గుమ్మడి మల్లయ్య మళ్లీ అందుకున్నాడు."

"అసలు మొదట ఫారెస్టు సారు తిరపతిరెడ్డి మమ్మల్ని బావి సాపు జెయ్యమన్నడు". మళ్లీ తనే "ఆ..... అట్టగాదు. అసలు తిరపతరెడ్డి సారు మా లైను అవతలకున్నది. యివతల సెట్టుగొట్టి సాపు జేసుకోండ్రి అన్నడు. యీ లోపల ఎవురో పెద్ద అమీను సాబుకు జెప్పింద్రు. అమీనుసాబు జీబేసికొచ్చిండు. సానా మంది పరాలయ్యింద్రు..... అప్పుడు బుచ్చయ్య, తాటి ముత్తయ్య, నేను దొరికినం.....

– దొరికితే.....

"ఉల్లెందు[1] దీసకెల్లింద్రు. గాడ సబుజెయిల్లో బెట్టుకోమన్నరు. పోలీటేసను కెల్తె

అమీను తెల్లారి సబు జెయిలకేస్తమన్నడు. గప్పుడు బోగ్గుట్టలో స్టైకు నడుస్తుండె. మళ్లి ఉల్లెందుల సబు జెయిల్లో బెట్టింద్రు. పదకొండ్రోజులాయె అండ్ల ఉండబట్టి. జమానతు దీసకరమ్మన్నరు. నేను బైటికొచ్చి అందర్నీ బైట తీసకరావడానికి పైసలు కావాలె అని వూరోళ్లందర్తో అన్న" "ముందు నివ్వియి తరవాత యిస్తమన్నరు. అప్పుడు తోటేసిన బూవినే అమానతు బెట్టి బొగ్గుట్టలో స్టైకుంట కమ్మం బోయి సీటి దెచ్చి అందర్ని యిడిపిచ్చకొచ్చిన గని ఎవరు పైసలు యియ్యిలె'

– మరి ఏం జేసినావు?

"ఏం జేసినా..... నా కష్టం బోయిందిగాని, నా సేతులు బొలేదనుకున్న..... డబ్బులు బొయినయి. బూవి రాలె. గమ్మన ఊకున్నం..... మూడు సంవత్సరాలు కోర్టుకు దిరిగినం..... బూవులు రాలేదని మా వోళ్లు డబ్బులియ్యమన్నరు" అని ముగించాడు మల్లయ్య.

బీదవాళ్లకున్న కాస్త భూమి ఎప్పుడు పోయినా, ఎలా పోయినా పోయే పద్ధతి మాత్రం ఒకటేనేమో! కాకుంటే పోగొట్టుకునేవాళ్ల పేర్లు మారుతూ ఉంటాయి. భూమి తీసుకునేవాళ్ల చక్కటి ప్రమాణాలూ, వాటిని నమ్మి భూమి యిచ్చేసే వాళ్ల పిచ్చి నమ్మకమూ, ఉన్నది కాస్తా పోయినాక ఆశ చావక చేసే యత్నాలూ, పోలీసు స్టేషన్లూ, సబ్‌జైలుతో అణగారిపోతే, కొత్తగా వచ్చిన నాయకుడో, అధికారో ఆ భూములను గురించి అడిగితే ఆశ మళ్లీ మొగ్గ తొడుగుతుంది.

– మరి గవర్మెంటు సార్లు భూమి దీసుకున్నరు గదా తీసుకొనేటప్పుడు ఏం చెప్పినారు?

– ఏం జెప్పింద్రు..... తలా ఒక ఎకరం తోటేసిస్తమన్నరు.

తరువాతేం అడగాలో నాకర్థం కాలేదు. ప్రభుత్వాధికారుల నుంచి ఎన్ని వాగ్దానాలు! ప్రతీసారీ వొట్టి చేతులే మిగిలినా వీళ్లకెందుకింత నమ్మకం ప్రభుత్వాధికారుల మీద? లేక యిదింతే లెమ్మనే ఉదాసీనతో? జీర్ణించుకుపోయిన కర్మవాదమో? లేక ధైర్యంచేసి మా భూమి మాకెందుకివ్వరని అడిగితే ఏమవుతుందోననే భయంతో భూమి కోసం తపనను కడుపులోనే దాచుకుంటున్నారో? యివన్నీ కలగలిసిపోయాయేమో! వీళ్ల వ్యక్తీకరణలో!

72 ఎకరాల్లో కొంత మామిడితోటా, కొంత జామతోటా, కొంత జీడితోటా, కొంత పూలతోటా, కొంత మల్బరీ తోటలూ పెరిగి, ఎక్కడ చూసినా పచ్చగా, ఏపుగా పెరిగి యీ తోటంతా ఒకటిగా అనిపించే యీ ఫారంలో గతంలో చేసిన వాగ్దానం ప్రకారం, తలా ఓ ఎకరం యివ్వాల? లేక యింత కాలమయిందని తప్పించుకోవాలా? యిస్తే ఈ తోట యింత



మంది చేతుల్లో మనగలుగుతుందా? మనలేకపోతే యిప్పటిదాకా గిరిజనులకు యిందులో యిస్తున్న శిక్షణ సంగతేమిటి?

ఈ ఫారంవల్ల కనీసం యాభై కుటుంబాల వాళ్లు జీవనం చేయగలుగుతున్నారు. ఈ కుటుంబాలన్నీ కోయలవే.

గరిమెళ్లపాడు ఫారం గ్రామాన్ని దత్తత తీసుకొంది. అందరికీ సంవత్సరం పొడుగునా పని చూపిస్తోంది. వాళ్ల కోసం ఓ గవర్నమెంటు ఇళ్లకాలనీ వచ్చేలా, ఊరికి కరెంటూ, ఓ స్కూలూ, అందులో ఓ టీవీ సెట్టూ వచ్చేలా చేసింది.

కానీ యివ్వన్నీ వీళ్లలో భూమికావాలనే కోరికనేమైనా తగ్గించగలిగాయా?

లేక మా భూమి యిందులోనే ఉంది. మేమందులోనే పని చేస్తున్నామనే అవ్యక్త సంతృప్తే వాళ్లను ఈ ఫారంలో ఉంచిందా? లేకుంటే నాలుగేళ్లలో యీ తోట యింత ఏపుగా..... యింత యింపుగా పెరుగుతుందా?

యీ ప్రశ్నలకు సమాధానం వెదకాలి అనుకుంటూ, దీని పరిష్కారం చెప్తానని, మల్లమ్మకూ, మల్లయ్యకూ చెప్పి తిరిగి పాలవంచ వచ్చేశాను.

సమాధానం పూర్తిగా దొరక్కముందే పాలవంచ నుంచి బదిలీ అయిపోయింది. అయినా ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాను. సమాధానం దొరుకుతుందేమోనన్న ఆశతో...

❖ ❖ ❖

18. హెచ్ఎన్‌టిసి : హార్టికల్చర్ నర్సరీ కమ్ ట్రైనింగ్ సెంటర్. ఆంధ్ర రాష్ట్రంలో ఐటీడీఏలు ఉన్న జిల్లాలో గిరిజన యువకులకు పండ్ల తోటల పెంపకంలో శిక్షణ యిచ్చేందుకు ఏర్పాటు చేయబడిన శిక్షణా సంస్థ.
19. కలేరి : సింగరేణి కాలరీస్ లేదా సింగరేణి బొగ్గు గనులు, కొత్తగూడెం
20. బొగ్గుబాయి : బొగ్గుగని.

# "శాపలు దాగితే సెరువెండుద్దా... సారూ?"

సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం. ఐటిడిఎ కార్యాలయం, పాలవంచ.

– "అమరారవు నాయకపోళ్లకు[21] బూమిచ్చింద్రంట గదా" అంది కొంచెం పొట్టిగా, నల్లగా ఉన్న నలభై, నలభై అయిదేళ్ల వయసున్న ఓ కోయ స్త్రీ.

ఆమె ఒక్కతే రాలేదు. ఆ వెనక కనీసం యింకో యిరవై మంది స్త్రీలున్నారు. వీళ్లందర్నీ చూస్తే ఓ పది రోజుల కిందట అమరారం, కోమట్లగూడెం నుంచి కట్టుగా వచ్చిన పదిహేను మంది స్త్రీలు గుర్తొచ్చారు. వాళ్ల పట్టుదల మెచ్చుకోదగింది. గ్రామాల్లో ఉండేవాళ్లకు విషయాలు తెలీవనుకుంటాం గానీ, వాళ్లు తెలుసుకోదగిన విషయాలు తొందరగానే తెలుసుకుంటారు. మనకులా ఊసుపోకకు చెప్పుకునే కబుర్లు మాత్రమే పెద్దగా పట్టించుకోరు వాళ్లు.

– "ఒక్క అమరారపు వాళ్లకే గాదు, కోమట్లగూడెం వాళ్లకు కూడా యిచ్చారు. సరే, మీ వూళ్లో కూడా మిగులు భూమి ఉందా?" అని అడిగాను నేను.

– మా వూరి దగ్గర కూడా ఐదొందల ఎకరాల బూవుంది గానీ ముప్పై ఏండ్ల నుంచి ఫారెస్టు సార్లతో కొట్లాడి కొట్లాడి అలిసిపోయినం. దాని గురించి మాట్లాడితె ఏం లాభం? యిప్పుడు అందుకు రాలే" అంటూ ముందుకొచ్చింది గుంపులో ఎక్కడో మధ్యలో ఉన్న ఓ ముసలమ్మ. పొడుగ్గా, చామనచాయలో ఉంది. విశాలమైన నుదురుతో, ఉత్సాహం నిండిన కళ్లతో ఉన్న ఆమెను చూడగానే చక్కని తల్లి అనే భావం కలిగింది నాకు. ఆమె వయసు ఏభై – ఏభై ఐదేళ్ల మధ్య ఉండొచ్చు. ఆమె పేరుసాయం పున్నమ్మ.

– "మరెందుకొచ్చారమ్మా"? అన్నాను.

– "మేమందరం దొర్ల మామిడితోటల్లో పనిజేస్తం. ఎల్లకాలముండదు గదా పని. అందుకని యింకేదన్న పని చేసుకుంటె బాగుంటుందని అనుకున్నం. మొన్న కోమట్ల గూడెపు ఆడమనుసులకు పట్టలిచ్చినరంట గదా. అట్లనే మా ఊరి మనుసులగ్గూడ అందరికి కలిపి ఏదైనా యిస్తే బాగుంటంది. పొయిన వారమొచ్చినంగానీ నువ్వప్పుడె బద్రచలం బొయిన వంట" అంది పున్నమ్మ.

– "మీకేం కావాలో మీరే చెప్తే మంచిది గదమ్మా."

– "యింటికి రెండు బర్లు యియ్యండి. మామిడితోటల్లో గడ్డి దొరుకుతది. మీరిస్తే మేంగూడ సెట్లు బెంచుతం. యింకొకరి తోటలో గడ్డి కోసం ఎన్ని రోజులు బోతం."

– అక్కడొకరికి, అక్కడొకరికి బఱ్ఱెలు యివ్వడం జరిగింది గానీ, వాటిని సక్రమంగా పోషించుకొని బాగుపడిన వాళ్లు చాలా తక్కువ మందమ్మా. భద్రాచలం మండలంలో యీ మధ్యనే అన్ని ఏర్పాట్లు చేసి పక్కపక్కనే ఉండే ఓ ఐదు గ్రామాల వారికి బఱ్ఱెలు యిచ్చాం. అదెట్లా ఉంటుందో చూశాక గానీ మళ్లీ వేరే గ్రామాలకు యివ్వదలుచుకోలేదు.

– "మరి వాళ్లు పాలెక్కడ అమ్ముతారు."

– "భద్రాచలం గురుకుల పాఠశాలకు."

– "మేం పాల్టెక్నిక్కు సార్లకమ్ముతం. నువ్వవునంటె"

– "యింత మంది పాలమ్మితే కొనే వాళ్లుండాల గదా"

– "బూర్గంపాడు దగ్గరెకద. కొంత మంది అడికిబొయి అమ్ముకుంటం. భద్రచలం దార్లో లారీ లాగే మలుపులో వోటల్లున్నయి గద. వాళ్లక్కూడ బోస్తం" అంది తెలివిగా పున్నమ్మ.

తమకేది అనుకూలమో, దాన్ని ఎలా నిర్వహించుకోవాలో, ఏమైనా యిబ్బందులొస్తే వాటినెలా ఎదుర్కోవాలో యింత జాగ్రత్తగా ఆలోచించుకొని అది యిస్తే మేము ఖచ్చితంగా ఏదో సాధిస్తామంటూ తామంతా కలిసి ఏదో ఒక పని చేయదలుచుకున్న ఈ కోయ మహిళ ఉత్సాహాన్ని యింకా పరీక్షించడం అనవసరం అనిపించింది. పది రోజుల తరువాత కన్పించండి అని చెప్పి పంపాను.

పది రోజులు గడిచాయి. ఆ గ్రామ వివరాలు తెలుసుకున్నాం. వేరే పని మీద ఆ గ్రామం మీదుగానే వెళ్లాం కానీ వాళ్లను మేం పలకరించలేదు.

పదిహేన్రోరోజుల తరువాత ఓ రోజు కాంపు నుంచి కొంచెం తొందరగా తిరిగి వచ్చాను. యింటికి వచ్చిన గంటలోపుల అటెండరు భూషయ్య వచ్చి – అయ్యా టేకుచెట్ల

అరుగుల మీద కూర్చొని ఉన్నారు లక్ష్మీపురం వాళ్లు యిరవై మంది పైన ఉంటారు పిలవాల్నా? అన్నాడు.

– "పిలుపు" అన్నాను.

దాదాపు పోయినసారి వచ్చిన వాళ్లంతా వచ్చారు. మరో ఐదారుగురు ఎక్కువే వచ్చినట్టున్నారు. గుంపులోంచి ఆ పొడుగ్గా, చామనఛాయలో ఉన్న ముసలమ్మే ముందుకు వచ్చి–

– "అయ్యా, నీ జీపు జూసిండంట మా రాంబాబు. వచ్చి చెప్పిండు. అందుకనె యిప్పటికిప్పుడెరావాలనుకున్నం. వచ్చినం."

– "అందరూ ఎక్కడికి పోకుండా ఊళ్లోనో ఉన్నారా?"

– "అనుకొని ఉన్నం. పొద్దున్నె రావాలనుకున్నం. నువు బయలెల్లిన వంట. అందుకని యింగ సాయంత్ర వద్దమనుకున్నం. యింతలోపల రాంబాబు జెప్పిండు, నీ జీపు యిప్పుడె పాలంచబొయిందని".

– "నేనెక్కడికైనా మళ్లీ వెళ్లిపోయి ఉంటే–?"

– "సోమారం నీకు కుదర్దయ్యా మాట్లాడ్డానికి. మా మాట యివరంగా యినాలెనువు. అందుకే యీరోజొచ్చినం" అంది పున్నమ్మ.

– "సరేనమ్మా మంచిదే. మరి మీరు పాతికమంది దాకా ఉన్నట్టున్నారు గదా. ఇంత మందికి పశువులిస్తే అందరూ వాటిని సరిగ్గా పోషించలేకపోవచ్చు. ఎంత వద్దని చెప్పినా మీరు పశువులే కావాలంటున్నారే" అన్నాను.

– "అయ్యా, పసువులెందుగ్గావాలంటమంటే సెప్పమంటారా? వానకాలంల అవేడ దిరిగినా మేత దొరుకుద్ది. ఎండకాలంల అడివి దగ్గరుంది కాబట్టి అయ్యే పోయి తిరిగొస్తయి. యింగ వొరుపుకాలంల మా తిప్పలు మేం బడతం. మామిడి తోటల్ల ఎంతో కొంత గడ్డిగాదం దొరుకుద్ది. మా పనులు మేం జూసుకుంటనే వాటిని సాక్కుంటాం" అని మళ్లీ తనే అంది పున్నమ్మ.

– "నువు జెప్పింది కూడా రైటేనయ్య. యింత మంది కొక్కసారిగ అదీ అందరికొకటే ఎందుకియ్యాల. కొంత మంది సరిగ్గ జూసుకుంటరు. కొంతమంది సరిగ్గ జూసుకోలేరు.



అట్టయితె ఒకపన్జేస్తం. మాలో ఎవురెవరికేది బాగుంటదో మేమే మాట్లాడుకున్నం సెప్పమంటావా?"

– "అలాగే చెప్పమ్మా"

– "యిదో యీనర్సమ్ముండదే ఆమె కొడుక్కే మొన్న నువు కోడిపిల్ల లిచ్చింది. మల్ల అదె యింట్లో యింకొకరి కెందుకనుకుంటే నాకొద్దులే అంటుండదామె. యింగ యీ మల్లమ్మకూ, బిచ్చమ్మకూ, గౌరమ్మకూ, సిట్టెమ్మకూ పాపమ్మకూ ఎంతో కొంత బూవుండది తలా రెండెకరాలకు పైన. యీళ్లకు మొదాలె సెట్లియ్యండి. దేశమంత సెట్లిస్తుండది ఐటిడిఏ. మా వూర్లో దొర్లుబెట్టిండ్రు గద అండ్ల పన్జేస్తం గద. మాకంత దెలుసు. అట్ల యీల్లగ్గాడ సెట్లిస్తె అండ్ల బెరిగిన గడ్డి మేం గోసుకుంటాం. ఏమమ్మా పాపమ్మ నువ్వేమంటావు?" అంటూ ఆగిపోయింది పున్నమ్మ.

– "నువు జెప్పినట్టేలే అత్తా" అంది పాపమ్మ

– "మరి యింకా పంతొమ్మిది మంది ఉన్నరుగదా బర్లకోసమే" అన్నాను పున్నమ్మ నాయకురాలితనాన్ని లోలోపులే మెచ్చుకుంటూ.

– "యింకా పందొమ్మిది ముందుడారు? అసలెంతమందికి బర్లిస్తవొ నువు జెప్పయ్య? మల్లమేం మాట్లాడుకుంటాం."

– "పదిమందికైతే సరిగా ఉంటుంది" అన్నాను.

– "నాయన్నాయన, బూవిలేనోళ్లమే పదిమందిపై నుండం. మరి పదిమందికే యిస్తే ఎట్టా?"

– "అసలు భూమిలేని వాళ్ళకు పశువులివ్వడం మంచిది గాదు. సొంత భూమి లేకుంటే రోజూ పచ్చిమేత ఎక్కడ్నుంచి వస్తుంది? పచ్చిమేత కోసం మీరు యిబ్బంది పడతారు. ఈ లోపు పశువుపాల్విడం మానేస్తుంది. దూడలు ఒక్కోసారి చచ్చిపోతాయి." అంటుండగా మధ్యలోనే అందుకుని పున్నమ్మ.

– "నాయన్నాయన నువ్వట్టంటే ఎట్ల. సరే పచ్చిమేత లేదన్నవుగద. మరైతే ఒకముప్పై ఎకరాల భూమి ఫారెస్టోల్లు వాళ్లదంటున్నరు. దాన్నెట్టయిన మేం జేస్తం. మాగ్గాడ మొక్కలియ్యండ్రి మొక్కలొచ్చిన కాడ గడ్డి మొలుస్తది గద."

– "అంతగా అయితే కొంత భూమిలో గడ్డి కూడా పెంచొచ్చు గదమ్మా"

– "అదే నాయన. నువవునంటె గవర్మెంటు సల్లగుంటె అన్ని వస్తయి. మరి పది మందికి పైన బర్లు యిస్తవుగద?"

– "సరె యింకొక ఐదు మందిగ్గూడ యిస్తాం. అంటే పదిహేను మందికి. అయినా యింకా నలుగురు మిగిలున్నారు" కదా అన్నాను.

కాని నా మనసులో మాత్రం అసంతృప్తికరంగానే ఉంది. నోటి మాటతో పదిని, పదిమేను చేయడానికి నేనెవడ్ని? అన్పించింది.

– "గవర్మెంటుకు మా మీద శర్ధొచ్చింది సారూ. ఆ నలుగురికి మేకలియ్యండ్రి, సారు. గొర్లొద్దులె. అడివుండది గద, అయ్యే పోయి మేసొస్తయి."

– "ఫారెస్టు సార్లు మేకలిస్తె ఒప్పుకోరు గదమ్మా. మేకల వల్ల అడివి తరిగిపోతుందట తొందరగా."

– "బాగ జెప్పినవుసారు. ఫారెస్టు సార్లొచ్చింతరవాత బుట్టినాయి మేకలు? తాతల ముత్తాతల నాట్నుంచి మేకల్లేవు? అయి అడివిలో మేస్తలేవు? యిప్పుడు ఫారెస్టు సార్లు మేకలు మేస్తే అడివిదరుగుద్దంటె శాపలు దాగి సెరువెండిందన్నట్టున్నది నాయనా. అయినా సార్ల మీద కోప్పడితె మంచిది గాదు. మరెట్ట నాయనా. యింగ యీ నలుగురికేమిస్తవో నువ్వె జెప్పు" అంది పున్నమ్మ.

పున్నమ్మ వాదనా పటిమ అమోఘం. తను సమజంసమనుకున్నదాన్ని ఎంత చక్కగా చెప్పింది పున్నమ్మ! ఫారెస్టు వాళ్లు ఒప్పుకుంటారా లేదా అనే సందేహం కన్నా తామేది చేయగలమో కారణాలతో సహా పున్నమ్మ చెప్పిందానికి తిరుగులేదనిపించింది.

"సరేనమ్మా యీ నలుగురికి మేకలు యిద్దాం" అన్నాను చివరికి.

– "యింగ జూడండి సారు. నువ్వు వారానికొకసారి మా వూరు రావాలె. నువు రాకపోతే నువు బద్రశలం బొయ్యేటప్పుడు దార్లో నీ ఎద్రజీపాపుతం. మా వూరు దీసకపోతం. నువు మెచ్చాలె. మా వూరోళ్లం మారాలె" అంది ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పున్నమ్మ.

ఆ ఉత్సాహాన్ని నీరు గార్చడం హాస్యాస్పదమే అన్పించింది.

పున్నమ్మ నాయకత్వానికి మెచ్చి, వూళ్లో అందర్నీ కూడగట్టుకోవడం చూసి ప్రాజెక్టు



పశు సంవర్ధక అధికార్లు సరసయ్యగారూ, రాఘవేంద్రరావుగారు దాదాపు లక్ష్మీపురంలో మకాం వేశారు. రెండ్రోజులకోసారి లక్ష్మీపురం మా చర్చల్లోకి వచ్చేది.

"సమగ్ర గ్రామాభివృద్ధి కిది గుర్తు కావాలి సార్" అంటూ ఉద్యాన శాఖాధికారి మురళీధర రావుగారు ఓ ముప్పై ఎకరాల్లో జీడి, మామిడి, జామ మొక్కలు నాటించేశారు. బైట నుంచి ఎవరొచ్చినా ఐటిడిఏ అభివృద్ధి కార్యక్రమాలు చూపించడానికి లక్ష్మీపురమే సరిపోయేది. మేమేదో చేశామని గొప్పలు చెప్పుకోవడానికి సూక్ష్మంలో మోక్షంలా తయారైందీ లక్ష్మీపురం.

పున్నమ్మపురమంటే బాగుంటుందేమో! కానీ యిప్పుడెలావుందో పున్నమ్మా, ఆమె ఊరు?.....?

❖ ❖ ❖

21. నాయకపోళ్లు : 'రాయకపోడు' అనేది ఒక గిరిజన తెగ. ఈ తెగను కోయ నాయక అని కూడా అంటారు. వీరి జనసంఖ్య చాలా తక్కువ. ఖమ్మం జిల్లాలోనే గాక ఆంధ్ర రాష్ట్రంలోని యితర గిరిజన ప్రాంతంలో కూడా ఉన్నారు.

# ఆ... తొమ్మిది నెలలు

**జూ**లై నెల యిరవయ్యారవ లేది. ఉదయం పదకొండు గంటలు. ఖమ్మం జిల్లా కలెక్టరు కార్యాలయం వచ్చీపోయే జనంతో బాగా సందడిగా ఉంది. వర్షాకాలం కావడంతో గోదావరి వరద సహాయక చర్యల ఏర్పాట్ల గురించిన చర్చలవల్ల కూడా వచ్చిపోయే అధికారులతో హడావుడిగా వుంది. వాస్తవానికి వరద సహాయక కార్యక్రమాల గురించిన చర్చలన్నీ భద్రాచలంలోనే జరుగుతాయి. ఖమ్మం జిల్లాలో గోదావరి వరద తీవ్రత ఎలాంటిదో నాకు పాలవంచ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా పని చేయడానికి వెళ్లేంతవరకూ తెలియదు. వర్షాకాలం మొదలయింది గాబట్టి కొంచెం తొందరగా వస్తే గిరిజన ప్రాంతంలో పండ్ల మొక్కలు, ఇతర సామాజిక వనాలు నాటే కార్యక్రమం పూర్తి చేయొచ్చని ఖమ్మం జిల్లా కలెక్టరుగా ఉన్న కృష్ణారావుగారు చెప్పడంతో భువనగిరి సబ్ కలెక్టరుగా రిలీవై జూలై యిరవై ఆరున ఖమ్మం బయల్దేరాను.

అంతవరకూ నేను కృష్ణారావు గార్ని చూడలేదు. వినడం మాత్రమే... తిరుపతిలో ఏమ్మే చదివే రోజుల్లో మిత్రులు చాలా మంది తరచుగా కృష్ణారావుగారి గురించి చెప్పేవారు.

కలెక్టరుగారి రూంలో అడుగుపెట్టిన నాకు కొంత మంది మామూలు ప్రజలు, కొంత మంది రాజకీయ నాయకులు, కొంత మంది జిల్లా స్థాయి అధికారులు కనిపించారు. మొత్తం ఓ పదిహేనుమంది దాకా ఉంటారు. ఇంతమందితో మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కలెక్టరంటే చాలా మందికుండే అపోహలు తొలగిపోతాయి. తన దగ్గరికి ఏదో ఉత్తర్వుల కోసం వచ్చిన అధికారులకు ఏ మాత్రం ఆలస్యం లేకుండా తగిన ఆజ్ఞలిస్తూ, రాజకీయ నాయకులతో స్పష్టంగా మాట్లాడుతూ, సాయంకోసం వచ్చిన ప్రజల విజ్ఞప్తులను స్వీకరించి తగిన సమాధానం చెప్పి పంపిస్తూ ఉంటే అదో అష్టావధానంగా అనిపించింది. పనిలో పడితే అలా ఉండాలి. దాని అపాదమస్తకం చూడాలి. దాన్ని అవుపోసన పట్టి ఆనందించాలి. పని భారంగానీ, బాధ్యతల బరువుగానీ తననే మాత్రం లొంగదీసినట్టనిపించలేదు. ప్రతి కలెక్టరూ అంత మాత్రం చేస్తాడని ఎవరైనా తేలిగ్గా కొట్టిపారేస్తే అనుభవించే వాడికి తెలుస్తుంది దాని సారాంశం ఏమిటో అని కొన్నిపారేస్తాన్నేను.

తాను అందర్తో మాట్లాడి పంపించేసరికి పన్నెండు కావస్తోంది. అందరి ప్రశ్నల పరంపరల జడివాన వెలిసింతరువాత (బైట వర్షం వస్తూనే ఉంది)–

– అత్యవసర పరిస్థితులవల్ల "మిమ్మల్ని కొంచెం ముందే రమ్మని చెప్పకతప్పలేదు" అన్నారు కృష్ణారావుగారు.

– "ఫరవాలేదండీ, పని చేయవలసిన సమయంలో పని చేయాలికదా" అన్నాను.

– "దయాచారిగారితో (అప్పటి నల్గొండ కలెక్టరు) మాట్లాడాను. అంత తప్పనిసరైతే రిలీవ్ చేస్తానన్నారు" అన్నారు కృష్ణారావుగారు.

– "నేను డిఆర్‌డిఎ అదనపు ఛార్జి తీసుకొని ఉన్నాను గాబట్టి రిలీవ్ కావడం కొంచెం ఆలస్యం అయింది సార్." అన్నాను.

– "ఎలాగైతేనేం వచ్చారు. వర్షాలు ఎలా వస్తున్నాయో చూస్తున్నారు గదా. యింక నుంచి మీరు వర్షాల్లో, వర్షాల్తో పనిచేయాల్సి వస్తుందనుకుంటా"నన్నారు.

– "అయితే సరదాగానే ఉంటుందనుకుంటాను" అన్నాను మాట కలుపుతూ.

"ప్రాజెక్టు అధికారి వుద్యోగమేమిటో తెలియాలంటే ప్రాజెక్టు అధికారిగా కనీసం మూడు నెలలైనా పని చేయాలి. అప్పుడే సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. అదృష్టవశాత్తు నేను మూడు నెలల పైనే చేశాను" అన్నారు నవ్వుతూ.

నాకు కొండంత ఆనందం కలిగింది. నీతో సహకరిస్తానని మనస్ఫూర్తిగా నీపై అధికారి చెబుతుంటే యిక కావలసిందేమిటి?

మనసు చాలా ఉల్లాసంగా ఉంది. ప్రపంచం మనతోనే ఉందన్న ఆనందప్రదమైన ధైర్యంతో చిరుజల్లుల మధ్య ఖమ్మం నుంచి పాలవంచ బైల్దేరాను.

ఖమ్మం జిల్లాలో గిరిజన ప్రాంతం ఖమ్మం పట్టణానికి 12 కి.మీ. దూరంలో ఉండే మంచుకొండ గ్రామం తరువాత నుంచి మొదలై ఓ రెండొందల ఏభై కిలోమీటర్లు అలా సాగి వాజేడు మండలంలోని లొట్టిపిట్ట గండిని దాటుకొని మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కలిసిపోతుంది.

కామేపల్లి, సింగరేణి మండలాల్లో పెద్దగా అడవుల్లేవు. ఇల్లందు మండలం దరిదాపుల కొచ్చేటప్పటికి అటవీ ప్రాంతపు సువాసనలూ, ఛాయలూ స్పష్టంగా కనిపిస్తాయి. వినిపిస్తాయి. వర్షాకాలంలో గిరిజన ప్రాంతం చూసి తీరవలసిందే. మనపైనే తేలియాడే మబ్బులూ, దోబూచులాడే నీరెండా, రోడ్డు పక్కన జల్లులు విదిలించే పెద్ద పెద్ద టేకు, మద్ది, కొడిశ చెట్లు. కొంచెం దూరంగా కొండలపై నుంచి నురగలుగక్కుతూ దూకే జలపాతాలూ, అడివి కిరకిరలూ, పక్షుల కలకలారావాలూ అదో అందమైన లోకం. ఇందులో కూడా

ఉద్యోగం చెయ్యొచ్చని తెలిసినప్పుడు బంగారానికి సువాసన అబ్బడమంటే యిదేనేమో అన్పించింది. వీటన్నింటికి తోడు మనసు విప్పి మాట్లాడే కలెక్టరుగారు. తనలో నాకు మొట్టమొదట నచ్చింది నిష్కర్షగా, నాన్చకుండా తన నిర్ణయాన్ని చెప్పగలగడం. తనవల్ల పొరబాటు జరిగిందనుకున్నప్పుడు దానికి బాధ్యత వహించడానికి ఏమాత్రం జంకని నిబద్ధత కూడా తర్వాత రోజుల్లో చూశాను.

పాలవంచ చేరి ప్రాజెక్టు అధికారిగా ఛార్జి తీసుకొని కొన్ని గంటలైనా కాకముందే గోదావరి పెరుగుతోంది; వరద సహాయక కార్యక్రమాల కోసం అందరూ భద్రాచలం వెళ్లాలంటూ కలెక్టరు గారి ఉత్తర్వులు వచ్చాయి. అందరికన్నా ముందే భద్రాచలం వెళ్లాలనుకున్నాను నేనుఎందుకంటే భద్రాచలం కేవలం 28 కి.మీ.లే కాబట్టి పాలవంచకు 3 కి.మీ.ల దూరం ఉండే నాగారం దగ్గర కిన్నెరసాని దాటనివ్వకపోతే 180 కి.మీ.లు చుట్టూ తిరిగి అశ్వారావుపేట ద్వారా వెళ్లినా భద్రాచలానికిఇక కేవలం ఆరు కి.మీ.ల దూరంలో ఉండే బూర్గంపాడు దగ్గర మళ్లీ కిన్నెరసానే ఆపేస్తే అరగంట ప్రయాణం ఓ 18 గంటలు సాగి అందరికన్నా చాలా ఆలస్యంగా చేరుకున్నాను. సిగ్గేసింది. కానీ వేరే గత్యంతరం లేదు మరి. యీ ప్రయాణంలో పడ్డబాధల గురించి "ఇటూ కిన్నెరసాని, అటూ కిన్నెరసాని"లో వివరించాను.

కలెక్టరుగారు కొత్తగూడెం దాకా వచ్చే రైలును మణుగూరు దాకా పొడిగించుకొని భద్రాచలం చేరుకున్నారు. నేను చేరుకునే లోపే అందరికీ బాధ్యతలు అప్పజెప్పడం జరిగినా ఎందుకో కూనవరం ప్రాంతాన్ని మాత్రం ఎవరికీ యివ్వలేదు. నేను వెళ్లగానే ఆ ప్రాంతానికి నన్ను వెళ్లమన్నారు. మొదట నన్నూ ఓ ప్రాంతానికి వెళ్లమని అన్నారనుకున్నాను గానీ కూనవరం వరరామచంద్రపురం నుండి కొల్లూరు దగ్గరుండే పాపికొండల దాకా గోదావరిని చూసినప్పుడు మంచి అనుభవమొచ్చే అవకాశం కల్పించారనిపించింది.

కూనవరం, వరరామచంద్రపురం దగ్గర గోదారి విరివీ, కొల్లూరు పాపికొండల దగ్గర గోదారి ఒడుపూ చూసి తీరవలసిందే. వరద గోదారి మీద లాంచీ ప్రయాణం ఉత్సాహానికి ఉద్రేకం, ఊపు తోడయినట్లనిపిస్తుంది. కూనవరం, వరరామచంద్రపురం రోడ్ల మీద లాంచీ ప్రయాణాలు జీవితంలో వైరుధ్యాలను గుర్తుకు తెస్తాయి. వారం రోజుల ఈ అనుభవాలు గిరిజన ప్రాంతంలో గిరిజనుల అవస్థలనూ,అసహాయతనూ, అధికారులకు అవసరమైన అప్రమత్తతను, ఒక్కసారిగా ముందు ముందు నా బాధ్యతలను సూచించాయనిపించింది.

చిక్కటి అడివీ, లోతు తెలియని నీళ్లూ, మొదట భయంగా, సందేహంగా చూసే ప్రజలూ మనలను ఏ మాత్రం యిబ్బంది పెట్టవనే ధైర్యముంటేనే గిరిజన ప్రాంతంలోని



అందమేమిటో, అక్కడ పని చేయడంలోని ఆనందమేమిటో మనసారా తెలుసుకోవచ్చు. అటువంటి అనుభవాన్ని కృష్ణారావుగారు నాకు గిరిజనసీమలో అడుగుపెట్టీ పెట్టకముందే కల్పించేశారు.

ఇలా మొదలయిన పరిచయాలూ, అనుభవాలూ కేవలం తొలిరోజుల మొహమాటమూ, మర్యాద పూర్వకమైన ప్రవర్తన కింద కొట్టిపారేయవలసిన అవసరం రాకపోవడం నా అదృష్టంగా భావిస్తాను.

సమస్య ఎటువంటిదైనా కానీవ్వండి తన దగ్గరికి తీసుకువెళ్లి వివరించి చెప్పగలిగితే దానికి పరిష్కారం లభించినట్లే. తాను చెప్పినట్టే అందరూ చేయాలనే అహంభావమూ కన్పించలేదు.ఏ సమయానికి ఏది ప్రస్తుతమో అది చేయడమే కర్తవ్యం.

ఓ రోజు తప్పనిసరై "సార్ మీటింగుకు యీ రోజు రాలేకపోతున్నాను. నేనో గ్రామానికి వెళ్లాల్సి వుంది" అన్నాను కొంచెం సందేహిస్తూ.

"ఏ మీటింగుకు రావాలో, ఏ మీటింగుకు రానక్కరలేదో నిర్ణయించుకోవలసింది మీరే. గిరిజన ప్రాంతంలో ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలనేది నిర్ణయించవలసిందీ మీరే. నన్ను రమ్మంటే నేను పాలవంచ వస్తాను. మళ్లీ ఎప్పుడు మీటింగు పెట్టుకుందామో చెప్పండి. ఈ రోజు మీటింగు కానిచ్చేస్తాను". అని చెప్పి ఫోను పెట్టేశారు. తను చెప్పదల్చుకున్నది చెప్పిం తరువాత ఒక్కక్షణం కూడా ఆగకుండా ఫోను పెట్టేయడం కృష్ణారావుగారికి అలవాటు. ఆయనిచ్చిన ఆ స్వేచ్ఛకు అవాక్కయిపోయిన నాకు ఒక్క క్షణం యీ రోజు ప్రయాణం రద్దు చేసుకొని మీటింగుకు వెళదామా అన్పించింది. కానీ, ఓ గ్రామానికి వస్తానని ముందే చెప్పాను కాబట్టి వెళ్లకపోతే గ్రామస్తులు నిరాశపడతారని గ్రామానికి వెళ్లడానికే నిర్ణయించుకున్నాను.

ప్రతిరోజూ వచ్చే ప్రజా విజ్ఞప్తుల్లో నన్నెక్కువ ఆలోచింపజేసిందీ, నేనేం చేయలేకపోయిందీ చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం.

ప్రతివారం ఎంతో మంది యువకులు వచ్చే వాళ్లు ఉద్యోగం కావాలంటూ ఈ సమస్యకు కొంత వరకైనా పరిష్కారం కనుక్కోవాలనుకొని కాస్త పరిశ్రమ చేశాను. గతంలో తయారు చేసిన ప్రణాళికలు తిరగవేశాను. ఎక్కడైనా ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని నేరుగా ఉద్యోగాలు కల్పించేమార్గం దొరకలేదు కానీ, కొన్ని పథకాల క్రింద విద్యాభివృద్ధి కోసం కేటాయించబడి ఖర్చు పెట్టకుండా మిగిలిపోయిన డబ్బుందని కనుక్కున్నాం నేనూ మా డియీవో[1]గారూ. యింకేం! పదండి ముందుకు అనుకుంటూ ఓ 200 పాఠశాలలు

తెరవడానికి ఓ చిన్న ప్రణాళిక తయారు చేశాం. అంటే ఓ 200 మంది యువకులకు ఉద్యోగాలన్నమాట.

అయితే సందేహం పీడిస్తూనే ఉంది. కలెక్టరుగారు యిటువంటి చిత్తు ప్రణాళికను ఆమోదిస్తారా అని. అయినా ప్రయత్నిద్దామని చెప్పి ఖమ్మం వెళ్లి మా ప్రణాళిక వివరించాను.

– "మరి యిలా మనం నియమించిన తాత్కాలిక ఉపాధ్యాయులు తమను పర్మినెంటు చేయమనే ప్రమాదం ఉంది గదా" అన్నారు కృష్ణారావుగారు.

– "చాలా ఎక్కువ ఉంది సార్. కానీ యీ యువకుల నిరుద్యోగ సమస్య, గిరిజన గ్రామాల్లో నిరక్షరాస్యత చూస్తుంటే ఎంతో కొంత మొదలుపెట్టి చేస్తూ పోతే బాగుంటుందని పిస్తోంది. ఏమైనా ఓ రెండేళ్లలో ప్రభుత్వమే ఓ వెయ్యి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పిస్తుందనే నమ్మకముంది. వీళ్లని అందులో కలిపేయవచ్చు. వేలాది మంది గిరిజన యువకులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు యిచ్చింది గదా ప్రభుత్వం ఒక్క ఆదిలాబాద్ జిల్లాల్లోనే పదిహేను వందల దాకా యిచ్చింది. ఈ జిల్లాకివ్వరా సార్" అన్నాను.

"కానీండి, అలానే చేద్దాం. ఏదైనా సమస్య వస్తే పరిష్కరిద్దాం" అన్నారు సునాయాసంగా కృష్ణారావుగారు.

ఒకేసారి 200ల ఏకోపాధ్యాయ పాఠశాలలు తెరవడానికి రంగం సిద్ధమయింది. గిరిజన ప్రాంతంలో సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చుచేసే డబ్బుతో పోల్చితే 200ల పాఠశాలలకు కాబోయే ఖర్చు నామమాత్రం కేవలం పది లక్షల రూపాయలు. కానీ 200 మంది యువకులకు ఉపాధి, 200ల గ్రామాలకు విద్యా సౌకర్యం కల్పించగలుగుతున్నారంటే ఆ ఆనందం, సంతృప్తి చెప్పనలవి కానిది. తరువాత రోజుల్లో అనుభవానికొచ్చిందేమిటంటే కృష్ణారావుగారిలా చాలా మంది మంచి పని చేయడానికి ధైర్యంగా నిర్ణయం తీసుకోలేరని.

ఎంత పనిచేసినా, ఎన్ని పనులున్నా, సాయంత్రం 7 గంటలయ్యేటప్పటికి సాధారణంగా యింటికి వెళ్లడం విధిగా పెట్టుకున్న కృష్ణారావుగారు సుదూర గిరిజన గ్రామాల్లో రెండు రోజులు అలా నిలబడిపోయేవారు. తల మీద ఫెల్ట్ హ్యాట్ పెట్టుకొని ఉల్లాసంగా అలా అడవుల మధ్య గ్రామాల్లోకి నడిచేవారు. తన ఆలోచనలన్నీ అలా నడుస్తున్నప్పుడు ఉత్సాహంగా చెప్పేవారు. అలాంటప్పుడే నేనూ చేయాలనుకుంటున్న వాటిని గురించీ, అమలు చేస్తున్న పథకాల గురించి వివరించేవాడ్ని. వాటిపై తన అభిప్రాయాలు చెప్పేవారు. రెండింటినికలిపి మరుసటి రోజుకు ఏదో కొత్త ప్రణాళిక తయారు చేసేవాణ్ణి.

1987లో డిసెంబరు నెలలో తూర్పు గోదావరి జిల్లా గిరిజన ప్రాంతంలో అప్పటి



సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి శంకరన్‌గారూ, జిల్లా కలెక్టరు ఎమ్.వి.పి.సి. శాస్త్రిగారితో సహా ఓ ఏడుమంది ఐఏఎస్ అధికారులను తీవ్రవాదులు చెరపట్టారు. అప్పటి నుంచి అధికారులు పోలీసు సాయంతో సుదూర గిరిజన ప్రాంతాలకు వెళ్లాలని ప్రభుత్వం ఆంక్ష విధించింది. కానీ పోలీసులు వెంట వుంటే అధికారుల దగ్గరకి గిరిజనులు నిర్భయంగా రాగలుగుతారా అనేది సందేహమే. అంతే కాకుండా ఎంత కాలం మన రక్షణ గురించి ఆలోచించుకుంటూ ఆ మూగ జనం కోసం పని చేయగలం? దాదాపు ప్రతి రోజూ తిరిగితే గానీ ప్రాంతం, జనం పరిచయం కారిక్కడ. అటువంటిది ఎప్పుడో ఒకసారి, అదీ పోలీసు సాయంతో వెళితే నిజంగా గిరిజనుల్లో నమ్మకాన్ని కలిగించగలమా? అన్నది నా సందేహం. అదే సమయంలో గిరిజనుల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం కలిగించడం కోసం జిల్లా ఉన్నతాధికారులందరూ, అంటే కలెక్టరు, ఎస్పీ, కన్సర్వేటర్ యిత్యాదులు సుదూర గిరిజన గ్రామాల్లో ఒక రోజు బసచేయాలని సూచించింది. ప్రభుత్వం మొదటి నిబంధన కన్న రెండో సూచనే నచ్చింది మాకు. నాకన్నా ముందు ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన అజయ్‌కల్లం యీ విషయంలో కొంత చొరవ తీసుకున్నారు. దాన్ని కొనసాగిద్దామన్నాను కలెక్టరు గారితో. ఫెల్ట్ హాట్‌తో సిద్ధమయ్యారు కృష్ణారావుగారు.

రెండు నెలలకోసారి ఎక్కడో మారుమూల గ్రామాల్లో మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో, తూర్పుగోదావరి అంచుల్లో, ఒరిస్సా దరిదాపుల్లో బసచేసేవాళ్లం. పొద్దున లేచేటప్పటికి గూడేలకు గూడేలుగా నడుచుకుంటూ వచ్చే నిష్కల్మషమైన గిరిజన సందోహాన్ని చూసి చలించిపోయిన కృష్ణారావుగారు కోయిదా[1] సదస్సులో ప్రభుత్వపరంగా ఎన్నో వరాలిచ్చారు. ఆనందంతో ఉక్కిరి బిక్కిరై కృష్ణారావుగారి చేతులు తాకడానికి ఎంతో తంటాలుపడిన ఓ గుడ్డి దంపతులు నాకింకా గుర్తు.

ఇదే అదననుకొని కోయిదా సదస్సు కాగానే యింకో ప్రణాళిక తయారు చేశాం. అదే కొండరెడ్ల సెంటరు. ప్రణాళికైతే తయారయింది గానీ సమస్యల్లా ఆ ప్రణాళిక అమలు జరపగలిగే ఓ అధికారిని నియమించడం. అందునా ఎక్కడ? దట్టమైన అడవుల మధ్య కొండల మీద నివసించే కొండరెడ్ల గ్రామాల మధ్యన ఉండే ఓ కొండరెడ్డి గ్రామంలో జీడిగుప్పలో.

ఉండడానికి సరైన యిల్లు లేకుండా, దాదాపు కాలినడక తప్ప వేరే మార్గం లేని యిరుకైన దారుల్లో నిటారుగా సాగే కొండలపై ఉండే కొండరెడ్ల గ్రామాల మధ్యనే ఉండడానికి మనస్ఫూర్తిగా యిష్టపడే అధికారి ఎవరు? ఒకవేళ ఎవరైనా యిష్టపడ్డా కొండరెడ్ల కోసమే ప్రత్యేకంగా ఓ అధికారిని నియమిస్తామంటే ప్రభుత్వం ఏమంటుందో?... ఎన్ని సందేహాలో!

సరే! ముందు కలెక్టరు గారితో మాట్లాడదాం. పరిష్కారం చూపించక పోతారా

అనుకొని బైల్దేరాను ప్రణాళిక పట్టుకొని ఖమ్మానికి. ఈ ప్రణాళిక పట్ల కలెక్టర్ గార్ని సుముఖులుగా చేయడానికి నాకున్న ఆధారమంతా గిరిజన సాంస్కృతిక పరిశోధనా సంస్థ వారు చేసిన సూచనల చిత్తు ప్రతి మాత్రమే. అందులో కొండరెడ్లు ఎక్కువగా ఉన్న రెండు మూడు జిల్లాల్లో కొండరెడ్ల కోసం ప్రత్యేకించి ఓ అధికారిని నియమిస్తే బాగుంటుందని సూచించబడింది. కానీ అలా చేసిన దాఖలాలులేవు.

ఖమ్మం చేరాక–

– "కొండరెడ్ల కోసం ఓ ప్రత్యేక కార్యాలయం తెరిస్తే బాగుంటుందేమో సార్" అన్నాను కృష్ణారావుగారితో.

– "ఎక్కడ?" అని అడిగారు కృష్ణారావుగారు.

హమ్మయ్య ఎందుకు అని అడగలేదని కొంచెం ఉత్సాహం తెచ్చుకున్నాను. "జీడిగుప్పలో" అన్నాను.

– "బాగానే వుంది కానీ దాన్ని చూసుకోవడానికి ఓ అధికారి కావాలి గదా" అన్నారు.

– "మన మండలాధికారుల్లోంచే కొంచెం ఉత్సాహమున్న ఓ మండలాధికారిని నియమిస్తే బాగుంటుందేమో!"

– "ఆ విషయం నాకొదిలెయ్యండి. కొన్నాళ్లు ఆగండి" అన్నారు దృఢంగా.

ఓ వారం రోజుల తరువాత ఓ సాయంత్రం పూట ఆఫీసులో ఏదో మీటింగులో ఉండగా ఫోనొచ్చింది. మాట్లాడుతున్నది కృష్ణారావుగారు.

– "వేంసూరులో వరప్రసాదరెడ్డి అని మండలాధికారి ఉన్నాడు. అతనైతే ప్రత్యేకాధికారిగా బాగుంటాడనుకుంటున్నాను" అన్నారు.

– "అలాగే సార్" అన్నానునా మనసులో ప్రత్యేకించి ఎవరూ లేరు గాబట్టి.

– "తానయితే నేను చెప్పగానే ఒప్పుకున్నాడు గానీ అతనికి తన డిపార్టుమెంటులో ప్రొబేషను కూడా పూర్తి కాలేదు. మరి డెప్యుటేషనుకు ఒప్పుకుంటారో లేదో వాళ్ల డిపార్టుమెంటు వాళ్లు".

– "కష్టమౌతుందేమో సార్"

– "ప్రయత్నిద్దాం. మనం అడగ్గానే సందేహించకుండా అడవుల్లో కొండల మధ్యనే ఉండడానికి సిద్ధపడిన వాడే మనకు కావలసింది. మిగిలిన సంగతులు మనం చూద్దాం" అన్నారు.



– "తొందరలో చేయగలిగితే బాగుంటుందేమో సార్"

– "ఉగాదికి ఆఫీసు తెరిచేద్దామా?" అన్నారు ఉత్సాహంగా.

– "మీరు అవునంటే కాదనడానికి నేనేవణ్ణి మధ్యన" అన్నాను.

పదిహేను రోజుల్లోపే ప్రభుత్వాన్ని ఒప్పించడం, ప్రత్యేకాధికారిగా ప్రసాదరెడ్డి రావడం, ఆఫీసు తెరిచేముందే ప్రసాదరెడ్డి సగానికిపైగా కొండరెడ్డి గ్రామాలు తిరగడం అయిపోయాయి.

1989 ఉగాది పర్వదినాన చిక్కటి అడవుల మధ్యన, నీలి కొండల లోగిలిలో, గోదారి ఒడ్డున, జీడిగుప్పలో, చింతచెట్ల నీడన, ఫారెస్టు బంగళాలో కొండరెడ్ల సెంటరు మొదలయింది. ఆ రోజు జరిగిన మొదటి కొండరెడ్ల సదస్సులో ఉత్సాహం పట్టలేని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, ఏకైక కొండరెడ్డి నాయకుడు అయిన ముర్ల యర్రయ్యరెడ్డి మాట్లాడుతూ భద్రాచలం రాజధానిగా గిరిజనుల కోసం ఓ ప్రత్యేక రాజ్యమే కావాలన్నాడు కలెక్టరు గారు తల్చుకుంటే అదీ సాధ్యమేమోననుకొని!

చక్కగా అలంకరించుకొని వచ్చిన కొండరెడ్లు, కోయలతో జీడిగుప్ప కళకళలాడింది. చింతచెట్లు పులికించాయి.

ఇదంతా జరిగి నెల తిరక్కుండానే కృష్ణారావు గారు బదిలీ అయ్యారు. కానీ నేను తనతో కలిసి పని చేసిన ఆ తొమ్మిది నెలల్లో చేసిన ఆలోచనలూ, ఆశలూ, ప్రణాళికలే మిగిలిన ఒకటిన్నర సంవత్సరమూ నన్నక్కడ ఉండేలా చేశాయి. గిరిజన చిన్నారులకు సొంత ఊళ్లోనే చదువు నేర్పించగలిగే, నిరాశా నిస్పృహలో మునిగిపోయిన గిరిజన యువకులకు ఉపాధి కలిగించే 200 గిరిజన ఏకోపాధ్యాయ పాఠశాలల కోసం ప్రయత్నించడంలో, గిరిజన ప్రాంతంలో ఉద్యోగం క్షేమం కాదనుకునే రోజుల్లో ఆవేమీ లెక్కచేయకుండా ప్రభుత్వమే మా ముంగిలి కొస్తున్నదని గిరిజనులు మురిసిపోయేలా చేసిన గిరిజన సదస్సుల నిర్వహణలో పని చేయడంలోని ఆనందమూ; చేసిన పనిని చూసి సంతృప్తి వ్యక్తం చేయగలిగే సహ అధికారులూ ఉండిన ఆ తొమ్మిది నెలలు మనసులో అలా తీపి గుర్తులుగా మిగిలిపోతాయి ఎప్పటికీ!

❖ ❖ ❖

# కోయ కన్నె

సాయంత్రం నాలుగున్నర గంటలై ఉంటుందనుకుంటాను. ఓ గంట కిందటే క్యాంపు నుండి వచ్చి భోంచేసి అలా తీరిగ్గా క్యాంపు ఆఫీసులో కూర్చున్నాను టపాల్ తిరగవేస్తూ, 'సార్, నా భర్తను నాకు దక్కించండి సార్" అంటూ దాదాపు 30 ఏళ్లున్న ఓ స్త్రీ వచ్చింది.

నేను పూర్తిగా అయోమయంలో పడిపోయాను. ఇంతవరకూ కోయలూ, లంబాడీలు, కొండరెడ్లూ రకరకాల సమస్యలను నాకు చెప్పడం విన్నాను. కానీ ఓ స్త్రీ నా భర్తను నాకు దక్కించమనడం యిదే మొదటిసారి. తనను చూస్తే గిరిజన స్త్రీలా లేదు. మరి గిరిజన సంక్షేమం కోసం పని చేసే నేను తన భర్తను రక్షించడమేమిటనుకొంటూ...

– "మీ పేరేమిటమ్మా?" అన్నాను.

– "రత్నకుమారి అంది."

– "మీ భర్త ఏం చేస్తారు."

– "వార్డను"

– "అయితే మీకు కలిగిన యిబ్బందేమిటి?"

– "ఏమని చెప్పంటారు సార్, యీయనకు నాలుగేండ్ల కిందట చింతూరు మండలానికి బదిలీ అయింది. ఒక్కడే ఉండేవాడు స్కూల్లో ఆశ్రమ పాఠశాలలో పని చేయడానికి వచ్చేదట ఓ కోయపిల్ల. మరి ఎట్లా అయిందో ఏమో నా భర్తను తన వల్లో వేసుకుంది. దానికి పెళ్లి కాలేదట. వాళ్లకు పెళ్లి లేకపోయినా, మొగుడు లేకపోయినా పరవాలేదట. యిప్పుడొక కూతురు పుట్టింది దానికి. తల్లీ బిడ్డను నువు చూసుకుంటావా లేదా అని ఆ గూడెపోళ్లు నా భర్తను ఒకటే బెదిరిస్తున్నారు. కోయలు బాణాలు వేసి చంపుతరట కద. ఏం చేయాలో దిక్కుతోచకుండా ఉంది సార్. యింక మీరే దిక్కు ఎలాగైనా నా భర్తను నాకు దక్కించండి సార్" అంది రత్నకుమారి.

గిరిజన ప్రాంతాల్లోకి వెళ్లే గిరిజనేతరుల వల్ల గిరిజన సమాజంలో కలిగే పరిణామాల్లో ఒకటైన స్త్రీ పురుష సంబంధాల గొడవను తన ధోరణిలో యీమె చెప్పేసింది. తన మాటల్లోని కోయలపట్ల కసి, ఏవగింపును నేనర్థం చేసుకోగలను. బహుశా ఓ భార్యగా తమ అంతకన్నా వేరేగా ఆలోచించలేదేమో!

కానీ, గిరిజనేతరుడైన పరపురుషుణ్ణి వలలో వేసుకోగలిగే కోయ స్త్రీలున్నారా? ఆ సంబంధం వల్ల పిల్లలు పుడితే ఆ తల్లీబిడ్డలను చూసుకోకపోతే కోయలు బాణాలు వేసి చంపుతున్నారా? యివి రెండూ జరిగే పనైతే కోయలు యీనాడు కోయలుగా ఉండేవారు కాదు గదా! సరే, ఏమైనా తన భర్తవల్ల తప్పు జరిగిందని తెలిసినా, ఏ భార్య నోటిగుండా తన భర్త తప్పు చేశాడనే మాట వస్తుంది? అందుకే తగిన సహాయం చేస్తాలేమ్మా అని చెప్పి ఆమెను పంపించివేశాను.

మరుసటి సోమవారం, ప్రజా విజ్ఞప్తుల దినం. ఐటిడిఎ కార్యాలయం. పాలవంచ నా గది ఏవేవో సమస్యలతో వచ్చిన గిరిజనులతో నిండిపోయింది.

"అయ్యా, నాకేదన్న ఆస్టల్లో పనిప్పిస్తే నేనూ నా బిడ్డ బతుకుతం. దిక్కులేనోళ్లమయినం. ఏ పనైన జేస్త" అంటూ ముందుకొచ్చింది యిరవై, యిరవై ఐదేళ్ల మధ్య వయస్సులో ఉన్న ఓ కోయ యువతి. తన భుజంపై ఓ మూడేళ్ల పాప వుంది నిద్రపోతూ, ఉద్యోగమివ్వమని ఐటిడిఎ కార్యాలయానికి గిరిజన యువకులు రావడం మామూలేగాని, వయసులో ఉన్న ఓ అమ్మాయి, చదువులేని అమ్మాయి తనకో ఉద్యోగం కావాలని రావడం మొదటిసారిగా గమనించి నాకు కొంచెం ఆశ్చర్యం కలిగింది.

– "నీ పేరేమిటమ్మా?"

– "రాజమ్మ"

– "మరి భర్త ఏం జేస్తాడు?"

మౌనంగా సందేహంగా వెనక్కి చూసింది రాజమ్మ. ఆ వెనకనే ఉన్నాడు చింతూరు మండలానికి చెందిన ఓ స్థానిక నాయకుడైన రామారావు. తాను గిరిజనేతరుడు. కోస్తా జిల్లాల నుంచి వచ్చినవాడు. చింతూరు మండలంలో ఓ యాభై ఎకరాలకు పైగా భూమి సంపాదించుకొని స్థిరపడిపోయిన ఓ కుటుంబంలోంచి వచ్చినవాడు.

– "ఈ అమ్మాయి గురించేసార్ మొన్నొకసారి మీతో మాట్లాడింది. ఆ అమ్మాయితో మీరొకసారి మాట్లాడితే బాగుంటుందనే ఉద్దేశ్యంతో తీసుకువచ్చాను సార్" అన్నాడు.

– "మరి యీమె ఉద్యోగం కావాలంటుందేవిటి?

– "మూడేండ్లు సంసారం చేసి ఒక బిడ్డ కలిగింతరువాత నేను నిన్ను పెళ్లి చేసుకోలేననే వాళ్లను ఏమనాలి సార్".

– "జంతువనకూడదు. ఎందుకంటే జంతువులకు మోసం చేయాలనే ఆలోచన ఉండదు గాబట్టి"

– "ఏమైనా యిది అన్యాయం సార్. యిప్పుడు ఆ అమ్మాయి ఏం కావాలి సార్. చిన్న బిడ్డతో తనెలా బతుకుతుంది సార్. ఏ పాపం తెలీని ఆ చిన్న పిల్ల జీవితాంతం తండ్రి లేకుండా ఎందుకు బతకాలి?"

– "ఇంతకు వివరాలేవిటో చెప్పండి. ఎవరతను?" ఏం జరిగింది? ఎలా జరిగింది?"

– "ఏమని చెప్పమంటారు సార్. మీ ఆధీనంలో పని చేసే ఉజ్జోగే. పేర్లెందుకు లెండి."

– "పేర్లెందుకులే అంటే యిక మరి అన్యాయాన్ని గురించి మాట్లాడడమెందుకండీ" అన్నాను కొంచెం విసుగ్గా.

– "టీచరు పని చేస్తాడు సార్. ఏవిటో యీ రోజుల్లో టీచర్లు కూడా పరువూ, మర్యాదా వదిలేస్తున్నారు. యిటువంటి వాళ్లు చదువుచెబితే యిక పిల్లలు బాగుపడ్డట్టే."

– "మీరు యిటువంటి విషయాన్ని గురించి కాస్త శ్రద్ధ తీసుకొని నా దృష్టికి తెచ్చినందుకు చాలా సంతోషం. కానీ మీరు ఉద్యోగినే నిలదీసి ఎందుకు అడగలేకపోయారు? అది చేసి ఉంటే యింకా చాలా బాగుండేది. సరే యిప్పటికైనా, మనం యీ విషయం పరిష్కారం చెయ్యాలి. మీరు వెంటనే ఆ అమ్మాయిని, తల్లిదండ్రులను తీసుకొని యింకోసారి తీరిగ్గా యిక్కడికొచ్చినా సరే. లేదా నేనే అక్కడికొస్తాను. గ్రామస్తులందర్నీ కూర్చోబెట్టి మాట్లాడదాం" అన్నాను.

– "అందరూ కలిసి దీన్ని గురించి మాట్లాడతారనేది నమ్మకం లేని మాట సార్. కోయలంతా ఒక్కటిగా కలిసిరారు."

– "అలా అనకండి. వాళ్లందరూ కలిసేలా మనం చేద్దాం. కులంలో పెళ్లికీ, చావుకూ, అందరూ కలిసి రావడం లేదా? అలాగే దీనిక్కూడా వస్తారు. నేను గూడేనికి



వస్తున్నాను. అందర్నీ ఉండమని చెప్పండి" అన్నాను.

– "ఆ ప్రయత్నం చేస్తాము సార్. కానీ తప్పు కట్టింతరువాత యింకా దీన్ని గురించి మాట్లాడేదేంది అంటారు వాళ్లు. తాము మోసపోతున్నా తమ నిజాయితీ నిలబెట్టుకోవాలనే పట్టుదల కలిగిన అమాయకులు యీ కోయలు" అంటూ వెళ్లిపోయాడు రాజమ్మను తీసుకొని.

"1989 అక్టోబరు నెల 25వ తారీఖు ఉదయ్యాన్నే రాజమ్మ వాళ్ల గూడెం వెళ్లాను. గూడెం రోడ్డు మీదనే ఉంది. ఆశ్రమ పాఠశాల రోడ్డు మీదికే ఉంది. ఆ స్కూలు పిల్లలు ఏవో సమస్యలున్నాయంటూ ఓసారి నాకు ఉత్తరం రాశారు. అందుకనే ఆ స్కూలు నాకు బాగా గుర్తు. చింతూరు వెళ్లే ప్రతిసారి ఆ స్కూలు చూస్తూ వెళ్లే వాణ్ణి.

ఊరి పెద్దలంతా పాత స్కూలు బిల్డింగులో ఉన్నారు. రామారావూ, స్కూలు టీచర్లూ మాట్లాడమని అడిగితే కూడా చాలా సేపటివరకూ కోయలు మాట్లాడలేదు. అందుకే నేను నేరుగా రాజమ్మనే పిలిచి మాట్లాడ్డం మొదలుపెట్టాను. చాలా సేపటి వరకు మౌనంగా ఉండిపోయింది. తన ఊరి వాళ్లంతా తన చుట్టూ ఉన్నారనేది ధైర్యాన్నీ, జంకును కలుగజేసి ఉంటుంది. ఓసారి అందర్నీ చూసింది. స్కూలు బయట పిల్లలూ, కొంతమంది స్త్రీలూ కిటికీల్లోంచి చూస్తున్నారు. నాకూ కొంచెం బెరుకనిపించింది. రాజమ్మతో యిక్కడ వీళ్లందరి 'ముందు మాట్లాడ్డమా, మాట్లాడకుండా ఉండడమా అనే సందేహం కలిగింది. కానీ ఊరి పెద్దలంతా ఉన్నప్పుడు నిర్ణయాలేవో వాళ్ల సమక్షంలోనే జరిగితే మంచిదనే ఉద్దేశ్యంతో వీళ్లందరి సమక్షంలో మాట్లాడితే మంచిదనే నిర్ణయానికొచ్చాను. ఈలోగా రాజమ్మే.

"నాకేదో ఒక పని యిప్పించండి సారూ. ఆస్టల్లో ఉండి పన్జేసుకుంట. నేను నా బిడ్డ బతుకుతం" అంది.

– "యీమె ఉద్యోగం కావాలంటుందేమిటి? అన్నాను రామారావుతో

– "లేకుంటే యింక ఆధారమేముందిసార్" అన్నాడు రామారావు.

– "కానీ యీమెతో సంసారం చేసి ఓ బిడ్డ పుట్టింతరువాత పెళ్లి చేసుకోలేనన్న అతన్ని గురించి మాట్లాడ్డం వదిలేసి ఉద్యోగం సంగతి మాట్లాడుతున్నారా?"

– "అతని సంగతే మాట్లాడాలనుకున్నాం సార్. ఈ పిచ్చిది ఒకసారి అతనితోనే ఉంటానంటుంది. మళ్లీ కొన్ని రోజులయినాక నేనక్కడికిపోతే ఏమౌతుందో ఏమో, ఏదో

ఉజ్జోగమిప్పిస్తే యిక్కడే ఉంటానంటుంది. అందుకే ఏం జేయాలో తోచక మిమ్మల్ని అడుగుతున్నాం.”

యిప్పుడు మిగిలిన అందరితో మాట్లాడ్డం కన్నా ఆమెతోనే నేరుగా మాట్లాడితే మంచిదనిపించింది.

– “ఏమమ్మా, నువ్వేమంటావు. అతనితోనే ఉంటావా?”

– “ఉండాలనే ఉంది. కానీ ఏం జేస్తరో ఏమో!”

– “ఎవరు వాళ్లు?”

– “తన రెండో భార్య.”

– “తన రెండో భార్యా? మొదటి భార్యా?”

– “ఏదో ఒకటి. ఆమెక్కూడ పిల్లలున్నరంట.”

– “కానీ తను నిన్ను రమ్మంటున్నాడా?”

– “రమ్మంటున్నాడు”

– “అంత వరకూ నీతిమంతుడే. కానీ ఆమెతో కలిసి నువ్వుండ గలుగుతావా?”

– “అదే నా భయం. దేశం గాని దేశంల ఏమవుతదో ఏమో”

– “తనకు పెళ్లయిందని నీకు తెలీదా?”

– “కాలేదనే చెప్పిండు”

– “నిన్ను పెళ్లి చేసుకోమని నువ్వు అడగలేదా?”

– “ఏడాదిపైగ కాపరం జేస్తుంటె యింక అడిగేదేముందనుకున్న”

– “మరి మీ పెద్దవాళ్లు కూడా అడగలేదా?”

– “వాళ్లకంతగ తెలీదు”

– “కూతురు పరాయి మగవాడితో చనువుగా ఉంటే పెళ్లిజేయాలని తెలీదా?”

– “ఆయన సారు గదా? మంచోడె అని చెప్పి మాట్లాడలె”

– “యిప్పుడేం జేద్దామనుకుంటున్నావు?”



– “తన దగ్గరకి పోవాలనుకుంది. కానీ భయం. యీ బిడ్డను బెట్టుకొని నేనొక్కదాన్ని ఎట్లబతకాల”.

మంచి వయసులో ఉండి, బిడ్డకు తల్లై, రెండో భార్యగా, (అదీ గుర్తింపు లేకుండా) యీ అమ్మాయి ఎక్కడో దూరపు గ్రామంలో ఉండడమంటే యీ అమ్మాయికే మాత్రం క్షేమం కాదనిపించింది నాకు. యిప్పటికప్పుడు పరిష్కారమయ్యేది కాదిది. యీ అమ్మాయి బిడ్డకు తండ్రైన అతనితో, అతని భార్యతో మాట్లాడిన తరువాత కానీ ఓ నిర్ణయానికి రాలేమనిపించింది.

ఈ అమ్మాయికి ఉద్యోగం యిప్పించి అతన్ని అలాగే వదిలేయడా? లేక రెండో భార్యగా ఎక్కడో దూరపు గ్రామానికి యీ అమ్మాయికి తెలీని వాళ్ల మధ్యకు ఒంటరిగా పంపించడమా?

– “మరి మీరేమంటారండీ రామారావుగారూ?” అన్నాను.

– “ఏమనేది సార్. మగవాడు తప్పుగట్టేస్తే ఆడపిల్ల కొచ్చిన మచ్చ మాసిపోతుందనుకునే అమాయకపు జాతి సార్ వీళ్లది”. ఈ అమ్మాయి అతనితో తిరిగేటప్పుడే మీ సంగతేమిటి అని అతన్ని నిలదీసి  ఉంటే ఒక బిడ్డ పుట్టే దాకా వచ్చి ఉండకపోవును. యిట్లా జరిగిందని తెలిసినాక ఊరికి తప్పుగడితే ఆ పైసల్తో వీళ్లు తిని, తాగి జరిగిందంతా మర్చిపోతారు. అట్లానే మర్చిపోయినారు కూడా. యిప్పుడు మీరు ఈ ఊరికల్లా వచ్చి ఏదో న్యాయం చేయాలంటున్నారు గాబట్టి ఆ టీచరు మీ కిందనే పని చేస్తాడు కాబట్టి పరిష్కారం మీరే ఆలోచించాలి. మీకు తెలియనిదేముంది?”

మళ్లీ సమస్య నా దగ్గరికే వచ్చింది.

బలహీనుల కోసం ఎంతో చేయాలని ప్రయత్నించే ఈ ప్రభుత్వం బలహీనులకే శక్తీ, స్థైర్యాలనెందుకివ్వలేకపోతోంది? స్వచ్ఛంద సంస్థలు కూడా యిటువంటి దాన్ని గురించి చాలినంత ఆలోచించడం లేదేమో! సరే ఏమైనా యిప్పుడు పరిష్కారమార్గం మనమాలోచించాలి. దానికన్నా ముందు ఆ టీచరూ, టీచరు భార్యతో మాట్లాడదామనుకొని ఆ రోజుకు గూడెం నుంచి వచ్చేశాను.

రాజమ్మను తల్లిని చేసిన టీచరు పేరు బాలకృష్ణ. అతను ఐటిడిఏ నిర్వహించే ఆశ్రమ పాఠశాలలో పని చేస్తాడు.

గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ నెలకొల్పే పాఠశాలల్లో ఎక్కువ భాగం

ఆశ్రమ పాఠశాలలే వుంటాయి. ఆశ్రమ పాఠశాలలో పాఠశాల, వసతి గృహం కలిసే వుంటాయి. పాఠశాలలో పని చేసే ఓ ఉపాధ్యాయుడు వార్డనుగా పని చేస్తాడు. అందుచేత అతన్ని కొంత మంది టీచరు అనుకోవచ్చు. కొంత మంది వార్డను అనుకోవచ్చు.

బాలకృష్ణను, అతని భార్య రత్నకుమారిని పిలిపించాను. ఒకరికి తెలీకుండా ఒకర్ని పిలిపించడం వలన సాధించగలిగే ప్రయోజనం పెద్దగా లేదనిపించింది. ఇక్కడ కేవలం రాజమ్మ జీవితమే కాకుండా రత్నకుమారి జీవితం కూడా ముడిపడి వుంది.

– "ఏమయ్యా, బాలకృష్ణా, ఎందుకిలా చేశావు?" అనడిగాను.

– "వాస్తవానికి నేనేం చేయలేదు సార్."

– "మరి మీపేరే ఎందుకు చెప్తోందీ రాజమ్మ."

– "ఈయన ఒట్టి అమాయకుడండీ. అందుకని తన దగ్గర నుంచి ఎంతో కొంత రాబట్టుకుందామని" అంటూ భాష్యం చెప్పింది రత్నకుమారి.

ఇంట్లో ఉన్నప్పుడు భర్తను నానా రకాలుగా తిట్టి పోయగలిగే భార్యామణులు పది మందిలో నా భర్త ఒట్టి అమాయకుడని వెనకేసుకొని రావడం చూస్తే నవ్వొచ్చింది. కానీ, వెంటనే ఈమెను మాట్లాడనిస్తే అసలు విషయాలు బైటికి రావనే ఉద్దేశంతో ఆమెను వారించాను.

– "మరి బాలకృష్ణా, మీకు పెళ్లయిందని చెప్పారా రాజమ్మతో"

– "చెప్పలేదు సార్."

– "ఎందుకని చెప్పలేదు?"

– "నేనొక్కణ్ణే ఉన్నానని తెలిసీ ఆ అమ్మాయి ఊరికూరికే వచ్చేది సార్"

ఒక్కడున్నప్పుడు గాక పది మంది ఉన్నప్పుడొస్తుందా తనని ప్రేమించే అమ్మాయి? తను చేసింది తప్పని స్పష్టంగా తెలిసినా, ఏదో ఒకటి మాట్లాడి దాన్ని కప్పి పుచ్చుకోవాలనే ప్రయత్నమే ఇటువంటి మాటలు.

– "ఒకసారి పెళ్లయిన వాడివే భార్య దూరంగా ఉందని చెప్పి యింకో అమ్మాయితో సరదాగా కాలం గడపాలనుకున్నావే! మీకు పెళ్లి కాలేదని తెలిసి, మీతో తన పెళ్లయితే బాగుంటుందని ఓ పెళ్లి కాని అమ్మాయిచనువు పెంచుకోవడం పెద్దగా ఆశ్చర్యపడాలా?"



అన్నాను.

– "కానీ తెలీకుండా అలా జరిగిపోయింది సార్."

– "మరి ఓ కూతురు పుట్టింది గదా. మీరిద్దరంటే పెద్దవాళ్లు. ఎంతో కొంత జీవితం చూసినవాళ్లు. మరి పసిపాప జీవితం మీ యిద్దరి వల్ల పాడయిపోవాలా?"

– "అలా ఎలా కానిస్తాం సార్?"

– "అయ్యో, నా యిద్దరు పిల్లలను, నన్ను ముంచేట్టున్నారు సార్. యీయన రెండు సంసారాలు పెడితేనేనూ, నా పిల్లలూ ఏ నుయో, గొయ్యో చూసుకోవలసిందే సార్" అంటూ శోకాలు మొదలు పెట్టింది రత్నకుమారి.

– "మీ పరిస్థితి బాధాకరమే అయినా, ఇంత వరకు పెళ్లి కాకుండా తల్లి, ఒక పసికందుకు దారి చూపించవలసిన ఆ రాజమ్మ సంగతేవిటమ్మా?"

– "అది నిజమే సార్. అంతగా అయితే ఏ వెయ్యో రెండు వేలో ఇస్తాం సార్. ఒక్కసారిగా యీ బాధ తీరిపోతే మేలుసార్."

– "ఏం బాలకృష్ణా?"

– "వెయ్యి, రెండు వేలతో ఆ పాప జీవితం గడుస్తుందా సార్?"

– "అయితే తెచ్చియ్యి ఒక లక్ష నీ కూతురికి, నీ ముద్దుల పెళ్లానికి."

– "తప్పు చేసిన మాట వాస్తవమే సార్. అప్పటి పరిస్థితుల్లో అలా అయిపోయింది. యిప్పుడు తనను నా దగ్గర తెచ్చి పెట్టుకోవాలని ఉన్నా రెండు సంసారాలు నడపడమనేది నేరం. అదీ నా వల్ల కాదు సార్."

– "మరి ఆ అమ్మాయి జీవితానికి ఓ ఆధారం కావాలి గదా"

– మీరే చెప్పండి సార్ ఏంచేయమంటారో?" అంటూ తల పట్టుకుంది రత్నకుమారి.

– "కనీసమంటే పది వేల రూపాయలు ఆ పసిపాప పేరుతో బ్యాంకులో వేయాలి. తనకూ మీ కుటుంబానికి యికనుంచీ ఎటువంటి సంబంధం ఉండకూడదు. రాజమ్మ పెళ్లి చేసుకోనంత వరకూ మీరు చూడదల్చుకున్నప్పుడు మీ కూతుర్ని చూడవచ్చు. ఏమ్మా, రత్నకుమారీ మీరేమంటారు?" అన్నాన్నేను.

– "నేనేమంటాను సార్? కష్టపడి కూడబెట్టుకున్నది ఈయన సరదాలకు

కరిగిపోతున్నది. నేనూ నా బిడ్డలు బజార్న పడడానికి వచ్చిన చేటు సార్ యిది. మీరు చెప్పినట్టుగానే కానీయండి. అంతటితో తెగిపోతే అదే పదివేలు. నేనూ నా బిడ్డలు కష్టపడతాం. ఈయనకేం మగ మహారాజు" అంటూ అయిష్టంగానే అయినా ఒప్పుకుంది రత్నకుమారి.

తరువాత రోజు రాజమ్మ వాళ్ల గూడెం వెళ్లాను మా వ్యవసాయాధికారి నాగేశ్వరరావుతో సహా, బాలకృష్ణ యిచ్చిన పది వేల రూపాయి గూడెంలోని పెద్దలందరి సమక్షంలో రాజమ్మకివ్వడం జరిగింది. అదే రోజు మోతుగూడెం నాగార్జున గ్రామీణ బ్యాంకులో రాజమ్మ కూతురు పేరుతో ఫిక్సడ్ డిపాజిట్‌లో వేయడం జరిగింది. కానీ యిదంతా చూసి నాకు సంతృప్తి మాత్రం కలగలేదు.

ఒక స్త్రీ మోసపోతే పది వేలరూపాయలు ఆ అన్యాయాన్ని అరికట్టగలవా? ప్రభుత్వోద్యోగిగా పని చేస్తున్నాడు గాబట్టి బాలకృష్ణను ఎంతో కొంత శిక్షించగలిగాం. కానీ గిరిజనేతరుల చేతిలో కేవలం ఒకనాటి సుఖం కోసం నలిగిపోయే అమాయకులైన కోయకన్నెల గతేమిటి? గిరిజన ప్రాంతంలో భూమి సంపాదించడం కోసం కోయ స్త్రీలను పెళ్లాడినట్టు నటించి, తన చేత ఆరుగాలం కష్టం చేయించి, యింట్లో పని మనిషికి మించి చూడబడని కోయకన్నెల గతేమిటి? తన భూమిలోనే తాను కూలీగా పని చేసి. గిరిజనేతరుడి వల్ల బిడ్డలు పుడితే చివరకు ఆ బిడ్డలను తనే చాకవలసి వస్తే నానా యాతనలు పడే కోయ స్త్రీల గతేమిటి? వర్ణాంతర ప్రేమ వివాహాలనేవి గిరిజన సమాజానికి ఎంత వరకు మేలు చేస్తాయనేది సందేహాస్పదమే! ఏ సమాజంలోనైనా మోసపోయేది స్త్రీయే! కానీ ఆదిమ సమాజంలోనే స్త్రీ పరిస్థితి కొంత వరకు మేలేమో! తప్పుకట్టేసి గిరిజనేతరుడు వెళ్లిపోతే, కోయ స్త్రీ మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు. కానీ డబ్బులున్న గిరిజనేతరుడు తప్పు కట్టేయ్యగలిగితే ఎంతమంది కన్నెలైనా బలి కావలసిందేనా? అయినా ఎప్పుడు పోతుందో కదా ఆత్మ త్యాగానికి కారణమయ్యే ఆదిమ సమాజంలోని యీ అమాయకత్వం!.

❖ ❖ ❖



# "కూసున్న కొమ్మ కొట్టుకుంటమా... సారూ?"

శీతాకాలం సాయంత్రం. యింకా చీకటి పడలేదు.

చింతూరు – వరరామచంద్రపురం రోడ్డు మీద జీపులో వెళ్తున్నాను.

మట్టి రోడ్డు. రోడ్డుకు యిరుప్రక్కలా చిన్నచిన్న పొదలు.కొంచెం లోపలికి వందలకొద్దీ నరికేసిన చెట్ల మొదళ్లు. కాస్తంత చలిచలిగా వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. దారి పక్కన ఎకరాల కొద్దీ చాలా ఏపుగా పెరిగిన నల్లమద్ది గుబురుపొదలు గాలికి తలలూపుతున్నాయి. ఈ నల్లమద్ది పొదల దగ్గరే ఈ సంవత్సరం దసలి పట్టుకాయల పెంపకం మొదలుపెడితే బాగుంటుందనుకుంటూ ముందుకు సాగుతుండగా కొద్ది దూరంలో దారి పక్కకు రగులుకుంటున్న మొద్దు కన్పించింది.

మంచి ఎండా కాలంలో గిరిజన ప్రాంతాల్లో బయళ్లలో కూడా మంటపెట్టి గడ్డీగాదం ఆకూ అలుమూ కాల్చేస్తారు తొలకరి వర్షాలకు మళ్లీఏపుగా పెరుగుదల వస్తుందని. చిక్కటి గడ్డీ,దట్టమైన తునికాకు తొలకరి వానల నాటికి వచ్చేస్తాయి. దగ్గరకెళ్లిన నాకు మతిపోయినంత పనైంది. అది చిన్న మొద్దు కాదు. ఓ మహావృక్షపు మొదలు. అది మొత్తం రగులుకుంటూంది. యింత పెద్ద చెట్టునలా తగలేయడమేనా? యీ కోయలకు యీ చెట్టువల్ల యింకే ప్రయోజనమూ లేదా? అది అమాయకత్వమా లేక నిర్లక్ష్యమా అనుకుంటూ నాతో ఉన్న అటెండరు భూషయ్య నడిగాను.

– "యింత పెద్ద చెట్టునిలా ఎందుకు తగలెడుతున్నారు భూషయ్యా?"

– "యిట్లా ఎన్నో చెట్లు తగలబెడుతూనే ఉంటారయ్యా కోయలు."

– "ఎందుకు?"

– "ఎందుకంటే, చలిగాసుకోవడానికి, రాత్రి వెలుతురు కోసం, ఎలుగ్గొడ్లు అవీ వస్తే బెదరగొట్టడానికి యిట్లా అన్నింటి కోసం చెట్లు తగలబెడతారు. ఎండినవే తగలబెడతారు. అడివినిండా ఎండిన మొద్దులే గదయ్యా, వాళ్లకేం చెట్లు తక్కువా?"

– 'యిట్లా తగలబెడుతూ పోతే చెట్లు తక్కువ అవుతాయి గదా!"

– "అని వాళ్లకనిపించదయ్యా, అయినా గిరిజనేతరులు కొట్టే చెట్లతో పోలిస్తే కోయలు కొట్టే చెట్లు చాలా తక్కువయ్యా అని భూషయ్య అంటూండగానే

– "వీళ్లమాయకులయ్యా", అంటూ అందుకున్నాడు డ్రైవరు వీరాస్వామి. వీరాస్వామి కోయజాతికి చెందినవాడు. మంచి మాటకారి. తన పని పట్ల నిబద్ధత ఉన్నవాడు.

– "అమాయకులైతే అడివిగొట్టడమేమిటి?" అన్నాన్నేను.

– "లేకుంటె ఏందయ్యా? గుండాల మండలంలో శంభుని గూడెం,శెట్టిపల్లె, ఎన్నెల బైలు, దామరతోగు బోయేటప్పుడు జూసింద్రు గదా! ఎన్ని సెట్లు బడి ఉండాయి దారికడ్డం? అయన్ని ఎందుగ్గొట్టింద్రు? అదేంది ఉదుమా ఏందది? అది సెట్టెక్కితే దాన్ని గొట్టడానికి మాను మాను నరుకుతరు. సెట్టుకొమ్మన తేనె తుట్టుందనుకో. మొత్తం సెట్టునరకుతరు. ఆయన్నీ దారికడ్డం బడతయి."

– "తరువాత?"

– "తరవాతేముండది. ఎండినంక తగలబెడతరు?"

– "మరి అడవిలోనే ఉంటారు గదా. అడవంతా యిట్ల తగల బెట్టుకుంటే ముందు ముందు రోజుల్లో యిబ్బంది గదా."

– "యిబ్బందే గానీ, ఎవురు జూస్తుందరయ్యా అదంతా? నాన్‌ట్రైబుకు టేకు గావాలె. కాంట్రాక్టరుకు సంద్రసెట్లు గావాలె. ఆ సెట్లు గొట్టడానికి ట్రైబు గావాలె. కొట్టుకొని పోయేవోళ్లు డబ్బు సంపాదించుకుంటే ఎండిపోయిన అడివిలోయీ ట్రైబులు ఉండిపోవాల."

– "ఎండిపోయింతరువాత యిక అడివేముంది?"

– "అదే ఆ మొట్ట[22] మజ్జన పోదుజేస్తరు. ఆండ్ల ఎకరానికి బస్త కొండజొన్నలొస్తయి. ఎదుర్లు పక్కనుంటె ఎదురుగొట్టబోతరు. ఎటొచ్చీ అడివిగొడితె ట్రైబుకు పొట్టగడుస్తది. నాన్‌ట్రైబుకు ఆస్తి బెరుగుద్ది. దాన్ని అడ్డుకొనేటోడెవడు? లారీలకు లారీలు టేకులు బోతయి. మనం జూసినం గద వరంగల్లు – ఖమ్మం బాడ్డర్ల గుండాల మండలంల టేకులు గొడతనే ఉంటరు. దాన్నా పెటోడెవడు?" నాన్‌ట్రైబు కోసం ట్రైబే గొడుతున్నడు తను కూసున్న కొమ్మతానే గొట్టుకుంటున్నడు."



– "మరి తెలీకుండా యింకా ఎన్నాళ్లుంటారు కోయలు?"

– "యింకొక సంగతి జెప్పమంటవయ్యా?"

– "ఏవిటి?"

– "మంచి టేకు మొద్దులు దగలబెడతరు సలిగాసుకోవడానికి కోయలు" యిది అమాయకత్వమో,నిర్లక్ష్యమో! దీనకంతం లేదనిపించి నాకింకేం మాట్లాడాలనిపించలేదు. యింతలో వరరామచంద్రపురం చేరాం. శబరి దాటి కూనవరం చేరాం. కూనవరంలో రాత్రి బసచేసిన నాకు ఆలోచనంతా ఈ అడవి తరిగిపోకుండా చూడ్డమెలా అనే దానిపై ఉండిపోయింది. అంతే కాకుండా కోయలు అడివి పాడుచేస్తున్నారనేది నమ్మబుద్ధి కాలేదు. అందుకనే యీ విషయంలో మరి కొంత మంది కోయలతోనే చర్చించాలనిపించింది. దీన్ని గురించి కోయలతో వివరంగా మాట్లాడే అవకాశం లభించింది.

జనవరి నెలనుంచే మొదలయ్యాయి సామాజిక వనాల నర్సరీల కోసం యీ ప్రయత్నాలు. గత సంవత్సరం మామిడి, జీడిమామిడి, జామ, దానిమ్మ మొక్కల గురించి తప్ప మిగిలిన మొక్కలు అంటే వెదురు, సుబాబుల్, కుంకుడు, చింత వంటి మొక్కల గురించి పట్టించుకోలేదు. అంచేత యీ సంవత్సరం మిగిలిన మొక్కలకు ప్రాధాన్యత యివ్వాలనే నిర్ణయం జరిగింది. అందులో భాగంగానే కోయలు ప్రియంగా చూసుకొనే విప్ప, కొడిశ, మద్ది, తవిసి లాంటి అడవి చెట్లుపెంచడానికి నిర్ణయించుకున్నాం.

మొక్కలన్నీ ఒకేచోట పెంచి అన్ని గ్రామాలకు చేర్చే కన్నా ఏ గ్రామానిక్కావలసిన మొక్కలు ఆ గ్రామంలోనే పెంచాలని కూడా అనుకున్నాం. యిలా ఓయాభై దాకా గ్రామాల్లో నర్సరీలు పెంచడం జరిగింది. ఈ నర్సరీలు పెంచడానికి కోయ యువకులనే ఎంపిక చేసి వారికో నలభై రోజులు గరిమెళ్లపాడులో శిక్షణ యిచ్చిన తరువాత ఎవరి గ్రామాల్లో వాళ్లు నర్సరీలు మొదలుపెట్టారు. దాదాపు అన్ని నర్సరీలు కంటికి యింపుగా తయారయ్యాయి. వాటిలో ఓ డజనుకు పైగా నర్సరీలు చెప్పుకోదగిన రీతిలో పెరిగాయి. ఆ నర్సరీలు పెంచిన యువకులతో మాట్లాడిన నాకు ఎన్నో విషయాలు తెలిశాయి. వీళ్లందరూ గరిమెళ్లపాడులో కేవలం మాటలతో కాలం గడిపి వెళ్లడం కాకుండా ఆ మాటల వెనక నిజంగా అడవిని కాపాడుకోవాలనే తపన ఉందనిపించింది.

వసంతవాడ గ్రామం. ఏటి ప్రక్కన ఒకటి రెండు చెట్ల నీడన గుబురుగా పెరుగుతున్న ఎన్నో రకాల మొక్కలు చూడటానికి ఆనందంగా నిశ్చింతగా, గలగలలాడుతూ, ఆడుతూ,

పాడుతూ చదువుకునే చిన్నారి పాపల్లాగా ఉన్నాయి. వసంతవాడ గ్రామానికి నిజంగా వసంతం తెస్తున్నట్లుంది ఆ నర్సరీ. నర్సరీలు పెంచడానికి గిరిజన యువకులకు గరిమెళ్లపాడులో శిక్షణ యిస్తారు. ఆ శిక్షణ తరువాత సొంతంగా నర్సరీ పెట్టి మొక్కలు పెంచవచ్చు. వాటిని అమ్ముకోవచ్చు. యిలాంటి నర్సరీ పెంచుతున్న కొంత మంది గిరిజన యువకుల్లో వసంతవాడ నుంచి వచ్చిన వెంకటేశ్వర్లు ఒకడు. వసంతవాడ వేలేరుపాడు మండలంలో ఉంది. ఆ మండలం బాగా వెనకబడిన మండలాల్లో ఒకటి. వర్షాకాలమొస్తే వేలేరుపాడు వెళ్లడం కష్టసాధ్యం. బాగా పెరుగుతున్న మొక్కలు చూడగానే, నర్సరీ పెంపకంలో కొంచెం ఎక్కువగానే శ్రద్ధ తీసుకుంటున్నాడనిపించింది. అందుకే నాకు వెంటనే వీరాస్వామి కొన్నాళ్ల కిందట చెప్పిన కోయలు అమాయకులై చెట్లు కొడుతున్నారాలేక అవసరమై కొడుతున్నారా? అన్న మాటలు గుర్తొచ్చాయి.

– "ఆ మొక్కలను పైన పందిరి వేసినట్టున్నావు. అవసరమా?" అంటూ మొదలు పెట్టాను నేను.

– "నేనే వెయ్యమని చెప్పానుసార్" అని అందుకున్నాడు వేలేరుపాడు మండలం సెక్టోరల్ అధికారిగా ఉన్న జయరాజ్.

– "పెరిగే మొక్కలు నీడలేకుంటే ఎండకు పసిపిల్లల్లాగా వాడిపోవా సార్" అన్నాడు వెంకటేశ్వర్లు.

– "మరి కోయలు లెక్కలేనన్ని చెట్లు గొట్టిఅవెండిన తరువాత తగలేస్తారట గదా"

– "అంటగాదు సార్. అది నిజమే. కానీ తగలెయ్యడానికి కొట్టరు. కొట్టిం తరువాత అడ్డమెందుకని తగలేస్తరు.

– "మరిట్లా అడవి కొడుతూ ఉంటే యింకొన్నాళ్లకు అడవి ఉండదు గదా"

– "మనం నీళ్లుబోసి పెంచకున్నా అడవి దరుగద్దా సార్. అయినా కోయలు గొడితే అడవి దరుగుద్దాసార్"

– "ఎవరుగొట్టినా తరుగుతుంది గదా"

– "నేనొప్పుకోన్సార్. కోయలు గొడితే అడివెండే పనైతే మా తాతల నాటికే అడివెండునుగద సార్. యింటికి వాసాల కోసం గొడతరు. దున్నుకోను గొడతరు. అయినా



అవికూడా గొట్టద్దని ఫారెస్టుసార్లు జెప్పబట్టింర్రు గదా. కొట్టినోల్ల మీద కేసులు బెడతుండరు గద. యింకా కోయలు గొడతరా? యిండ్లు గట్టుకోవడానికి వాసాలకు కూడ చెట్లు గొట్టనిస్తలేరు గద"?

– "మరి ఎవరు కొట్టకుంటే అడివెట్లా తరుగుతున్నది?"

– "చెప్పమంటరాసార్" అంటూ జయరాజ్ వైపు చూశాడు.

– "చెప్పవయ్యా చెప్పు. నేనేం ఫారెస్టు డిపార్టుమెంట్ అధికారిని కాదు గదా" అన్నాడు జయరాజ్. వెంకటేశ్వర్లు మళ్లీ అందుకొన్నాడు.

– "ఎప్పుడో మా తాతల పోడుగొట్టిన భూములకు యిన్నేండ్లకూ మాకు పట్టలిస్తలేరు సార్. ఈ లోపల నాన్‌ట్రైబు ఆ భూమి దీసుకుంటడు. ట్రైబు ఎక్కడికిబోతడు సార్. భూవెదుక్కుంట యింకాస్త అడివిలోకి బోతడు."

– "మరి కొత్తగా యింకాస్త అడివిగొడతడు గద" అన్నాన్నేను.

– "కొట్టకేం జేస్తడు సార్. మా మండలం గోదారి పక్కనే ఉండది గద. మాకెంతమందికి భూములున్నయి గోదారి పక్కన. ఆ భూములన్నీ ఒకప్పుడు మావే గద. యిప్పుడు నాన్‌ట్రైబు చేతిలోఉన్నాయి. మేం అడివిలో బుట్టినం. కూసున్న కొమ్మ గొట్టుకుంటమా సార్. అడివి గాపాడుకోవాలని మాకు దెలుస్సార్. కాని మా మాట యినేటోడెవడు?"

– "మరి తేనె కోసం, ఉడుముల కోసం పెద్ద పెద్ద మాన్లు కొడుతున్నారట గదా? అడవి కాపాడుకోవాల్సిన అవసరముందని కోయల కందరికీ దెల్సునా?" అని అడిగాను.

– "యిప్పుడిప్పుడే దెలుస్తున్నది సార్. అడివి లేకపోతే తవిసి సెట్టెండతయి. అవెండితే జిగురేడ దీస్తరు కోయలు? ఏందింటరు కోయలు? ఆడివెండితే యిప్పపువ్వ ఎక్కడ్నుంచొస్తది? యిప్పపువ్వ లేకుంట బతుకుతరా కోయలు?" అన్నాడు.

– "మరి అటువంటప్పుడు అడవి తరగకుండా చూసుకోవాలి కదా?"

– "చూసుకోవాలె. మరి ఈ జయరాజుసార్ వచ్చినంకనే గదా చెప్పబట్టిండు. ఏలేరుపాడు మండలం మొత్తం దిరిగిండు. ఊరూర్ల చెబ్తున్నడు. మన భూములున్నకాడ్నేగట్ల ఎంబడి సెట్లు బెంచమని అదే పనిగ జెప్తున్నడు. మొక్కలు పెంచడానికి ఐటిడిఎ నుంచి

పైసలు యిస్తరని యిప్పుడు కోయలందరికి దెలిసొస్తున్నది."

– "రాజీవ్‌నగర్లో కూడా నర్సరీ చాలా బాగుంది సార్" అంటూ అందుకున్నాడు జయరాజ్.

– "ఏ మండలం?"

– "కుకునూరు మండలంలో సార్. అదికూడా బాగా వెనకబడిన మండలమే సార్" అన్నాడు జయరాజ్.

– "ఆ నర్సరీ కూడా సార్ జెప్పినంక బెట్టిందే గద సార్. యిప్పుడిప్పుడే దెలిసొస్తున్నది చెట్లు మనం బెంచితే పెరుగుతయని. యింతకు ముందంత యింటి చుట్టుఉండే చెట్లు దప్ప మిగిలిన సెట్లు బెంచడం మన వల్ల గాదనుకునేవోళ్లు. యిప్పుడు ఐటిడిఏ వోళ్లు మామిడి, జీడి సెట్లిచ్చినప్పట్నుంచి మిగిలిన మొక్కలు గూడా బెంచొచ్చని తెలుసుకుంటున్నరు. మీరు పొయ్యేటప్పుడు ఆ నర్సరీ కూడా జూసిపోండ్రి సారు."

"మంచిదయ్యా" అని సెలవు తీసుకున్నాను. చెట్లు పెంచడంవల్ల ప్రయోజనముందని మనం కొత్తగా కోయలకు చెప్పడంలేదు కదా? పోడు కూడా పద్ధతి ప్రకారమే కొడతారు కోయలు. కాకుంటే దానివల్ల వాళ్లకొచ్చే ఆదాయం చాలా తక్కువ.

వేలేరుపాడు నుంచి పాలవంచకు తిరిగివచ్చే దారిలో కుకునూరు, బూర్గంపాడు మధ్యలో రోడ్డుకు కుడివైపుగా ఉంది రాజీవ్‌నగర్ నర్సరీ. నర్సరీ రోడ్డు లోపలికి ఉన్నా రోడ్డు మీదికే బోర్డు పెట్టించాడు జయరాజ్.

మేం రాజీవ్‌నగర్ చేరుకునేటప్పటికి మధ్యాహ్నం రెండున్నరైయింది. సాధారణంగా ఆ సమయంలో అందరూ నిద్రపోతూనో లేదా అడవికిపోతే తిరిగివస్తూనో ఉంటారు. మేం నర్సరీ చూడ్డానికి వస్తామని చెప్పలేదు. అంచేత నర్సరీ పెంచుతున్న చిన్న రామయ్యఉంటాడనే నమ్మకం లేదు.

అయినా సరే కనీసం నర్సరీ చూడవచ్చు కదా అని వెళ్లాను. మనిషి లేనప్పుడే తను చేసిన పనేమిటో బాగా తెలుస్తుంది.

నర్సరీ మొత్తం పందిరికింద ఉంది. ప్రక్కనే చిన్న బావి తవ్వి దానికి మోటారు బిగించి ఉంది. నిమ్మ, దానిమ్మ, జామ, మామిడితోబాటు తవిసి, సీతాఫల్, మద్ది, చింత, కుంకుడు, వేప, కొడిన, తుమ్మ మొక్కలు మడులు మడులుగా పచ్చగా ఏపుగా పెరుగుతూ



ఉన్నాయి. యిద్దరు స్త్రీలు నీళ్లు పోస్తున్నారు. మమ్మల్ని చూసినా వాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. బైటమా అలికిడి విన్నాడేమో "అన్న యిప్పుడే బైటికెళ్లినట్టున్నడు" అంటూ వచ్చాడు రాములు తమ్ముడు. యింటి ముందే నర్సరీ ఉంది. యింటి చుట్టూ యింకా ఏవేవో మొక్కలున్నాయి. జీడిమొక్కలూ, బొప్పాయి మొక్కలూ పెరట్లో పెరుగుతున్నాయి. యిల్లు మొత్తం వనవాటికలా ఉంది.

అలవాటుగా జయరాజ్ మొక్కల మధ్యకెళ్లిపోయి సీతాఫల్ మొక్కల కుదుళ్లలో గడ్డి తీసివేస్తూ "మీరు కూడాయీ రకంగా వారానికోసారైనా చెయ్యాలి" అన్నాడు చిన్న రామయ్య తమ్ముడితో.

– "అన్ని సంచుల్లో పెరిగిన గడ్డంతా పెరికేసే లోపన్నే మళ్లీ మొలుస్తున్నది సారూ."

– "యింత ఎండ మీద వచ్చింగ్రేం సార్" అంటూ వచ్చాడు అంతలనే చిన్న రామయ్య కూడా.

– "నువ్వుంటావో లేదో చూద్దామనీ, మొక్కలు మంచిగ జూసుకుంటున్నావో లేదోనని" అన్నాడు జయరాజ్ కొంచెం గమ్మత్తు చేస్తూ.

– "మీ కండ్ల ముందున్నాయిగద సార్ మొక్కలు. యియి బెరిగితేనే గద పైసలొస్తయి."

– "ఏం రామయ్యా, మరి తవిసి, కొడిశ చెట్లు పెంచితే లాభమేమిటి" అన్నాన్నేను.

– "లాభమంటే యిప్పటికిప్పుడె దెలుస్తద సారూ. అయినా యియిన్ని మాకు బనికొచ్చెసెట్లే గద. అడవిల సెట్లు దగ్గుతున్నయి సారూ. మరింక మనమే బెంచాలె"

– "మరి ఒకపక్క చెట్లు గొడుతున్నారుగద."

– "సారూ, సెట్లు గొడుతున్న మాట నిజమేగానీ, ఒక్క కోయలు గొడతలేరు సారూ. మేం గొడితె కేసులు బెడతారు, దండగేస్తరు. కాలనీలిచ్చింద్రు గవర్మెంటోళ్లు. దానిగ్గాడ కొయ్య గొట్టనిస్తలేదు. యిన్ని సెక్కుపోస్టులుండీ నాన్‌ట్రైబు లారీలకు లారీలు సెట్లు దోల్తదు. మేం బతకడానికి పొడుగొడితె ఫారెస్టు సార్లు కేసులు బెడతరు."

"పోడుగొడితే అడివి తరుగుతుంది గదా" అన్నాను.

– "మల్ల అండ్లనే టేకు సెట్లు, నీలగిరి సెట్లు బెడతరు. ఆ టేకుసెట్లు, నీలగిరి

సెట్లు ఎవురికోసం సారూ? మా కోసమా? దానికింద గడ్డికూడా మొలవది. అడివి నరికి టేకు సెట్లు, నీలగిరి సెట్లు బెడితే అడివి బెరుగుద్దా సారూ?అమ్ముకునేటోడికి అడివీ, బతకడానికి సెట్టుగొట్టినోడి మీదకేసులు. యిండ్ల బుట్టి యిండ్ల బెరిగినోల్లు యిప్పుడు దొంగలయింద్రు. బైట నుంచొచ్చి మాన్లు నరికి, మిల్లు బెట్టి, మొద్దులు జేసిప్పం బంపెటోళ్లు దొరలయింద్రు. మొక్కలు బెంచంద్రి అని మీరు మాకు జెప్తరు. నాన్‌ట్రైబుకెవరు జెప్తున్నరు సారూ. నేననేది నాన్‌ట్రైబు గొట్టిండని కోయలు కూడా అడవిగొట్టాని గాదు" అంటూ తన ఆవేదనను చక్కగా వ్యక్తం చేశాడు చినరామయ్య.

గిరిజనేతరులు అడవికొడుతూంటే దాన్ని అడ్డుకొనేవాడెవడని సూటిగా ప్రశ్నిస్తూంటే ఏం సమాధానం చెప్పాలో తోచలేదు నాకు. మన అభిరుచులను ఘనంగా చూపించుకోవడానికి మన యింటి గదులన్నీ, సమావేశ మందిరాల్నీ నగిషీలు చెక్కిన కలపతో తయారు చేస్తూ పొట్టకూటి కోసం పోడుగొట్టేవాళ్లని పోడుగొట్టొద్దని చెప్పడం ఎంత వరకు సమంజసమో అర్థం కాక అలాగే నిలబడిపోయాను.

– "ఏమనుకోవొద్దు సార్ నేనిట్టన్నని" కొంచెం నొచ్చుకుంటూ అన్నాడు చిన రామయ్య.

– "లేదు రామయ్యా నువ్వన్నది వాస్తవమే. కానీ... " తరువాత ఏం మాట్లాడినా అసంబద్ధంగా ఉంటుందనే ఆశక్తతతో తిరిగి వచ్చేశాను పాలవంచకు.

❖ ❖ ❖

22. మొట్లు : నరికివేసిన చెట్ల మొదుళ్లు. గిరిజన ప్రాంతంలోని పోడుగొట్టిన భూముల్లో యిటువంటి మొదుళ్లు చాలా ఉంటాయి. సంవత్సరాలు గడిచేకొద్దీ క్రమేణా యివి తీసివేయబడతాయి.



# చీకటి మండలం

వర్షాకాలం. వాగులు పొంగే రోజులు.

దట్టమైన అడవి. ఆ అడవి మధ్య వళ్లంతా తడిసిన కాలిబాటలు. ఏవో ఒకటి రెండు మాత్రమే జీపు వెళ్లగలిగేంత విశాలంగా ఉన్నాయి. దారి కిరుపక్కలా చాలా ఎత్తుగా పెరిగిన చెట్లూ. ఆ చెట్లమొదళ్ల నుంచి పెరిగి దారికడ్డంగా అల్లుకుంటున్న పొదలు. వీటిని నెట్టుకుంటూ జీపు ముందుకు పోతుంది. తన అనుభవాలను కథలుగా చెప్తూ వీరాస్వామి ఎర్ర మారుతీ జిప్సీనీ ఆ దారుల వెంట తిప్పుతున్నాడు. యిలా వెళుతూ ఉండగా కన్పించింది. ఎదురుగా ఓ పొంగుతున్న వాగు వీరాస్వామి కథ చెప్పడం మానేశాడు.

"అయ్యా యిదసలే మారుతి. నీళ్లలో దిగితే ముందుకు సాగదు. పోనీ యిక్కడ్నే ఉండిపోదామా అంటే ఈ వానెప్పుడు ఆగుద్దో తెలుస్తలేదు. శంభునిగూడేనికి యింకా పది కిలో మీటర్లుంటది. ఆడ్నుంచి ఎన్నెల బైలు యింకా శానా దూరముంటది. మనమియన్ని జూసుకోని పొద్దుగూకేలకు యింటికి బోతమా అని నా అనుమానం" అంటూ జీపాపేశాడు. దట్టమైన అడవిలో, అంతకు ముందే ఓ చోట చక్రాలు బురదలో దిగిపోతే అరగంట సేపు నేనూ, అటెండరు భూషయ్య, వీరాస్వామి ముగ్గురం కుస్తీ పట్టీ చివరకు చావు దప్పి కన్నులొట్టబోయినట్టు వళ్లంతా బురదతో, తలంతా చిత్తడితో, బట్టలు మొత్తం నీటి బుగ్గలా తయారైయ్యాయి.

చివరకు ఎలాగైతేనేమి శంభుని గూడెం చేరుకున్నాం.

ప్రాజెక్టు అధికారిగా నేను చార్జి తీసుకుని నెల దాటింది. ఈ నెలరోజుల్లోనే గోదావరి వరదల ప్రభావం చూశాను. ఖమ్మం జిల్లాలో పూర్తిగా వెనుకబడిన మండలాలు వర్షాకాలంలో దీవుల్లాగా తయారౌతాయి. అటువంటి వాటిలో గుండాల మండలం ఒకటని తెలిసింది. వర్షాలు ముదిరిగే నవంబరు దాకా వెళ్ళడం సాధ్యం కాదనికూడా తెలిసింది. అందుకే వర్షాకాలంలో మొదట్లోనే గుండాల మండలం చూడాలనుకున్నాను.

శంభుని గూడెం, చెట్టిపల్లె వెళ్ళడానికి ప్రధాన కారణం ఆ రెండు గ్రామాలు అడవి మధ్యలో ఉండి, చేరుకోవడానికి కష్టమవడం. అటువంటి సుదూర గ్రామాలను

మొదట చూడాలని నాకోరిక. దానికి అవకాశాన్ని వెంటనే కల్పించింది ఆ రెండు గ్రామాల్లో నిర్మాణాలో ఉన్న రెండు చెక్‌డ్యాములు.

శంభుని గూడెం గ్రామం దగ్గర దున్నపోతుల వాగు మీద కట్టే చెక్‌డ్యాం బాగా పెద్దది. ఇంజనీరింగ్ చదివి తను స్వతంత్రంగా బ్రతకాలనే ఉద్దేశం ఉన్న ఓ యువకుడు చేస్తున్న ప్రయత్నమిది. ఎవరైనా సొంతంగా, కొంచెం కొత్తగా ఏదైనా చేయదల్చుకుంటే మన వ్యవస్థ, దాన్ని కాపాడాలనుకునే ఉద్యోగులు, అధికారులు ఏవో కొన్ని అవాంతరాలు కల్పిస్తూనే ఉంటారు. అవరోధాలు దాటుకొని ముందుకెళ్లగలిగే వాళ్లు చాలా తక్కువ మంది. అందుకే యీ గొడవలన్నీ ఎందుకనుకొని చాలా మంది విద్యావంతులైన నిరుద్యోగులు ప్రభుత్వోద్యోగం వచ్చేదాకా నిరుద్యోగులుగా ఉండడానికే యిష్టపడతారు.

అయితే శంభుని గూడెంచెక్ డ్యాం కడుతున్న యువ ఇంజనీరు బాబు అటువంటి అవరోధాలను అధిగమించాలనే పట్టుదలతో ఉన్నట్టున్నాడు. వాస్తవానికి ఆ సమయంలో కార్యనిర్వాహక ఇంజనీరుగా ఉన్న భాస్కరరావుగారు ఆ బాబుకు కొంచెం ప్రోత్సాహమిచ్చాడు.

అయినా బాబుకు కొన్ని యిబ్బందులుండిపోయాయి. ఆ యిబ్బందుల్లో మొదటిది చెక్ డ్యాం మీద పని చేసే గిరిజనులకూ యితర కూలీలకు తొందరలో రాబోయే ఓ పండగకు ముందే జీతాలివ్వాలనేది. చెక్ మేజర్ చేస్తే గానీ బిల్లు చెయ్యరు. బిల్ చేస్తే గానీ అది పాస్ కాదు. దాన్ని మళ్లీ బ్యాంకుకు పంపించాలి. ఆ బ్యాంకు శంభునిగూడేనాకి డెబ్భై కి.మీ.ల దూరంలో ఉంది. బ్యాంకుకు తీసుకుపోయి డబ్బు తీసుకోవాలి. అప్పుడే కూలీలకు డబ్బు పండగలోపల యివ్వడం సాధ్యమవుతుంది.

అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంతలేదన్నా ఒక్కో పని ఓ అధ్యాయం, ఒక్కో అధ్యాయం ముగియడానికి ఓ వారం చొప్పున పడుతుంది ఎవరూ చొరవ తీసుకోకపోతే.

అలా అన్ని వారాలు ఓపిక పడతే కూలీలకు జీతాలు వచ్చే ఏడాది రాబోయే పండక్కు ముందే యివ్వచ్చు. కానీ బాబు యివ్వాలనుకుంటున్నది యీ ఏడాది రాబోయే పండగకు. అందుకని సత్వర మార్గమేమైనా ఉంటుందేమోనని కనుక్కోవడానికి స్వయంగా వచ్చాడు బాబుపాలవంచకు. గిరిజన ప్రాంతంలో కూడా అన్ని నిబంధనలు పాటిస్తూ కూచుంటే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. అందుకే సత్వర పరిష్కారమే ఐటిడిఎ ధ్యేయం. ఈ బిల్లేదో యిచ్చే లోపులే శంభునిగూడెం చెక్‌డ్యాం నేనోసారి చూస్తే బాగుంటుందనే ఉద్దేశం కలిగింది నాకు. అందుకే పండక్కు ముందే ముహూర్తం పెట్టాను.



ఈ లోపుల వెన్నెల బయలు నుంచి కుంజా చిన రామయ్య వచ్చాడు. వెన్నెల బయల్లో తనో చెరువు పని తీసుకున్నానని, దాని బిల్లు తొందరగా రావడం లేదనీ, అదీ గాకుండా దాని పని తను సరిగ్గా చేయలేదని సార్లంటున్నారనీ, నువ్వోసారి వచ్చి చూస్తే మంచిదనీ చెప్పాడు.

గిరిజన ప్రాంతంలో గిరిజనులే ప్రభుత్వ పనులు తీసుకొనిచెయ్యాలని నిబంధన ఉన్నా, వాస్తవంలో అది జరగడం తక్కువ. దానికి కారణాలు చాలా ఉన్నాయి. తాలూకాకు ఒకరన్నట్టుగా చింతూరు ప్రాంతం నుంచి ఆ బొర్రయ్య ఒకడు, భద్రాచలం ప్రాంతం నుంచి చటాకు ఒకడు, గుండాల నుంచి యీ చిన్నరామయ్య ఒకడు తప్పించి గిరిజనుల్లో తరచుగా పనులు తీసుకొని చేసే వాళ్లు చాలా తక్కువ. మిగిలిన వాళ్లంతా అక్కడొకరూ, అప్పుడొకరన్నట్టుగా ఉంటారు. మరి అటువంటప్పుడు చిన్నరామయ్య అది పనిగా యిక్కడ దాకా వచ్చి తనకేదో యిబ్బంది ఉందంటే తన ఊరి దాకా వెళ్లి ఆ సంగతేదో పరిష్కారం చెయ్యడం కర్తవ్యమనిపించింది.

శంభుని గూడెం దట్టమైన అడవి మధ్య ఉంది. వర్షాకాలం గాబట్టి అప్పుడప్పుడూ కురిసే జల్లులతో పులకరించే చెట్లూ మంద మందంగా వీచేగాలికి తలలూపే జొన్న చేలూ, గలగలపారే సెలయేళ్లూ, పైన తేలిపోతూ, మూసుకుంటూ, తెరుచుకుంటూ దోబూచులాడే మబ్బులతో, లేత ఎండలో బంగారు నీలికాంతులీనే కొండలతో, అద్భుతంగా ఉంటుంది.

దున్నపోతుల వాగు శంభుని గూడెం మీదుగాపోతుంది. వాగు చాలా పెద్దది. ఆ నీళ్ల గలగలలు చాలా దూరం వరకూ వినవచ్చు. ఆ వాగు మీద చెక్‌డ్యాం కడితే కనీసం ఓ రెండొందల ఎకరాలు పారించవచ్చు. చెక్‌డ్యాం పని చూశాక బాబుకు వెంటనే బిల్లివ్వమని చెప్పాను.

చెట్టిపల్లె దగ్గర కోయలే ఓ చిన్న అడ్డుకట్టవేసి పొలాలు తడుపుకుంటున్నారు. అక్కడా ఓ చెక్ డ్యాం నిర్మాణంలో ఉంది. వీటి రెండింటినీ చూసి వెన్నెలబైలు బైల్దేరాను.

వెన్నెలబైలు. ఎంతచక్కటి పేరు! గిరిజన సీమలో నాగరికత లేదన్నవాడెవడు? వారి నాగరికత వారిది! కొండరెడ్ల చక్కటి తెలుగూ; కోయలరేలపాటా[23] దీనికి నిదర్శనం.

వాన చిత్తడికి అప్పటికప్పుడే పుట్టుకొచ్చి వెన్ను తీసిన రెల్లు పూలూ; అడివి పూల పొదలు అల్లుకున్న బండ్లబాటా; నిలువెత్తు పెరిగి నిగనిగలాడే ఆకులతో కుబుసం విడిచే పాములా కసకసమని సందడిచేసే కొండజొన్న చేలూ, చిరుజల్లులకు మురిసిపోయే

అడివిచెట్లూ దాటుకొని అడివి మధ్యలోనే ఉన్న వెన్నెలబైలు చేరేటప్పటికి దాదాపు రెండున్నర కావస్తోంది.

చిన్నరామయ్య చెరువు దగ్గరే ఉన్నాడు.చెరువు చూసి దానికీ బిల్లు యివ్వమని చెప్పి యింజనీరు భాస్కరరావు గారికి చెప్పాను. తాను సరేనన్నాడు.

వర్షాకాలంలో గిరిజన ప్రాంతంలో మూడు గంటల నుంచి వాతావరణం చాలా తొందర తొందరగా మారుతుంది. హిమాలయాల్లో కూడా మధ్యాహ్నం రెండు గంటల నుంచి వాతావరణం పూర్తిగా మారిపోతుంది. పెనుగాలి వీయవచ్చు భారీ వర్షం రావచ్చు. గిరిజన ప్రాంతం అరణ్యమయం గాబట్టి వర్షాకాలంలో వర్షం జల్లులు జల్లులుగా పడుతూనే ఉంటుంది. ఈ వర్షానికి వాగులు పొంగుతూ ఉంటాయి. సాయంత్రం వేళ మబ్బు ఆకాశాన్ని మూస్తే, చీకటిలో, వాగుల్లో చిక్కుకుపోతే యిల్లు చేరడం కష్టం. అందుకే వెన్నెలబైలు నుంచిచాలా తొందరగానే బయలుదేరాం.

చెట్టిపల్లెకి దగ్గర దగ్గరగా వస్తుండగా జొన్నచేలో ఖాకీ బట్టలు వేసుకొని తుపాకి పట్టుకున్న ఓ యువకుడు కన్పించాడు. భూషయ్యా, వీరాస్వామి భావయుక్తంగా చిన్న నవ్వు నవ్వారు. నాకు కొంచెంసేపటి వరకూ అర్థం కాలేదు. చిరవకు భూషయ్యే అన్నాడు "అయ్యా, బాటన్న యిక్కడెక్కడ్నో ఉన్నట్టుంది. తమర్ని గలుస్తడేమో, ఆఫీసర్లను గలుస్తుంటారు వాళ్లు. అన్నట్టు బాటన్న గుండాల మండల ప్రెసిడెంటుకు తండ్రి. బాటన్న దళం వాళ్లకు ఒక ఎమ్మెల్యే కూడా ఉన్నాడు. అతనే ఇల్లందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య' అన్నాడు యింకొంచెం దూరం వెళ్లేటప్పటికి ఖాకీ బట్టలు కట్టుకొని తుపాకీ పట్టుకొని యింకో యువకుడు నిలబడి ఉన్నాడు. యిలా చెట్టిపల్లి ఆశ్రమ పాఠశాల చేరేటప్పటికి పాఠశాల చుట్టూ వలయాకారంలో ఓ అరడజను మంది ఖాకీ నిక్కర్లు, చొక్కా తొడుక్కొని తుపాకులు ధరించిన యువకులు కాపలా కాస్తున్నారని అర్థమయింది. కానీ అరడజను మంది కాపలా కాయడం దేనికో వెంటనే నాకు తోచలేదు.

'అయ్యా, బాటన్న గూడెంలో ఎక్కడ్నో ఉన్నాడేమో, మీకు కబురు బెడతడేమో! తనొచ్చి మాట్లాడతనంటడేమో! ఏమడుగుతడో? మనెంట పోలీసు లొచ్చింద్రేమో ననుకొని యీల్లంతా జూస్తున్నరు. ఊర్లో బాటన్నున్నడని ఎవ్వరైన పోలీసులకు జెప్తరేమోనని ఊరి సుట్టు కాపల గాస్తున్నరు" అన్నాడు డ్రైవరు వీరాస్వామి.

ఇదంతా చాలా మామూలు వ్యవహారంలా ఉంది భూషయ్యకూ, వీరాస్వామికీ.



కానీ నాకు మాత్రం కొంత ఆతృతగా ఉంది. అయితే ఈ విషయం ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకొని పోవాలని అనుకున్నాను. ఓ ఏడునెలల కిందట తూర్పుగోదావరి జిల్లాలో చాలా మంది ఐఎయస్ అధికారులను నక్సలైట్లు పట్టుకొని ఉండడంవల్ల, యిప్పుడు జరగబోయేది ఎలా ఉంటుందనే దాన్ని గురించి కొంచెం ఎక్కువగానే ఆలోచించాన్నేను.

చెట్టిపల్లెలో ఆశ్రమ పాఠశాల జొన్నచేల మధ్యే ఉంది. ఒక షెడ్డు పూర్తిగా పాతబడింది. అది ఏనాడైనా కూలిపోవచ్చని దాన్ని మూసివేసి, చోటు చాలకున్నా రెండో షెడ్లోనే స్కూలూ, హాస్టలూ నిర్వహిస్తున్నారు. గుండాల మండలంలో నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించడం కొంచెం కష్టం.

శంభుని గూడెం స్కూలూ, డి.ఆర్.డిపో[24] మొదలుపెట్టి ఎన్నో రోజులు కావస్తున్నా యింకా పూర్తి కాలేదు.

ఆశ్రమ పాఠశాల కార్యక్రమాలు అయిపోయి పిల్లలు మధ్యాహ్నం భోంచేసి బయట ఆడుకుంటున్నారు. మా భోజనం ఆశ్రమ పాఠశాలలోనే. వారి కోసం చేసిందే. భోం చేసే సమయం దాటిపోయిచాలా సేపే అయినా బాటన్నవచ్చి వెళ్లిన తరవాతనే భోం చేద్దామను కున్నాను.

పదిహేను నిమిషాలు గడిచాయి. బాటన్న గారు రాలేదు. మీరు భోంచెయ్యండయ్యా" అంటూ నీళ్ల తెచ్చేడుభూషయ్య. చివరిసారి, యింకో ఐదు నిమిషాలు చూద్దామనుకుంటుండగా ఖాకీ నిక్కరు, చొక్కాతో చామన చాయతోఅంత సున్నమూ లావూ గాని శరీరంతో, కొంచెం పొట్టిగానే ఉన్నాడనిపించే తలనెరిసిన వ్యక్తి తుపాకీ భుజానికి తగిలించుకొని రావడం గమనించాను. కాళ్లకు కిర్రు చెప్పులున్నట్టున్నాయి. ముకం మీద ముడతలున్నా, కళ్లలో కాంతి తగ్గలేదు. ఏదో చేయాలన్న ఆకాంక్ష మనిషి నడకలో కన్పిస్తోంది. తన నడక తీరు చూస్తుంటే గౌరవమూ, తను చేస్తున్న పని చూస్తే ఆశ్చర్యమూ కలుగుతాయి.

బాటన్న గారు కాస్త నిదానంగా, వివరంగా మాట్లాడానలుకున్నట్టు చెప్పారు. భోజనానికి సిద్ధమవుతూ ఉన్న వాళ్లం గాబట్టి బాటన్నగారిని కూడా భోజనానికి కూచోమనే చెప్పాం. "పరవాలేదు మీరు ముందు కానివ్వండి" అన్నాడు బాటన్న కొంచెం మొహమాటపడుతూ. నా చుట్టు ప్రక్కల ఉన్నవాళ్లలో సందేహాశ్చర్యాలు దోబూచులాడుతున్నాయి. మనందరమూ చూసిన, విన్నబాటన్నే అయినా తుపాకీ భుజం మీద పెట్టుకొని ఉన్నాడు కాబట్టి ఏం చేస్తాడోననే సందేహమూ; కొత్తగా, మొదటిసారిగా

యీ ప్రాంతానికి, అడివిలోకి ఒంటరిగా వచ్చిన యీ ప్రాజెక్టు అధికారి యీ బాటన్నతో ఎలా ప్రవర్తిస్తాడో అనే ఆశ్చర్యమూ మిళితమై ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. చివరకు "మీరు యిద్దరూ ముందు భోంచెయ్యండి సార్" అని హెడ్మాస్టరు గారుచెప్పేశారు.

భోజనం చేస్తుండగా దాదాపు పరిచయమయిపోయా ఒకరికొకరం. యిక్కడో విషయం చెప్పాలి. ప్రభుత్వ అధికారిగా పనిచేస్తున్న నేనూ, ఈ వ్యవస్థలో లోపాలను తీవ్రంగా ఎత్తిచూపే బాటన్న యిద్దరం కలవడం అసంబద్ధం. కానీ యిప్పటి కలయిక కాకతాళీయం. అలా అని చెప్పి నేను కలవనని చెప్పడం అసమజంసం. "వినదగునెవ్వరు చెప్పిన వినినంతనే వేగపడక...." కలవకుండా తప్పించుకొని పోవాలనుకోవడం అవమానకరం. యిప్పటి పరిస్థితుల్లో కలిసి మాట్లాడి పోవడమే ఉచితమనిపించింది. అందుకే తనతో మాట్లాడుతున్నప్పుడు ఎటువంటి ఆందోళన కలగలేదు నాకు. యిద్దరు వ్యక్తులు ఎక్కడో అడవుల్లో నివసించే వారి కోసం పని చేస్తూ కలిసి మాట్లాడుకుంటున్నట్లనిపించింది.

ఈ లోపులే బయట మెల్లమెల్లగా జనం చేరుతూ ఉన్నారు. ఆశ్రమ పాఠశాల పిల్లలే అరవై మంది దాకా ఉన్నారు. చెట్టిపల్లె ఊరిజనం, శంభుని గూడెం వాళ్లు మొత్తం కలిసి దగ్గర్లో ఉన్న జొన్నచేను దాకా నిండిపోయారు. కొత్తగా వచ్చిన అధికారి ఎలా ఉన్నాడో చూడాలనే కోరిక ఎక్కువగా ఉన్నట్టుంది తోసుకుంటున్నారు.

బైటికొచ్చి వరండాలో కూచున్నాం మేమిద్దరం. శంభుని గూడెం నుంచి వచ్చిన వాళ్లలో ఒకతను "మా కాడికి వస్తరా సారూ" అంటూ ముందుకొచ్చాడు – "ఆడికి కూడా వస్తదు లేవయ్యా, కొంచెం నిదానించండి" అన్నాడు బాటన్న.

– "మీరు ఈ వయసులో తుపాకీ పట్టుకొని యిలా గ్రామాల వెంట తిరగడం యిబ్బందిగా లేదా?" అడిగాన్నేను.

– "అలవాటయిపోయింది సార్. యిప్పటి సంగతి కాదు. దాదాపు యిరవై అయిదేండ్లయిపోయె. తిరక్కుంటేనే యిబ్బంది. తిరక్కుంటే యిక్కడ పనులవుతయా?" అన్నాడు బాటన్న.

– "పనులు జరగడానికి తుపాకీ పట్టుకొని అడవుల వెంట తిరగడమెందుకూ?"

– "తుపాకీ లేకుంటే బతకడం కష్టం సార్. ఏ రోజు ఏమైతదో? ఊళ్లలోకి పోవుడైతే కుదరది. యిక్కడైనా మమ్మల్ని పోలీసులు ఉండనియ్యరుగద. ఎప్పుడూ తరుముతూనే



ఉంటారు. కూలిరేట్లు బెరుగతయా, తునికాకు ధర బెరుగుతదా ఈ తుపాకీ లేకుండానే?"

– "అసలు తుపాకీ ఎందుకు పట్టుకున్నారు మీరు? తుపాకి పట్టడం నేరమని తెలియదా?"

– "పెద్ద పెద్ద సిద్ధాంతాలు తెలవయిసార్. కానీ అన్యాయం జరుగుతుండదని తెలుసు. అదెందుకుని అడిగిన నేను వయసుల ఉన్నప్పుడు. దానికి జవాబు రాలె. నన్నే ఏదో చెయ్యబోయింద్రు. నేను తిరగబడ్డ. కొట్లాటలు మొదలయినవి. నేను చేసేది నేను జేసిన. నా వెంట పోలీసులు బడ్డరు. ఊళ్లల్లో దొరలట్టనే ఉన్నరు. అన్యాయం ఎందుకు జరిగిందని అడిగినోళ్లం తప్పుడొల్లమయినం. తుపాకీ బట్టుడు దప్పలే. అప్పట్నుంచి యింతే".

– "మరీ మీ కొడుకు మండలాధ్యక్షుడైనాడు కదా"

– "ఆ.... మా పార్టీకి ఎమ్మెల్యే గూడా ఉన్నడు. నా భార్య ఆస్టలో పని జేస్తది" అని యధాలాపంగా అన్నాడు.

– "మరి....."

– "మరేముంది సార్, దేనికదే. ఎమ్మెల్లే ఉన్నడని మమ్మల మంచిగ జూస్తరా? యీ తుపాకీ లేకుంట మమ్మల్ని పోలీసులు బతకనిస్తరా? యింకా శానా గ్రూపులుండయి గద. వాళ్లతో గూడా యిబ్బందే. అందుకని తుపాకీ వాడినా వాడకున్నా, అదుంటే దానికతే వేరు. యింకిప్పుడు ఊళ్లల్లోకి బోయి యాదుంటం? అవుగానిసారూ, యియన్ని జెప్పుకుంటా ఉంటే తరగది గాని యిక్కడదాక వచ్చింద్రు మీరు, మీకేమనిపిస్తున్నది?"

– "ఒక్కో ఊరు చేరడమే కష్టంగా ఉన్నది. బాగా వెనకబడి ఉంది ప్రాంతమంతా" అన్నాను.

– "ఇది చీకటి మండలం సార్. వచ్చి చూసెటోడు లేడు. ఫారెస్టోల్లది, పోలీసులది రాజ్యం. మీరన్నా ఏమన్న జెయ్యాలె సార్."

– "ఏం జెయ్యాలె? నేను మాత్రం పోలీసుల్లో, ఫారెస్టులో భాగం కాదా?"

– "చుట్టు పక్కన ఉన్న వాళ్ళంతా ఒక్కసారిగా శెట్టిపల్లె, శంభునిగూడెం మీదుగా దావరతోగు దాకా రోడ్డు గావాలె" అని చెప్పారు.

– "అదే నేను జెప్పేది సార్. ఈ అడవిలో బడి ఎన్నాళ్లు జస్తం సార్. బైటికి

రావడానికి ఎన్ని మైళ్లు నడిసేది? గుండాలకు ఈడికి పాతిక కిలోమీర్లుకు పైన ఎంతని నడుస్తం?" అన్నాడు బాటన్న.

– "యింకా...."

– "మండలం మండలం నీటిబుగ్గ సార్. వానాకాలంలో ఎన్ని నీళ్లు దండగ బోతయో సెప్పలేం. ఆ భీమునిపాదం సెరువుబోస్తె వెయ్యేకరాలు పారుద్ది. యింగ ముత్తారం దగ్గర నిమ్మవాగుకు సెరువుబోస్తే కనీసమంటె 500 ఎకరాలు బారుద్ది. యింగా యిప్పుడు బోస్తున్న సెరువులు గట్టిగ బొయ్యాలె. తొందరగా బొయ్యాలె. అన్నట్టు పోళ్లుగొట్టి సేస్తున్న బూవులు శానా ఉన్నాయి. వాటికి పట్టాలియ్యాలె. ఫారెస్టోల్లు యిప్పటికే పంట ఎయ్యి నిస్తలేదు. యిక్కడందరు కోయలె"

– "మరి యివ్వన్ని రాత పూర్వకంగా యిస్తే మంచిది గదా" అన్నాను.

– "అదే సార్ గవర్మెంటుతో వచ్చిన చిక్కు అన్ని రాసియ్యాలె అంటరు. మీకే జెప్తున్నం గద! సరె పోనియ్యండి మీరంతగా జెప్తుంటె రాసిస్తం" అన్నారు బాటన్న.

– "మీరిట్లా ఎప్పటికప్పుడు సమస్యలు మా దృష్టికి తెస్తూ ఉంటే మంచిది కదా. పోలీసులకు కన్పించకుండా ఎన్నాళ్లు యిలా తిరుగుతారు?"

– "పోలీసులు గూడా మీలో భాగమే గద సార్. అయినా మీతో ఎందుకు మాట్లాడుతున్నమంటరు? చెప్పిన మాట వినెటోళ్లుంటే, పనిచేసేటోల్లుంటే చెప్తము. లేకుంటే దౌర్జన్యమే గతి. అయినా మేం ఎన్నికల్లో దిగినం గద. మా అంతట మేమేం జెయ్యం ఉజ్జోగస్తులంత ఎవురిపని వాల్లు మంచిగ జేసుకుంట బోతే వాల్లను కూడా ఏమనం"

– "ఉద్యోగస్తులు సరిగ్గా నడుచుకోకపోతే దండించడానికి ప్రభుత్వ ముంది గదా?" అన్నాను.

బాటన్న నవ్వి ఊరుకున్నారు. ఆ నవ్వుకు ఏవో అర్థాలున్నట్టున్నాయి.

❖ ❖ ❖



# ప్రశ్నల శర్మ గారు

అడవంటే ఏమిటి? చాలా చిన్న ప్రశ్న తనకు తానే వేసుకున్నారు శర్మగారు. ఇది వినేవాళ్లకు కొంచెం సేపటివరకూ కాస్త అయోమయంగా అనిపించింది. ఎందుకంటే మనలో ఎక్కువ మందికి అడవంటే తెలిసిందీ యింత మాత్రమే. చెట్లూ, పుట్టలూ, వాగులూ, వంకలతో వన్యమృగాలతో కూడిన ప్రాంతమని. జనావాసాలకు దూరంగా ఉండి నివాస యోగ్యంకని ప్రాంతమని అక్కడ వింత వింత వేషాలతో కోయలూ, కొండదొరలూ ఉంటారని, సరదాగా వేటాడ్డానికి పనికొస్తుందని. కానీ శర్మగారి వివరణ వింటే కొత్త అర్థాలు గోచరించాయి. "అడవంటే చెట్లూ పుట్టలుకాదు. అడివంటే నరికి ముక్కలు చేసి మంచాలూ, కుర్చీలు చేసుకోవడానికి పనికొచ్చే కొయ్య దుంగలు కాదు. అడివంటే డబ్బున్నవాళ్ల అవసరాలు తీర్చడానికి పనికొచ్చే వనరు కాదు. సరదాగా వేటాడ్డానికి పనికొచ్చే చోటు కాదు. అది అనాదిగా మానవ జాతికి సంక్రమించిన ఆస్తి. అడవిలో నివసిస్తున్న ప్రజలకు జన్మ స్థానం దానిపై ఆధారపడి ఉన్న వాళ్లకది కన్నతల్లి. అందుకే దాన్ని అడవి తల్లి అంటారు అందులో నివసించేవారు" అంటారు శర్మగారు.

– "మరి అడవెందుకు?"

"అడవి కొందరి సొమ్ము కాదు. అడవిలో నివసించేవారికి లేని హక్కు అడవి బైట ఉండే వాళ్లకు అసలు లేనేలేదు. డబ్బున్న, తెలివున్న వాళ్ల అభివృద్ధి కోసం అడవిలో నివసించేవాళ్లు బికారులు కానవసరంలేదు. ఒకరి ప్రగతి కోసం యింకొకరు బలి కానక్కరలేదు. దేశ ప్రగతి కోసం మూగ జీవులు రోధించనక్కరలేదు. పట్టణాల్లో సౌధాలు లేస్తే కొండకోనల్లో జమలు అలమటించి బికారులు కానక్కరలేదు. అందులో నివసించేవారికి జీవనాన్ని,పట్టణాల్లో ఉన్న వారికి కొన్ని అవసరాలను తీర్చే సమిష్టి సంపదే అడవి. అడవంటే అందం. అడవంటే ఆస్తి. అడవంటే ఆధారం. అడవంటే ఓ జీవనానికి ఆయువుపట్టు" అని శర్మగారి వాదన.

ఆయన వేసే చిన్న చిన్న ప్రశ్నలకు సమాధానాలు చిన్నవి కావు. కొత్తకొత్త అర్థాలు, కొత్తకొత్త ఆలోచనలు పుట్టించారాయన.

మొదటిసారి వో సెమినార్లో కలిశాను శర్మగారిని. అది గిరిజన సమస్యల గురించి

కూలంకషంగా చర్చించడానికి ఏర్పాటు చేసిన సెమినారు. దానికి ప్రధాన వక్త ఆయనే. ప్రధాన వక్తలు ప్రధాన సమస్యలకు పరిష్కారాలను వ్యవస్థకు దెబ్బ తగలకుండా సూచించడం మామూలే. కానీ, బీడీ శర్మగారలా కాదు. వ్యవస్థలోని అవస్థలను మనం రూపుమాపొచ్చు అంటారు. దానర్థం విప్లవం బోధిస్తున్నాడని కాదు. ఆయన విప్లవాత్మకమైన మార్పులు కోరుకుంటాన్నాడేమోకానీ, విప్లవకారుణ్ణని ఎప్పుడూ చెప్పుకోలేదు. ఇదే వ్యవస్థలో మార్పు తేగలమనే నమ్మకముందాయనకి. దాని కోసం ఆయన కోరుకునేది కేవలం రెండేనేమో! ఎప్పుడో బ్రిటిషు వాళ్లు తయారుచేసిన చట్టాల్లో మార్పులూ, యిప్పటి అవసరాలకూ, పరిస్థితులకు తగిన విధంగా చదువుకున్న వ్యక్తుల్లో దేశానికెంతో కొంత సేవ చేయాలన్న ధ్యాస. ఇవి రెండు జరుగుతాయన్న ఆశ, దానికి తన వంతు కర్తవ్యం నిర్వర్తించాలన్న నిబద్ధతా ఆయన్ని నడిపిస్తున్నాయి.

తెల్లగా, బాగా పొడుగ్గా ఉండి, ఖద్దరు లాల్చీ, ధోవతితో, మామూలు చెప్పులతో మాసిపోని చిరునవ్వుతో వడివడిగా నడిచే ఆ ఆజానుబాహుణ్ణి చూస్తే ఆయనో ప్రభుత్వాధికారి అని, అందునా ఓ ఐయ్యేయస్ అధికారని నమ్మడం కొంచెం కష్టమే. ఆయన మాటలు వింటే, ఆ భావాలు చదివితే ఆయనో ప్రభుత్వాధికారి అని నమ్మడం యింకా కష్టం. ఆయన ధ్యాసంతా బడుగువర్గాల సంక్షేమమే. అందునా మరీ ముఖ్యంగా షెడ్యూల్డు కులాలూ, జాతుల గురించి. అందుకే ఆయన ఎన్నో ఆశనిరాశలూ, ఒడిదుడుకులూ వోర్చుకొని జాతీయ స్థాయిలోని షెడ్యూల్డు కులాలూ, జాతుల కమీషనరుగా ఉండేవారు కొంతకాలం.

ముప్పై సం॥ల కిందట మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బస్తరు జిల్లా కలెక్టరుగా పని చేసి ఆదివాసుల సమస్యలను అర్థం చేసుకోవడలో వారికి వారే సాటి అని పేరు తెచ్చుకున్నారు. ఆ బంధమీనాటికీ తెగలేదు.

“సార్, మీ ఆలోచనలను ఆచరించే దాని కోసం మేము చేయవలసిందేమిటో చెప్పండి” అని అడిగాన్నేను. ఆయన ప్రసంగం విన్న తరువాత నన్ను నేను పరిచయం చేసుకుంటూ.

– “మీరెక్కడ పనిచేస్తున్నారు?” అని అడిగారు.

– “పాలవంచలో”

– “పాలవంచ చుట్టు ప్రక్కల చాలా పరిశ్రమలు వచ్చాయి అవునా?”



– “అవునండీ.”

– “అక్కడ గిరిజనులున్నారా యిప్పుడు?”

– “పెద్దగా లేరుసార్. పాలవంచ యిప్పుడు మునిసిపాలిటీ అయింది.”

– “మీరు చేయగలిగిందేమిటో మీకర్థం కాలేదా?”

మౌనంగా ఉండిపోయాను నేను.

– “ఇంత భూమి పరిశ్రమల కోసం తీసుకున్నారు గదా. ఒకప్పుడు అదంతా అడవే కదా. అక్కడ ఎంతో మంది గిరిజనులు అంటే కోయలు, కొండరెడ్లు, గోండులు ఉండి ఉంటారు కదా. వారిని తరిమివేసి మనం పరిశ్రమలు స్థాపించుకోవాలా? ఆ భూమికి నష్టపరిహారం దాకా ఎందుకు? వాళ్లనడిగారా వాళ్ల భూమి తీసుకుంటున్నామని? ఎవరి ప్రగతి కోసం ఎవరు బికారులు అవుతున్నారు? మనందరి కోసం ఆ గిరిజనులు అయోమయంలో పడిపోవాలా?”

– “ఎంతో కొంత నష్టపరిహారం యిచ్చే ఉంటారు కదండీ!” అన్నారు అయిష్టంగానే.

– “వారి జీవితం కుదటుపడాలంటే మనం వచ్చే నష్టపరిహారం ఏపాటి. అయినా గిరిజనులు మన నష్టపరిహారం యిచ్చేదాకా వేచి ఉంటారా? వాళ్లప్పటికే ఏ అడవుల్లోకో వెళ్లి ఉంటారు. కొన్నాళ్లయిన తరువాత అక్కడికి కూడా వెళతాం మనం ఏదో ఖనిజముందని వెదుక్కుంటూ. వాళ్లు కొండల మీదికి పారిపోక తప్పదు. మన అభవృద్ధి మార్గానికి గిరిజనులు అడ్డుకట్టవుతూన్నరో, వారి అభివృద్ధికి మనం అడ్డుకట్టవుతున్నామో అర్థంకావడం లేదు. ఇప్పుడు బీహార్లోని ధన్‌బాద్ గొప్ప పారిశ్రామిక ప్రాంతం. ఒకప్పుడు అది గొప్ప అడవి. అక్కడి గిరిజనులందరూ ఎక్కడ? ఏమయ్యారు? అక్కడే రోజు కూలీలుగా మారారు. వారి జన్మస్థలంలోనే వాళ్లు అనామకులు, బికారులు” అన్నారు శర్మగారు.

– “మీరు పాలవంచ ఓసారి రావాలి సార్” అంటూ శర్మగారు.

– “వస్తాను కానీ బాగా దట్టమైన అడవిలో ఉండే కోయగూడేలు చూపిస్తారా”

– “వచ్చిం తరువాత మీరే నిర్ణయించుకుందురుగానీ” అన్నాను.

– “సరే, నేను ఢిల్లీ వెళ్లింతరువాత మీకు తెలియపరుస్తాను” అన్నారు.

– “సాధ్యమైనంత తొందరగా రండి సార్. ఎండలు ఎక్కువైతే కొంచెం యిబ్బందిగా

ఉంటుందేమో" అన్నాను ఆయన వయసును దృష్టిలో పెట్టుకొని.

– "ఏం ఫరవాలేదు అడివిలోకి వెళ్లదల్చుకున్న తర్వాత అటువంటివన్నీ ఆలోచించ కూడదు"

1989 మే నెల మొదటి వారం ఓ రోజు సాయంత్రం మా కలెక్టరు శ్రీ శర్మారావుగారు ఫోన్ చేసి "రేపు బీడీ శర్మగారొస్తున్నారు. కొన్ని గిరిజన గ్రామాలు తిరుగుతారట. దానిక్కావలసిన ఏర్పాట్లు చేయండ"ని చెప్పారు. వస్తే ఎప్పుడు ఎక్కడికి వెళదామంటే అప్పుడు అక్కడికి వెళ్లడమే కదా ఏర్పాట్లు చేయగలిగేదేముంది అనిపించింది నాకు.

అన్నట్టుగానే ఉదయం హైదరాబాద్ నుంచి రావడం తోటే "ఎక్కడికి వెళదాం" అని అడిగారు.

– "మంచి దట్టమైన అడవిలో ఉండే కోయగూడేలు చూద్దామని అన్నారు మీరు పోయినసారి కలిసినప్పుడు" అని గుర్తు చేశాను.

– "మీకింకా గుర్తుందన్నమాట. అయితే పూర్తిగా అడివిలో ఉండే గూడెమేది?"

వెంటనే పూసుకుంట, కటుకూరు గుర్తొచ్చాయి నాకు. పూసుకుంట పూర్తిగా కొండరెడ్డి గ్రామం. కటుకూరు పూర్తిగా కోయ గ్రామం. రెండూ ప్రక్క ప్రక్కనే ఉంటాయి. మంచి దట్టమైన అడవిలో యివి రెండే గ్రామాలుంటాయి. చుట్టూ కొండలతో దుర్భేధ్యమైన కోటలాగా అన్పిస్తుంది. పూసుకుంటను సంపూర్ణాభివృద్ధి కోసం ఎంపిక చేయడం జరిగింది. అందుకనే ఆ గ్రామంలో అన్ని రకాల కార్యక్రమాలు తీసుకోవడం జరిగింది. యివన్నీ చూపించవచ్చు గదా అని ఉత్సాహం కలిగింది. కానీ వెంటనే మనకు మంచివనిపించినవన్ని వాళ్లకు మేలు చేస్తాయంటారా?" అని ప్రశ్నిస్తారేమో అనిపించింది.

అయితే తనకున్న ఒక్క రోజులో దగ్గర్లో మంచి అడివిలో ఉండే కోయ, కొండరెడ్డి గూడేలవే కాబట్టి వాటి విషయమే చెప్పాను. వెంటనే ఒప్పేసుకున్నారు.

కానీ ఆ గ్రామాలకు వెళ్లబోయే ముందు కొత్తగూడెం దగ్గర గరిమెళ్లపాడు చూద్దామని చెప్పాను.పాలవంచకు వచ్చిన అతిథులందరికీ గరిమెళ్లపాడులోని ఫారం చూపించడం దాదాపు ఆనవాయితీ అయిపోయింది. అది చూపించి మేమెంతో సంతోషపడుతూ ఉండేవాళ్లం. అయితే అది చూపించడంతోనే నా కళ్లు తెరిపించారాయన.



గరిమెళ్లపాడు వెళ్లగానే ఆ పచ్చటి మొక్కలు గలగలపారే నీళ్లూ చూసిన ఆయనకు యీ సంపద యిందులో పనిచేసేవారే ఎందుకు అనుభవించ గూడదూ అనిపించిందేమో వెంటనే ఓ చిన్న ప్రశ్న వేశారు. "అడవంటే ఏమిటి" లాగ.

– "ఈ భూమి ఎలా వచ్చింది? మీకు"

– "గతంలో గిరిజనులకిస్తే దాన్ని వాళ్లు సాగుచేయకుంటే ప్రభుత్వం ఐటిడిఎకు కేటాయించారు."

– "నిజంగానే?"

– "నిజంగానే సార్" అన్నాడు ఫారం ఇన్‌ఛార్జీ శ్రీ నరసింహదాస్.

– "గిరిజనులు దీన్ని సేద్యం చేయలేదని ఖచ్చితంగా చెప్పగలరా?"

మౌనంగా ఉండిపోయాం. గతంలో యిటువంటి ప్రశ్నే నేనడిగాను కానీ యింతగా పెరిగిన యీ తోటను మనమిప్పుడు వీళ్లకి పంచగలమా అనే సందేహంతో ఉన్న నాకు యిప్పుడు ఆ ప్రశ్న శర్మగారడుగుతూ ఉంటే ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

– "గిరిజనులు ఆ మాట కొస్తే బీదవాళ్లు, ఉన్న కాస్త భూమిని ఎందుకు సాగు చేయలేకపోతున్నారో ఆలోచించారా? ఈ ఫారాన్ని ప్రభుత్వాధికారులే సరిగ్గా పెంచగలరని మీ నమ్మకమా?"

– "కాదనుకోండి. కానీ...."

– "కానీ లేదు గానీ, ఓసారి యిందులో పని చేస్తున్న వారినందర్నీ పిలిపిస్తారా' అని అడిగారు. అందర్నీ పిలిపించాం. వాళ్లలో ఓ ముసలమ్మను అడిగారు శర్మగారు. "ఏమ్మా నీ భూమి ఉందా యిందులో?" అని

– "అ.... పోడుగొట్టిన నాలుగెకరాల్లో రెండెకరాలు అడివిలోబోతె, రెండెకరాలు ఫారంలో గలిసిపోయింది" అంది ముసలమ్మ.

– "చూశారా? దీపం కింద నీడ. మనమేదో వాళ్ల మేలుకోసం చేస్తున్నామని అనుకుంటాం గానీ, ఈ ఫారం పుణ్యమా అని ఆమె భూమి పోయిందిగా, యిక్కడ యిచ్చే కూలి ఆమె భూమి విలువలో ఏపాటి? ప్రభుత్వమే సాక్షాత్తు ఆమె భూమి తీసుకొంది. తిరిగి ఆమెకు భూమి యిచ్చే ప్రయత్నం చేయగలరా?"

– "ప్రయత్నం చేస్తాం సార్" అని అన్నాను కానీ ఎలా అనేది మనసులో సుడులు తిరుగుతూనే ఉంది.

ఫారం చూడ్డం కాగానే వెంటనే పూసుకుంట బయల్దేరుదామన్నారు. ఎండాకాలం మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉంది. జీపు ప్రయాణం. పాలవంచ దమ్మపేట రోడ్డు మీద దాదాపు ముప్పై తొమ్మిది కి.మీ.లు తరువాత అడివిలోకి మళ్లీ భద్రాచలం పేపర్ బోర్డ్ వారి దారిలో పదిహేను కి.మీ.లు నేరుగా వెళితే వస్తుంది పూసుకుంట. దానికి పైన మరో కిలోమీటరు వెళితే కటుకూరు. యివి రెండూ దమ్మపూట మండలంలోనే ఉన్నాయి.

పూసుకుంట చేరగానే నులక మంచం మీద కూచుంటూ లాల్చీ జేబులోంచి ఓ చిన్న టేప్‌రికార్డరు తీశారు. నేనే దుబాసీగా పనిచేశాను. ఆయన హిందీ, ఇంగ్లీషులో మాట్లడతారు. చుట్టూ కూర్చున్న కొండరెడ్లు, కోయల్నుద్దేవించి "మీరు మామూలుగా ఏం పని చేస్తుంటారని"? అని అడిగారు.

–"చేటలల్లుతామ"న్నారు.

–ఎక్కడమ్ముతారు?"

–"దమ్మపేటలో"

–"ఎన్ని రోజులు దొరుకుంది పని"?

–"అన్ని రోజులు దొరకదు."

– "మరి బి.పి.యల్. వెదుళ్లు కొడుతున్నారు గదా. అదే వెదురుతో మీకెందుకు జీవనం జరగదు"?

– " మాకంత ఎదురెవురిస్తారు"? అన్నాడు వేట్ల రామిరెడ్డి అనే కొండరెడ్డి పెద్ద.

– "అడవిలో ఉండే మీకు వెదురెవరిస్తారు? అడవి ఎండకుండా వెదురు మీరే కొట్టి బుట్టలల్లి సింగరేణి కాలరీస్ వాళ్లకు అమ్మొచ్చు కాదా!"

ఎంత సులభంగా పరిష్కారాలు సూచిస్తారు శర్మగారు.

ఇదే ఆలోచన చూచాయిగా మనసులో కొన్నాళ్ల నుంచి మెదులుతూ ఉండడంతో శర్మ గారి రాకతో వెంటనే దానికో రూపం యివ్వడం జరిగింది. కూనవరం, వరరామచంద్రపురం మండల్లాలో అప్పటికే అటువంటి ఏర్పాటు చేశాం.



యిలాంటిదే వారు సూచించిన గిరిజన దంపతులకు శిక్షణా కార్యక్రమం కూడా. వారి ఉద్దేశ్యం ప్రకారం ఆధునిక వ్యవసాయం, అధునాతన పద్ధతుల్లో గిరిజన దంపతులకు శిక్షణ యిస్తే వారు తమ తమ గ్రామాల్లో నాయకులుగానూ, ప్రభుత్వానికి ప్రతినిధులుగానూ, ప్రభుత్వానికీ, ప్రజలకీ వారధులుగా తయారౌతారని.

గిరిజనుల ప్రగతి కోసం ప్రభుత్వం చేసే యత్నాలు తెలియ జెప్పడానికి ఎంత సులభమైన చక్కటి మార్గం!

ఆ ఆలోచనకి రూపకల్పనే కూనవరం దగ్గర పైడిగూండెంలో ఉండే "పూమాలావనాలు". దీనికి ఆలోచనా బీజాలు నాటిన వారు శర్మగారే గాబట్టి వారి చేతుల్తోనే దాన్ని ప్రారంభించాలనుకున్నాం.

కానీ యింతలోనే నాకు పాలవంచ నుండి బదిలీ అయిపోయింది.

ఏదో రోజు ఆ పూమాలా వనాలను ఆయన చూస్తారని నా నమ్మకం.

కాని చూసి యింకే చిన్న ప్రశ్న వేస్తారో ఏమో!

❖ ❖ ❖

# "బతకనిస్తరా... సారూ ?"

“అయితే నువ్వెప్పుడొస్తవు బాయి జూడ్డానికి. శనా రోజులయిపాయె. మండలపోళ్లు జూసి కూడా పైసలిస్తలేరు. యింగ పంజెయొద్దని సూపరువేజరు జెప్పబట్టిండు.వొచ్చే దొర్సకాలం. మరెట్ట? నువ్వెప్పుడొస్తవు జెప్పు. నేనుంట బయికాద్నే” అన్నాడు సున్నం సిరిమప్ప.

నా సమాధానం వెంటనే రాకపోతే రెట్టించి మరీ అడిగేట్టున్నాడు. నాకు వెంటనే కోపం వచ్చినామాట వాస్తవం. కానీ లోపలే అణచుకున్నాను. కోపమెందుకు వచ్చిందంటే యితను యింత గట్టిగా నా దగ్గరకొచ్చి అడుగుతున్నాడు కదా అదే మాట మండలంలో ఎందుకు అడగలేదు? ప్రతి ఒక్కరూ ఐటిడిఎ ఆఫీసుకొచ్చి అది కాలేదు ఇదికాలేదు అని అన్ని డిపార్టుమెంటులకు సంబంధించిన విషయాలను గురించి ఫిర్యాదు చేస్తూ ఉండడం మామూలే. అది చూస్తుంటే అన్ని డిపార్టుమెంటుల పని యీ వొక్క ఆఫీసే చేయాలని వీళ్ల ఉద్దేశమా? అన్పిస్తుంది.

యింత గట్టిగా యిక్కడ మాట్లాడే వాళ్లు మిగిలిన ఆఫీసుల్లో ఎందుకు మాట్లాడరు అనిపించి కోపం వచ్చింది. అయితే వెంటనే అన్పించింది. మిగిలిన ఆఫీసుల్లో సులభంగా పని అయితే యితను యిక్కడికెందుకొస్తాడు అని. అతని మీద కోపం తెచ్చుకున్నదానికి నొచ్చుకున్నాను.

సున్నం సిరిమప్ప కాస్త గట్టిగానే మాట్లాడతాడు. కాస్త మొండిగా మాట్లాడతాడు.

“నువ్వెప్పుడొస్తవొ చెప్పు” అని అంటూనే మిగిలిన వాళ్లంతా నిలబడున్న వరసనుంచి తొలిగిపోయి పక్కనున్న కుర్చీలో కూర్చొన్నాడు. సిరిమప్ప మాట తీరూ విషయం వివరంగా చెప్పడం ఎక్కడెక్కడ ఏ ఏ ఆఫీసులున్నాయో తెలిసినట్టు చెప్పడం చూస్తే ఎవరికైనా తనో గిరిజనుడనీ అదీ చంద్రగొండ మండలంలో ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చాడని అనుకోరు. అందుకే వరస నుంచి తొలిగిపోయి వేరేగా కూర్చొన్న సిరిమప్పను మళ్లీ మాట్లాడించవచ్చునుకొని మిగిలిన వాళ్ల యిబ్బందులేవో తెలుసుకోవడంలో పడిపోయాను.

మేము గ్రామాల వెంట తిరిగేటప్పుడు మా దృష్టికొచ్చే సమస్యలను అప్పటికప్పుడు పరిష్కారం చేసే ప్రయత్నం చేసినా అన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం వీలయ్యేది కాదు.

ప్రతి సోమవారం కార్యాలయంలోనే ఉండి ఎక్కడెక్కడనుంచో ఏవేవో యిబ్బందులతో వచ్చే గిరిజనుల యిబ్బందులను రోజంతా మా మిగిలిన అధికారులతో సహా విని పరిష్కారాల కోసం ప్రయత్నం చేస్తూండేవాళ్లం. ఆ రోజు అధికారులంతా కార్యాలయంలో ఉంటారని గిరిజనులందరికీ తెలుసుకాబట్టి ఎక్కడెక్కడ నుంచో వస్తూ వుంటారు. ఏ రోజు దొరికినా దొరక్కపోయినా ప్రాజెక్టు అధికారి సోమవారం కార్యాలయంలో తప్పక ఉంటారని అందరికీ నమ్మకం. యిలా వచ్చేవారి విజ్ఞప్తులు రకరకాలుగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ తాము చెప్పేదంతా వినాలని కోరుకుంటారు. తమ ఆదుర్దాలో చెప్పిందే చెప్పడానికీ, అధికారులను ఒప్పించడానికి ఎంతో కష్టపడతారు. ఎక్కువసేపు బతిమిలాడితే తప్పకుండా పని జరుగుతుందనే అమాయత్వం వారిది. ఇలాంటి విజ్ఞప్తులన్ని వింటూ ఉండగా మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో భూషయ్య గుర్తు చేశాడు భోజనం చెయ్యమని, కానీ, గ్రామాల నుంచి వచ్చేవాళ్లందరూ 12 తరువాతనే ఎక్కువగా రావడం మొదలుపెడతారు. రెండు గంటలు అయ్యేటప్పటికి జనం రద్దీ ఎక్కువౌతుంది. అందుకనే సాధ్యమైనంత ఎక్కువ మందిని భోజనానికి ముందే చూడాలని నా కోరిక. “యిలా వస్తూనే ఉంటారయ్యా భోం చేసిన తరువాత మళ్లీ చూడవచ్చుం”టాడు భూషయ్య. సరే, ఎటొచ్చి యీ రోజంతా మనం ప్రజా విజ్ఞప్తుల కోసమే కార్యాలయంలో ఉన్నాం గాబట్టి, మళ్లీ చూద్దాం అనుకొని లేచే సమయంలో సున్నం సిరిమప్ప కూడా లేచి నా వెంట నడపడం మొదలుపెట్టాడు.

‘సిరిమప్పా, అయ్యను భోం చెయ్యనియ్యి. మళ్లీ చెబ్దువు” అన్నాడు. భూషయ్య.

“నిజమే మళ్లీ సారు దొరుకతడేనేంది నమ్మకం జనం పుల్లుగున్నరు గద ఒక మాట జెబితే నేంబోతగదా. సారు రావాలగద”

‘‘ఈ సిరిమప్ప ఎప్పుడింతేనయ్య తన పని అయ్యేదాక వదిలిపెట్టడు. చెప్పిందాకపోడు మరి ఎప్పుడొస్తామని చెప్పమంటారు” అడిగాడు భూషయ్య.

నేనెప్పుడొస్తానో చెప్పడం పెద్ద కష్టమేం కాదు కానీ, సిరిమప్పను చూశాక కాస్త వివరంగా సిరిమప్పతో మాట్లాడాలనిపించింది. ఈ రోజు యింత హడావిడిలో వివరంగా మాట్లాడ్డం కాస్త కష్టమనిపించినా సాయంత్రం లోపు తనతో మాట్లాడకపోతే తాను తిరిగి ఊరికి పోలేదు. అంతగా అవసరమైతే రాత్రికి యిక్కడ్నే ఉండమని చెబ్దామనుకొని “మళ్లీ నేను సిరిమప్పతో మాట్లాడతాన్లే భూషయ్యా” అని చెప్పాను.

గిరిజనులు రావడం కొంచెం పలుచబడేటప్పటికి సాయంత్రం ఆరున్నర అయింది.

యిక పెద్దగా రారు ఈ రోజు అనేటప్పటికి ఏడయింది. సిరిమప్ప ఇంటరిగా కుర్చీలో కూర్చునే ఉన్నాడు. సిరిమప్ప పట్టుదల చూసిన నేను చలించిపోయాను.

యింత మంది ఒక్కరోజే వస్తే దానర్థమేమిటి? మిగిలిన రోజుల్లో ప్రజా విజ్ఞప్తులను గురించి పట్టించుకోరా అని సందేహం రావచ్చు. ఐటిడిఏ అధికారులు కార్యాలయంలో ఉంటే మిగిలిన రోజుల్లో కూడా చూస్తారు. కానీ సోమవారం మాత్రం విధిగా అది పనిగా కార్యాలయంలో ఉండి ప్రజా విజ్ఞప్తులను సమాధానం సాధ్యమైనంత వరకు అప్పటికప్పుడే యివ్వడానికి ప్రయత్నం జరుగుతుంది.

7 గంటలకు ఆఫీసులోనే కూర్చొని సిరిమప్పను దగ్గరికి పిలిచాన్నేను.

"సిరిమప్పా! నీకు యిప్పుడు బస్సున్నదా ఊరికి పోవడానికి?"

"యింకొక్క అరగంటల ఉన్నది. అది తప్పితే మళ్లీ పొద్దుగాలె"

"మరి ఉంటావా. యిప్పుడే పోతావా?"

"యిప్పటికే రోజుగడిచిపోయింది. వచ్చిన గాబట్టి తేల్చుకొని పోదామని నిలబడ్డ ఏ మాటజెప్తే యిప్పుడు బండికిపోతా లేదంటే పొద్దుగాల బోత"

– "ఏం పని మీద వచ్చినావు?"

– "చెప్పినగద బాయి బిల్లిస్తలేరని"

– "నీ బావి నేనుచూడ్డమెందుకు?"

– "పెద్దొర జూసిండంటె కిందోళ్లు యింటరుగద. నా పైసలు నాకిస్తరుగద. గదీ యిసియం.

– "ఐటిడిఏ బావి మంజూరు చేసిన తరువాత మండలంవాళ్ల చేతికే మొత్తం డబ్బిస్తుంది. బావి సరిగ్గా తవ్వినారో లేదో చూసేదిగానీ, దానికి పైసలిచ్చేదిగానీ మొత్తం మండలపోళ్లే. ఏ మండలంలో వాళ్లు ఆ మండలం ఆఫీసుకు పోయిఅక్కడుండెసార్లకు చెప్పుకోవాలెగదా. మరి నువు యింత దూరం ఛార్జీలు బెట్టుకొని ఎందుకు వచ్చినావు?"

– "నిజమే ఏ మండలపోళ్లు ఆ మండలం బోవాల్సిందే. మండలంలో పన్లయితయని నువ్వంటున్నవు. మరి వాళ్లయితే నా పన్జేస్తలేరు గద"

– "మరి నీ పని ఎందుకు జేస్తలేరని అడిగినవా?"

– "అడిగిన వాల్లేదో జెప్పింగ్రు నాకర్థమైతలేదు. అందుకే వచ్చిన"



– "మరి అన్నింటికి యిక్కడకొస్తే ఎట్లా చెప్పు? వాళ్లు చేయవలసిన పనులు వాళ్లు చేయాలిగదా. మీ పనులు చేయమని మీరు గట్టిగా అడగాలిగదా?"

– "అదిరైటే.మరి మేమంత గనంగ అడిగితె ఊరుకుంటారా?"

– "యిక్కడింత గనంగ అడగడం లేదా నువ్విప్పుడు?"

– "సారూ ఒక మాటజెప్త యింటవా?"

– "చెప్పు"

– "నువ్వొస్తవలేద?"

– "రానని చెప్పలేదు గదాకానీ నేను ఖచ్చితంగా రావాలని యింత పట్టుపడుతున్నవు గదా. మరి యిదే రకంగా మండలంలో నీ పైసలెందుకు యిస్తలేరో ఖచ్చితంగా తేల్చుకోలేకపోయినావా?"

– "తొలిసారి బోయిన మండలాధికారిలేడన్నరు. యింటికి బోయిన కాళ్లీడ్చుకుంట. వారమాగి బోయిన రాసెటోడులేడని మండలాధికారి జెప్పిండు. వారమాగి మళ్లీబోయిన అదేందో పండగంట ఆఫీసు బందన్నరు. మూడోరాలు ఆగేటంత దమ్ముండాది నాకు? యిన్ని పండగలుంటాయి సార్లకు?"

– "మరి మండలాధికారి మంచివాడేనా? కాదా?"

– "మంచోడె. ఆ పాపం నాకెందుకు? అయిన పని అయిత లేదు."

– "నీకే పని అయితలేద? అందరికింతేనా?"

– "అందరి సంగతి నాకేమెరిక? నేబోయినప్పుడు పనిగాలె.

ఇంతలో సేపలసెరువెండిపోతున్నది. నీళ్లొదుల్తలేదు" అంటూ చర్లమండల దేవరపల్లి నుంచి యింకోగిరిజనుడొచ్చాడు.

– "ఏం పేరయ్యా నీది."

– "మడకం బాబూరావు"

– "చేపల చెరువుకు నీళ్లివ్వండెరు?"

– "తాలిపేరుకాలవ నా చేపల సెరువు పక్క నుంచి పోతది. ఆ నీళ్లు పెట్టుకొని సేపలు బెంచుత. నీళ్లు దగ్గినాయి నీళ్లొదలమని సత్తెనారాయణపురం బోయిన నీళ్లొదుల్తలేదు."

– "ఏమంటున్నారు?"

– "అసలు లోనకి రానిస్తెడదా!"

– "రావొద్దన్నరా?'

– "మేమున్నామని సూసినోడు లేడు"

– "మీరు లోపలికి బోవచ్చుగదా"

– "మల్లొద్దువులె అసుంట గూసుండు అంటరు"

– "ఎంతమంది పోయినారు?"

– "ఆరుగురం"

– "ఎప్పుడు?"

– "నిన్న పొద్దున బొయినం. రేత్రి ఆడ బండుకున్నం. పొద్దున బొయినం పలకరిస్తలేరు. మా ఎదురుగ్గనే ఒక దొర బోయిండు గంట గూసున్నడు. చాయిలు లోనకి బొయినయి. లోనకి బోయినంక శానాసేపటికి దొర బెయిటికొచ్చిండు సూపర్‌వైజర్ సారు నవ్వుకుంట ఆ దొరను జాగనంపిండు. మేమాడ్నే ఉన్నం. పలకరించలె నేనే అడిగిన సారూ నీళ్లొస్తలెవు. సేప్పిల్లలు జస్తున్నయి అని" అని అందుకున్నడు తన ప్రక్కనున్న యింకో గిరిజనుడు.

సున్నం సిరిమప్ప అందుకొన్నడు "అర్థమైంది సారూ అందరెందుకొస్తరూ యీ ఆఫీసుకు?"

– "అర్థం కాలే సిరిమప్పా" అన్నాను. నేను అర్థం అయికూడా.

– "పరాశెకం సరె దొరా, మమ్మల్నింతసేపు మాట్లాడిచ్చిండ్రు మీరు గని ఎవరన్నా అడుగతరా మమ్మల్ని? మా పంటలెట్టున్నయని? ఎవరన్నా అడుగుతర? మా పోరగల్లు బడికిబొయిండ్రా అని నువ్వడుగుతున్నవు"

– "మరి నా ఉజ్జోగమే అదిగదా సిరిమప్పా"

– "అవుగానీ, నిన్నింత మాట్లాడిస్తె యిసుక్కోకుంట" జెప్తున్నవు. యిన్ని మాటలు మాట్లాడితే మమ్మల్ని బతకనిస్తరా సారూ? ఆఫీసు దాకా బోవుడే గగనమైతది. పోయినంక మాతాన జూస్తరనే నమ్మకం లేకుంటది. సూచ్చూసి ఎనిక్కి దిరిగొస్తము. మల్లీ బోతం.



గిదింతే."

అంటే ఏమనర్థం? వీళ్ల యిబ్బందులు వినేవాళ్లు కూడా లేరా? విని ఏం చేయడం లేదా? విని కూడా మనం చేయగలిగేదేముందని అందర్నీ యీ కార్యాలయానికి పొమ్మంటున్నారా? ఉన్నతాధికారులేం చెయ్యమంటే అది చేస్తే సరిపోతుందిలే అనే ఉదాసీనతా భావం కింద అధికారుల్లో చోటు చేసుకుందా? మొత్తం మీద ఎక్కడో లోపముంది. ఎక్కడ?

బహుశా మనిషిని మనిషిఅర్థం చేసుకోవడానికి సిద్ధంగా లేడేమో! కారణాలేమైనా కావచ్చు! ఎన్నైనా ఉండొచ్చు!!

– "అయితే, సిరిమప్పా, మీరు ఖచ్చితంగా మా పనులెందుకు చేయరని అడిగితే ఏమౌతుంది?"

– "మల్లసారి ఆఫీసుకుబోవుడు కష్టమైతది."

– "ఎందుకని?"

– "యింత గనంగ అడగబట్టినవుగద పోయి పెద్దొరకే జెప్పుకో అంటరు."

– "చెప్పుకోవచ్చు గద."

– "సెప్పినప్పట్నుంచి రెంటికిజెడతం మేము.దొరకు మా మీద జెప్పినవు గద. దొర దగ్గరకె బో అంటరు. పెద్దొరలు వస్తరు పోతరు. కిందసార్లు ఎప్పుడుంటరు. వాల్లతో కయ్యమెందుకని ఊకుంటం. పెద్ద దొరకు తీరిక లేకపాయె. సిన్నదొర్లకు శర్ధలేకపోయె.'

"మండలాధికారి మంచివాడేగాని పని అయితలేదు." ఏవిటీ వైరుధ్యం? మనసులో ఈ ప్రశ్న మెదులుతూ ఉండగా మౌనంగా ఉండిపోయాను.

"నువ్వు రేపొస్తుండవు గదా" అని సిరిమప్ప రెట్టించి అడిగాడు.

"ఆ రేపొస్తున్నానని అంటూండగానే సిరిమప్ప నాలుగడుగులు వేశాడు.

సిరిమప్ప బిల్లూ, చేపల చెరువుకు నీల్లూ రెండూ వొచ్చాయి గానీ ప్రభుత్వ కార్యాలయమంటే అమాయక గిరిజనుడికుండే సంకోచమూ, సంశయమూ పూర్తిగా తొలిగించలేకపోయాం గదా అన్పిస్తుంది. ఈ సంఘటనలు గుర్తొచ్చినప్పుడల్లా!

❖ ❖ ❖

# "నా మొకం మల్లొచ్చింది సారూ!"

పాలవంచ మండలంలోని ఉలవనూరు గిరిజన సదస్సులో ముఖంపై కొంచెం మొర్రి ఉన్న ఓ ముసలతన్ని చూడగానే యితను ఆర్నెల కిందట ఎలుగ్గొడ్డు గొట్టిందని అర్థరాత్రి వచ్చిన ముసలతను కాదు గదా అని నేననుకుంటుండగా తాను మౌనంగా నా దగ్గరికొచ్చి కళ్లనీళ్లు పెట్టుకొని, "నా మొకం మల్లొచ్చింది సారూ, ఎంతో కొంత మొర్రున్నా ఎలుగ్గొడ్డు గొట్టినప్పుడున్నంత గాయం యిప్పుడు లేదు మంచిగయిపోయింది నన్ను గుర్తుబట్టలేదా సారూ" అన్నాడు. "నిన్నే కదా ఒక పక్క దవడ మొత్తం ఎలుగ్గొడ్డు కొట్టేస్తే నీ భార్య యీ మొకం మల్లొస్తదా సారూ అని అడిగిందీ," అన్నాను.

"నిజమే సారూ, సూసుకొనేటోడుంటె అన్ని తిరిగొస్తయి. నా బారియ శాకిరి యింతా అంతా గాదు. దేశంగాని దేశంలో ఆ డాగటరయ్యా, యీ ముసిల్దీ ఉండబట్టే యీ రోజు మీ ఎదురుగ నిలబడ్డ. మమ్మలగూడ గవర్మెంటు కర్సు బెట్టి పట్నం బంపిస్తదనీ, సచ్చెటోణ్ణి బతిస్తదనీ అప్పుడెరికలేకపాయె. మల్ల యిదో యిప్పుడునువు కండ్ల బడ్డంక యింత జనంలో నిన్ను జూస్తే గవర్మెంటుకు మా మీద శర్దుండదని అనిపిస్తుండది" అన్నాడతను.

కానీ నిజానికి యితనికి చేయగలిగినంత సాయం చేశామా మనం? తాను తమమీద గవర్మెంటుకు శ్రద్ధ ఉందని అభిమానంతో చెప్తూంటే అవునని సంతోషపడాలో, నిజానికి మనం పెద్దగా చేసిందేమీ లేదని అవమానంగా భావించాలో తోచని స్థితిలో పడిపోయాను. ఏ కొంచెం సాయమందినా దాన్ని తమ జీవితాంతమూ గుర్తు పెట్టుకుంటారేమో యీ కల్మషమెరుగని అమాయకులు! నా అసహాయతా, అసమర్థతను ఎత్తి చూపించిన సంఘటనలు ఒకదాని వెంట ఒకటి గుర్తొచ్చాయి. ఆరునెలల కిందట జరిగిన సంగతి.

"సాబ్ కోయీ ఆయా హై" అంటూ తలుపు తట్టాడు వాచ్‌మేన్ మహదూర్ రాత్రి రెండున్నర గం॥ ల సమయంలో అంతకు ముందు వరకు మేలుకొని ఉండడంతో బాగా అలిసిపోయి నిద్రలోకి పూర్తిగా జారిపోయిన నాకు ఈ మాటలు ఎక్కడో లీలగా వినబడినాయి. ఆలస్యంగా పడుకున్నాను గాబట్టి నన్ను లేవడానికి చాలా సేపే సందేహించి ఉంటాడు. తలుపు తట్టి లేపడానికి యింకా ఎక్కువ సంకోచించి ఉంటాడు. అదే రోజు రాత్రి పదకొండు గంటలప్పుడు ఫోన్ చేసి తామెక్కడో చింతూరు దగ్గర డీజల్ లేక ఆగిపోయాము; మీరు ఓ జీపు పంపిస్తే కానీ రాలేమని చెప్పిన మెడికల్ టీము వాళ్లెవరైనా వచ్చారేమోననుకొన్నాను. బైటికి రాగానే పోలీసు కానిస్టేబులు ఎదురుగా అగుపించాడు. ఈ సమయంలో యితనెందుకు వచ్చాడా అని సందేహిస్తూ ఏవిటని అడిగాను.

"సర్, యనంబైలుకు పైన ఏదో ఊరట. ఎలుగుబంటి కొట్టిందట. ఓ ఆడమనిషి, ఆమె అల్లుడూ ఓ ముసలతన్ని తీసుకొని ఏడుస్తూ బజార్న వస్తూ ఉంటే యీ సమయంలో ఎవరాని వీళ్లని స్టేషన్‌కి తీసుకొని పోయాము. విషయం తెలుసుకున్న తరువాత ఖమ్మం ఆసుపత్రికి పంపిస్తే మంచిదేమో అనిపించింది. దానికో జీపు కావాలి. అందుకనే మిమ్మల్ని యిబ్బంది పెట్టవలసివచ్చింది" అన్నాడు కానిస్టేబుల్.

నిద్ర వదిలిపోయింది.

– ఎక్కడున్నారు వాళ్లు?

– "మన బంగళా బైటే ఉన్నారు సార్".

– "లోపలికి తీసుకుని వచ్చి ఉండవలసిందన్నాను."

– "ఆఫీసు వరండాలో పండుకోవడానికి కొంచెం అనుకూలంగా ఉందని అక్కడతన్ని పడుకొబెట్టార"ని చెప్పారు.

యిటువంటి ఆపత్సమయాల కోసమే ఐటిడిఎ ఆఫీసులో ఓ డ్రైవరు జీపుతో సహా ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు కాబట్టి ఖమ్మం పంపించడం పెద్ద పనేం కాదు. కానీ ఖమ్మం దాకా వెళ్లవలసిన అవసరం ఉందా?

బంగళా బైటికి వెళ్లి చూసిన నాకు కనిపించిన దృశ్యం జుగుప్సా కరంగా అనిపించింది ఎలుగుబంటి కొట్టినతను ఆఫీసు వరండాలో పడుకొనే ఉన్నాడు. ఒక కన్ను దప్ప మిగిలిన ముఖం కనబడకుండా బేండేజి వేసి ఉంది. కానీ ఆ బాండేజి చీము నెత్తురుతో తడిసి రంగుమారిపోయి వాసన వస్తోంది. ఓ దవడ భాగం పూర్తిగా లోపలికి పోయింది. అంటే ఆ వైపు ఎలుగుబంటి కొట్టిందన్నమాట. ఎంతో మేలు కళ్ళు పోలేదు. మనిషిని చూస్తే బలహీనంగా ఉండి నల్లగా, సన్నగా ఉన్నాడు. అతని వయస్సు అరవై సంవత్సరాల లోపే ఉండొచ్చు. కానీ పేదరిక ప్రభావం అతని మీద ఎక్కువగా చూపినట్టున్నాయి. వయసుకు మించి అగుపిస్తున్నాడు.

నన్ను చూడగానే అతని భార్య అంది. ఆమె పేరు సీతమ్మట.

"అయ్యా, ఎలుగ్గొడ్డు గొట్టింది. నాలుగు రోజులాయె. దిక్కు దోసకపాయె. అడ్నే ఏందో పసురేసిరి. నడిసి యానంబై లొచ్చినం మొన్నటికి. గవుర్మెంటు దవకానకు బొమ్మని జెప్తే పోయినం. అప్పటికె సీకటిబడె. డాగటరు దొర ఉన్నడుగని తుడిసి ఏందో ముందుబూసి యిగ బోంట్రి. ఖమ్మంల జూస్తరు అన్నడు. యీనేమో కండ్లనీలు బెట్టబట్టిండు. ఏడవడానిక్కూడ లేకపోయె. ఒక దవడ గొట్టేసింది. ఎలుగ్గొడ్డు. ఏడిసినా దవడ గదిలిచ్చినా నొప్పి గుండదేమో, ఒకటే కండ్లనీల్లు."

ఐటిడిఎ పెట్టిన పన్నెండేళ్లక్కూడా ఈ మూగజనాలకు తమకేదైనా ఆపదొస్తే ఐటిడిఎకు వెళ్లొచ్చనే విషయం తెలియలేదనడం కన్నా మనం తెలియజేయలేకపోయామనడం సబబేమో. ఏదేమైనా ఈ సమయంలో ఖమ్మం పోవడం దండగ అనిపించింది. కాస్త వివరాలు కనుక్కోని ఒకేసారి హైదరాబాద్ పంపిస్తే మంచిదేమో నన్పించింది.

– "అవునమ్మా, అసలు యీ పెద్దమనిషి చూస్తుంటే అంత బలంగా లేడుగదా. మరి పనికి బోతాడా?" అని అడిగాను.

– "పన్జెయ్యకుంటె ఎల్లుతాది సారు"?

– "మరయితే యీ గాయం ఎట్లా దగిలింది?"

– "ఎట్టదగిలిందీ? యావని జెప్పేది? కరమకొచ్చింది. అల్లుడూ, యీయనా అడివికి బొయింద్రు. మొద్దులు గొట్టడానికి. యిద్దరు కాస్తె ఎడమెడంగా ఉన్నరంట. యీన పొదలోకి దూరి ఒక వాసం గొడతుంటె పక్కపొద నుంచి ఎలుగ్గొడ్డు. యీయన అరుపులకి అల్లుడు పరిగెత్తొచ్చేటప్పటికి ఎలుగ్గొడ్డెల్లిపోయింది".

"సరేమ్మా యిప్పటికి పొద్దు పోయింది. ఈ రాత్రి యిక్కడే ఉండండి. రేపుదయాన్నే మళ్లీ ఆసుపత్రికి తీసుకుపోయి ముఖం శుభ్రం చేసి కట్టుకట్టిదాం. ఆ తరువాత పెద్దాసుపత్రికి తీసుకుపోయి పోదాం. భయపడకుండా దిగులపడకుండా పడుకొండి" అని చెప్పి కానిస్టేబుల్‌ని అభినందించి వెళ్లమన్నాను.

తెల్లవారింతరువాత ఆసుపత్రికి పంపించి శుభ్రం చేయించి కొత్త కట్టు కట్టించాము. ఆసుపత్రి నుంచి తిరిగి రాగానే తన అల్లుడు తిరిగి ఊరికి పోతాననడం మొదలు పెట్టాడు. యిటువంటి పరిస్థితుల్లో ముసలివాళ్లకు తోడుగా ఉండవలసింది పోయి యిప్పుడు ఊరికి



వెళతానంటావేమిటి అని అడితే అతను చెప్పిన సమాధానం నన్ను ఆందోళనపర్చింది.

"సారూ, యీడుండాల్సిందే. మా మామను జూసుకోవాలిసిందే. మరి జోబిలో డబ్బుల్లేవు. వొంటి మీద గుడ్డలు మాసినాయి. ఖమ్మం దవాకానకు బోపెడైతే నేనుండి జేసేదేంటి. ఊరన్నా బోయి డబ్బులడక్కరావాలె గదా యిడుండాలంటె. ఉన్న మనిసిన్నుటు దీసుకొస్తిమి నేనిప్పుడు బోవాల్సిందే" అన్నాడు.

అతన్నాపడం వీలయ్యేట్టు లేదు. ఈ రోజు గడిచేదెట్లా అనే ఆలోచనతో సతమతమయ్యే మనిషిని భవిష్యత్తు గురించి ఆలోచించమంటే అసందర్భంగా అనిపిస్తుందేమో! అందుకే తాను నా మాటలపై ధ్యాస ఉంచి నట్టనిపించలేదు.

" నేనొస్త సారు. మల్లొస్త. గుడ్డలు దీసుకొని కాసిని డబ్బులు దీసుకొని మల్ల యీడికే వస్త. పట్నం బోవుడైతే పోత. కాని నేనేం జెయ్యగలుగుత. వండిపెట్టెటోళ్లు గావాలె. అత్తయితె మంచింది" అని అతని అల్లుడు తిరిగి వెళ్లిపోయినాడు.

–"ఏమ్మా, మరి ఏకంగా పట్నం దీసుకొనిపోతే మంచిది. అక్కడ డాక్టర్లతో మాట్లాడుతాము. మరి తనతో ఉంటావా?" అని అడిగాను.

–" ఉండకుంటె జరుగుతాది? ముసిలోడు యిట్టయిండు, పట్నం నాకేమెరిక, బిడ్డ యింట్లో ఉండె. అల్లుడేమో యిప్పుడె యింటికి బాయె. నాకు దప్పుతాది? అయినా ముసిలోడి మొకం మల్లొస్తాది సారు? అంటూ చాలా ధైన్యంగా అడిగింది సీతమ్మ.

– " మీకు కావలసిన డబ్బు సాయం చేస్తానమా. తనతో నువ్వుండాల్సిన అవసరం ఉంది కదా" అన్నాను.

– " పట్నం నాకేమెరిక. ఎవురన్న దోలకపోయి దవకాన్లో వదిలిపెడితె ముసిలోడ్ని జూసుకుంట నేనక్కడుంట. అల్లుడు గూడొస్తడు"

తన కష్టాలకు తాను బాధపడుతూన్న తన కర్తవ్యాన్ని, భార్య భర్తల బంధాన్ని మర్చిపోని ఆ కోయ స్త్రీ వ్యక్తిత్వం మమ్మల్ని మెప్పించింది. అయితే ఆ సంతోషం, అభినందన ఎంతో కాలం నిలవలేదు.

శుభ్రం చేసి, కట్టుగట్టించి, పట్నంలో అన్ని వసతులు చేసి రావడానికోసం ఓ అధికారినిచ్చి హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రికి పంపిస్తే, పంపించిన నాలుగో రోజు సాయంత్రానికి ఆఫీసు వరండాలో మళ్లీ ప్రతక్షమయ్యారు ముసలాయన, తన భార్యా,

అల్లుడూ. అదే జుగుప్సాకరమైన రూపం. చీము నెత్తురుతో చివికిపోయి వాసనొస్తున్న బాండేజి. నాకు చాలా కోపమూ, విసుగూ కలిగింది. కాని వారి అమాయకత్వానికీ నిస్సహాయతకూ అచేతనుడనయ్యాను నేను.

– "ఏమ్మా, మరి యీ రకంగా మధ్యలో తిరిగొస్తే, మొకం రమ్మంటే ఎట్లొస్తుంది చెప్పు"

– "సారూ, మొకమొస్తదో రాదో గానీ, దేశం గాని దేశంలో నేనెందుకు జావాల. నేనీడెందుకుంట. నన్నూరికి దీసుకపోండ్రి అని ముసిలాయనొకటె వొర్లబట్టె. పట్నంల దవకాన్ల బెడ్డు లేదని కింద బండబెట్టిరి. పొద్దు నొక డాకటేరు జూసి పోతే మళ్లీ జూసెటోడు లేకపోయె. ఏదన్న గావాలంటె నేనేబోతె ముసిలోడి దగ్గర మనిసిలేకపోయే. సస్తే సచ్చినం. ఉన్నూర్ల జస్త. నన్ను దీసకపొండ్రి అంటె దిక్కుదోసకమళ్లీ దెచ్చినం యీడికె. మీరిచ్చిన పైసలు ఆడికయిపోయినయి" అంది.

యీ విషయాలన్ని కాస్త ముందుగా ఆలోచించలేకపోయినందుకు సిగ్గనిపించింది. ఈ సారయినా కాస్త జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చేయాలనుకొని "సరేమ్మా, అయిందేదో అయిపోంది. కనీసం రెండు వారాలు మీతోనే ఉండడానికి ఒకర్ని తోడిచ్చి పంపిస్తాము మానేదాక దవఖాన్లో ఉండండి అంటే, కాదంటే కాదంది ముసలమ్మ. సరే యీ రాత్రికిక్కడే ఉండండి" తెల్లవారి చేయవలసిందేవిటో చూద్దామని చెప్పాను.

కానీ తెల్లవారేసరికి "వాళ్లగుపించడం లేదంటూ" వాచ్‌మేన్ బహదూర్ చేస్తే నేనోడిపోయాననే భావం మనసంతా ఆవరించింది. ఆ ముసలతనేమవుతాడనే ప్రశ్న మిగిలిపోయింది.

మళ్లీ యిన్నాళ్లకూ, యీ ముసలతను యిలా ప్రత్యక్షమై "నా మొకం మల్లొచ్చింది సారూ" అని ఆప్యాయంగా చెప్తుంటే అలా చూస్తూ నిలబడి పోయాను యింకేం మాట్లాడాలో తోచక ఆనందంతో.

❖ ❖ ❖



# కొండెక్కి దిగిన కొండరెడ్ల సెంటరు

ఇంతవరకూ నా జీవితంలో నాకు గుర్తుండి రెండే రెండుసార్లు చాలా తీవ్రమైన వేదన ననుభవించాను. మొదటిది పూర్తిగా వ్యక్తిగతమైనది.

రెండోది ఉద్యోగానికి సంబంధించినదే అయినా దాదాపు వ్యక్తిగతమైనంతగా మనసును కలచివేసింది. అది కొండరెడ్ల కోసం జీడిగుప్పలో ఓ ఏడాది కిందట స్థాపించిన కొండరెడ్ల సెంటరూ, కూనవరం దగ్గర పైడిగూడెంలో తయారౌతున్న 'కొండరెడ్ల శిక్షణా కేంద్రం' ఆపేయవలసి రావడం.

ఆ రెండింటినీ కొనసాగించడానికి చేసిన ప్రయత్నమంతా సఫలం కాక కళ్లముందే కన్న బిడ్డలు ప్రమాదానికి గురై మరణిస్తే కలిగే వేదనని అనుభవించాను.

ఎన్ని రోజులు తిరిగాము ఈ గ్రామాల చుట్టూ? ఎన్నిసార్లు చర్చించాము వీటి గురించి? ఎంతమంది గిరిజనులు కష్టపడ్డారు వీటికో రూపం యివ్వడానికి? ఎన్ని ఆశలు పెంచాము ఈ అమాయకమైన కోయల్లో? కొండరెడ్లలో? ఈ శిక్షణా కేంద్రంలో కోయ, కొండరెడ్ల తెగల భవిష్యత్తును తీర్చిదిద్దగలిగే ప్రయత్నాలు చేయగలమని ఎన్ని కలలు కన్నామో కదా! అవి వాస్తవం కావడానికి ఎంత కష్టపడ్డామో కదా!! అయినా యిప్పుడు వీటిని కాపాడుకోడానికి ఏం చేయాలో తోచని స్థితి.

ఖమ్మం జిల్లాలో ఉండే గిరిజన తెగల్లో కొండరెడ్లు బాగా వెనకబడి కొండల మీదనే నివసిస్తున్న తెగ. వాళ్లు ఆఫీసుల చుట్టూ తిరగడం కన్నా తామున్న స్థితిలోనే ఉండడానికే యిష్టపడతారు. మార్పంటే యిష్టం లేక కాదు. ఆఫీసుల చుట్టూ తిరగలేక, తిరిగినా పనికాక. యిటువంటి పరిస్థితుల్లో వాళ్ల గ్రామాల మధ్యనే వాళ్ల ఊళ్లలాంటి ఒక ఊరిలో వాళ్ల పెద్దలతో చర్చించి జీడిగుప్ప అందుకు అనువైన చోటని నిర్ణయించి కొండరెడ్ల సెంటరు తెరవబడింది.

జీడిగుప్ప అందమైన ఊరు. వరరామచంద్రపురానికి పదిహేను కి.మీ. దూరంలో ఉంది. కానీ దట్టమైన అడవి మధ్యలోంచి వెళ్లాలి. ఆ దారిలో నక్సలైట్లుంటారని బలమైన వదంతి. ఎందుకంటే కొన్నాళ్ల కిందట నక్సలైట్లు ఓ పార్టీ కార్యకర్తను చంపేశారట. ఆ

చంపేసిన చోటు దగ్గరొచ్చేటప్పటికి యిప్పటికి అందరూ కొంచెం బెరుకు బెరుగ్గా చూస్తారు. అయినా అటువంటి ప్రాంతానికి గిరిజన సంక్షేమం దృష్ట్యా, యిప్పటికి కనీస వసతులకు నోచుకోని కొండరెడ్ల తెగ కోసం ప్రభుత్వాధికారిగా ఒకటికి రెండుసార్లు వెళ్ళక తప్పలేదు. ఇదంతా గిరిజనుల్లో ముఖ్యంగా కొండరెడ్లలోని బెరుకును పోగొట్టడానికి చేసిన ప్రయత్నాలే! అడవి మధ్య, గోదారి ఒడ్డున, చింతచెట్ల నీడన, ఆరుబయట ఉద్యోగం చేసుకోగలిగితే ఎంత బాగుంటుందో అనుకున్న కోరిక జీడిగుప్ప కొండరెడ్ల సెంటరుతో తీరింది. అటువంటి సెంటరు ఏడాది తిరక్కుండానే......

కొండరెడ్ల సెంటరు రావడాకి అప్పటి కలెక్టరుగా ఉన్న కృష్ణారావు గారెంతో శ్రమ తీసుకున్నారు. సెంటరకు స్పెషలాఫీసరుగా పేస్టేసిన ప్రసాద రెడ్డికి ప్రొబేషను కూడా పూర్తి కాకున్నా ప్రభుత్వాన్ని ఒప్పించి ఐటిడిఎకు తీసుకురావడం జరిగింది.

ప్రసాదరెడ్డిలో 'రెడ్డి' అనే పదమే చూశారో, ఎక్కడ చూసిన కనిపించే రెడ్డిలోని ఉత్సాహమూ, శ్రద్ధా చూసారో, మిగిలిన ఎవరొచ్చినా రాకపోయినా 'వాడు రెడ్డి వచ్చినాడా' అనేంత దూరం వచ్చారు కొండరెడ్లు. కొండలెక్కడం తన ఉద్యోగంలో భాగమైపోయి అతి నిటారుగా ఉండే కొండల మీద చింతగండిని ఫక్తు కొండరెడ్డి గ్రామంగా చెప్తుండే వాడు ప్రసాదరెడ్డి. ఆ గ్రామాన్ని వీడియో తీయించేశాడు. మమ్మలందర్నీ ఆ గ్రామం నడిపించాడు.

కొండరెడ్డి గ్రామాలు వెళ్లాలంటే రెడ్డి లేకుండా వెళ్లడం అసాధ్యమై పోయిది. కొండరెడ్లు రెడ్డి లేకుండా వెళ్లిన యింకెవర్నీ గుర్తించదల్చుకోలేదు. చివరకు ప్రాజెక్టు అధికారి కూడా. ఆ యాతన, ఆ తపనంతా నేడు ఎందుకు కొరగాకుండా పోయిందా?

కొండరెడ్ల సెంటరు తెరవడానికి రెండు నెలల ముందే ప్రసాదరెడ్డి నలభై ఎనిమిది కొండరెడ్డి గ్రామాలు తిరిగాడు. ప్రారంభోత్సవంనాడు జరిగిన కొండరెడ్డి సదస్సులో కొండరెడ్లు , రెడ్డి కోసం ఎదురుచూసే స్థితికి తెచ్చాడు. ఖమ్మం జిల్లా మొత్తమూ వ్యాపించి ఉన్న కోయలు కూడా మాకలాంటి సెంటర్లుంటే బాగుండుననుకొనేవారు. గుల్లేటివాడ నుంచి దారపల్లి నుంచీ, చింతగండి నుంచి వచ్చిన కొండరెడ్లు జీడిగుప్ప దాటి వెళ్లడానికి ససేమిరా యిష్టపడలేదు. తనతో ఎన్నో వ్యక్తిగత సమస్యలు, కుటుంబసమస్యలు చెప్పుకోవడానికి రోజూ జీడిగుప్ప వచ్చే కొండరెడ్ల సంఖ్య ఎక్కువౌతుందని ప్రసాదరెడ్డి ఎన్నోసార్లు చెప్పేవాడు. కొండరెడ్లలో ఈ చైతన్యమే గొప్ప సంగతి.

రానున్న ఐదు సంవత్సరాలకు ప్రణాళికలు తయారుచేసిన ప్రసాదరెడ్డి కొండరెడ్డి సెంటరును సాంస్కృతిక కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించాడు. ఊరు



దాటిరాని, వచ్చినా పొద్దు గూకే వేళకు యిళ్లు చేరే కొండరెడ్లు భార్యాపిల్లలతోసహా వంద కి.మీ.ల దూరంలో ఉండే పైడిగూడెంలో సంవత్సరం రోజులు ఓ ట్రైనింగ్ కోసం ఉండటానికి సిద్ధమయ్యారు. తమ పిల్లలను చదివించడానికి చాలా దూరాన ఉండే చింతూరు పంపడానికి నిర్ణయించుకున్నారు. యింత జరిగాక యిప్పుడు యిలా అర్థాంతరంగా.....ఏమైనా యిలా ఎన్నాళ్లో కొనసాగడం కష్టం అనిపించింది. యిన్ని రోజులు పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలిపోనివ్వడమా? యిలా ఆలోచనల్లో ఆవెదనల్లో, నేనొంటరిగా నా గదిలో .... ఆలోచనలో ఆవేదనలో ఉండగా....

"సార్, జీడిగుప్పలో కొండరెడ్ల సెంటరు ఎత్తేస్తున్నరంట గద" అంటూ చాలా ఆందోళనగా వచ్చారు ఓ ముగ్గురు యువకులు. వాళ్లలో ఒకరు గిరిజన అభ్యుదయం కోసం పనిచేసే సంఘానికి అధ్యక్షుడు, మిగిలిన యిద్దరూ ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి. "ఎత్తేస్తున్నరంట కాదు ఎత్తేశారు" అన్నాను చాలా మామూలుగా.

"అంటే రెడ్డిసార్ను తీసేస్తున్నారన్నమాట. అంతకన్న మంచిసార్ను దెస్తున్నారా సార్? కొండరెడ్డి గ్రామాలెన్ని ఉన్నయో తెలీనిసార్లు ఎంతమందో ఉంటే కొండలెక్కి, దిగి, ఊరూరికి మూడు నాలుగు సార్లు బొయిండు. రెడ్డి సారొస్తే అన్నిపనులవుతయని యిప్పుడు అందరు నమ్ముతున్నరు గద సార్. మండలాఫీసర్ల పేర్లు ఎంతమందికి దెల్సుస్సార్? యిప్పుడే కొండరెడ్డినైన అడగండి మీ సారెవరని? రెడ్డిసారని చెప్తరు. అంతమంచిగుంటే గూడ మంచిది గాదేమో సార్. లేకుంటే రెడ్డిసార్ను దీసేస్తరా" యింకాస్త ఆందోళనగా అన్నాడు ప్రధాన కార్యదర్శి.

"ఆయన్నూ, సెంటర్నూ తీసేస్తున్నారు" అన్నాను.

''యిది అన్యాయం సార్. ఎంత మాములుగా అంటూన్నారు. సార్ ఎత్తేస్తున్నారని.మేం పుట్టినప్పనుంచీ కోయలూ, కొండరెడ్లూ ఆఫీసుల చుట్టూ మండలాల చుట్టు తిరిగి, తిరిగి విసిగిపోయి అలిసిపోయి పోతే పోయిందిలెమ్మని మానుకుంటుండే టైంలో మీ ఊళ్ల మధ్యనే ఆఫీసు బెడతమనీ, మీ కోసమే ఒక అధికారి పనిజేస్తడని చెప్పి, వాళ్లందరూ యింకెక్కడికి బోనక్కరలేదనీ, జీడిగుప్ప చాలనీ, యింకెవర్నీ కలవక్కర లేదు రెడ్డిగార్ని కలిస్తే చాలనీ, నమ్ముకొని ధైర్యంగా ఉండే యీ టైంలో, కొండరెడ్లందరికి ఐటిడిఎ అంటే తెలిపొస్తుండే యీ టైంలో ఆ సెంటరు ఎత్తేయడం దారుణం సార్. మీరు కూడా ఏం పట్టనట్టున్నారేం సార్. మీరే ఏదైనా చెప్పి సెంటరు ఎత్తేయకుండా చూడండి సార్"అన్నాడు అధ్యక్షుడు.

యింతలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, ఏకైక కొండరెడ్డి నాయకుడు ముర్ల

యర్రయ్యరెడ్డి వచ్చాడు. తనతో ఎప్పుడూ ఉండే శ్రీనివాసరావు గారితో సహా.

"ఇదేమాన్యాయం సార్? జీడిగుప్ప ఆఫీసు ఎత్తేస్తునంట్ర గదా. ఈ ఆఫీసులు మా కోసమా? మీ కోసమా సార్? ఒకరొచ్చి ఆఫీసుదెరిస్తే యిప్పుడింకొకరొచ్చి మూసెయ్యమంటే ఏమన్నమాట? అంటే కొండరెడ్లందరు బాగుపడిపోయిన్నారన్నమాట! గవర్మెంటు నుంచి అటువంటి జీ.వో. ఏమన్నా వచ్చిందా సార్?" అన్నాడు చాలా ఆవేశంగా యర్రయ్య రెడ్డి గారు.

యర్రయ్యరెడ్డి కొండరెడ్డి తెగకు చెందినవాడు. స్వస్థలం జీడిగుప్ప, మంచి ఒడ్డూ పొడుగూ ఉండి పసిమి శరీర ఛాయతో చక్కటి రూపం ఉన్నవాడు. వీరి గురించి "చెట్టు కింద ఆఫీసు"లో కొంత చెప్పుకున్నాం. "చెట్టుకింద ఆఫీసు"కు స్ఫూర్తినిచ్చిన ముర్ల రాజిరెడ్డికి స్వయానా తమ్ముడు. అన్నదమ్ములిద్దరికీ కొండరెడ్ల సెంటరంటే అభిమానం వుంది. ఆ సెంటరు ఆరంభం చూసిన అన్నదమ్ములకు సంవత్సరం దాటీ దాటకుండానే దాన్ని ఎత్తేస్తున్నారంటే భరించశక్యం కానట్లుంది.

– మీరేం మాట్లాడరేం సార్? అంటూ రెట్టించాడు మళ్లీ యర్రయ్యరెడ్డి.

– ఏమి మాట్లాడేది? మీ మాదిరే నేనూ బాధపడుతూన్నాను"

– "మీరు చెప్పకుండా దాన్నెట్లా ఎత్తేస్తరు సార్? ఇట్లాంటి ఆఫీసోకటుంటే బాగుండునని ఆలోచించడానికి ముప్పై ఏండ్లు పడ్తే, దాన్నెత్తెయ్యడాకి మూడు రోజులు పట్టలేదు".

–"గతంలో నేను చెబితే దాన్ని స్థాపించడం జరిగింది గానీ, యిప్పుడు నేను చెప్తే తిరిగి ఉంచుతారని నాకు నమ్మకం లేదు" అన్నాను.

–"అయితే అక్కడికేపోతం సార్. ఖమ్మం బోయి తేల్చుకుంటం. కొండరెడ్లనందర్నీ తీసుకుపోతం. మా సెంటరు మాకొచ్చేదాక ఊరుకోం. మీకు గూడా తెలియకుండా జిరగిందంటే పోయిన ఉగాదికి కొండరెడ్ల సదస్సు బెట్టి ఆఫీసు దెరిస్తే జీడిగుప్పలో జాతర జరిగినట్లు, పండగ జరిగినట్టున్నది గదండి. ఈ సంవత్సరం ఆఫీసు దెరిసిన ఏడాది పండగజేసేది బోగొట్టి ఉన్న దాన్ని బెరికేస్తర్రా. అయినా మాతెగంటే ఎవురికి లెక్క. ఆ సంగతేందో మేం తెలుసు కోవలసిందే వస్తం సార్" అంటూ వెళ్లాడు శ్రీనివాసరావు సమేతంగా ముర్ల యర్రయ్యరెడ్డి.

"మేం చెప్పలేదా సార్, సెంటరెత్తేస్తే ప్రజలూరుకోరని" అందుకున్నాడు.



గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షుడుగా ఉన్న యువకుడు.

"ఎవరా ప్రజలు?" అడిగాను నేను కావాలనే.

– "మీకు తెలవదా సార్. మేమే ప్రజలమంటే...... కోయలు, కొండరెడ్లు, లంబాడీలు అందరూ కలిసి సాధిస్తరు సార్. ప్రజకేది అనుకూలమో, తెలుసుకోవడాకి చాలా టైం పడతది. యిప్పుడంతా మంచిగ ఉందని అందరు అనుకుంటూండే టైంలో యిట్లాచేస్తే ఆశపెట్టి మోసం చేయడమే గదా సార్. ప్రభుత్వం యిటువంటి పనిజేస్తదా సార్. అన్నాడు సంయుక్త కార్యదర్శిగా ఉన్న యువకుడు.

– "సరే నేనూ మీ మాదిరే విన్నాను. యింకా ఖచ్చితంగా తెలీదు. చుద్దాం ఏ జరుగుతుందో" అని వాళ్లని పంపించేశాను. వాల్లు చాలా అసంతృప్తిగా, సందిగ్ధంగా వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రానికల్లా తిరిగి వస్తారని తెలుసు నాకు.

ఈ కొండరెడ్ల సెంటరు, వీళ్లకంతగా నచ్చిందా? దీనికోసం వీళ్లు పోరాడతామం టున్నారు. కానీ అదే సమయంలో నా ప్రమేయం లేకుండా దాన్ని ఎత్తివేయడం జరగదని వాళ్ల అభిప్రాయం. వీళ్ల అభిమానానికీ, ఆవేశానికి సంతృప్తి ఒకవైపు, ప్రభుత్వంలో పనిచేసే ఉన్నతాధికారులందరూ ఏకాభిప్రాయాన్ని కలిగి ఉండాల్సిన అవసరం లేదని తెలుసుకోని వారి అమాయతకత్వానికి బాధతో కూడిన కోపమూ వచ్చాయి.

కానీ ఈ రోజు వీళ్లింత స్వేచ్ఛగా నాదగ్గర కొచ్చి యిలా మాట్లాడుతున్నారంటే వీల్లలో ఎంతో కొంత చైతన్యమొచ్చిందనిపిస్తుంది. వారం వారం ఐటిడిఏ కార్యాలయానికి ఉజ్జోగం కావాలంటూ తిరిగే పదో తరగతి ఫెయిలైన వందలాది మంది కుర్రాళ్ళలో నుంచి కొంతమంది సంఘంగా ఏర్పడి జాతికోసం ఏదో చేస్తామని ముందుకు వస్తే వాళ్లను ఉద్యోగ మర్యాదకు లోబడి ప్రోత్సహించలేకపోయినందకు బాధ అన్పించింది.

కానీ వీళ్ల పట్టుదల నాకు మొదటినుంచీ తెలిసిందే. కేవలం ఓ ఆరేడు నెలల కిందటే మొదలైన వీళ్ల పరిచయం గుర్తొచ్చింది.

"సార్, మోతుగూడెం హాస్టలు వార్డను అసలు హాస్టల్లో ఎప్పుడూ ఉండడు సార్. ఖమ్మంలో ఉండి ఎప్పుడో నెలకొకసారి జీతం తీసుకోవడానికి వస్తూంటాడట. మొన్న మేం మా సంఘం తరపున మీటింగు పెడితే అక్కడవాళ్లు చెప్పారు. ఇట్లా అయితే మాకు చదువెలా వస్తుంది సార్? ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతూ ఉంటే ఉద్యోగులు యిట్లా చేస్తూ ఉంటే మేం బాగుపడేదెట్లా సార్. మీరే చెప్పండి" అంటూ యింకా కొనసాగించ బోయాడు ఓ యువకుడు తన ఆవేశాన్ని, ఆవేదనని.

తనొక్కడే రాలేదు. తనతో బాటు యింకా ముగ్గురు యువకులున్నారు. అంతా ఇరవై, ఇరైవ రెండేళ్ల మధ్య మధ్య ఉంటారు. అందరూ అదే ఆవేశంలో ఉన్నట్టున్నారు. కాకుంటే వీళ్లందరి తరపునా ఆ యువకుడొక్కడే తన ఆవేదనను వెళ్లగక్కాడు. కొంచెం సేపు వాళ్లతో మాట్లాడిన తరవాత తెలిసింది వాళ్లు పెట్టుకున్న సంఘానికి ఆయువకుడు అధ్యక్షుడనీ, మిగిలిన ముగ్గుర్లో ఒకరు ఉపాధ్యక్షుడూ, యింకొకరు ప్రధాన కార్యదర్శి యింకొకరు సంయుక్త కార్యదర్శి అని, ఈ రోజు నేను కొంచెం తీరిగ్గానే కూచొని ఏదో పాత ప్రణాళికల ముసాయిదాలు తిరగేస్తూ ఉన్నాను. గతంలో ఎటువంటి కార్యక్రమాలు చెపట్టారో చూద్దామని. ప్రభుత్వం ఒక రకమైన కార్యక్రమాలను మళ్లీ మళ్లీ చేపట్టడం మామూలే కాబట్టి గిరిజనాభివృద్ధి కోసం పాలవంచ ఐటిడిఎలో గతంలో పనిచేసిన ప్రాజెక్టు అధికారులు చాలా చక్కటి పథకాలనే తయారు చేశారు.

వాటిలో మోతుగూడెం లాంటి సుదూర ప్రాంతాల అభివృద్ధి కోసం తమారు చేసిన "కాంపాక్ట్ ఏరియా ప్రోగ్రాం" ఒకటి. యిలాంటి ఎన్నో ప్రణాళికలూ, ఐదో పంచవర్ష ప్రణాళిక నుంచి అమలులోకి వచ్చిన "గిరిజన ఉపప్రణాళిక" కార్యక్రమాలూ అమలు జరుగుతున్నా గిరిజన ప్రాంతాలలో కొన్ని మౌలికాంశాల్లో లోపం మాత్రం పూరించబడలేదు. ఆ లోపాలు పూరించడానికి తగినంత గట్టి యత్నాలు జరగలేదని చెప్పలేం కానీ, వాటి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని మాత్రం చెప్పలేం.

గిరిజన ప్రాంతంలోని విద్యా విధానం అటువంటి వాటిల్లో ఒకటి. మారుమూల ప్రాంతాల్లో మహా భవనాలు, మంచి వసతులు కల్పించగలుగుతున్నాం గానీ గిరిజనుల మనసుల్లో విద్య గొప్పదనే భావన మాత్రం తగినంతగా కలగజేయలేకపోతున్నాం. పదో తరగతి ఫెయిలు కావడం కూడా ఓ అర్హతనుకునే అమాయకమైన గిరిజన యువతరాన్ని తయారు చేశామేమో!

'మోతుగూడెం వార్డెన్ సస్పెండై కొంత కాలమైంది. అతను సరిగ్గా హాస్టలు చూసుకోవడం లేదనే సస్పెండ్ చేయడం జరిగింది. ఎన్నోసార్లు హెచ్చరించినప్పటికీ పెద్ద మార్పు కన్పించలేదు. మరి సస్పెండు అయిన వాళ్ళను అక్కడ మీకు కన్పించడు కదా" అన్నాను.

ప్రభుత్వాధికారులు గిరిజన ప్రాంతంలో మనస్ఫూర్తిగా పని చెయ్యరనే అభిప్రాయం గిరిజనులకు అందరికీ ఉంటుంది. అందుకే నాతో ఉండే అధికారులు సరిగ్గా పని చేయకున్నా నేను పట్టించుకోలేదనే భావం కలగజేయడానికి ప్రయత్నించిన యువకులు ఆ వార్డను సస్పెండ్ అయ్యాడనగానే కొంచెం సిగ్గు పడిపోయారు. కొంచెం సేపటివరకు ఏమ్మాట్లాడాలో



తోచనట్టుగా ఉండిపోయారు. అప్పటి నుంచీ అప్పుడప్పుడూ ఎన్నో విషయాలు నా దృష్టికి తెస్తూ ఉండేవాళ్లు.

గిరిజన యువజన అభ్యుదయ సంఘం, ముర్ల యర్రయ్యరెడ్డి ప్రభుత్వోద్యోగులు కాదు కాబట్టి తమ ఉద్దేశ్యాన్ని బహిరంగంగానే చెప్పగలిగారు. విమర్శించారు. కానీ ప్రభుత్వోద్యోగిగా ప్రసాదరెడ్డి ఆ పని చేయలేకపోయాడు. కానీ ఒక్క మాటలో తన బాధనంతా వ్యక్తం చేశాడు. అది నన్ను చాలా ఎక్కువ ఆలోచింపజేసింది.

"భార్యా పిల్లలతో ఎవరూ ఉండని వరరామచంద్రపురంలో భార్యా పిల్లలతో సహా ఉండి రోజూ జీడిగుప్ప వెళ్లి, కొండనీళ్లు తాగి నెలకోసారి జ్వరమొస్తున్నా భరించి, కొండలు ఎక్కి, దిగి రెండో ఏడాది సదస్సు ఏర్పాటు చేద్దామనుకుంటూ ఉండేసమయంలో నువు చేసిందేం లేదు పో అంటే దాన్నెలా భరించాలో అర్థం కావడం లేదు సార్. ఆ బాధ మాటల్లో చెప్పలేను. ఎంతయినా మేం చిన్న ఉద్యోగులం కదా సార్. ఏం మాట్లాడినా తప్పేనేమో!"

చివరి ప్రయత్నంగా సుల్తానుకు లేఖ రాసిన ఫిరదౌసి లాగా ఓ ఉత్తరం రాశాను యీ సెంటరు తీసివేయకూడదంటూ. కాస్త ఘాటుగానే రాయక తప్పలేదా ఉత్తరాన్ని.

1990 మే నెలల్లో, మొదలై 'మారుమూల ప్రాంత అభివృద్ధి పథకం' హడావుడీ మే నెల తొమ్మిదో తారీఖున వచ్చిన తుఫాను బీభత్సం, ఆ నెల నుంచి ఇక్కడోటి అక్కడోటిగా గిరిజన సీమలో మొదలయిన మహమ్మారి విషజ్వరాలు (విష జ్వరాలని అప్పటికి తెలీదు) కలిసి వాతావరణం బాగా అస్తవ్యస్తంగా ఉన్న సమయంలో వీటన్నింటితో సంబంధం లేదన్నట్టు నాకు బదిలీ ఉత్తర్వులువచ్చాయి. పాలవంచ వదిలి వచ్చేశాను.

బదిలీ అయి నెల రోజులు గడిచీ గడవక ముందే తెలిసింది జిల్లాలోని వార్తా పత్రికలన్నీ 'సెంటరు' ఎత్తేయకూడదంటూ రాశాయనీ, యువజన సంఘం వాళ్ళ పట్టుదల, యర్రయ్యరెడ్డి గారి వ్యంగ్యం, పత్రికల వారి సానుభూతీ పని చేశాయేమో కొండరెడ్ల సెంటరు తిరిగి తెరవబడిందని తెలిసింది. ఎలాగైతేనేం కొండరెడ్ల సెంటరు కొండ దిగింది.

❖ ❖ ❖

# ఇవి కూడా...
# జరిగి ఉంటే...

మనం చేయగలిగిందాని కన్నా చేయవలసిందే ఎక్కువగా మిగిలిపోతుంది గనుకనే జీవితమంటే అంత మక్కువ మనందరికీ. మనకు అందుబాటులోకి, అనుభవంలోకి వచ్చినవే జీవితమంతా అని ఎవరైనా అంటే తనో నమ్మదగిన అబద్ధం చెబుతున్నాడని అంటాన్నేను.

జీవితంలో ఎంతో సాధించారని మనందరమూ చెప్పుకొనే మహానుభావులు సైతం మీరింకా చేయవలసిందేమైనా ఉందా అని అడిగితే ఇవి కూడా చేయగలిగి ఉంటే యింకా సంతృప్తికరంగా ఉండేదేమోనని చెప్తారనుకుంటాను.

బుద్ధుడు – ఏసుక్రీస్తు – గాంధీ – మార్క్సు కూడా తాము చేసిందానికన్నా చేయవలసిందే ఎక్కువనీ, అది చేయగలిగితే సంతృప్తి నివ్వగలిగిగుండేని అనేవారేమో! ప్రతి రోజూ కొంతమందికి ఎంతో కొంత సాయం చేసే అవకాశం కలిగీ, ఈ వారంలో యీ పనిచేయగలిగామనీ ఆ చేసింది కళ్లెదుట కన్పించి సాక్ష్యం చెబుతుంటే, ప్రతి నెలా ఏదో ఒక మరపు రాని అనుభవం జీవితంలో చోటు చేసుకున్నా, గడిచిన రెండు సంవత్సరాలు జీవితంలో కొత్త అనుభవాలనందుబాటులోకి తెచ్చినా ఆ రెండేళ్లలోనే అన్నిటితోబాటు "యివి కూడా చేయగలిగివుంటే" అని మనసు కనిపిస్తుంది.

అలా అనిపించినప్పుడల్లా మనం చేయగలిగి ఉండీ చేయలేకపోయామనే భావం కన్నా, చేయడానికి యింకాస్త అవకాశం దొరికితే బాగుండేది గదా అనిపిస్తుంది. అయితే ఆ సమయంలో దొరికుంటే ఖచ్చితంగా అది చేయగలిగి ఉండేవాణ్ణా అంటే చెప్పడం కష్టమే. అందుకే అంత మక్కువ నాకు నేను చేయలేకపోయిన ఆ మూడు పనులంటే...

ప్రతి సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం పాటించడం ఐటిడిఎలో కొన్ని ఏళ్లుగా అనూచానంగా వస్తున్నది. ఆ రోజు ప్రాజెక్టు అధికారి కార్యాలయంలోనే ఉండి దరఖాస్తులన్నీ స్వీకరించి సాధ్యమైనంత తొందరలో వాటి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తారు.

అయితే యీ ప్రయత్నంలో నేనెంచుకున్న విధానమేమింటే ఐటిడిఎ అధికారులందర్నీ ఆ రోజు కార్యాలయంలో ఉంచడమే గాకుండా, అందరమూ కలిసి ఒకే చోట కూర్చొని దరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారం కోసం ప్రయత్నించడం. ఒకవేళ వెంటనే పరిష్కరించలేకపోతే ఏ రోజుకు పరిష్కారమౌతుందో సూచించి సంబంధిత గిరిజనుడ్ని పంపించివేయడం.

ఇలా కొన్ని వారాలు గడిచేటప్పటికి నేను గమనించిందేమిటంటే అన్ని విభాగాల్లోని విజ్ఞప్తులు దాదాపు పరిష్కారమవుతున్నాయి. కానీ ఒకే ఒక్క విభాగంలో వారంవారానికి సంఖ్య పెరుగుతున్నది తప్ప తగ్గడం లేదు అని. అవి ఉద్యోగాల కోసం మా గిరిజన సంక్షేమాధికారి వద్ద పదో తరగతి ఫెయిలయ్యిన వాళ్లు. పాసైనా ఆ పైన చదవలేకపోయిన వాళ్లూ, ఆ పైన చదువుతున్న వాళ్లూ చేసిన విజ్ఞప్తులు.

సోమవారమొస్తే చాలు చదువుకుని నిరుద్యోగులైన గిరిజన యువకుల అభ్యర్థనలుయిలా ఉండేవి.

– "ఏం చదివావు బాబూ?"

– "పదో తరగతి"

– "పాసా, ఫెయిలా?"

– "ఫెయిలు"

– మళ్లీ పరీక్షకుకట్టావా?

– లేదు

– అసలు ఎందుకు ఫెయిలయ్యావు?

– యింట్లో ఆర్థికంగా ఇబ్బందిగా ఉండి

– యింట్లో ఆర్థికంగా కష్టంగా ఉంటే నీవు చేయగలిగిందేమిటి? బాగా చదివి పాసయి ఉద్యోగం సంపాదించే ప్రయత్నం చేయాలిగానీ యిలా ఫెయిలైతే అమ్మ నాన్నలకు యింకా కష్టంకదా"

– "నాన్న ముసలివాడుసార్. అమ్మకు ఆరోగ్యం బాగాలేదు. తమ్ముడు చెల్లెలు చిన్న వాళ్లు. అందర్నీ నేనే చూడాలి."

– "అంటే ఏం చేస్తావు?"

– కూలికిపోయి అందర్ని పోషిస్తాను.

– నిజంగా?

– నిజంగానే సార్

– మరి నీ పరీక్షకు ఫీజు గడితే యిప్పుడు మళ్లీ రాస్తావా?

– వద్దు సార్.

– ఎందుకని?

– యిప్పుడు కష్టం సార్

– మరి పదో తరగతి కూడా పాస్ గాకపోతే ఏముద్యోగమొస్తుంది చెప్పు?

– టీచరుజ్జోగమొస్తుందంటగద సార్.

– అంటే ఫెయిలయిన వాళ్ల కోసమే టీచరు పోస్టు అనుకున్నావా? పాసైన వాళ్లుంటారుగదా. వాళ్లే ఎక్కువ మందొస్తే నీకుద్యోగం దొరకదు గదా.

– ఎట్లనో కట్ల మీరే చూడాలసార్.

– ఇలా సాగేవి వారి విజ్ఞప్తులు. ఒక వేళ పదో తరగతి పాసయినా పైకి చదవడానికి ముందుకొచ్చే వాళ్లు తక్కువ.

– "ఎందుకు చదవగూడదయ్యా నువు చక్కగా పాసయ్యావుగదా!" అంటే

– "యింట్లో ఆర్థికంగా ఇబ్బంది ఉంది సార్. నాయన చదివించలేదు. అమ్మ జచ్చిపోయింది యింక కష్టం సార్.

యిలాంటి సంభాషణలు క్రమం తప్పకుండా నాలుగువారాలు విన్న నాకు దీనికేదైనా పరిష్కారం కనుక్కోగలిగితే బాగుండుననిపించింది.

యింతమంది యువకులు యిలా పనిలేకుండా, సంవత్సరాల తరబడి ఉంటే గిరిజన ప్రాంతంలో అశాంతి లేకుండా ఎలా వుంటుంది? ఒక పక్క వీళ్ల తల్లిదండ్రులు అమాయకత్వంతో భూమి పోగొట్టుకొని ఏడుస్తుంటే, అరకొరగా చదువుకున్న యువకులు ఉద్యోగాలు రాక, భవిష్యత్తు ఏంటో తెలీక యింటి పనులు చేయలేక, పొలం పనులు చేయలేక రెండింటికి చెడిన రేవడిలా తయారైతే ఆ సంసారాల పరిస్థితేమిటి? బీదరికంలో మగ్గే ఆ గూడేలు దరిలేని నిరాశలో మునిగిపోవలసిందేనా? యిటువంటి వాతావరణంలో అతివాదంవైపు ఆకర్షితు లౌతున్నారేమో! ఉద్యోగాలు యిచ్చినా, ఆర్థిక పరిస్థితి మెరుగుపడినావాళ్లు అతివాదం వైపు మొగ్గు చూపితే అది వేరే విషయం.

ఇలాంటి యువకుల కోసం, గిరిజన సీమలో ఉండే అనంతమైన నిరక్షరాస్యతను



కొంచెమైనా తగ్గించడం కోసం మొదటిగా గిరిజన గ్రామాలను సర్వే చేయడం మొదలుపెట్టాం. పాఠశాలలు లేకుండా ఎన్ని గ్రామాలున్నాయో చూద్దామని.

రాష్ట్ర విద్యాశాఖవారి ప్రమాణాల ప్రకారం 200ల పాఠశాలలు కావాలి ఖమ్మం గిరిజన ప్రాంతంలో. కానీ గిరిజన ప్రాంతంలోని ప్రత్యేక కారణాలవల్ల వెయ్యిదాకా పాఠశాలలు కావాలనే నిర్ణయానికొచ్చాం. చాలా కోయగూడేల్లో ఒక్క దగ్గర యిరవై యిళ్లకు మించి ఉండవు. గూడేనికి గూడేనికి దూరం పెద్దగా ఉండకపోవచ్చు, కానీ రెండు గూడేల మధ్య వాగు అడ్డముంటుంది. రెవెన్యూ గ్రామం ఒకటే ఐనా దాని కింద ఉండే కుగ్రామాలు ఒక్కోసారి యాభై దాకా ఉంటాయి. ఉదాహరణకు టేకుల పల్లి మండలంలోని బోడు గ్రామం. దానిక్రింద యాభై కుగ్రామాలున్నాయి. వీటన్నిటికి కలిపి ఒకే పాఠశాలంటే కుదురుతుందా? అలాగే మణుగూరు మండలంలో ఉండే పగిడేరు గ్రామం. దానికింద ఎన్నో కుగ్రామాలున్నాయి.

రెండు కుగ్రామాల మధ్య దూరం కిలోమీటరులోపే. కానీ రెండింటికి మధ్య దట్టమైన అడవిఉంటే చిన్న పిల్లలు ఆ అడవిలో నడిచి వెళ్ళడంసాధ్యమా? యిలాంటి వాస్తవాలను దృష్టిలో పెట్టుకుంటే వెయ్యి పాఠశాలలు తెరిస్తే కానీ గిరిజన సీమలోని నిరక్షరాస్యత మీద మనం దాడి చెయ్యలేం. నిరుద్యోగం మీద దెబ్బతీయలేం. నిరాశలోఉన్న యువకులకు ఓ దారి చూపించలేం అనిపించింది.

ఖమ్మం జిల్లాలో ఉండే పన్నెండు వందల చిల్లర గ్రామాల్లో వెయ్యి గ్రామాలు గిరిజన సీమలోనే ఉన్నాయి. ఆ వెయ్యి గ్రామాల కింద ఎన్నో కుగ్రామాలు. ఆ కుగ్రామాల్లో మళ్లీ ఎన్నో విడివిడి గూడేలు. వీటన్నింటిని సమన్వయం చేయాలంటే విద్య ద్వారానే సాధ్యం అని మా భావన.అందుకనే గిరిజన యువకులకు ఉపాధి కల్పించే ఏకోపాధ్యాయ పాఠశాలలు మిగిలిన జిల్లాల్లోని గిరిజన సీమలో బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రతి గిరిజన యువకుడి ఆశా, ఆసక్తీ, ఏకోపాధ్యా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయడం మీదే ఉండేది.

రెండు నెలలు కృషి చేసి పాఠశాలలు కావలసిన గ్రామాల ఒక జాబితా తయారుచేసి దాన్ని స్థానిక నాయకులతో చర్చించి ఒక తీరుకు తెచ్చాం. అప్పటి నుంచీ గిరిజన యువకుల ధ్యాసంతా దాని మీదే. పాలిటెక్నిక్, బియ్యే, బియస్సీలు మానుకొని ఈ ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూసిన యువకులను నేనెరుగుదును. బియ్యే మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడై కూడా ఏవో కారణాల వల్ల వేరే ఉద్యోగం చేయడానికీ, జిల్లా వదిలి పోవడానికీ యిష్టపడని రాంబాబు అనే యువకుడు ఎన్నిసార్లు ఈ ఏకోపాధ్యాయ పాఠశాలల గురించి నన్నడిగి ఉంటాడో చెప్పలేను. కానీ రెండేళ్లు గడిచినా అవిరాలేదు. ఈ లోపుల నేనే వచ్చేశాను. ఈ పాఠశాలలన్ని తెరవగలిగి ఉంటే... ఆ యువకుల ముఖాల్లో వెలుగు చూడగలిగి ఉంటే...

గిరిజన సీమలోని చిన్నారి బాలలంతా ఊళ్లోనే ఉండే పాఠశాలకు పోవడం నేర్చుకుంటే... ఎన్ని కలలో...

ఆ పాఠశాలలు వస్తాయి. వస్తాయి అనే నమ్మకం ఎంతగా ఉండేదంటే అవి వస్తే గిరిజన ఉపాధ్యాయులు వారి వారి గ్రామానికి కరదీపంలా ఉండాలని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, చట్టాలు, వివిధ కార్యాలయాల గురించి లీలా మాత్రంగా వివరించే ఓ కరదీపిక తయారు చెయ్యడం మొదలుపెట్టాం.గిరిజన ఉపాధ్యాయుడు తన గ్రామానికి కేవలం అక్షరాలు నేర్పేవాడే కాకుండా వైతాళికుడు కావాలని కోరుకున్నాం.ఎన్ని కలలో...?

సరే అదలా అయిపోయింది. పోనీ మనకున్నంతలో, మన చేతుల్లోనే ఉండే వనరులతో మండలానికో సుదూర గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దగలిగితే బాగుండుననే ఆలోచన మా యూనిట్ అధికారులసమావేశంలో వ్యక్తమయింది. అక్కడ ఒకస్కూలు, వ్యవసాయంలో కొత్త పద్ధతులను నేర్పించే ఓ రెండొందల ఎకరాల ఫారము, కరెంటు, ఓరోడ్డు, తాగడానికి మంచినీళ్లు అందరికీ శుభ్రమైన యిళ్లు – యివే మా ఉద్దేశంలో ఆదర్శగ్రామంలో ఉండవలసిన వసతులు.

సెమీ పర్మినెంటు యిల్లనేది ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లోనే చూస్తాం. గోడలు లేకుండా పైన పెంకులతో కప్పిన యిళ్లను సెమీ పర్మినెంటు యిళ్లంటాం. గోడలకు బదులు వెదురు తడికెలుంటాయి. యీ యింటికి వాళ్లకు కావలసినంత విశాలంగా కట్టుకునే వీలుంది. అటువంటియింటిని అతిసుందరంగా తీర్చిదిద్దిన కోయలెంతో మంది ఉన్నారు. కోయగూడేల్లో కొంత మంది కోయల యింటి లోగిలిచూస్తే అందమంటే కోయలకుండే భావమేమిటో తెలుస్తుంది. ఇంటి ముందు పూలచెట్లు, యింటి లోపల రెండు అరల వెదురు తడికెల మీద చక్కటి రంగుల పోస్టర్లు, యింటి బైట చక్కగా అలికి ఏవో ముగ్గులు వేసి, వెదురుగోడలపైన ఏవో బొమ్మలు వేసి బొమ్మరిల్లుగా ఉండే యిలాంటి యిళ్లతో ఉండే కాలనీ చిక్కటి అడవి మధ్య ఉండే పచ్చటి వనం ఎర్రటిపూలు పూసినట్టుగా ఉంటుంది. లేదా ఓ పెద్ద ఎర్రటి పండు తయారౌతున్నట్టుగా ఉంటుంది.

ఇలాంటి కాలనీలో ఓ స్కూలు, మంచినీటి వసతి ఉండి గ్రామం చేరడానికి అడివి మధ్యలో వెళ్లే కాలిబాట కన్నా కాస్త పెద్దదైన రోడ్డు లాంటిది (రోడ్డు మాత్రం కాదు) ఉంటే ఆ గ్రామం శోభ చూడవలసిందే. ఇలాంటి దారులు తారురోడ్ల కన్నా శుభ్రంగా వుంటాయి. అప్పుడప్పుడు బాగు చేస్తే. దమ్మపేట – పాలవంచ రోడ్డు నుంచి పూసుకుంట వెళ్లేదారి అలాంటిదే.



ములకలపల్లి మండలంలో అలాంటి గ్రామాలు కొన్ని చూడొచ్చు. ఈ కలలతో, కోరికలతో ప్రతి మండలం నుంచీ ఒక్కొక్క గ్రామంఎన్నుకొన్నాం. దాదాపుఅడవి మధ్యలోఉండి, అన్ని యిబ్బందులూ ఉన్న గ్రామాన్నే తీసుకున్నాం. గుండాల మండలంలో దామరతోగు, ఏనుకూరు మండలంలో మేడేపల్లి, పాలవంచ మండలంలో పునుకుడు చెలక, బూర్గంపాడు మండలంలో లక్ష్మీపురం,చర్లలో పూసుగుప్ప, కూనవరంలో గండి కొత్తగూడెం, దమ్మపేటలో పూసుకుంట, అశ్వారావుపేటలో రెడ్డిగూడెం యిలా మొదటి విడతగా ఓ పదిగ్రామాల దాకా ఎన్నుకున్నాం.

ఈ పది గ్రామాలకు మా యూనిట్ అధికారులతో వెళ్లాము. అయితే వాటిక్కావలసిన చిత్తు ప్రణాళికలు మా సమావేశాల్లో నాలుగింటికే చర్చించడం జరిగింది. అవి పునుకుడు చెలక, లక్ష్మీపురం, పూసుగుప్ప, పూసుకుంట గ్రామాలు.

ఆదర్శ గ్రామానికుండాలని మేమనుకున్న వసతుల్లో ఈ నాలుగు గ్రామాల్లో ఒక్కోదాన్లో ఒకటీ, రెండే చెయ్యగలిగాం. పునుకుడు చెలకకు కరెంటు, నీళ్లు వచ్చాయి. లక్ష్మీపురానికి అభివృద్ధి కార్యక్రమాలు యివ్వగలిగాం. పూసుగుప్పకు రోడ్డు, పూసుకుంటకు కరెంటూ అభివృద్ధి కార్యక్రమాలూ యివ్వగలిగాం.

ఒక్కో వ్యక్తికి అభివృద్ధి కార్యక్రమాలు తీసుకోవడం సులభమే గానీ గ్రామం గ్రామాన్నీ అభివృద్ధి చెయ్యడంలో ఉండే చిక్కులు అనుభవిస్తేగానీ తెలియవు.

మూడోదీ చాలా ముఖ్యమైనదీ ఐటిడిఏ కార్యాలయాన్ని పాలవంచ నుంచి భద్రాచలం మార్చితే బాగుండుననే కోరిక.

అసలు భద్రాచలానికి ఐటిడిఏ కార్యాలయం మార్చాలనుకోవడానికి ముఖ్య కారణాలు రెండు. మొదటిది ఖమ్మం జిల్లా మొత్తం గిరిజన సీమతో పోల్చిచూస్తే కొత్తగూడెం డివిజన్లోని గుండాల మండలం తప్పించి,మిగిలిన ప్రాంతమంతా అభివృద్ధి చెందిందే. కానీ భద్రాచలం డివిజన్లోని 8 మండలాలూ వెనుకబడి ఉన్నాయని చెప్పొచ్చు. దానికి తోడు ప్రతిసంవత్సరం దెబ్బతీసే గోదావరి వరదలు. ఖమ్మం జిల్లా మన్యమంటే భద్రాచలన్నే చెప్పుకోవాలి. మిగిలిన అన్ని ఐటిడిఏల(ఒక్క పార్వతీపురం మినహాయించి) కార్యాలయాలు ఏజెన్సీ ప్రాంతం మధ్యలో ఉన్నాయి. ఆదిలాబాదు ఐటిడిఏ చాలా చిన్న గ్రామమైన ఉట్నూర్లో; విశాఖపట్నం ఐటిడిఏ  పాడేరులో; శ్రీకాకుళం ఐటిడిఏ సీతంపేటలో; వరంగల్ ఐటిడిఏ ఏటూరు నాగారంలో ఉన్నాయి. కానీ ఖమ్మం ఐటిడిఏ చెప్పుకోదగిన పట్టణమైన కొత్తగూడెం దగ్గర పాలవంచలో ఉంది. పాలవంచలో దాదాపు గిరిజనులు లేరిప్పుడు. అటువంటి పాలవంచలో ఐటీడిఏ ఎందుకు?

రెండోది : భద్రాచలం డివిజనుకు దగ్గరగా ఉండే మండలమైన వేలేరుపాడు మండలంలోనే చాలా వెనుకబడిన తెగలయిన కొండరెడ్లు, కోయలు ఎక్కువగా ఉన్నారు. భద్రాచలం గిరిజనులు యిప్పటికీ ఐటిడిఏ కార్యాలయం రావడానికి వెనుకాడతారు. ఒకటి భయ సందేహాలు, రెండు ఖర్చుకు వెనుకాడడం. 1989 నుంచీ సెక్టోరల్ అధికార్లు, గిరిజన సంక్షేమ కార్యకర్తలు ఈ భయ సందేహాలను కొంత వరకు పోగొట్టడానికి ప్రయత్నించినా అదే పనిగా పాలవంచ రావడమంటే ఖర్చుతో కూడిన పని. ఈ ఖర్చుకు చాలా జంకేవాళ్లు భద్రాచలం గిరిజనులు. అందుకే బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతంలో, వాళ్ల మధ్యనే ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో కొండరెడ్ల కోసం ప్రత్యేక కార్యాలయం జీడిగుప్పలో స్థాపించడం జరిగింది. కానీ ఐటిడిఏ కార్యాలయాన్ని భద్రాచలం మార్చడమనేది చాలా పెద్ద నిర్ణయం. ప్రభుత్వం తీసుకోవలసిన నిర్ణయం. అయితే మా వంతుగా భద్రాచలంలో కార్యాలయం తెరవడానికి కావలసిన వసతులన్నీ ఎంపిక చేయడం జరిగింది. నిర్ణయం తీసుకోవడమే తరువాయి. భద్రాచలం నుంచి కార్యాలయం నడిపించడం అంత కష్టమైన పనేం కాదు. కానీ ఈ నిర్ణయం కోసం కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూశాం. చూస్తున్నాం. ఇది మా చేతుల్లో లేకపోయినా మా అభిప్రాయం మాత్రం స్పష్టంగానే ప్రభుత్వానికి చెప్పాం. నా వంతు భద్రాచలానికి కార్యాలయం మారేలోగా నెలలో మొదటి, మూడు సోమవారాల్లో భద్రాచలం వెళ్లి రోజంతా అక్కడే ఉండి ప్రజా విజ్ఞప్తులను స్వీకరించేవాణ్ణి. ప్రాజెక్టు అధికారి భద్రాచలంలోనే అందుబాటులో ఉంటారనేది భద్రాచలం డివిజన్లోని గిరిజనులకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. కానీ అందరూ ఆ విషయం తెలుసుకోవడానికి కొంత ఎక్కువ సమయమే పట్టింది.

బాగా వెనకబడిన గిరిజనుల మధ్యకు భద్రాచలానికి కార్యాలయం మార్చి, గిరిజన గ్రామాలకు చదువు, గిరిజన యువకులకూ ఉపాధి కలిగించే గిరిజన ఏకోపాధ్యాయ పాఠశాలలు తెరిచి, ఒక్కో మండలంలో కనీసం ఒక్క గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తయారు చేస్తే గిరిజనాభివృద్ధిని గురించి గిరిజనులకుండే అపనమ్మకం చెరిగిపోయే అవకాశం ఉంది.

ఆ ప్రయత్నం జరుగుతుందని నా ఆశ.

❖ ❖ ❖



# ఓసారి తిరిగి చూస్తే...

తీయటి గురుతుగా మిగిలిపోయిందేమో అనిపిస్తున్నది.

కాలం గడిచేకొద్దీ జ్ఞాపకాలు మసకబారతాయి. అయినా ఆ రెండేళ్ల జ్ఞాపకాలు రెండేళ్లు గడిచినా కూడా నిన్న జరిగిన సంఘటనల్లా అనిపిస్తున్నాయి. సాందల గంగిరెడ్డి మాట్లాడుతున్నట్టు, పున్నమ్మ యింకా వాదిస్తూనే వున్నట్టూ, రాజిరెడ్డి గారికి యింకా చెట్టుకింద ఆఫీసు మీద ఆశ చావనట్టూ అనిపిస్తుంది. ఇవన్నీ భ్రమలుకాదు. ఇవన్నీ యిలా జరుగుతూనే ఉంటే ఎంత బాగుంటుందో కదా అనే ఆశా దీవనలు.

యీ మూగ గిరిజనులు జనస్రవంతిలో కలిసి తాము సైతం ఈ దేశ ప్రగతికి కారణభూతులమే అని మనస్ఫూర్తిగా తమపై తాము నమ్మకం పెంచుకోగలిగితే రెండు తరాల కిందట కాలినడకన వందల మైళ్లు నడిచి ఆంధ్రదేశపు గిరిజన జీవనగతిని మార్చాలనుకున్న ప్రొఫెసరు హేమండార్ఫ్ గారి దగ్గర్నుంచి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సంక్షేమ కార్యక్రమాలకు ప్రాణం పోసి జనం జీవం పెంచిన శంకరన్‌గారూ గిరిజనుల ఆలోచనా విధానంలో మార్పు తీసుకొచ్చి వారూ ఓ ఉప్పెనగా మారాలని కోరుకునే బీడి శర్మగారి దాకా గిరిజన సీమలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో ఆనందాన్ని సంతృప్తినీ పొందగలిగే ఎంతో మంది అధికారులు కోరుకునే తీయని కోరికలు ఫలించినట్టే. కొన్ని నెరవేరుతూనే ఉన్నాయి. కాకుంటే వాళ్లు కోరుకున్నంత బలంగా జరక్కపోవచ్చు. వాళ్లు కోరుకున్నంత తియ్యగా జరక్కపోవచ్చు. ఈ అధికారులకు స్వేచ్ఛనూ, వారి ఆలోచనా విధానానికి మద్దతునూ యిచ్చిన ఆయా ప్రభుత్వాలూ ఈ లక్ష్య సాధనకు తోడ్పడినాయి.

గిరిజన సమాజంలో మార్పులొస్తున్నాయి. ఆ మార్పులన్నీ మంచి కోసమే రావడం లేదు. నాలుగు దశాబ్దాల ప్రణాళికలూ, ప్రయత్నాల అనంతరం గిరిజన సీమలో పాత సమస్యలు పోయాయని చెప్పడం కష్టం. కొత్త సమస్యలొస్తున్నాయి. ఆ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఇలా సమస్యలొస్తూ ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ, గిరిజన యువతరాన్ని నిదానంగానైనా భవిష్యత్తు వైపు మళ్లించగలిగితే

వాళ్లే వాళ్ల గూడేలను బాగు చేసుకోగలరు.

ఇప్పటికి విద్య చాలా తక్కువగా ఉంది గిరిజన సీమలో, ఆ కొంచెం మందిలో కూడా తమ జాతికి ఏదో చేయాలనే ఆరాటంతో ఉన్న యువకులున్నారు. కాకుంటే వాళ్లకు చేయూతనిచ్చి నడిపించే మంచి మనసున్న వాళ్లే తక్కువౌతున్నారేమో!

గిరిజన సీమలో గిరిజనేతర ప్రాబల్యం; భూమి సమస్యవల్ల భూమిలేని కూలీలుగా మారుతున్న కుటుంబాలున్నాయి. చదువు పూర్తిగా రాక, ఇటు నాగరిక సమాజంలో చలామణి కావడానికి కావలసిన అర్హతలు లేక, అటు తమ గూడెల్లోనే ఉండడానికి వ్యవసాయం చేతకాక రెండింటికి చెడిన రేవడుల్లాగా తయారౌతోంది గిరిజన యువతరం. పదో తరగతి తప్పిన వాళ్లు కోకొల్లలు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడం వాస్తవమే. అందువల్ల పదో తరగతి ఫెయిలు కావడమూ నిజమేకావచ్చు. కానీ ఉన్న వసతులనుపయోగించుకోమని ప్రోత్సహించే వ్యక్తులూ, వ్యవస్థలూ నానాటికీ తగ్గి పోతున్నాయో,లేక అవి పెరుగుతున్నా వాటివల్ల యీ యువత పొందగలిగిన ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉందేమోననిపిస్తోంది. ఈ సంస్థలు గిరిజనులను పీడించే ప్రధాన సమస్యల జోలికి ఎంత వరకు పోతున్నాయనేది ఆలోచించవలసిన విషయం.

భూమి సమస్యలోగానీ, గిరిజన స్త్రీలను గిరిజనేతరులు మోసం చేస్తే పుట్టిన బిడ్డల సంగతికానీ, రెండింటికిచెడిన రేవడిగా తయారైన గిరిజన యువకుల జీవనగతి మార్చడానికి గానీ తగినంతగా ఈ సంస్థలేవీ పూనుకోవడం లేదని చెప్పొచ్చు. వ్యక్తులు ఎంత నిబద్ధత కలిగినవారైనా, ప్రభుత్వంలో పనిచేస్తుండే వారికుండే పరిమితులూ, పరిధులూ వారి కుండడంతో ఈ ప్రధాన సమస్యల విషయంలో వాళ్ళు సాధించగలిగింది పరిమితమేమో! కాకుంటే వాళ్లు ఒక సమస్య తీవ్రతకు స్పందించి యువతరాన్ని జాగృతం చెయ్యగలరేమో!

ఇలాంటి ప్రధాన సమస్యల్లో ఒకటి అడవి సమస్య. గిరిజనులకు గిరుల మీద, అడవి మీద అధికారముందా అనే ప్రశ్న చెట్టుముందా విత్తుముందా అన్నట్టుగా ఉంటుంది. అడవులొచ్చిన తరువాతనే గిరిజనులొచ్చినా, అటవీ శాఖాధికారులు (వారికున్న ఇబ్బందులు వారికున్నాయనుకోండి) గిరిజనుల కన్నా అడవే ముఖ్యమని చెప్పకనే చెప్పడంతో నవ్వాలో ఏడ్వాలో అర్థంకాని స్థితిలో పడుతున్నారు గిరిజనులు.

అటవీశాఖ ఇంకో అడుగు ముందుకేసి వన్య మృగ సంరక్షణ కోసం గిరిజనులను అడవులను ఖాళీ చెయ్యమనడమూ జరుగుతున్నది. యీ పరిస్థితుల్లో అడవిలో జంతువులు



అటవీశాఖ వారికన్నా ముందే లేవా? అవీ, గిరిజనులూ కలిసి బ్రతకలేదా? గిరిజనుల వల్ల వన్య మృగాల సంతతి పెరగడం లేదనడం గిరిజనులకు సమంజసంగా అన్పించడంలేదు.

ఇలాంటి వైరుధ్యాలెన్నింటిలో ఎదుర్కొంటున్నా ముందు ముందు రోజుల్లో మంచేదో జరుగుతుందన్న అమాయకత్వంతో నిండిన ఆశలతో బతుకుతున్నారు. సమస్యలెన్నున్నా బతుకు యీడ్చుకతప్పదనే దశలో వాళ్లున్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆయా ప్రభుత్వాలూ, ఆ ప్రభుత్వాల తరఫున అధికారులూ తమవంతుకృషి చేస్తున్నా గిరిజనుల ప్రధాన సమస్యలు యింకా వున్నాయి.

ఐతే తమ వంతు కృషి చేసిన అధికారులకు గిరిజన సీమపట్ల మమకారం చావదు. అందుకే ఒకసారి గిరిజన సీమలో పని చేసిన ఏ అధికారీ అంత సులభంగా ఆ ప్రాంతాన్ని మర్చిపోలేడు.

అందుకే ఇప్పటికీ రాత్రి రెండు గంటల సమయంలో తలుపుకొట్టి, “అయ్యా నా మొగుడ్ని ఎల్లుగ్గొడ్డు కొట్టిందని” దిక్కుతోచక విలపించే గిరిజన స్త్రీ రూపం కళ్లకు కట్టినట్టుగా ఉంది. “మేమంత గనంగా మాట్లాడితే ఊరుకుంటారు సారూ. నువ్వంటే మా పిల్లలెట్టున్నరని అడిగినవు. మా పంటలెట్టున్నయని అడిగినవు. అదే తేడా సారూ. యిన్ని ఆఫీసులున్నయి. అక్కడ మా పనులు జరిగే సంగతట్టుంచు. పలకరించెటోడు లేడు గద” అనే సున్నం సిరిమప్ప వాదన నిన్న మొన్ననే జరిగినట్టుగా ఉంది. “కన్న పేగూ, బూవి తల్లీ అంత తొందరగా వదిలిపెట్టవయ్యా” అన్న చింత మల్లమ్మతో యింకా మాట్లాడుతున్నట్టుగానే ఉంది.

ఈ జ్ఞాపకాల బంధం ఏదో ఒక రోజు వాళ్ల సమస్యల పరిష్కారానికి నా వంతు సాయం చెయ్యడానికి ఉపయోగపడుతుందేమోనన్పిస్తున్నది. ఆ రోజు కోసం ఆర్తిగా యిలా ఎదురుచూస్తూ......

❖ ❖ ❖

# ఈ పుస్తకమెలా వచ్చిందంటే...

భారతదేశంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికీ, వారి అభివృద్ధికీ సృష్టమైన ప్రణాళికలను తయారుచేసి, వాటిని అమలు పర్చడానికి 'సమగ్ర గిరిజనాభి సంస్థలను' ఏర్పాటు చేసి గిరిజనాభివృద్ధి పట్ల ఒక ప్రత్యేక ఆసక్తిని అధికారుల్లో కలుగజేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనసీమలో పనిచేసే అవకాశం కల్పించింది. అందుకు నా కృతజ్ఞతలు. వాస్తవానికి యివి కథలు కావు. గిరిజనుల వెతల కతలు. తమదనుకునే చోటనే గిరిజనులు పడే వెతలకు అక్షరూపం. వీటిలో చాలా వాటిని వారి మాటల్లోనే చెప్పడం జరిగింది. వాళ్ళ ఆశలూ, ఆశలు నెరవేడానికి వాళ్ళ పరిష్కారాలూ, వాళ్ళ ఆలోచనా విధానానికీ మనకీ ఎంత అంతరముందనే విషయమూ- స్థాలీపులాకంగా చెప్పడమే యీ కతల ఉద్దేశం.

ఈ కతలకు మూలం సొంత అనుభవమే. ఇందులో ఏ సంఘటన గానీ, సన్నివేశం గానీ, వ్యక్తి గానీ ఊహల నుంచి రాలేదు. ప్రతిదే వాస్తవమే. కాకుంటే మూగజీవులైన కోయలూ, కొండరెడ్లూ క్లుప్తంగా ఒక మాటలో ఒక వాక్యంలో చెప్పిన వాటిని అందరికీ అర్థమయ్యే దానికోసం యింకో నాలుగు మాటల్లో వివరించడం జరిగింది.

కోయలూ, కొండరెడ్లు సృష్టంగా మాట్లాడగలరు గానీ వాళ్ళకు నగిషీలు తెలియవు. అందుకే యీ కతల్లో, భాషలో నగిషీలు లేవు. వాళ్ళకున్న సునిశిత పరిశీలనా దృష్టితో చక్కటి వ్యక్తికరణ చెయ్యగలరు. అటువంటివారే 'కొండకు కట్టెలు మొయ్యమంటరా సారూ' అన్న సున్నం చంద్రమ్మ; 'ఇద్దరుండాల సారూ' అన్న గంగిరెడ్డి; 'కూచున్న కొమ్మ కొట్టుకుంటబా సారూ' అన్న చినరామయ్య; 'బతకనిస్తరా సారూ' అన్న సున్నం సిరిమప్ప; 'యీ మొకం మల్లొచ్చింది సారూ' అన్న సీతమ్మ; 'శాపలు దాగితే సెరువెండుద్దా' అన్న పాయం పున్నమ్మలు.

ఈ కతలకు కారణం ఏవో కథలు రాయాలనే కోరిక కాదు. చూసిందీ, అనుభవించిందీ రాయడం సులభం కాబట్టి రాసి పడేస్తే సరిపోతుందనుకునే ఆలోచన కాదు. అడవుల్లోకి, కోయాగూడేల్లోకి వెళ్లి ఒక్కోసారి ఒక్కొక్కర్నే పలకరించి, ఒక్కొక్కసారి పలకరించడానికి ఒక్కరూ దొరక్కపోతే, రెండోసారి వెళ్లినా బెరుగ్గా, నిరాసక్తిగా చూసే గిరిజనుల మనసులో ఏముందో తెలుసుకోవాలనే కుతూహలం; ఏముందో తెలుసుకోవడానికి ఏం చేస్తే బాగుంటుందనే ఆరాటం వెనక మనం చేసిన కాస్త వాళ్ల సమస్యలను యిసుమంతయినా తీర్చలేక పోతున్నదనే వాస్తవం తెలిశాక, మనకు తెలుసుకున్న దానికన్నా వాళ్ల బాధలకు వాళ్లే చెప్పగలిగే పరిష్కారాలున్నాయేమోనని అనిపించినప్పుడు తళుక్కున మెరిసిన ఆశాకిరణమే గిరిజనుల మనసుల్లోకి గుండె లోతుల్లోకి, వాళ్ల బాధల్లోకి వెళ్లాడానికి నాంది పలికింది.

ఆ ప్రయత్నంలో భాగంగానే గూడేలకు గూడేలు,కొండలూ, గుట్టలూ లెక్క చెయ్యకుండా తిరగడం. ఆ తిరగడంలో గూడెం గూడేనికి వేర్వేరు బాధలున్నాయని తెలియడమే గాకుండా గూడేలన్నింటికీ ఒకే రకమైన బాధలూ ఉన్నాయని తెలిసింది. ఆ బాధలను వాళ్ల మాటల్లో, ఆ బాధలకు పరిష్కారాలను వాళ్ల ఆలోచనల్లో చెప్పడమే ఈ కతల ఉద్దేశం.

ఏ గిరిజన సీమైనా గిరిజన సీమలో ఉండే సమస్యలు దాదాపు ఒకే రకంగా ఉంటాయి. (1) ప్రకృతి వైపరాత్యాలు (2) గిరిజనేతర ప్రాబల్యం (3) భూమి సమస్య (4) కోయ కన్నెల అమాయకత్వం (5) తరగిపోయే అడవి- అటవీశాఖ అధికారులకు సమాధానం చెప్పలేక బ్రతుకు భారం చేసుకునే గిరిజనులూ (6) వీటిన్నిటి మధ్య ఎంతో కొంత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకునే కొంతమంది అధికారులూ.

ప్రకృతి వైపరీత్యాలు కలిగినప్పుడు గిరిజన గూడేలు దీవుల్లాగా తయారైపోయి తాగే నీరు దొరక్క, దొరికినా కలుషితమైపోయి జీవితం దుర్భరమైపోతుంది. బైటనుంచి ఎంతో కొంత సాయం చేస్తేనే వారి జీవితం మళ్లీ సాఫీగా తయారౌతుంది. ఇటువంటి పరిస్థతినే 'ఇటూ కిన్నెరసాని అటూ కిన్నెరసాని'లో చూపించడం జరిగింది.

గిరిజన సీమలో అడుగుబెట్టడంతోనే యిలాంటి విపత్తులెదురైతే వాటి నెదుర్కోవడం మినహా మరో మార్గం లేదు. ఆపాదమస్తకం అందులో మునిగి తేలితే గానీ గిరిజనసీను లోతేమిటో తెలియదు.

అయితే ఆపదలో ఉన్న మనుషులు, గ్రామాలు, గిరిజనులా, గిరిజనేతరులా అని తర్కించుకునే సమయం లేకుండా చేసే విషాద సంఘటనలు తారసపడుతుంటాయి. అప్పుడు మనిషిగా స్పందించడం వినా అధికారిగా ఆలోచించడం అనవసరం అని నా వ్యక్తిగత నమ్మకం. ఇటువంటి పరిస్థితి "రోడ్డు మీద లాంచీ" లో చూడవచ్చు. బాధల్లో ఉన్నావాళ్లు ఎవరైనా ఒకటే !గిరిజన సీమలో గిరిజనేతరులూ ఉన్నారు.

ఈ వైపరీత్యాల విపత్తుల్లో చిక్కుకొని సుదూర తీరాల్లో ఉండే గిరిజనులు; ముఖ్యంగా కొండరెడ్లకు కనీస సౌకర్యాలేమయినా కల్పించగలమా అనే సందేహానికి,

"ఎందుకల్పించలేరూ! చక్కగా మా ఊళ్ల మధ్యనే ఓ ఆఫీసు పెట్టి మాకందుబాటులో ఉండే సారునిస్తే అదే మాకు మీరు మొదట చేసే సాయం" అని చెప్పింది.'ఓ కొండరెడ్డి గ్రామానికి సర్పంచీ, అందరికీ ఆమోదయోగ్యుడైన కొండరెడ్ల నాయకుడు ముర్ల రాజిరెడ్డి తను జీడిగుప్పలోనే ఉంటాడు. అందుకే ' కొండరెడ్ల సెంటరు' జీడిగుప్పకు వచ్చింది. అదే 'చెట్టుకింద ఆఫీసు'

అలాంటి ఆఫీసు కొండల మధ్య, కొండరెడ్ల మధ్య, గోదారి వొడ్డున పెట్టడానికి ముందే కొండలెక్కి గోదావరి, శబరి దాటి కొండరెడ్లందర్నీ కలుసుకొని కొండరెడ్లందరూ మాకు 'రెడ్డి' ఉంటే చాలనిపించిన వరప్రసాదరెడ్డి కథే "వాడు రెడ్డి వచ్చినాడు". ఇందులో ఒక వ్యక్తిని గురించి గొప్పగా చెప్పడం కాదు ముఖ్యం. నిబద్ధతా, ధ్యాస ఉంటే ఏ ఉద్యోగైనా గిరిజనుల ఆదరాభిమానాలకు పాత్రుడౌతాడు. అందుకోసం ప్రతి ఉద్యోగి పాటుపడాలి అని చెప్పడమే!

సరే'చెట్టు కింద ఆఫీసు' పెట్టాం. కొండరెడ్ల కోసం అధికారిగా రెడ్డి వచ్చినాడు. ఆ తరవాతేమయింది?

రెడ్డి కొండరెడ్ల కోసం ఓ శిక్షణా కేంద్రాన్ని పెడితే బాగుంటుందేమో అనే ఆలోచనలను బలపరిచాడు. కొండరెడ్లు గానీ, కోయలు గానీ వాళ్ల గూడెం వదిలి ఒక్క రోజు కూడా ఉండరు. సాయంత్రానికి లేదా ఎంత రాత్రైనా సరే రాత్రికి రాత్రే యింటికి వెళ్లాల్సిందే. అదవులూ, కొండలూ, గోదావరీ వాళ్లకడ్డం కావు. అయితే యిలాంటి వాళ్లకు బాహ్య ప్రపంచం చూపించి బ్రతకు దెరువుతో బాటు, బ్రతుకు నేర్పు కూడా చూపించాలన్న ధ్యేయమే ఓ శిక్షణా కేంద్రానికి నాంది పలికింది.

అయితే ఆ నాందికి పరోక్షంగా కారణభూతురాలు చంద్రమ్మ. చంద్రమ్మ అప్పటి కూటూరు సర్పంచి కూతురు. 'కొండకు కట్టెలు మొయ్యమంటరా సారూ? అని చిన్న ప్రశ్న వేసి నన్ను సిగ్గు పడేట్టే చేసిన చంద్రమ్మ గిరిజనులెదుర్కొటున్న ఓ సమస్యకు పరిష్కారం వెదికేట్టు చేసింది.

కొండకు కట్టెలు మొయ్యడం అర్థంలేని పని అని ఒప్పుకొన్నాక, వెదుళ్ల పెంచాలనుకుని, అది పెద్దగా సఫలం కాకపోవడంతో ' అడవిలో ఫారం' రావడానికి అహర్నిశలు కష్టపడ్డవాడు వ్యవసాయాధికారి నాగేశ్వరరావు కూనవరానికి దూరంగా అడవి మధ్యలో మకాం పట్టి, తుప్పలు కొట్టించి నేల సాపు చేసి, తొలకరి వానలకే మొక్కలు నాటాలని నాలుగే నాలుగు నెలల్లో ఎగుడుదిగుడుగా ఉండి ఎందుకూ పనికిరాదనుకున్న



నేలను చదును చేసి చక్కని రూపుదిద్దాడు.

అటువంటి ఫారానికి శిక్షణ కోసం వచ్చిన కొండరెడ్డి జంటల్లో ఒకరైన సొందల గంగిరెడ్డి గిరిజనేతరులమైన మాతో ఒక్క నెల రోజుల సావాసంతో,నాగేశ్వరరావు ప్రోత్సహంతో సిగ్గు, మొహమాటాల దశ దాటి చెప్పదలుచుకున్న దాన్ని నేరుగా, స్పష్టంగా, ఖచ్చితంగా చెప్పే స్థితికొచ్చాడు. అందుకే 'ఇద్దరుండాల సారూ!' అన్న తన వాదాన్ని వినిపించాడు.

మామూలుగా గిరిజనులు నిర్మొహమాటంగా, ధైర్యంగానే మాట్లాడతారు. కానీ నాగరికతపెరిగేకొద్దీ మిథ్యావిలువల మహిమలో పడిపోయి స్వచ్ఛంగా, నిరాడంబరంగా ఉండడానికి కష్టపడే మనలాగా కాకుండా నాగరికత నేర్చుకుంటూ కూడా తన నైజమైన నిర్మొహమాటాన్నీ స్వచ్ఛతనీ ప్రదర్శించారు. గంగిరెడ్డి ఆ స్వచ్ఛతను ప్రతి గిరిజనుడిలో చూడొచ్చు. మనకు ఓపిక ఉంటే, వాళ్లను మనతో కూడా నడిపించగలిగితే.

గిరిజన సీమలో గిరిజనేతరుల ప్రాబల్యం ఒప్పుకోక తప్పని చేదునిజం. చట్ట ప్రకారం గిరిజన ప్రాంతంలో భూమి మొత్తం గిరిజనులదే. గిరిజనేతరుడు భూమి సంపాదిస్తే అదెలా వచ్చిందో నిరూపించుకోవలసినది గిరిజనేతరుడే. కానీ అంతదాకా ఎప్పుడూ రాదు. ఎందుకంటే గిరిజనుల భూమి సమస్య అంత ప్రాధాన్యతనుసంతరించుకోవడంలేదు. గిరిజన సీమల్లో ఉండే మొత్తం సేద్యపు భూమిలో యాభై శాతంపైగా భూమి గిరిజనేతరుల చేతుల్లో ఉంది. అనూచానంగా, వారసత్వంగా గిరిజనులకు వస్తున్న భూమిని గిరిజనేతరులు పలు మార్గాల్లో ఆక్రమించుకుంటే ఇంకాస్త లోపలికి అడివికి పోయి 'పోడు[1]' కొట్టుకోక తప్పని పరిస్థితి గిరిజనుడిది. ఆ భూమి అడవి మధ్యలో ఉందంటూ ఏడాదికేడాది గిరిజనుడ్ని జడిపిస్తూ ఉంటారు అటవీశాఖ అధికారులు. గిరిజన సీమలోనే పరిశ్రమలూ వస్తాయి. వాటివల్ల గిరిజనుడి భూమిపోతుంది తప్ప గిరిజనుడికి వొరిగేదేంలేదు. తానున్న చోటనే కూలిగానైనా మారాలి. లేదా అడవి మధ్యలోకి వెళ్లి అటవీ శాఖ అధికారులదయా దాక్షిణ్యాల మీదైనా ఆధారపడి ఉండాలి. ఈ సమస్య యిలానే కొనసాగుతుంది. అందుకే 'ప్రశ్నల శర్మగారి' ప్రశ్నకు సమాధానం చిన్నదే అయినా యింకా పరిష్కారం దొరకలేదు.

భూమి పోతున్నదని తెలిసినా భూమిని వదలి పెట్టుకోలేకపోవడం దాని కోసం ప్రాకులాడ్డం గిరిజనుడి రక్తంలో ఉంది. ఆ మాటకొస్తే ప్రతి గ్రామస్తుని మనసులో ఉంది. దీన్ని చింత మల్లమ్మ చెప్పిన "భూమికోసం"లో చూడొచ్చు.

గిరిజన ప్రాంతంలో ప్రాబల్యం గిరిజనేతరులదే. భూమి, అడవీ, రాజకీయం, నడిపించేది వారే. అందులో భాగంగానే గిరిజన సీమలోని కోయ కన్నెలు గిరిజనేతర

పురుషుల సరదాలకూ, ఒక్కోసారి భూమిసంపాదించుకోవడానికి మార్గంగా బలైపోతుంటారు. కోయగూడేనికి తప్పు కట్టేస్తే కోయకన్నెకు జరిగిన అన్యాయం గురించిమళ్లీ ఎవరూ మాట్లాడరు. భూమి తనదే. గిరిజనేతరుణ్ణి తన భర్తనుకొని గిరిజన స్త్రీ తన భూమిలో తాను పనిచేసి పండిస్తే ఫలితం గిరిజనేతరుడిది.కోయ స్త్రీకి పిల్లలూ పుడతారు, భూమి పంటలు పండుతుంది. కాని తాను కేవలం పనిమనిషిలా మిగిలిపోతుంది. పంటలు వేశాక సొంత ఊళ్లో ఉండే ఆస్తులూ సంసారాన్నీ చూసుకోవడానికి గిరిజనేతరుడు వెళితే పంట చేతికొచ్చేదాకా కష్టపడేదికోయ స్త్రీలే. కోయ పురుషులు తమ సొంత పొలాల్లో పనిచేయడానికే అంతంత మాత్రం ఓపికచేసుకుంటారు. యిక తమ స్త్రీలు యిలా అయి పోతున్నారని పట్టించుకొనేదెక్కడ? ఈ స్థితిని చూచాయగా 'కోయ కన్నె'లో చూడొచ్చు.

అడవిని 'అడవితల్లి' అని గిరిజనులను అడవితల్లి బిడ్డలని చెప్పడం బాగానే ఉంటుంది. కానీ అడవి మధ్యలో ఉండే గిరిజనులకూ,అడవికీ మధ్య అటవీ శాఖ అధికారులూ, అబ్కారీ అధికారులూ ఉండి, అడవి వల్ల వచ్చే ఆదాయం ముఖ్యమని చెప్తుంటే తామెవరికి తమ బాధలు చెప్పుకోవాలో తెలియని గిరిజనుల సందేహాల వ్యక్తీకరణే "కొండకు కట్టెలు మొయ్యమంటరా సారూ'లో చంద్రమ్మ చేసిందీ 'శాపలు దాగితే సెరువెండుద్దా సారూ'లో లక్ష్మమ్మ చేసిందీ, "కూచున్న కొమ్మకొట్టుకుంటమా సారూ'లో రాములు చేసింది.

అడవి తరిగిపోతుంది. గిరిజనుడి భూమి పోతుంది. గిరిజనుడు యింకాస్త అడవిలోకివెళతాడు. అడవిలోకి ఎందుకొచ్చావని అటవీ శాఖ అధికారులు ప్రశ్నిస్తారు. తాము నిత్యం వాడుకునే యిప్ప పువ్వు ఎక్కడ్నుంచి వచ్చిందని అబ్కారీ అధికారులు ప్రశ్నిస్తారు. జీవనోపాధి కోల్పోయిన గిరిజనుడు పరోక్షంగా అడవి తరిగిపోవడానికి కారణమవుతాడు. చెట్టుకొడుతున్న గిరిజనుడి మీద కేసులు. కానీ కొట్టించిన వాడు గిరిజనేతరుడు. కొట్టించింది పట్టణాల్లో ఉన్న మన కోసం. గిరిజనేతరుడికి ఆస్తీ, ప్రాబల్యం పెరుగుతాయి. పట్టణాల్లో ఉన్న మనకు గిరిజనేతరుడు తరలించిన కలప నగిషీలు చెక్కినటేకు తలుపులుగా, ద్వారబంధాలుగా మన కళాత్మకతను చాటుతుంది.

గిరిజనుల్లో విశ్వాసం పెంపొందించాలని ప్రభుత్వం ఎన్నో ప్రణాళికలను ప్రవేశపెడు తున్నది. కాని ఆ ప్రణాళికలకూ, గిరిజనులకూ మధ్య ఎన్నో అడ్డంకులు, ప్రభుత్వాధికారులు వెళితే అంత తొందరగా గిరిజనులు నమ్మరు. వారి దగ్గరకు రారు. ఒకటికి రెండు సార్లు ఒకే గ్రామానికి వెళ్లగలిగే ఓపికా, తీరికా చాలా మంది ప్రభుత్వాధికారులకు లేదనే చెప్పాలి. ఈ పరిస్థితిని "చీకటి మండలం"లో చూడొచ్చు.



ఇలాంటి పరిస్థితిని చక్కదిద్దాలని 1975 నుంచి ప్రభుత్వ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ ద్వారా తన వంతు కృషి చేస్తున్నది. కాని గిరిజనుల మనస్సులోని భయ సందేహాలు పూర్తిగా తొలగించడం కష్టమవుతున్నది. ఈ పరిస్థితినే 'బతకనిస్తరా సారు'లో చూడొచ్చు.

ఇన్ని రకాల వైరుధ్యాలూ, ఇబ్బందులూ ఉండే గిరిజన సీమలో ప్రాణానికి ముప్పొస్తుందని తెలిసినా జీవితాలను గిరిజన సంక్షేమం కోసం అంకితం చేసిన అధికారులున్నారు. ఒక రకంగా చెప్పాలంటే కొంత మంది నిబద్ధత కలిగిన అధికారుల వల్లనే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు గిరిజనులకూ, హరిజనులకూ చేరగలుగుతున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అటువంటి అధికారుల్లో కొందరు తమ పరిధిలో తాము చేయగలిగిందాన్ని తమ వంతు కర్తవ్యాన్ని మనస్ఫూర్తిగా చేసి, మళ్లీ, మళ్లీ గిరిజన సీమలో పర్యటించి తాము ప్రేమించిన, తము అభిమానించిన గిరిజనులు ఎలా ఉన్నారని చూసిపోతున్నారు. అలాంటి వారే ప్రొఫెసర్ హేమండార్ఫ్‌గారు, శంకరన్‌గారు, బీడీ శర్మగారు.

తమ ఉద్యోగ ధర్మాన్ని మనస్ఫూర్తిగా నిర్వహిస్తున్న అధికారులే కృష్ణారావుగారు, శాస్త్రిగారు యింకా ఎందరో మహానుభావులు. ఈ ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయి. గిరిజన సీమలో కాంతి రేఖలు విస్తరిస్తాయని వీళ్లందరి ఆశ. ఆ ఆశల్లో పాలుపంచుకోవడంలోనే ఈ పుస్తకమొచ్చింది. ఇదంతా ఓ ఎత్తు. ఈ పుస్తకానికి రూపాన్నిచ్చిన వాళ్ల గురించి చెప్పందే ఈ ప్రయత్నం పూర్తికాదు.

గిరిజన సంక్షేమం కోసం తమ వంతు కృషి చేసిన కొందరు అధికారుల గురించి ఇందులో రాశాను. నేను వ్యక్తం చేసిన అభిప్రాయాలతో ఆ అధికారులు ఏకీభవిస్తారని నమ్ముతున్నాను. వారికి చెప్పకుండా వారి గురించి చెప్పడం వారికేమైనా యిబ్బంది కలిగించివుంటే క్షమించమని మనసారా ప్రార్థిస్తున్నాను. నా మనసులో వారిపట్ల ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేయడమే నా ఉద్దేశం. కృష్ణారావు గారికీ, శాస్త్రిగారికీ, బీడీ శర్మగారికీ, హేమండార్ఫ్‌ప గారికి నా సమస్సులు.

ఈ వ్యాసాలు రాయడానికి కారణభూతులైన ముర్ల రాజిరెడ్డిగారికీ, సున్నం చంద్రమ్మకు, చదలవాడ సొందల గంగిరెడ్డికి, సున్నం సిరిమప్పకూ, మడకం బాబూరావుకూ, చింత మల్లమ్మకూ, పున్నమ్మకూ, నేను ఏ మాటల్లో కృతజ్ఞత చెప్పాలో తోచడం లేదు. నాకు వాళ్లు నేర్పించింది సమస్యలకు పరిష్కారాలు మాత్రమే కాదు జీవితానికీ, జీవనానికీ అర్థం.

అంచేత మాటల్లో నేనేం చెప్పదల్చుకోవడంలేదు. అయినా ఆ జీవన్మూర్తులకూ రెండేళ్ల గిరిజన సీమ అనుభవాల్లో నాతో పని చేసిన సత్యనారాయణగారూ, హనుమంతరావూ, భూషయ్య, వీరస్వామీ నా భాగస్వాములు, వాళ్లు లేకుంటే నాకీ అనుభవాలు కలిగి ఉండేవా అని అప్పుడప్పుడనిపిస్తుంది.

గిరిజనసీమలోని అందాలనే గాక అందులోని అగాధాలనీ, కతలనీ, వెతలనీ అక్షరబద్ధం చెయ్యండి ఎవరో ఒకరు చదువుతారు ఎంతోకొంత మూగజీవులకు సేవ చేయడానికి సిద్ధమవుతారని నచ్చచెప్పి వీటికో రూపమివ్వడానికీ, తమపత్రిక ఆంధ్రప్రభ ద్వారా పది మందికీ వీటిని చేర్చడానికి కృషిచేసిన ఆత్మీయులు గౌరవనీయులు పొత్తూరు వెంకటేశ్వరరావుగారికీ, శ్రీ కృష్ణారావుగారికీ, వాసిరెడ్డి నారాయణరావుగారికీ, మామగారైన శ్రీ చంద్రయ్యగారికీ, వాసిరెడ్డి సీతాదేవిగారికీ – యీకతల్లో అంతర్లీనంగా ఉన్న గిరిజనులతోబాటు వారి బాధలకు పరిష్కారం కోసం ఉద్యోగం కేవలం ఉద్యోగంలా కాకుండా తమ వంతు కృషి చేసిన నాగేశ్వరరావూ, ప్రసాదరెడ్డీ, జయరాజు, నరసింహదాసు, భాస్కరరావు, శేఖర్లకూ, నా ప్రత్యేక కృతజ్ఞతలూ, అభినందనలు. అయితే ఈ పుస్తకంలోని పుటల మధ్య, పదాల మధ్య తొంగిచూస్తున్న భద్రాచలం గిరిజనసీమ వాసులెంతమందో ఉన్నారు. వారందరికీ నా నమస్సులు.

ఈ ప్రయత్నంలోని ఔచిత్యాన్నీ, నేను చెప్పిన కతల్లోని వెతలను గుండెలోతుల నుంచి మననం చేసుకొని మాటల రూపంలో యీ పుస్తకానికి పరిచయ వాక్యాలు రాసిన పొత్తూరి వారికీ, మిత్రుడు సుబ్రమణ్యానికి నేను రుణపడి ఉంటాను. వారి ప్రోత్సాహమే నా ప్రయత్నానికి ప్రోద్బలము.

ఇంతటితో అయిపోయిందా? ఒక్కొక్క పదాన్నీ, వాక్యాన్నీ సంధించీ బంధించీ పాఠకుడి మనసుకూ, మేధస్సుకూ నా భావాల నర్థం చేసుకోవడంలో నొప్పి కలగని రీతిలో రచన సాగాలంటూ పదేపదే నా చేత తుది మెరుగులు దిద్దించిన మిత్రుడు మనోహర్‌కూ, ప్రతిని ఓపిగ్గా చదివి చక్కని సలహాలిచ్చిన సోదరి డా॥ శ్రీమతి జయసలోమికి (రీడరు, శాఖాధిపతి, జానపద కళల శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం) కతకూ కతకూ కతల మధ్య వెతలకు భాష్యం ఎలా చెప్పే బావుంటుందో సూచించిన నిరంతర గిరిజన శ్రేయోభిలాషి మిత్రుడు కొండయ్యకూ (NISIET, Hyderabad).

రాతప్రతిని టైపు చేయడానికి చాలా శ్రమ తీసుకున్న పంచాయితీ రాజ్ శాఖలో పని చేస్తున్న శ్రీ వెంకటేశ్వరరావుగారికీ, ప్రతి కతకూ అందమైన అర్థవంతమైన



ఫొటోలనందించిన రామూకు (బాలాజీ స్టూడియో, పాలవంచ), కవరుపేజీ అర్థవంతంగా తీర్చిదిద్దిన ఆర్టిస్టు శ్రీ చంద్రశేఖర్‌కూ, ఈ పుస్తకాన్ని అందంగానూ, సకాలంలో ముద్రించి యివ్వడానికి శాయశక్తులా కృషి చేసిన శ్రీ వెంకటపతిరాజు, డాన్ ప్రింటర్స్, పబ్లిషర్స్ ప్రైలి. హైదరాబాద్ వారికీ.

ప్రతులను చదివి తమ అమూల్యమైన సలహాలిచ్చి ప్రోత్సహించిన సీనియర్ IAS అధికారులు మున్సిపల్ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ టి.ఆర్. ప్రసాద్ IASగారికీ, హైదరాబాద్ జిల్లా కల్టెకర్ శ్రీ కె.ఆర్. కిశోర్ IASగారికీ, తన అమూల్యమైన అభిప్రాయాన్ని రాసిన కడప జిల్లా కలెక్టర్ శ్రీ పి. సుబ్రమణ్యం IASగారికీ.

రెండేళ్లు ఖమ్మం గిరిజనసీమలో ప్రభుత్వ ప్రణాళికలను అమలు పరిచే అమూల్యమైన అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ–

కొత్తగా పెళ్లైన భార్యాభర్తలు ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకోవడం సహజం. అయితే తన ఉద్యోగరీత్యా పొరుగు రాష్ట్రమైన కర్నాటకలో ఉండాల్సి వున్నా, వివాహ బంధాన్ని గౌరవించి మూడేళ్ల డెప్యుటేషన్‌లో ఆంధ్రదేశానికొచ్చింది నా శ్రీమతి. తను హైదరాబాద్‌కొస్తే, భర్త హైదరాబాద్‌కు కొన్ని వందల మైళ్ల దూరమున్న భద్రాచలం మన్యంలో ఉద్యోగం చేస్తానంటే పెళ్లై రెండేళ్లు కూడా కాకుండానే భర్త అడవుల వెంట పడతానంటే ఏ భార్యా ఒప్పుకోదు. కానీ నా శ్రీమతికి నా మనసు తెలుసు. సంతోషంగా ఒప్పుకుంది. ఆమె సహకారమే లేకుంటే ఈ కతలకు వూపిరి పోయడం కష్టమై ఉండేది. నా శ్రీమతి రత్నప్రభకూ!

మా చిరంజీవి నీహారిక నావెంట అడవుల్లో తిరిగింది. పప్పా ఓ కథ చెప్పవా అంటూ యీ ప్రయత్నానికి నాంది పలికింది. మరి ఆమె పెరిగి పెద్దయి యీ మూగజీవుల బాధలకు స్పందించి తన వంతు కృషి చేయగలిగిన రోజు ఈ పుస్తకం రాయడంవల్ల నాకు నిజమైన సంతృప్తి కలుగుతుంది. ఈ రోజు కోసం ఎదురు చూస్తూ అందరికి వందనాలతో...

విద్యాసాగర్

❖ ❖ ❖

# గిరిజన సీమలు

**త**రతరాల చరిత్రగతిలో కొన్ని జనసమూహాలు కొండల్లో, కోనల్లోనే నివాసముండక తప్పని పరిస్థితులు ఏర్పడినాయి. అలాంటి వారే యీనాడు గిరిజనులుగా పిలవబడుతున్నారు. ప్రస్తుతము మనదేశంలో అలాంటి గిరిజన తెగలు సుమారు 250 దాకా వున్నాయి. ఈ తెగలన్నీ రాజ్యాంగలో అనుసూచిత జాతులుగా పొందుపరచబడి ఉన్నాయి. వారి సమగ్ర అభివృద్ధి కోసం అనేక ప్రత్యేక పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయి. భారతదేశంలో గిరిజన జాతులు ఇరవై ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్నారు.

1991 జనాభా లెక్కల ప్రకారం గిరిజనుల జనాభా ఎనిమిది కోట్ల ఆరు లక్షలు. మొత్తం జనాభాలో యిది 9.55 శాతం, భిల్లులు, గోండ్లు, సంతాలు, బరియాలు, మీనాలు ఖోండ్లు, హెూ, సుగాలీలు ప్రధానమైన గిరిజన తెగలు. ప్రతి తెగకు ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయాలున్నప్పటికీ వీరందరూ భారత జాతి జీవనంలో కలిసి ఉండడం గమనించదగ్గ అంశం.

1981 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల సంఖ్య 32 లక్షలు. రాష్ట్ర జనాభాలో వీరి శాతం 5.93. చెంచు, గదబ, గోండు, జాతపు, కోయ, కోలాము, కొండదొర, ఎరుకుల కొండరెడ్లు, సవరలు, యానాది, సుగాలీలు ఆంధ్ర రాష్ట్రంలోని ప్రధాన తెగలు. వీరిలో యానాది, ఎరుకుల, సుగాలీలు మైదాన ప్రాంతాల్లో ఉన్నారు. మన రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఎనిమిది జిల్లాల్లో గిరిజన జనాభా అధికంగా ఉంది. ఆ జిల్లాల్లో కూడా అధికంగా గిరిజనులున్న ప్రాంతాలను గిరిజన ప్రాంతాలుగా, వారికోసం ప్రత్యేక ప్రణాళికలను అమలుచేసే ప్రాంతాలను గిరిజన ఉప ప్రణాళికా ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 1975 నుంచీ యీ గిరిజన ఉప ప్రణాళిక అనేది అమలులోకి వచ్చింది. అటువంటి గిరిజన ఉప ప్రణాళికా ప్రాంతాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఆదిలాబాదు, వరంగల్లు ఖమ్మం, ఈ జిల్లాల్లో ఒక్కొక్క సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పనిచేస్తున్నది.

రాష్ట్రంలోని అన్ని జిల్లాలకంటే ఖమ్మం జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నారు. వీరి సంఖ్య 1981 జనాభా లెక్కల ప్రకారం 4.5 లక్షలుంది. జిల్లా జనాభాలో సుమారు 25 శాతం కోయలు, కొండరెడ్లు, నాయకపోడులు, లంబాడీలు ఈ జిల్లాలోని ప్రధానమైన గిరిజన తెగలు. ఈ తెగలన్నింటిలో కొండరెడ్లు కొండలపైనే నివసిస్తూ యీనాటికి బాగా వెనకబడి ఉన్నారు.

ఖమ్మం జిల్లాలోని 46 మండలాల్లో 29 మండలాలు పూర్తిగా గిరిజన ప్రాంతంలో అంటే ఖమ్మం జిల్లా గిరిజన ఉప ప్రణాళికా ప్రాంతంలో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని మొత్తం నాలుగు రెవెన్యూ డివిజన్లలో మూడు డివిజన్లు గిరిజన ప్రాంతంలో ఉన్నాయి. కొత్తగూడెం డివిజల్లో ప్రధానంగా లంబాడీలు, కోయలున్నారు. పాలవంచ డివిజల్లో కోయలు ఎక్కువగా ఉన్నారు. వారి తరవాతి స్థానం లంబాడీలది. భద్రాచలం డివిజల్లో దాదాపు 90 శాతందాకా కోయలున్నారు. మిగిలిన పది శాతం కొండరెడ్లు, నాయక పోడులు. ఖమ్మంలో ఉన్న సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ యీ గిరిజనుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సారథ్యంలో తన వంతు కృషి చేస్తున్నది.

❖ ❖ ❖



వృత్తిలో ఎదురైన వాస్తవ సంఘటనలు మిగిల్చిన అనుభవాలకు
అక్షర రూపం దిద్ది, కథా సాహిత్యంలో
సరికొత్త ఒరవడిని సృష్టించారనడానికి
పుస్తక సాక్ష్యం ఈ భద్రాచలం మన్యం కతలు.
అక్కడి గిరిజన బతుకుల్లోని వ్యథల్ని,
ప్రకృతి అందాల పరిచయంతో రంగరించి,
తన అనుభవాల్లోని చేదుని, అచేనత్వాన్ని,
అశక్తతని నిష్కర్షగా, నిజాయితీగా
అక్షరాల్లోకి అనువదించిన
**విద్యాసాగర్**
ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కి చెందిన ఐఏఎస్ అధికారి.


**ఇతర రచనలు :**
అసలు సంతకం
మనిషొకడే నిజంగా మనిషేడు
విశాఖ... నా విశాఖ

**అనువాదాలు :**
అసలు సంతకం - హిందీ, కన్నడ
భద్రాచలం మన్నెం కతలు - హిందీ, కన్నడ

Bhadrachalam Mannem Kathalu

విద్యాసాగర్
భద్రాచలం మన్నెం కతలు

విద్యాసాగర్



# భద్రాచలం
# మన్నెం కతలు